సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 293

సోమవారం 13-1-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'



గీతాభాస్కర్ సమర్పించు
సంక్రాంతి సకినాలు

బ్రహ్మాండం..
కృష్ణుడి పాకుండలు

భోగి వైభోగం

వివరాలు 13లో





# మహా సంరంభం

## నేటి నుంచే మహా కుంభమేళా.. భారీగా వస్తున్న భక్తజనం



ఆదివారం యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణి సంగమం వద్దకు తరలి వస్తున్న సాధువులు

### నేడు పుష్య పౌర్ణమి స్నానంతో ఆధ్యాత్మిక వేడుక ప్రారంభం

ఫిబ్రవరి 26న మహాశివరాత్రితో ముగింపు

సర్వాంగసుందరంగా ముస్తాబైన ప్రయాగ్‌రాజ్

10 వేల ఎకరాలకు పైగా స్థలంలో తాత్కాలిక ఆవాసాలతో ప్రత్యేక నగరాన్ని తలపిస్తున్న త్రివేణి సంగమ ప్రాంతం

గంగా నది తీరం వెంట 2 లక్షల టెంట్లు

50 వేల మంది పోలీసు సిబ్బంది, పారామిలటరీ బలగాలతో భద్రతా ఏర్పాట్లు

ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుకకు సర్వం సిద్ధమైంది. 144 ఏళ్లకోసారి వచ్చే అత్యంత అరుదైన మహా కుంభమేళా ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో నేటి నుంచే ప్రారంభమవుతోంది. గంగా, యమున, సరస్వతి సంగమించే పవిత్ర త్రివేణి సంగమంలో సోమవారం పుష్య పూర్ణిమ పుణ్య స్నానాలతో మొదలయ్యే ఈ సంరంభం 45రోజుల పాటు కొనసాగి ఫిబ్రవరి 26న మహాశివరాత్రి పుణ్యస్నానాలతో ముగుస్తుంది.

2లో

కుంభమేళా చరిత్ర **ఇప్పటిది కాదు**

అబ్బురపరుస్తున్న **టెంట్ సిటీ**

ప్రత్యేక ఆకర్షణ **నాగ సాధువులు**

టాప్ 4

## వైల్డ్ ఫైర్

'శత' క్కొట్టిన జెమీమా రోడ్రిగ్స్

స్మృతి, ప్రతీక, హర్లీన్ వీరవిహారం

రెండో వన్డేలో ఐర్లాండ్‌పై టీమిండియా ఘనవిజయం



370 పరుగులతో జట్టు అత్యుత్తమ స్కోర్ నమోదు

14లో

## భూభారతిలో భూములకే..

- రైతు భరోసా సాయంపై రాష్ట్ర ప్రభుత్వం వెల్లడి
- రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మార్గదర్శకాలు విడుదల

12లో



విద్యాసాగర్‌రావు పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సీఎం రేవంత్. చిత్రంలో కె. లక్ష్మణ్, శ్రీధర్‌బాబు, బండి సంజయ్, గవర్నర్లు దత్తాత్రేయ, హరిబాబు



## అన్ని పక్షాలు కలిస్తేనే ప్రభుత్వం

విద్యాసాగర్‌రావు ఆత్మకథ 'ఉనిక' ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్

ఎన్నికల సమయంలో మాత్రమే పార్టీలు వేర్వేరుగా పోరాడాలి

- ఎన్నికల తర్వాత అన్ని వర్గాలు కలిసి అభివృద్ధి పథంలో సాగాలి
- అభివృద్ధి కంటే రాజకీయాలు ముఖ్యం కాదు
- ప్రజా ప్రభుత్వం ఎలాంటి భేషజాలకు పోదన్న సీఎం

3లో

## ఎందుకీ కార్చిచ్చు?!

- మానవ తప్పిదాలతోనే పెను విపత్తులు
- కొంపముంచుతున్న పర్యావరణ మార్పులు
- తీవ్ర వర్షాభావం, ఎండిపోయిన అడవులు
- లాస్ ఏంజెలెస్‌లో మంటలకు అవే కారణం

6లో

మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్న మంటలు

లాస్ ఏంజెలెస్‌లో ఆరని అగ్నికీలలు

సాధుజన సందోహం







# నేటి నుంచే మహా సంరంభం

**45 రోజులు.. 50 కోట్ల భక్తులు**

## మహా కుంభమేళాకు సర్వం సిద్ధం

**144 ఏళ్లకు వచ్చే అరుదైన వేడుక ● ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మికోత్సవం**

ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక వేడుకకు సర్వం సిద్ధమైంది. 144 ఏళ్లకోసారి వచ్చే అత్యంత అరుదైన మహా కుంభమేళా ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో నేటి నుంచే ప్రారంభమవుతోంది. గంగా, యమున, సరస్వతి సంగమించే పవిత్ర త్రివేణి సంగమంలో సోమవారం పుష్య పూర్ణిమ పుణ్య స్నానాలతో మొదలయ్యే ఈ ఆధ్యాత్మిక సంరంభం 45 రోజుల పాటు కొనసాగి ఫిబ్రవరి 26న మహాశివరాత్రి పుణ్య స్నానాలతో ముగుస్తుంది. దేశ నలుమూలల నుంచే గాక ప్రపంచవ్యాప్తంగా భక్తులు, ఔత్సాహికులు కుంభమేళాను తిలకించేందుకు పోటెత్తనున్నారు. సోమవారం తొలుత పీఠాధిపతులు, నాగా సాధువుల షాహీ (రాజ) స్నాన వేడుకతో మహా కుంభమేళాకు అంకురార్పణ జరుగుతుంది. అనంతరం భక్త జనాన్ని స్నానాలకు అనుమతిస్తారు. ఈ ఒక్క రోజే ఏకంగా కోటిన్నరకు పైగా భక్తులు వస్తారని అంచనా. మొత్తమ్మీద 40 కోట్ల దాకా భక్తులు రావచ్చని తొలుత భావించారు. కానీ శని, ఆదివారాల్లో ఏకంగా 25 లక్షల మంది చొప్పున భక్తులు పుణ్య స్నానాలు ఆచరించడం విశేషం! దాంతో 45 రోజుల్లో మేళాకు వచ్చే భక్తులు 50 కోట్లు దాటినా ఆశ్చర్యం లేదని యూపీ సర్కారు భావిస్తోంది. ముఖ్యంగా జనవరి 29న ఒక్క మౌనీ అమావాస్య నాడే ఏకంగా 5 కోట్ల మందికి పైగా పోటెత్తనున్నారు! ఇంతటి మహా క్రతువును సజావుగా నిర్వహించేందుకు కేంద్రం సహకారంతో సకల సౌకర్యాలూ కల్పిస్తోంది. దాదాపు రూ.7,000 కోట్లు వెచ్చించి పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది.

– ప్రయాగరాజ్ త్రివేణి సంగమం నుంచి సాక్షి ప్రతినిధి



ఆదివారం రాత్రి విద్యుత్‌కాంతుల్లో త్రివేణి సంగమంలోని 'మహాకుంభ్ నగర్' ప్రాంతం

### భక్తుల నుంచి పీఠాధీశుల దాకా...

సాధారణ భక్తులతో పాటు దేశంలోని అన్ని ప్రముఖ ఆధ్యాత్మిక పీఠాల అధిపతులూ కుంభమేళాలో పాల్గొంటారు. వారంతా ఇప్పటికే త్రివేణి సంగమం చేరుకున్నారు. గత నెల రోజులుగా ఒక్కొక్కరుగా అట్టహాసంగా నగరప్రవేశం చేసి ఆకట్టుకున్నారు. 13 ప్రఖ్యాత అఖాడాలతో పాటు పలు సంప్రదాయాలకు చెందిన చిన్నా పెద్దా పీఠాలు సంగమ స్థలిలో ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక ఆశ్రమాలు, టెంట్లు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. వాటిలోనే ప్రత్యేకంగా పూజా మందిరాలు కూడా వెలిశాయి. నెలన్నర పాటు రాత్రిళ్లు నెగళ్లు వేసి, అక్కడే ఆధ్యాత్మిక ప్రవచనాలు, ప్రసాద వితరణ వంటివి జరపనున్నారు. కుంభమేళా ప్రారంభానికి సూచకగా ఆదివారం సంగమ స్థలిలో నమామి గంగే బృందం ఆధ్వర్యంలో ఘనంగా యజ్ఞ క్రతువు నిర్వహించారు. నది పవిత్రతను, స్వచ్ఛతను కాపాడతామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ప్లాస్టిక్ రహితంగా ఉత్సవం జరుపుకుందామని పిలుపునిచ్చారు. భక్తులకు జ్యూట్ బ్యాగులు పంచారు.

**దక్షిణాది నుంచి 60 లక్షల మంది**

మహా కుంభమేళాకు తెలుగు వారు లక్షలాదిగా తరలనున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణాది నుంచి కనీసం 60 లక్షల మందికి పైగా ఉత్సవంలో పాల్గొంటారని అంచనా.

**స్వచ్ఛత కోసం పది వనాలు**

మహా కుంభమేళాకు కోట్ల మంది వస్తున్నందున పరిశుభ్రమైన, స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు యూపీ ప్రభుత్వం రెండేళ్ల నుంచే ఏర్పాట్లు మొదలు పెట్టింది. జపాన్ విధానంలో 10 ప్రాంతాల్లో ప్రత్యేకంగా చిన్న చిన్న వనాలను పెంచింది.

### ప్రయాగ్‌రాజ్‌కు 'కుంభ కళ'

కుంభమేళా నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్ ఉత్సవ కళ సంతరించుకుంది. ప్రపంచ నలుమూల నుంచీ కోట్లలో వచ్చే భక్తులు, సందర్శకులతో కళకళలాడనుంది. రాత్రి వేళల్లో రేడియం వెలుగుల్లో మెరిసిపోతోంది. కార్యాలయాలు, గోడలు, ఫ్లై ఓవర్ల పొడవునా సనాతన ధర్మం, దేవీదేవతలకు సంబంధించిన పెయింటింగులతో పండుగ వాతావరణం నెలకొంది. ముఖ్య కూడళ్ల కలశం, శంఖచక్రాలు, ఓంకారం యోగాసనాల థీమ్‌లతో కూడిన ఏర్పాట్లతో అలరిస్తున్నాయి. ఎంట్రీ పాయింట్ల వద్ద భారీ స్వాగత స్తంభాలు ఆకర్షణగా నిలిచాయి.



సుబేదార్‌గంజ్ జంక్షన్లో అలరిస్తున్న నిర్మాణం

**ముఖ్యమైన రోజులు**

| | |
|---|---|
| జనవరి 13 | పుష్య పౌర్ణమి |
| జనవరి 14 | మకర సంక్రాంతి |
| జనవరి 29 | మౌనీ అమావాస్య |
| ఫిబ్రవరి 2 | వసంత పంచమి |
| ఫిబ్రవరి 12 | మాఘ పౌర్ణమి |
| ఫిబ్రవరి 26 | మహాశివరాత్రి |

గత కుంభమేళాకు 24 కోట్ల మంది వచ్చారు. ఈసారి భక్తుల వరద చూస్తుంటే 50 కోట్లకు చేరినా ఆశ్చర్యం లేదు.
– యూపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్ సింగ్

### విశేషాలెన్నో...

త్రివేణిసంగమం, పరిసరాల్లో 10 వేల ఎకరాలపై చిలుకు స్థలంలో ప్రత్యేకంగా 'కుంభ్‌నగర్' పేరుతో ఏకంగా ఓ ప్రత్యేక పట్టణమే పుట్టుకొచ్చింది. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద తాత్కాలిక ఆవాస ప్రాంతంగా ఇప్పటికే రికార్డు సృష్టించింది. మేళాకు తరలివచ్చే భక్తులకు ఆశ్రయం తదితర అవసరాలను ఇది తీర్చనుంది. ఇందులో కనీసం కోటి మందికి సరిపడా ఏర్పాట్లున్నాయి.

- 55 ప్రత్యేక పోలీస్‌స్టేషన్లు, 50 వేల పోలీసు సిబ్బంది, పారా మిలటరీ బలగాలు
- గంగా నదిపై 30 బల్లకట్టు వంతెనలు
- 2,700 ఏఐ కెమెరాలు, వెయ్యికి పైగా సీసీ కెమెరాలు, వందల డ్రోన్లు
- ఎన్డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో వాటర్ అంబులెన్సులు
- విదేశీ పర్యాటకులకు 'ఇన్‌క్రెడిబుల్ ఇండియా పెవిలియన్'
- 1800111363, 1363 నంబర్లలో టోల్‌ఫ్రీ సేవలు

### ప్రథమ చికిత్స కేంద్రాలు

- కోట్ల మంది వస్తున్నందున వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టారు.
- అత్యవసర చికిత్స కోసం విస్తృతంగా ప్రథమ చికిత్సా కేంద్రాలు పెట్టారు.
- అన్ని సౌకర్యాలతో కూడిన 10 పడకల మినీ ఐసీయూలు పదుల సంఖ్యలో ఏర్పాటయ్యాయి.



ఆదివారం రాత్రి ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలో భక్తుల పుణ్య స్నానాలు

"అనాదికాలం నుంచి అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ వస్తున్న భారత ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని ఆధునిక ప్రపంచానికి మరోసారి ఘనంగా చాటిచెప్పేందుకు మహా కుంభమేళా చక్కని వేదికగా నిలవనుంది" – యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్

### రైలు ప్రయాణికులకు ఎన్‌క్లోజర్లు

కుంభమేళా భక్తుల్లో అత్యధికులు రైలు ద్వారానే వస్తారని యోగీ ప్రభుత్వం అంచనా వేసింది. ప్రయాగ్‌రాజ్ రైల్వే జంక్షన్ వద్ద వారికోసం ప్రత్యేక ఎన్‌క్లోజర్లు ఏర్పాటు చేశారు. నాలుగు దిక్కుల నుంచి వచ్చే వారి కోసం నాలుగు వైపులా ఆకుపచ్చ, ఎరుపు, పసుపు, నీలం రంగుల్లో నాలుగింటిని సిద్ధం చేశారు. రైలు దిగి రాగానే అవి కనిపిస్తాయి. ప్రతి ఎన్‌క్లోజర్‌లో తాగునీరు, మరుగుదొడ్లు, మొబైల్ ఛార్జింగ్ తదితర సౌకర్యాలున్నాయి. ప్రయాణికుల కోసం రైల్వే శాఖ 1800 4199 139 టోల్‌ఫ్రీ నంబర్ అందుబాటులోకి తెచ్చింది.

### వాటర్ అంబులెన్సులు

ముఖ్యమైన పర్వదినాల్లో పవిత్ర స్నానాల కోసం కోట్ల మంది భక్తులు రానున్నందున అదుపు తప్పి నీట మునిగేవారిని కాపాడేందుకు వందల సంఖ్యలో డీఆర్‌ఎఫ్ బృందాలు మోహరించాయి. రక్షించేందుకు, ప్రథమ చికిత్స అందించేందుకు వాటర్ అంబులెన్సులు కూడా అందుబాటులో ఉంచారు. వాటిలో వైద్యుడు, పారా మెడికల్ సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉంటారని ఎన్డీఆర్‌ఎఫ్ డీఐజీ ఎంకే శర్మ తెలిపారు.

### విదేశీ పెవిలియన్

విదేశీ పర్యాటకులు, పండితులు, పరిశోధకులు, జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లు, ప్రవాస సంఘం, భారతీయ డయాస్పోరా కోసం 5 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో కేంద్ర పర్యాటక శాఖ 'ఇన్‌క్రెడిబుల్ ఇండియా పెవిలియన్' ఏర్పాటు చేసింది. కుంభమేళా ప్రాముఖ్యతను తెలిపే విశేషాలను ఇక్కడ పొందుపరిచారు. విమాన ప్రయాణికులకు అవసరమైన సమాచారాన్ని అందించేలా విమానయాన సంస్థలు కస్టమర్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేశాయి.

### మహా కుంభమేళా యాప్

కుంభమేళాను వీక్షించేందుకు గూగుల్ ప్రత్యేక మ్యాప్‌ను సిద్ధం చేసింది. బ్రిడ్జి, ఆశ్రమం, ఎరీనా రోడ్డు మొదలుకుని జాతరనంతా ఈ యాప్‌లో చూడొచ్చు. ఇది గూగుల్ పేస్టోర్, యాప్ స్టోర్లలో అందుబాటులో ఉంది. దేవాలయాల లోకేషన్‌తో పాటు నగరంలోని ప్రధాన ప్రదేశాలకు సంబంధించిన సమాచారమంతా ఇందులో పొందుపరిచారు.

## కుంభమేళా చరిత్ర
# ఇప్పటిది కాదు

**కల్ప వాసం**

కుంభమేళాకు మాత్రమే ప్రత్యేకమైన క్రతువు కల్పవాసం. భక్తులు ప్రయాగ్‌రాజ్‌లో సంగమ ప్రాంతంలో నెల రోజుల పాటు దీన్ని నిష్ఠగా పాటిస్తారు. మేళా మొదలయ్యే పుష్య పౌర్ణిమ నాడు కల్పవాస సంకల్పం తీసుకుంటారు. అప్పటినుంచి మాఘ పూర్ణిమ దాకా కల్పవాసాన్ని పాటిస్తారు. ఆ నెల పాటు సంగమ స్థలం దాటి వెళ్లరు. రోజూ గంగలో మూడు మునకలు వేయడం, యోగ, ధ్యానం, పూజలు, ప్రవచనాల శ్రవణం వంటివాటితో పూర్తి భక్తి భావనల నడుమ కాలం గడుపుతారు. ఈసారి 15 నుంచి 20 లక్షలకు పైగా భక్తులు కల్పవాసం చేయనున్నట్టు ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు వివరించారు. వారి కోసం కుంభ్‌నగర్‌లో విస్తృతమైన ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

కుంభమేళాది అతి ప్రాచీన నేపథ్యం. ఇది చరిత్రకందని కాలం నుంచీ జరుగుతూ వస్తోందని చెబుతారు. క్రీస్తుశకం ఆరో శతాబ్దంలోనే హర్షవర్ధనుడు ప్రయాగలో కుంభమేళాకు ఘనంగా ఏర్పాట్లు చేసినట్టు చరిత్రలో నమోదైంది. కుంభమేళాను ఆదిశంకరులు వ్యవస్థీకృతపరిచి ప్రస్తుత రూపు కల్పించారంటారు. కుంభ మేళా అనే పేరు అమృతకలశం నుంచి **వచ్చింది**. సాగరమథనం వల్ల పుట్టుకొచ్చిన అమృత భాండం **నుంచి** నాలుగు చుక్కలు భూమిపై ప్రయాగ్‌రాజ్, హరిద్వార్, **ఉజ్జయిని**, నాసిక్‌ల్లో పడ్డాయని ఐతిహ్యం. తల్లికి బానిసత్వం తప్పించేందుకు గరుత్మంతుడు స్వర్గం నుంచి అమృతభాండం తెస్తుండగా చుక్కలు జారిపడ్డాయని మరో కథనం. అమృతంతో అత్యంత పవిత్రతను సంతరించుకున్న ఆ నాలుగు చోట్లా కుంభమేళా జరగడం ఆనవాయితీగా వస్తోంది.

### నాలుగు రకాలు

కుంభమేళా నాలుగు రకాలు. ఏటా మాఘ మాసంలో జరిగేది మాఘ మేళా. ఇది కేవలం ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతుంది. ఆరేళ్లకు ఓసారి జరిగేది అర్ధ కుంభమేళా. ఇది హరిద్వార్, ప్రయోగరాజ్‌ల్లో జరుగుతుంది. 12 ఏళ్లకోసారి జరిగేది పూర్ణ కుంభమేళా. ఇది ప్రయాగ్‌రాజ్‌తో పాటు హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్‌ల్లో కూడా జరుగుతుంది. 12 పూర్ణ కుంభమేళాల తర్వాత, అంటే **144 ఏళ్లకు** ఓసారి వచ్చేది మహా కుంభమేళా. అంత అరుదైనది కనుకనే **దీనికి ఎనలేని** ప్రాధాన్యం. దీన్ని ప్రయోగరాజ్‌లో మాత్రమే నిర్వహిస్తారు. ప్రస్తుతం జరుగుతున్నది మహా కుంభమేళా.

### ఏం చేస్తారు?

కుంభమేళాలో పాల్గొనే భక్తులు ముఖ్యంగా ఆచరించేది త్రివేణి సంగమ ప్రాంతంలో పవిత్ర స్నానం. తద్వారా పాపాలు తొలగి దేహత్యాగానంతరం మోక్షప్రాప్తి కలుగుతుందన్నది విశ్వాసం. 45 రోజుల పాటు జరిగే ఈ వేడుకలో ఆరు ముఖ్యమైన తిథులను మరింత పవిత్రమైనవిగా నమ్ముతారు. ఆ రోజుల్లో సంగమ స్థలికి ఇసుక వేసినా రాలనంతగా జనం పోటెత్తుతారు. పుణ్య స్నానం తర్వాత త్రివేణి తీరాన్నే ఉన్న అక్బర్ కోటలో అక్షయ వట వృక్షాన్ని, ఆ పక్కనే ఉన్న బడే హనుమాన్ ఆలయాన్ని, అక్కడికి సమీపంలో ఉండే మాధవేశ్వరీ శక్తి పీఠాన్ని దర్శిస్తారు. మామూలు రోజుల్లో కంటే మేళా సమయంలో సంగమ స్థలిలో చేసే పుణ్యకార్యాలు అత్యంత ఫలప్రదాలని నమ్ముతారు.

– సాక్షి, నేషనల్ డెస్క్



2019 అర్ధకుంభమేళాలో మౌనీ అమావాస్య సందర్భంగా పుణ్యస్నానాల కోసం త్రివేణి సంగమంలో భారీ సంఖ్యలో పోటెత్తిన భక్తులు

## మేళాలో ప్రత్యేక ఆకర్షణ... నాగ సాధువులు



వాళ్లు బంధాలు, అనుబంధాలుండవు. సర్వం త్యజించిన సన్యాసులు. చలికాలమైనా, ఎండాకాలమైనా దిగంబరంగానే ఉంటారు. ఒళ్లంతా విభూది ధరిస్తారు. జనవాసాలకు దూరంగా సాధనే ప్రపంచంగా గడుపుతారు. కుంభమేళా సమయంలో మాత్రమే జన సామాన్యానికి కనిపిస్తారు. వాళ్లే నాగసాధువులు. కుంభమేళాకు శ్రీకారం చుట్టేది వాళ్లే. ఈసారి కూడా మేళాలో వారే సెంటర్ ఆఫ్ అట్రాక్షన్. మొహెంజోదారో కాలం నుంచీ నాగాల ఉనికికి సంబంధించిన ఆధారాలున్నాయి. అవసరమైనప్పుడు ఆలయాలను, సనాతన సంప్రదాయాలను అన్య మతస్తుల దాడులు తదితరాల నుంచి వీరు కాపాడినట్టుగా చరిత్ర చెబుతోంది. ఆయుధాల వాడకంలోనూ వీళ్లు దిట్ట. అందుకే వీరిని హిందూ ధర్మానికి కమాండర్లుగానూ అభివర్ణిస్తుంటారు. వీరి ప్రాముఖ్యత అనాది కాలం నుంచీ కొనసాగుతూ వస్తోంది. హిమాలయాల్లో ఉంటారంటారు. కుంభమేళా సమయంలో ప్రయాగ్‌రాజ్‌కు వచ్చి పవిత్ర స్నానాలు చేస్తారు. తద్వారా పుణ్య జలాలకు మరింత పవిత్రత వస్తుందన్నది విశ్వాసం. అందుకే మేళాలో తొలి రాజ (షాహీ) స్నానం వీరితోనే చేయించి గౌరవిస్తారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

### కుంభమేళా కోసం..

- ప్రయాగ్‌రాజ్‌లో 92 రహదారులు నిర్మించారు
- 17 ప్రధాన రోడ్లను సుందరీకరించారు
- 30 బల్లకట్టు వంతెనలు కట్టారు
- భిన్న భాషల్లో 800 దారిసూచికలు ఏర్పాటుచేశారు
- తొలిసారిగా అండర్‌వాటర్ డ్రోన్లను రంగంలోకి దింపారు. ఇవి 100 మీటర్ల లోతుకు సైతం వెళ్లి గాలిస్తాయి. అలాగే 120 మీటర్ల ఎత్తులోనూ గస్తీ కాయనున్నాయి.
- రోజూ వేలాది భక్తులకు కంటి పరీక్షలకు 10 ఎకరాల్లో 11 భారీ గుడారాల్లో నేత్ర కుంభ్‌ను నెలకొల్పారు.
- భద్రతకు ఏడంచెల కట్టుదిట్టమైన వ్యవస్థ ఏర్పాటు చేశారు.
- భక్తుల కోసం దేశ నలుమూలల నుంచి 13,000 ప్రత్యేక రైళ్లు ఏర్పాటయ్యాయి.
- తప్పిపోయిన వారికోసం 'ఖోయా–పాయా' కేంద్రాలు ఏర్పాటు చేశారు.

## అబ్బురపరుస్తున్న
# టెంట్ సిటీ

**2 లక్షల టెంట్లతో నిర్మాణం**
**సాధారణుల నుంచి సంపన్నుల దాకా ఏర్పాట్లు**

కుంభమేళాకు పోటెత్తే కోట్లాది భక్తులకు బస, ఏర్పాట్లు చేసే సామర్థ్యం ప్రయాగ్‌రాజ్‌లోని హోటళ్లకు లేదు. ఆ అవసరాలు తీర్చే ఏకైక చిరునామాగా 'టెంట్ నగరి' నిలిచింది. లక్షలాది టెంట్లు ఆతిథ్యానికి సిద్ధమయ్యాయి.

### సకల సౌకర్యాల శిబిరాలు

ప్రయాగ్‌రాజ్‌లోని గంగానదీ తీర ఇసుక తిన్నెలు ఇప్పుడు ఆధునాతన టెంట్‌లుగా రూపాంతరం చెంది ఎండా, వాన నుంచి భక్తులకు రక్షణగా నిలిచాయి. పది అడుగుల ఎత్తయిన కర్రలను ఈ టెంట్‌ల నిర్మాణం కోసం వాడారు. మొత్తంగా 68 లక్షల చెక్క కర్రలు, 100 కిలోమీటర్ల పొడవైన వస్త్రం, 250 టన్నుల బరువైన సీజీఐ(ఇనుప) రేకులతో ఈ టెంట్‌లను నిర్మించారు. గత కొన్ని నెలలుగా నిరాటంకంగా ఏకంగా 3,000 మంది కార్మికులు అవిశ్రాంతంగా కష్టపడి ఈ టెంట్ నగరానికి తుదిరూపునిచ్చారు. వర్షం, గాలులను తట్టుకునేలా టెంట్‌లను పటిష్ఠంగా నిపుణులు నిర్మించారు. ఒకేసారి 20 లక్షల మందికి బస సౌకర్యం కల్పించేలా ఎక్కువ టెంట్లను కట్టారు.

### విభిన్న సౌకర్యాల మహాకుంభ గ్రామం

టెంట్ సిటీలో అన్ని ఒకే తరహా టెంట్‌లు ఉండవు. సాధారణ భక్తుడు మొదలు సంపన్న భక్తుడి దాకా ప్రతి ఒక్కరికి వారి వారి తాహతుకు తగ్గట్లు విభిన్న టెంట్లను నెలకొల్పారు. డిమాండ్, భక్తుల రద్దీని బట్టి మరిన్ని టెంట్‌లను నిర్మించేందుకు యోగి ఆదిత్యనాథ్ సర్కార్ ఏర్పాట్లుచేస్తోంది. భారతీయ రైల్వే వారి ఇండియన్ రైల్వేస్ క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్(ఐఆర్‌సీటీసీ) వారు భక్తుల కోసం మహాకుంభ్ గ్రామ్ పేరిట ప్రత్యేక టెంట్‌లను నిర్మించింది. ఇవి త్రివేణి సంగమం నుంచి 3.5 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. వీటిల్లో సూపర్ లగ్జరీ టెంట్లు, విల్లాలు ఉన్నాయి. విడిగా స్నానాల గది, చల్లటి, వేడి నీళ్ల, ఎయిర్ బ్లోయర్, మంచాలున్నాయి. అల్పాహారం, భోజన సదుపాయాలూ కల్పిస్తున్నారు. టెలివిజన్ ఏర్పాట్లూ చేశారు. ఆర్‌ఐసీటీసీ ద్వారా ఈ టెంట్లను బుక్ చేసుకోవచ్చు. రోజుకు రూ.18,000 నుంచి రూ.20,000 వసూలుచేస్తారు.

### ప్రీమియం టెంట్లూ ఉన్నాయ్

ఖరీదైన పరుపులతో సిద్ధంచేసిన మంచాలు, రాత్రిళ్లు భోగిమంటల్లా చలికాచుకోవడానికి ఏర్పాట్లు, ఆధ్యాత్మిక బోధనలు వినేందుకు విడిగా ఏర్పాట్లూ ఈ ప్రీమియం టెంట్‌ల వద్ద ఉన్నాయి. ప్రాచీన మత విశ్వాసాలు, ఆచార సంప్రదాయాలు, ఆధునికత మేళవింపు ఈ సంగమస్థలిలో కనిపిస్తుంది. వీటిలో శాకాహార భోజన ఏర్పాట్లు చేశారు. తెలుగు, తమిళం, కన్నడ, బెంగాలీ, అస్సామీ, మరాఠీ, హిందీ సహా ఇంగ్లిస్ వంటి పది భాషల్లో సమాచారాన్ని పొందొచ్చు

### రూ. 3,000 నుంచి 1లక్ష దాకా!

టెంట్ సౌకర్యంతోపాటు అక్కడి పలు ఘాట్‌ల వరకు తీసుకెళ్లడం, టూర్ గైడ్, పడవ ప్రయాణం, దగ్గరి పుణ్యక్షేత్రాల సందర్శన తదితరాలతో కలిసి పలు రకాల ప్యాకేజీలను కొన్ని సంస్థలు అందిస్తున్నాయి. రూ.3,000 నుంచి మొదలు ఏకంగా రూ.1లక్ష దాకా 'టెంట్ కమ్ టూర్' ప్యాకేజీలను అందిస్తున్నాయి. లాలూజీ అండ్ సన్స్ సంస్థ ఇందులో 104 ఏళ్ల అనుభవం గడించింది. ''పుష్కరాల కోసం మా ఏర్పాట్లు 18 నెలల నుంచే మొదలవుతాయి. టెంట్ అంతర్గత సౌకర్యాల కోసం కాటన్, టెరీ కాటన్ వాడతాం. బయటివైపు చిరిగినా వర్షపు నీరు లోపలికి రాకుండా పాలిథీన్‌తో కుట్టేస్తాం. మంచాలు, కుర్చీలు, టీవీ స్టాండ్ ఇతర సౌకర్యాలు సమకూరుస్తాం'' అని సంస్థ నిర్వాహకుడు దీపాన్షు అగర్వాల్ చెప్పారు. ''పూర్వం రోజుకు రూ.10 వేతనం దక్కేది. ఇప్పుడు రూ.500 పైనే చేతికొస్తున్నాయి. డబ్బుల కంటే భక్తుల కోసం పని చేస్తున్నామన్న తృప్తి మాకెంతో సంతోషాన్ని ఇస్తుంది'' అని టెంట్ల నిర్మాణంలో పనిచేసే రోజువారీ కార్మికుడు 68 ఏళ్ల రఘునాథ్‌ను చెప్పుకొచ్చారు.



### ఉచితంగానూ ఇస్తారు

సర్వోదయ మండలి వంటి సంస్థలు పేద భక్తుల కోసం ఉచిత బస వసతులనూ ఈ టెంట్లలో కల్పిస్తున్నాయి. గరిష్ఠంగా 30 మంది ఈ భారీ టంట్లను తాత్కాలికంగా కొంతసమయం మాత్రం ఉండేందుకు అనుమతిస్తారు. పోటెత్తే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని, తర్వాతి పేద భక్తులకూ అవకాశం ఇవ్వాలనే ఉద్దేశ్యంతో తక్కువ సమయం మాత్రమే బస వసతి కల్పిస్తారు.

### ఎంతో సౌకర్యవంతం

''40 ఏళ్లుగా ప్రతి పుష్కరాల్లోనూ టెంట్ సిటీకి వచ్చా. అప్పట్లో కేవలం టెంట్ల కింద ఇసుకపైనే నిద్రించేవాళ్లం. ఇప్పుడు చాలా సౌకర్యాలు పెంచారు. టీవీ, వై–ఫై, డ్రోన్లు, నిఘా కెమెరాలు, అసలు మనం ఎక్కడ ఉన్నామని లొకేషన్ తెలిపే క్యూఆర్ కోడ్ స్కాన్ ఫ్లెక్సీ బ్యానర్లు, నిరంతరం పోలీసు గస్తీ.. ఇలా ఎన్నో సదుపాయాలు ఉన్నాయి. భద్రంగా, భక్తితో, చక్కటి భోజనాలతో కుంభమేళా యాత్ర పూర్తిచేయడంలో ఈ టెంట్‌లు కీలకపాత్ర పోషిస్తున్నాయి'' అని రాజస్తాన్‌కు చెందిన వృద్ధురాలు కల్పవాసీ అన్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

# డబ్బాలు, బొట్టు పెట్టెలు, అట్టపెట్టెలు




నోము సామగ్రిని కొనుగోలు చేస్తున్న మహిళలు (ఇన్‌సెట్‌)లో సంక్రాంతి నోముకు సంబంధించిన వివిధ రకాల వస్తువులు

సాక్షి, సిద్దిపేట: తరతరాల నుంచి సంక్రాంతి నోములు నోచుకునే కుటుంబాలూ ఉన్నాయి. సిద్దిపేట, హైదరాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, వరంగల్, హనుమకొండ, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో పండుగ వేళ.. లలితాదేవి పుస్తకం, శ్రీచక్రం, మంగళగౌరి, పీటమీద పిల్లెన్లు, అరుగు మీద అద్దాలు, లాలి గౌరవమ్మ, డబ్బాలు, బొట్టు పెట్టెలు, అట్ట పెట్టెలు, పల్లకి, బతుకమ్మ, కుంకుమ భరణి, క్యారంబోర్డు, గాలిపటాలు, చరఖాలు ఇలా వందల రకాల వస్తువుల్లో ఏదో ఒకదానితో నోముకుంటారు. గౌరమ్మను పెట్టి పసుపు, కుంకుమ వేసి, ఏవైనా ఒకే రకమైన 13 వస్తువులను పెట్టి బంధువులు, స్నేహితుల ఇంటికెళ్లి వాయనం ఇచ్చి వస్తారు. బాలింతలు, చిన్న పిల్లలు ఉన్నవారు ఉగ్గు గిన్నె, నూనె పావు నోములు నోస్తారు.

ఇది సంక్రాంతి నోము..





### ఈసారి బొట్టు పెట్టెల నోము

ఈ సంక్రాంతికి మేము బొట్టు పెట్టెల నోము నోచుకుంటున్నాం. పెళ్లికాగానే మా అత్తగారు మాకు నోములను పట్టించారు. అష్టైశ్వర్యాలు కలుగుతుండటంతో భక్తితో నోముకుంటున్నాం.

\- పావని, శ్రీజ, సిద్దిపేట

### ఆరునెలల ముందే నోము సామగ్రి తెప్పిస్తాం



పండుగకు ఆరు నెలల ముందే నోము సామగ్రి తెప్పిస్తాం. స్టీల్ అయితే మచిలీపట్నం, ఇత్తడి సామాను చెన్నై, ప్లాస్టిక్ వస్తువులను ఢిల్లీ నుంచి తెప్పిస్తాం. మా షాప్‌నకు వివిధ జిల్లాలవారు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. కొందరు ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇస్తారు.

\- నార్ల నాగరాజు, నోముల సామగ్రి షాప్ యజమాని, సిద్దిపేట

## అత్యంత దుర్మార్గం

**తిరుపతి తొక్కిసలాట ఘటనలో సర్కారు వ్యవహారశైలిపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆక్షేపణ**

**ఘటనకు బాధ్యులైన టీటీడీ చైర్మన్, ఈఓ, అడిషనల్ ఈఓ, కలెక్టర్, ఎస్పీలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**




సాక్షి, అమరావతి: ప్రపంచ ప్రఖ్యాతి చెందిన తిరుమల తిరుపతి దేవస్థానం చరిత్రలో ఎప్పుడూలేని విధంగా తొలిసారిగా తొక్కిసలాట జరిగి, ఆరుగురు మరణించిన ఘటనకు బాధ్యులైన వారిపై చర్యల విషయంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అత్యంత దుర్మార్గంగా ఉందంటూ 'ఎక్స్' వేదికగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదివారం మండిపడ్డారు. టీటీడీ చైర్మన్, ఈఓ, అడిషనల్ ఈఓ, కలెక్టర్, ఎస్పీల నిర్లక్ష్యమే తొక్కిసలాటకు కారణంగా తేలిన నేపథ్యంలో విచారణ చేసి.. వారిని జైల్లో పెట్టాల్సిన ప్రభుత్వం వారిని విడిచి పెట్టిందంటే దానర్థం ఏమిటని ఆయన ప్రశ్నించారు. చిత్తశుద్ధితో వ్యవహరించి.. ఈ ఘటనకు ప్రత్యక్షంగా బాధ్యులైన చైర్మన్, ఈఓ, అడిషనల్ ఈఓ, కలెక్టర్, ఎస్పీలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాళ్లందరినీ వెంటనే డిస్మిస్ చేసి.. కేసులు పెట్టి మీ చిత్తశుద్ధిని, దేవునిపట్ల మీ భక్తిని చాటుకోవాలని సీఎం చంద్రబాబుకు ఆయన హితవు పలికారు. లేదంటే ప్రపంచవ్యాప్తంగా ఉన్న వేంకటేశ్వరస్వామి భక్తుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

# అన్ని పక్షాలు కలిస్తేనే ప్రభుత్వం

**విద్యాసాగర్‌రావు ఆత్మకథ 'ఉనిక' ఆవిష్కరణ కార్యక్రమంలో సీఎం రేవంత్**

- ఎన్నికల సమయంలో మాత్రమే పార్టీలు వేర్వేరుగా పోరాడాలి
- ఎన్నికల తర్వాత అన్ని వర్గాలు కలిసి అభివృద్ధి పథంలో సాగాలి
- అభివృద్ధి కంటే రాజకీయాలు ముఖ్యం కాదు
- ప్రజా ప్రభుత్వం ఎలాంటి భేషజాలకు పోదన్న ముఖ్యమంత్రి



ఉనిక పుస్తకాన్ని చదువుతున్న సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వమంటే అధికార పక్ష సభ్యులే కాదని, అన్ని పార్టీల సభ్యులు కలిస్తేనే ప్రభుత్వం అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని 119 మంది శాసనసభ్యులు కలిస్తేనే ప్రభుత్వమని, కేవలం 65 మంది అధికార పార్టీ ఎమ్మెల్యేలను మాత్రమే ప్రభుత్వంగా భావించడం పొరపాటని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే వేర్వేరుగా పోరాడాలని, ఎన్నికల తర్వాత అన్ని వర్గాలు కలిసి అభివృద్ధి వైపు ప్రయాణం సాగించాల్సి ఉంటుందని అన్నారు. తమిళనాడు, మహారాష్ట్రల మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు ఆత్మకథ 'ఉనిక' పుస్తకాన్ని ఆదివారం తాజ్ కృష్ణ హోటల్‌లో హరియాణా, ఒడిశా గవర్నర్లు బండారు దత్తాత్రేయ, కంభంపాటి హరిబాబు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ తదితరులతో కలిసి సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

**అప్పట్లో చర్చలతో సమస్యలు పరిష్కారమయ్యేవి**

'పాలకపక్షం, ప్రతిపక్షం కలిస్తేనే ప్రభుత్వం. అసెంబ్లీలో ముఖ్యమంత్రికి ఎంత సమయం మైక్ ఇస్తారో.. ప్రధాన ప్రతిపక్ష నేతకు కూడా అంతే సమయం మైక్ ఇస్తారు. ఉమ్మడి ఏపీలో బీజేపీ ప్రాతినిధ్యం చాలా తక్కువే అయినప్పటికీ ఆ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో చాలా విషయాలు లేవనెత్తేవారు. కమ్యూనిస్టులు కూడా ప్రజా సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడేవారు. అసెంబ్లీ వాయిదా పడితే పాలక పక్షం, ప్రతిపక్షం చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకునే పరిస్థితులు ఉండేవి. అలాంటి వాతావరణం నెలకొల్పేందుకు ప్రజా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. 13 నెలల ప్రజాపాలనలో ఒక్క ప్రతిపక్ష సభ్యుడిని కూడా సస్పెండ్ చేయలేదు..' అని సీఎం చెప్పారు.

**అన్ని పార్టీల సహకారం అవసరం**

'రాష్ట్ర అభివృద్ధికి అన్ని పార్టీల సహకారం అవసరం. సమస్యలొస్తే తమిళనాడులో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒక్కటి అవుతాయి. అలాంటి సంస్కృతి తెలంగాణలో కూడా పెరగాలి. రాష్ట్ర అభివృద్ధి కంటే రాజకీయాలు ముఖ్యం కాదు. ఈ విషయంలో ప్రజా ప్రభుత్వం ఎలాంటి భేషజాలకు పోదు. హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరాలతో పోటీ పడాలి. సమీపంలోని అమరావతితో కాదు. హైదరాబాద్ విశ్వనగరంలా మారాలంటే మెట్రోరైలు ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం. రీజినల్ రింగ్ రోడ్డు, రిజినల్ రింగ్ రైల్ ప్రాజెక్టులపై కేంద్రం కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోవాలి. అందుకు కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ప్రత్యేక చొరవ తీసుకోవాలి. రాష్ట్రానికి సముద్ర మార్గం లేనందున డ్రైపోర్టును, ఆటో మొబైల్ ఇండ్రస్ట్రీని తెలంగాణకు ఇచ్చేలా ప్రధానిని అడగాలి. గోదావరి నీటి వినియోగం పూర్తిగా జరగాలనే ఉద్దేశంతోనే రాజశేఖరరెడ్డి హయాంలో ప్రాణహిత–చేవెళ్ల చేపట్టారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు మహారాష్ట్ర భూభాగాన్ని తెలంగాణకు ఇవ్వాలి. ఇందుకు విద్యాసాగర్‌రావు, బీజేపీ పెద్దలు ఆ రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించాలి..' అని రేవంత్ విజ్ఞప్తి చేశారు.

**విద్యార్థి రాజకీయాల్లేకుంటే చైతన్యం ఉండదు**

'వర్సిటీల్లో విద్యార్థులు రాజకీయాల్లోకి రావాలనే ఆలోచనను ప్రోత్సహించాలి. విద్యార్థి రాజకీయాలు లేకుంటే చైతన్యం ఉండదు. సమస్యలకు పరిష్కారం తొందరగా దొరకదు. స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా యువతకు వేగంగా ఉపాధి అవకాశాలు అందుతాయి. జూన్ రెండో తేదీ నాటికి ఇది పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుంది..' అని ముఖ్యమంత్రి తెలిపారు. విద్యాసాగర్‌రావుగారి వ్యక్తిగతం ఎవరూ విమర్శించరని రేవంత్ చెప్పారు. రాజకీయ చైతన్యం అధికంగా ఉన్న తమిళనాడు రాష్ట్రానికి, అలాగే ఆర్థిక కేంద్రం మహారాష్ట్రకు ఒకేసారి గవర్నర్‌గా పనిచేసిన ఆయన..జాతీయ స్థాయిలో తెలంగాణ ప్రతిష్టను పెంచారని కొనియాడారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. కరీంనగర్‌కు చెందిన విద్యాసాగర్‌రావు జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారన్నారు. ఆయన పనితీరు అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. పొన్నం ప్రభాకర్, బండి సంజయ్, మాజీ ఎంపీలు బి.వినోద్‌కుమార్, టి.సుబ్బిరామిరెడ్డి తదితరులు మాట్లాడారు.

**అన్ని పార్టీలు అభివృద్ధి కోసం పోరాడాలి**

యువతలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసే దిశగా ప్రభుత్వం స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయడం అభినందనీయమని విద్యాసాగర్‌రావు అన్నారు. మూసీ నది పరిరక్షణ అత్యవసరమని, హైదరాబాద్‌ను విశ్వనగరంగా మార్చేందుకు కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాని సూచించారు. ఎన్టీఆర్ ప్రభుత్వంలో ప్రైవేటు బిల్లులు ఆమోదించబడేసిన ఘనత ఉందని, ఈ ప్రభుత్వం కూడా ఆ విధానాన్ని అనుసరించాలని ఆకాంక్షించారు.

## భువనగిరిలో బీఆర్‌ఎస్ ధర్నా ఉద్రిక్తం

**నేతల మెరుపు ధర్నా.. అరెస్టు చేసిన పోలీసులు**



బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

సాక్షి, యాదాద్రి: యాదాద్రి జిల్లా కేంద్రం భువనగిరిలో ఆదివారం బీఆర్‌ఎస్ చేపట్టిన ధర్నా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వేకువజాము నుంచే పోలీసులు పట్టణాన్ని అష్ట దిగ్బంధనం చేశారు. మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులను గృహ నిర్బంధంలో ఉంచారు. కొందరిని పోలీసు స్టేషన్లకు తరలించారు. భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిని హైదరాబాద్ వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లో రాత్రి పొద్దుపోయే వరకు నిర్బంధించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నేత కంచర్ల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా యువజన కాంగ్రెస్, ఎస్ఎస్‌యూఐ కార్యకర్తలు.. భువనగిరిలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఆ దాడికి నిరసనగా బీఆర్‌ఎస్ భువనగిరిలోని వినాయక చౌరస్తా వద్ద ఆదివారం మహాధర్నాకు పిలుపునిచ్చింది. పోలీసుల నిర్బంధాన్ని ఛేదించి బీఆర్‌ఎస్ నేతలు భువనగిరికి చేరుకుని మూడు చోట్ల ధర్నాలు చేశారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి వివేకానందుని విగ్రహానికి పూలమాల వేయడానికి వచ్చిన సందర్భంగా బీఆర్‌ఎస్ నేతలు పైళ్ల శేఖర్‌రెడ్డి, కంచర్ల రామకృష్ణారెడ్డి, క్యామ మల్లేష్... కర్నె ప్రభాకర్ తదితరులు ఒక్కసారిగా ధర్నాకు దిగారు. దీంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణులు పోటాపోటీగా నినాదాలతో హోరెత్తించాయి. అక్కడ ఉద్రిక్తత నెలకొనటంతో పోలీసులు బీఆర్‌ఎస్ నాయకులను అరెస్ట్ చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. అశ్వికదళంతో ప్రధాన రహదారితో పాటు పలు వీధుల్లో గస్తీ నిర్వహించారు. పోలీసుల తీరుపై పైళ్ల శేఖర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతిపక్ష నేతలను రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాలతో భయభ్రాంతులకు గురి చేస్తోందని ఆరోపించారు.

**కారులో ఈడ్చుకుంటూ తీసుకెళ్లిన పోలీసులు**



భువనగిరిలో వినాయక చౌరస్తా వద్ద నిరసన తెలుపుతున్న వల్లపు విజయ్‌ను పోలీసులు వాహనంలో బస్టాండ్ వరకు ఈడ్చుకుంటూ తీసుకెళ్లారు. దీంతో ఆయన వెన్నుపూసకు గాయాలైనట్లు వైద్యులు చెప్పారని బీఆర్‌ఎస్ కార్యకర్తలు తెలిపారు.

## మంత్రి పొంగులేటికి తప్పిన ప్రమాదం

**పేలిన కారు టైర్లు**



కారులో మంత్రి పొంగులేటి (ఇన్‌సెట్‌)లో పేలిన కారు టైరు

తిరుమలాయపాలెం: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి పెను ప్రమాదం తప్పింది. హనుమకొండలో ఆదివారం జరిగిన అధికారిక సమీక్షలో పాల్గొన్న ఆయన, అక్కడి నుంచి ఖమ్మం బయలుదేరారు. రాత్రి 8–45 గంటల సమయాన ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం సమీపంలో మంత్రి ప్రయాణిస్తున్న కారు ఎడమపక్క రెండు టైర్లు ఒక్కసారిగా పేలిపోయాయి. డ్రైవర్ చాకచక్యంగా వాహనాన్ని అదుపులోకి తీసుకురావడంతో ప్రమాదం తప్పింది. ఆ సమయంలో కారులో పొంగులేటితో పాటు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, డీసీసీబీ డైరెక్టర్లు బొర్రా రాజశేఖర్, తుళ్లూరి బ్రహ్మయ్య ఉన్నారు. అనంతరం మంత్రి ఎస్కార్ట్ వాహనంలో ఖమ్మం క్యాంపు కార్యాలయానికి బయలుదేరారు. హనుమకొండ నుంచి వస్తున్న క్రమంలో టైర్లు వేడెక్కి పేలిపోయి ఉంటాయని భావిస్తున్నారు.

## మందా జగన్నాథం కన్నుమూత

**సంతాపం తెలిపిన సీఎం రేవంత్, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు**



సాక్షి, హైదరాబాద్/అలంపూర్: నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ డాక్టర్ మందా జగన్నాథం (74) అనా రోగ్యంతో కన్నుమూశారు. కొన్ని రోజులుగా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఇటిక్యాలలో 1951 మే 22న జన్మించిన మందా జగన్నాథం.. నాలుగు పర్యాయాలు ఎంపీగా గెలిచారు. 1996, 1999, 2004 పార్లమెంటు ఎన్నికల్లో తెలుగుదేశం నుంచి 2009లో కాంగ్రెస్ నుంచి గెలిచారు. 2014 తరువాత బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా సేవలందించారు. గత లోక్‌సభ ఎన్నికల ముందు బీఎస్పీలో చేరారు.

**సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం**

మందా జగన్నాథం మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఎంపీగా, సామాజిక తెలంగాణ ఉద్యమకారునిగా రాష్ట్రంలో మందా జగన్నాథం పోషించిన పాత్ర మరువరానిదని అన్నారు. జగన్నాథం మరణం తెలంగాణకు తీరని లోటు అని అన్నారు. మందా జగన్నాథం మరణం పట్ల బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. తెలంగాణ ఉద్యమానికి, బీఆర్‌ఎస్ పార్టీకి ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. జగన్నాథం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సుదీర్ఘకాలం ఎంపీగా ప్రజలకు సేవలందించిన జగన్నాథం మృతి బాధాకరమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. జగన్నాథం రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారని ఎమ్మెల్యే హరీశ్‌రావు సంతాపం వ్యక్తం చేశారు.

## రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నట్లా? లేనట్లా?

**కేంద్రం జోక్యం చేసుకోవాలి: హరీశ్‌రావు**



సిద్దిపేట జోన్: 'వరుస దాడులు జరుగుతున్న తీరు చూస్తే రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయని అనిపిస్తోంది. బీజేపీ, బీఆర్‌ఎస్‌పై జరుగుతున్న దాడుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి. అవసరమైతే రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన పెట్టాలి' అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సాయంత్రం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం పనితీరు, ప్రతిపక్ష పార్టీలపై దాడులు, రైతు హామీల ఉల్లంఘనపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజల దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్ హింసా రాజకీయాలను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. సంక్షేమంలో విఫలమైన సీఎం రేవంత్‌రెడ్డి, శాంతి భద్రతల సమస్యను కావాలనే సృష్టిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితిపై సమీక్ష చేయాల్సిన అవసరం ఉందని, సీఎం మౌనంగా ఉండటాన్ని బట్టి చూస్తే దాడుల వెనుక ఆయన హస్తం ఉన్నట్లు అర్థమవుతోందన్నారు. రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అని, వ్యక్తిగా ఆయన ఆలోచనలు వేరుగా ఉండొచ్చు కానీ, సీఎంగా ఒక బాధ్యత ఉందన్న విషయం గుర్తు ఉంచుకోవాలని సూచించారు. రైతులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని, దీనిపై తాను బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నానని హరీశ్ సవాల్ విసిరారు.



# నీదేం పార్టీ.. నీదేం పార్టీ?

**మంత్రుల ముందే కలబడిన హుజూరాబాద్, జగిత్యాల ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, సంజయ్**

- పాడి తీరుపై మండిపడిన ఉత్తమ్, శ్రీధర్, పొన్నం
- రసాభాసగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రణాళిక, సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న జగిత్యాల ఎమ్మెల్యేను అడ్డుకొని వాగ్వాదం చేస్తున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యాచరణ ప్రణాళిక, సమీక్ష సమావేశం రసాభాసగా మారింది. ఆదివారం కరీంనగర్ కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఉత్తమ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న పథకాల అమలులో సలహాలు, సూచనలు ఇవ్వాలని మంత్రి ఉత్తమ్ కోరారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతుండగా..హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన ఏ పార్టీ అని..మైక్ ఎందుకు ఇచ్చారని మంత్రులను ప్రశ్నించారు. దీనిపై ఎమ్మెల్యే సంజయ్ కూడా స్పందించారు. 'నీది ఏ పార్టీ అంటే నీది ఏ పార్టీ..'అంటూ ఒకరినొకరు ప్రశ్నించుకున్నారు. తాను కాంగ్రెస్ పార్టీలో ఉన్నానని సంజయ్ సమాధానం ఇచ్చారు. ఇద్దరి మధ్యా వాగ్వాదం పెరిగి కలబడి చేతులతో తోసుకున్నారు. పరస్పరం దూషణలకు దిగారు. పోలీసులు కలగజేసుకొని పాడి కౌశిక్‌ను అడ్డుకున్నారు. దీంతో కొన్ని నిమిషాలపాటు కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరూ పరుగున వెళ్లి వారిద్దరినీ వారించే యత్నం చేశారు. పాడిని బలవంతంగా పోలీసులు బయటకు తరలించారు. కేసీఆర్ ఫొటో పెట్టుకొని గెలిచిన వారంతా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ మారిన ప్రతి ఎమ్మెల్యేనూ ఇలాగే నిలదీస్తామని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలపై సంజయ్ బదులిస్తూ.. ముందు పార్టీ ఫిరాయింపులను గతంలో ప్రోత్సహించిన కేసీఆర్, కేటీఆర్ ముందు రాజీనామా చేయాలని, తాను జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తానని, త్వరలో పార్టీలో చేరతానని మీడియాకు తెలిపారు. వేదికపై పాడి తనను ఏమన్నాడో విననేలేదన్నారు. కౌశిక్‌రెడ్డి కాంగ్రెస్ నేతలు కరీంనగర్ వన్‌టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

**రౌడీయిజాన్ని సహించం..**

ఇలాంటి రౌడీయిజం తాము గతంలో చూడలేదని ఉత్తమ్ పేర్కొన్నారు. తమ పార్టీ ఇలాంటి చర్యలను ఉపేక్షించదన్నారు. పాడి చర్యలపై కేసీఆర్, కేటీఆర్ సమాధానం చెప్పాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు. మీడియా ముందు ఇలాంటి చిల్లర పనులతో హీరోలు కావొద్దని హితవు పలికారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సిరిసిల్లలో బీఆర్‌ఎస్ నేతలు రెండు వేల ఎకరాలు దోచుకున్నారని ఆరోపించారు. సిరిసిల్ల బీఆర్‌ఎస్ భవన్‌కు ఎకరం కేటాయిస్తే, రెండున్నర ఎకరాల్లో నిర్మించారని, ఆ భవనాన్ని కూల్చుకుంటారా..తమను కూల్చమంటారా అని ప్రశ్నించారు.

**నేను రాజీనామా చేస్తా.. మీరు సిద్ధమా?**

శాసనసభ సభ్యత్వానికి తాను రాజీనామా చేసేందుకు సిద్ధమని.. దమ్ముంటే బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పదిమంది ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సవాల్ చేశారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలంతా తన సవాల్‌ను స్వీకరించాలన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అమ్ముడుపోయారని, ఆయనకు ఎమ్మెల్యే పదవి కేసీఆర్ పెట్టిన భిక్ష అని చెప్పారు. దమ్ముంటే సంజయ్ తన పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ టికెట్‌పై గెలవాలన్నారు.





అందాన్ని ప్రేమించడం అభిరుచి.
అందాన్ని సృజించడం కళ.
– రాల్ఫ్ వాల్డో ఎమర్సన్



సాక్షి
సోమవారం, 13 జనవరి 2025

# సంక్రాంతి జరీచీర

ఏదో తప్పదు కావున పెళ్లి చేసి చేతులు దులుపుకున్నారనీ, సంక్రాంతికి పిన్నీ బాబాయిలు పుట్టింటి హోదాలో తననూ భర్తనూ పిలిచేదేమీ లేదనీ తెలిపోయాక చిన్నబుచ్చుకుంది ఆ కొత్త పెళ్లి కూతురు. భర్త గమనించాడు. వాళ్లు రాసినట్టే పిలిచినట్టే ఒక కార్డుముక్క సృష్టించాడు. పండక్కు ముందు భార్యను బయల్దేరదీశాడు. పట్నానికి తీసుకెళ్లి దర్జాగా హోటల్‌లో దించాడు. 'ఇదేమిటండీ' అని ఆశ్చర్యపోయింది భార్య. 'మరేటనుకున్నావోయ్. ఇంతకు మించిన పుట్టిల్లు లేదు. కోరిన టిఫెను, భోజనం గదిలోకే వస్తాయి. సాయంత్రమైతే సినిమాలు షికార్లు బోలెడన్ని. ఇదే నీ పుట్టిల్లనుకొని సంతోషపడు' అంటాడు. మనసుంటే పండగ ఉండదా? మధురాంతకం రాజారాం 'పండగ అల్లుడు' కథ ఇది.

చార్జీలు, పండగ ఖర్చులు తలచి పాపం ఆ పేద తల్లిదండ్రులు పెద పండుగ ఊసే ఎత్తలేదు కూతురి సంగతే మరిచినట్టు. అల్లుడు అది గమనించాడు. పండక్కు తన భార్య కొత్తచీర కట్టుకుంటే ఆ మురిపెం వేరు. సింగారమూ వేరు. కోర్టు గుమాస్తా అతను. చిన్న జీతమే. కాని పెద్ద మనసు. రిక్షా ఎక్కడం మానేశాడు. బయట టిఫెన్లు కాఫీలు మానేశాడు. నాటకాలు చూడ్డం మానేశాడు. పుస్తకాలు కొనడమున్నూ. ప్రతి పైసాను పొదుపు చేసి తెచ్చాడు ఆఖరుకు 'పుల్లంపేట జరీచీర'! పదిహేను మూరల ఆ జరీచీర కట్టుకుని కళకళ్లాడిన భార్య 'ఇంత కష్టం చేసి నా కోసం తెచ్చారా' అని భర్త కంఠార తల ఆన్చి బాష్పాలు రాలుస్తుంది. సయోధ్య ఉంటే కాపరం పండగే. శ్రీపాద కథ ఇది.

కరువు రోజుల్లో పండగంటే ఎంత కష్టం. ఇంటి పెద్ద మనసు కష్టపెట్టుకుంటూనే ఎక్కడ ఏది సర్ది చెప్పాలా అని ఆగమవుతూ ఉంటాడు. పిల్లలకిది పడుతుందా? పండగ మరో నెలుందనగానే తట్టలు పట్టి ఎక్కడి పేడంతా సేకరించి పిడకలు కొట్టి ఆరబెట్టారు. 'ఎన్నర్రా' అని తండ్రి అడిగితే '300' అన్నారు గర్వంగా. తండ్రికి ఎన్నో ఆలోచనలు. వాటిని పొయ్యిలోకి వాడితే కట్టెలైనా మిగిలి నాలుగు పైసలు ఆదా అవుతాయి గదా అని. 'ఇవ్వండ్రా' అనంటే 'ఊహూ'. భోగి మంటలేసి ఎగిసే మంటలను చూసి పక్కింటివాళ్లను ఓడిస్తేనే పిల్లలకు ఆనందం. పేదవాడికి పండగంటే 'సర్దుబాటే'. సాక్షాత్తూ ఆరుద్ర రాసిన కథ ఇది.

అయితే 'ఇప్పటి భోగిమంటలు ఒక మంటలేనా' అంటారు ముళ్లపూడి వెంకట రమణ. జగన్నాథుని రథమంత ఎత్తున లేసేలా వేస్తేనే వేసినట్టట. 'ఒరే ఫ్రెండూ... వెళ్లి రెండు బైండింగ్ అట్టలైనా పట్టుకురారా మంట పెంచుదాం' అనంటే ఎవరింట ఉన్నాయట బైడింగ్ అట్టలూ పుస్తకాలూనూ. కోళ్లగంపలూ తాటాకు బుట్టలూ తప్ప. కావున జానెడు ఎత్తు మంటే జగన్నాథుడితో సమానం. అయితే పిల్లకారుకు చిన్న సరదా ఉందిలే. ఆ చిరుచీకట్లలో ప్లీడరు శేషయ్యగారి బోర్డు ఊడబెరికి మంటల్లో వేసి గోడ ఖాళీ ఎందుకని భోజనం తయార్ బోర్డు తెచ్చి అక్కడ వేళ్లాడదీశారు. పండగంటే పిల్లల అల్లరిది. జీవితాంతం చెప్పుకునేటందుకు జ్ఞాపకమై గూడుకట్టేది. ముళ్లపూడి 'భోగి మంటలు' బలే సరదా కథ. అయితే స్త్రీగణాన్ని ఎలా వదిలేస్తాం? ఒక సింగిల్ ఉమన్‌కు అందరూ గది అద్దెకిస్తారుగాని ఒకటే షరతు... రోజూ ఇంటి ముందర ముగ్గేయాలని. ఆ సింగిల్ ఉమన్ మంచి జర్నలిస్టు. ఆలోచనాశీలి. సమాజానికి పనికొచ్చే పనులు చేయగలిగినది. మించి తన జీవితాన్ని తాను నిర్మించుకోగలిగేది. అయినా సరే. ముగ్గేయాల్సిందే. 'నాకు రాదు... వచ్చినా వేయను'... 'పనిమనిషితోనైనా వేయించు'... పండుగ నెల వచ్చిందంటే ఆమెకు గండం. ముగ్గు లేని వాకిలిగా ఆమె ఇల్లే కనపడుతుంది. ఆ నెల్లో యజమాని ఖాళీ చేయించడం ఖాయం. మరో గదికి చలో. ఇంటిని చూసి ఇల్లాలిని చూడాలట. ఇల్లాలి చదువు, జ్ఞానం, వికాసం వీటి వల్ల కాదా దేశానికి పండగ వచ్చేది? పి.రామకృష్ణారెడ్డి కథ 'ముగ్గు'.

సంక్రాంతి తెలుగువారి ముఖ్యమైన పండగ. యుగాంతం వరకూ నిలిచే పండగ. సంస్కృతిని ఎప్పటికీ కాపాడుకోవాల్సిందే. కాని సందర్భాలలోని అంతరాలను చూసి సరిచేసి పండుగ అర్థాన్ని విశాలం చేసుకోవాలి కూడా. 'గుమ్మం ముందు బొబ్బిలిపాట గాళ్లేమిటి... బుడబుక్కల వాళ్లేమిటి... తందానపదం వాళ్లేమిటి... గంగిరెద్దు వాళ్లేమిటి... పగటి వేషగాళ్లేమిటి... తోలు బొమ్మలాళ్లేమిటి... ఎరకలాళ్లేమిటి... చెంచులాళ్లేమిటి... జంగాలేమిటి... సన్నాయి వాళ్లేమిటి... వీళ్లంతా నిమిష నిమిషానికి వచ్చేవాళ్లే' అని రాస్తారు కవికొండల వేంకటరావు 'మా ఇంట సంక్రాంతి' కథలో. పండగ ఒకరు చేసుకునేదిగా... మరొకరు వారింటి ముందుకు వచ్చి ఇనాము అడిగేదిగా ఎందుకు ఉండాలి? ఇనాము ఇచ్చే స్థాయిలో ఒకరు, పొందే స్థాయిలో ఒకరు ఉంటే అది న్యాయమైన సమాజమేనా? జన్మ అంతరాలు, ఆర్థిక అగాథాలనే కాబోలు భోగిజ్వాలల్లో పడేయాల్సింది. గాయకుడు పుట్టా పెంచల్దాసు 'యేటంబిడ యేడుచ్చా పోయా' అనే కథను రాశాడు. భోగి రోజు పండగ చేసుకోనీకుండా, ఇల్లు గడిచేందుకు భత్యాలు తీసుకురమ్మని తల్లి పోరుపెడితే, చీకటితో బయల్దేరి ఇంటింటా పాటలు పాడి గింజలు, వడ్లు తీసుకుని చీకటి పడ్డాక ఇల్లు చేరి, అప్పుడు కొత్త బట్టలు కట్టుకుని ఎవరికి చూపించుకోవాలో తెలియక దిగాలు పడే పసివాడి కథ అది. దుఃఖం వస్తుంది.

సంక్రాంతి ఎంతో సంబరమైన పండగ. కాని సమకాంతికై అది చేసే వాగ్దానాన్ని మనం ఇంకా అందుకోవలసే ఉంది. సామాజికంగా అందరూ అడుగు పెట్టగలిగేదే ఉత్తరాయణం అంటే. క్రాంతి రావడమే సరైన సంక్రాంతి. అటువంటి సంక్రాంతిని కాంక్షిస్తూ గుమ్మడి పూల, పసుపు చేమంతుల శుభాకాంక్షలు!

# రక్షణ రంగంలో రావాల్సిన మార్పులు

విశ్లేషణ



సి. ఉదయ్ భాస్కర్

ఏ దేశమైనా భద్రంగా ఉండాలన్నా, సార్వభౌమత్వానికి సవాళ్లు ఎదురు కాకూడదన్నా పటిష్ఠమైన మిలిటరీ, రక్షణ వ్యవస్థలు అత్యవసరం. 2014లో ప్రధానిగా ఎన్నికైనప్పటి నుంచి నరేంద్ర మోదీ ఈ అంశాలకు ప్రాధాన్యమిచ్చారు. అయితే భారత మిలిటరీ, రక్షణ వ్యవస్థలను సంపూర్ణంగా అర్థం చేసుకోవడంతోపాటు సమీక్షించి అవసరమైన సంస్కరణలు చేపట్టాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉన్నది. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఈ అంశాన్ని తరచూ మిలిటరీ పెద్దల వద్ద ప్రస్తావిస్తూండేవారు. దురదృష్టవశాత్తూ ఈ వ్యవస్థ సంస్కరణ పథం పట్టేందుకు ఇప్పటికీ నిరాకరిస్తోంది.

నరేంద్ర మోదీ రెండో దఫా ప్రధానిగా ఎన్నికైన తరువాత 'చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్' పదవిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే రక్షణ రంగ సంస్కరణలనే భారీ ప్రయత్నానికి ఇది చిన్న ముందడుగు మాత్రమే. చేయాల్సిన పనులు చాలానే ఉన్నాయి. రక్షణ శాఖ ఆధ్వర్యంలోని మిలిటరీ వ్యవస్థ బహుముఖమైనది. ఎన్నో భాగాలు, విభాగాలు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల వంటివి బ్రిటిష్ కాలం నాటివి. అన్నీ వేటికవే ప్రత్యేకమన్నట్టుగా పనిచేస్తున్నాయి. మార్పును సుతరామూ ఇష్టపడటం లేదు. అయితే ఈ లక్షణం భారతీయులది కాకపోవడం కాకతాళీయమే. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో మిలిటరీలు పాతకాలపు మూస ధోరణుల్లోనే కొట్టుకుపోతున్నాయి. భారత మిలిటరీ కూడా ఇలాంటి వ్యవస్థాగతమైన లక్షణాన్నే వ్యక్తం చేస్తోంది.

### లేని యుద్ధ సన్నద్ధత

ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ 2025 సంవత్సరాన్ని మిలిటరీ సంస్కరణలను ప్రధాన లక్ష్యంగా ఎంచుకోవడం, ప్రకటించడం ఆహ్వానించదగ్గ పరిణామం అని చెప్పాలి. 'డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్' (డీఆర్డీవో) 67వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రధాని ఉద్దేశాలను బహిరంగ పరిచారు. సంస్కరణల లక్ష్యాల సాధనలో డీఆర్డీవో కీలక భూమిక ఏమిటన్నది కూడా రక్షణ మంత్రి ఆ సమావేశంలో వివరించారు.

మిలిటరీ సంస్కరణల గురించి స్థూలంగా చెప్పాలంటే... దేశ రక్షణకు వ్యూహాత్మకంగా, సాంకేతిక పరిజ్ఞానాల విషయంలో, భౌగోళిక, రాజకీయ అనివార్యతలకు తగ్గట్టుగా యుద్ధ సన్నద్ధతను సంపాదించుకోవడం ఒకటి. కీలకమైన ఆయుధ, సమాచార వ్యవస్థలు, టెక్నాలజీల కోసం విదేశాలపై ఆధారపడటం వీలైనంత తగ్గించడం రెండోది. ఈ రెండు లక్ష్యాలను సాధించాలంటే డీఆర్డీవోతో పాటు దేశంలోని శాస్త్ర, తయారీ రంగాలు ప్రధానమైన పాత్ర పోషించాల్సి ఉంటుంది.

శాస్త్రవేత్తలు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలనీ, తమ సామర్థ్యాలను పెంచుకోవాలనీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. 'ప్రపంచంలోనే అగ్రగామి పరిశోధన, అభివృద్ధి సంస్థగా డీఆర్డీవో ఎదగాలి' అని ఆకాంక్షించారు. డీఆర్డీవో కీర్తి కిరీటంలో కొత్తగా చేరిన కలికితురాయి దీర్ఘశ్రేణి 'హైపర్ సానిక్ యాంటీ-షిప్' క్షిపణి డిజైన్ బృందం కృషిని



రక్షణ మంత్రి అభినందించారు కూడా.

అయితే భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి విషయాల్లో వ్యవస్థాగతమైన పరిమితులు కొన్ని పట్టిపీడిస్తున్నాయన్నది కఠోర సత్యం. వీటిని పరిష్కరించకుండా సంస్కరణల లక్ష్యం సాధించడం అసాధ్యం. 'ఆర్ అండ్ డీ' విషయంలో భారత్ ప్రపంచ అగ్రగామి దేశాల జాబితాలో లేదు. రక్షణ రంగంలో పెట్టుబడులు, ఉత్పాదకతలు కూడా దశాబ్దాలుగా ఓ మోస్తరుగా మాత్రమే ఉన్నాయి. అప్పుడప్పుడు అక్కడక్కడ ఒకట్రెండు మినహాయింపులు కనిపిస్తాయి అంతే.

### కేటాయింపులు పెరిగేనా?

గత ఏడాది సెప్టెంబరులో డీఆర్డీవో చైర్మన్ సమీర్ వి.కామత్ మాట్లాడుతూ, 'ఆర్ అండ్ డీ'కి వెచ్చిస్తున్న మొత్తం భారత స్థూల జాతీయోత్పత్తిలో కేవలం 0.65 శాతం మాత్రమే ఉన్న విషయాన్ని స్పష్టం చేశారు. ఈ రంగంపై అమెరికా 2.83 శాతం, ఫ్రాన్స్ 2.19 శాతం, చైనా 2.14 శాతం, దక్షిణ కొరియా 4.8 శాతం ఖర్చు చేస్తున్నాయని కూడా ఆయన గుర్తు చేశారు. భారత్ కేటాయిస్తున్న నిధులు చాలా తక్కువన్న విషయం ప్రభుత్వానికి కూడా తెలుసుననీ, మోదీ హయాంలోనైనా ఈ మొత్తం జాతీయోత్పత్తిలో ఒక శాతానికి చేరుకోవాలనీ ఆశిస్తున్నట్లు సమీర్ కామత్ తెలిపారు. 2035 నాటికి రెండు శాతానికి చేరడం అభిలషణీయమని అన్నారు. ప్రస్తుత పరిస్థితులను గమనిస్తే ఈ ఆశలు నెరవేరే సూచనలేవీ లేవు. రక్షణ రంగం మొత్తానికి కేటాయిస్తున్న నిధులే స్థూల జాతీయోత్పత్తిలో రెండు శాతానికి దగ్గరగా ఉన్న పరిస్థితుల్లో భారీ రాజకీయ జోక్యంతో గానీ 'ఆర్ అండ్ డీ'కి ఒక శాతం కేటాయింపులు సాధ్యం కావు.

ఇక డీఆర్డీవో, రక్షణ మిలటరీ వ్యవస్థలు ఎదుర్కొంటున్న సమస్య విదేశీ దిగుమతులపై ఎక్కువగా ఆధారపడటం. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదిక ప్రకారం, 2012–13 నుంచి 2021–22 మధ్యకాలంలో మిలిటరీ, రక్షణ రంగాల మూలధన వ్యయం విదేశీ మారక ద్రవ్యంలో 35 శాతం వరకూ ఉందంటే పరిస్థితి ఏమిటన్నది అర్థమవుతుంది. ఒకానొక దశలో ఇది 49 శాతానికి కూడా చేరుకున్నట్లు నివేదికలు తెలుపుతున్నాయి. వ్యూహాత్మక విషయాల్లో

- కీలకమైన ఆయుధ, సమాచార వ్యవస్థలు, టెక్నాలజీల కోసం విదేశాలపై ఆధారపడటం వీలైనంత తగ్గించుకోవాలి.
- యుద్ధ ట్యాంక్, యుద్ధ విమానం, జలాంతర్గాముల విషయంలో మనం చాలా వెనుకబడి ఉన్నాం. వ్యక్తిగత ఆయుధాల కోసం కూడా దిగుమతులపైనే ఆధారపడుతున్నాం. అగ్ని–5 వంటి క్షిపణులను సమర్థంగా ఉత్పత్తి చేయగల దేశానికి ఇదేమంత అనుకూలమైన అంశం కాదు.
- స్థూల జాతీయోత్పత్తిలో 'ఆర్ అండ్ డీ'కి భారత్ వెచ్చిస్తున్న మొత్తం కేవలం 0.65 శాతమే. అమెరికా 2.83 శాతం, ఫ్రాన్స్ 2.19 శాతం, చైనా 2.14 శాతం, దక్షిణ కొరియా 4.8 శాతం ఖర్చు చేస్తున్నాయి.

స్వతంత్రంగా ఉండాలన్న దేశ ఆకాంక్షలకు ఇది భిన్నం.

డీఆర్డీవో, ఇతర రక్షణ రంగ సంస్థలు మొదలై సుమారు ఏడు దశాబ్దాలు అవుతోంది. అణ్వాయుధాలు, క్షిపణులు, అణు చోదక వ్యవస్థల విషయంలో ప్రశంసార్హమైన ప్రగతి సాధించాము. ఇందులో ముప్ఫై ఏళ్ల అగ్రరాజ్యం అమెరికా ఎన్నో ఆంక్షలున్న సంగతి తెలిసిందే. అయితే యుద్ధ ట్యాంక్, యుద్ధ విమానం, జలాంతర్గాముల విషయంలో మనం చాలా వెనుకబడి ఉన్నాం. డీఆర్డీవో, ప్రభుత్వ రంగ సంస్థలు రెండూ దేశ యుద్ధ సన్నద్ధతను గణనీయంగా పెంచిందీ లేదు.

### సొంత డిజైన్లు లేవు!

ప్రస్తుత ప్రభుత్వం దృష్టి ప్రధానంగా ప్రైవేట్ రంగం, విద్యాసంస్థల సహకారంపై ఉంది. ఆహ్వానించ దగ్గదే. కానీ ఈ సహకారానికి సంబంధించి పద్ధతులు, సమయావధులు నిర్ణయం కావాల్సి ఉంది. భారత్‌కు ఉన్న ఇంకో బలహీనత ఏమిటంటే... గణనీయమైన జీడీపీ, నైపుణ్యం, విద్యార్హతలున్న మానవ వనరులు, ఉన్నత విద్యాసంస్థలు ఎన్ని ఉన్నా... మిలిటరీ పరికరాలకు సంబంధించి సొంత డిజైన్ లేకపోవడం! 1960లలో ఇషాపోర్ రైఫిల్, హెచ్ఎఫ్–24 మారుత్ యుద్ధ విమానాలు కొంతమేరకు మాత్రమే విజయం సాధించాయన్నది గుర్తుపెట్టుకోవాలి. ఫలితంగా ఇప్పటికీ మనం వ్యక్తిగత ఆయుధాల కోసం కూడా దిగుమతులపైనే ఆధారపడుతున్నాం. అగ్ని–5 వంటి క్షిపణులను సమర్థంగా ఉత్పత్తి చేయగల భారత్ లాంటి దేశానికి ఇదేమంత అనుకూలమైన అంశం కాదు.

డీఆర్డీవో విషయాన్నే ప్రత్యేకంగా పరిశీలిస్తే... సంస్కరణలను ఆహ్వానిస్తూనే తన సొంత శక్తి సామర్థ్యాలపై లోతైన సమీక్ష చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పాలి. స్వతంత్ర నిపుణుల ఆధ్వర్యంలో ఇలాంటి అధ్యయనం ఒకటి జరిపి ఫలితాల ఆధారంగా భవిష్యత్తుకు ప్రణాళికలు రూపొందించుకోవడం అవసరం. లేదంటే సంస్కరణల ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారిపోయే ప్రమాదం ఉంది.

వ్యాసకర్త 'సొసైటీ ఫర్ పాలసీ స్టడీస్' డైరెక్టర్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

## సోషల్ మీడియా

### ఏం చేయగలదు?



గ్రీన్‌లాండ్ డెన్మార్క్‌లో భాగం. డెన్మార్క్ నాటో వ్యవస్థాపక సభ్యదేశం. ఆర్టికల్ 5 కింద నాటో ఉమ్మడి భద్రతను అందిస్తుంది. అంటే, డెన్మార్క్ మీద దాడి జరిగితే, నాటో సాయానికి రావాలి. కానీ నాటోలో అత్యంత శక్తిమంతమైన అమెరికాయే డెన్మార్క్ సార్వభౌమత్వాన్ని అతిక్రమిస్తే, అప్పుడు నాటో ఏం చేస్తుంది? – స్టాన్లీ జానీ, జర్నలిస్ట్

### అవి ఎలాంటివి?



తాను చెడ్డ వాళ్లు అనుకున్న అన్ని దేశాల నాయకులను ఎలాన్ మస్క్ ఢీ కొడుతున్నారు – కెనడా, ఫ్రాన్స్, యూకే... కానీ ఇప్పటి వరకూ చైనా, షీ జిన్‌పింగ్ మీద మౌనంగా ఉన్నారు. రష్యా, పుతిన్ మీద కూడా మాట్లాడటం లేదు. – సందీప్ మనుధానె, విద్యావేత్త

### లేబుల్ ఉండాల్సిందే!



బిస్కెట్లు, నూడుల్స్ లాంటి ఏ ఆహార పరిశ్రమ అయినా పోషకాల లేబుల్‌ను ప్రదర్శించాల్సిందే. నీళ్లలో సున్నా కేలరీలు ఉన్నప్పటికీ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్‌లో అదైనా చూపాల్సిందే. మరి మద్యపాన పరిశ్రమకు ఎందుకు మినహాయింపు? లేబుల్స్ ఉన్నంత మాత్రాన తాగేవాళ్లు మానుతారా? మానకపోవచ్చు, కానీ కొంచెం తగ్గుతారు. – రేవంత్ హిమత్‌సింగ్‌కా, ఫుడ్ యాక్టివిస్ట్

### ఇంత నిర్లక్ష్యమా?



మధ్యప్రదేశ్‌లోని గిడ్డంగుల్లో 9 లక్షల క్వింటాళ్ల ఆహార ధాన్యాలు పాడైపోయాయి. ఐదేళ్ల లోపు చిన్నారుల్లో 26 శాతం మంది తక్కువ బరువున్న రాష్ట్రం ఇది. అన్నట్టూ, ప్రపంచ ఆకలి సూచీలో ఇండియా ర్యాంకు 105. – పార్థ్ ఎంఎన్, జర్నలిస్ట్

### జాగ్రత్త



కనీసం నాలుగు రకాల సంపదలుంటాయి: 1. ఆర్థిక సంపద (డబ్బు) 2. సామాజిక సంపద (హోదా) 3. సమయ సంపద (స్వేచ్ఛ) 4. భౌతిక సంపద (ఆరోగ్యం): 'మీకు 1, 2 ఇస్తామని ప్రలోభపెట్టి మీ 3, 4 దోచుకునే వాటిపట్ల జాగ్రత్తగా ఉండండి' అంటాడు అమెరికా రచయిత జేమ్స్ క్లియర్. – వాలా అఫ్షార్, ఇవాంజెలిస్ట్

## ఇన్ బాక్స్

### ఇంటింటా సంక్రాంతి

శ్రమైక జీవన సౌందర్యానికి అద్దం పట్టే పండుగ సంక్రాంతి. శ్రమకు ఫలితం ఇంటికి చేరే సందర్భంలో జరుపుకొనే రంగుల పండుగ. అలుకు (కళ్లాపి) చల్లిన వాకిళ్లు, నేల నలుచెరుగులా పరుచుకున్న ముగ్గులు, గొబ్బెమ్మలతో నిండిన వీధుల్ని చూసినప్పుడు కలిగే ఆనందం అంతా ఇంతా కాదు. నింగిలోని చుక్కలు దిగివచ్చి ముగ్గులై మురిశాయా... హరి విల్లులోని వర్ణాలన్నీ ఆ ముగ్గుల్లో కొత్త అందాలు పరిచాయా అన్నట్టుగా అనిపిస్తుంది. గొబ్బెమ్మలు, రేగుపళ్లు, చెరుకు గడలతో ముగ్గులు మరింత సింగారించుకొని సంక్రాంతికి ఆహ్వానం పలుకుతాయి.



రంగు రంగుల బట్టలు, గంటలు, గజ్జెలతో అలంకరించిన గంగిరెద్దులు; నువ్వుల బెల్లంతో చేసిన అరిసెలు, తీరొక్క దినుసులు, పసుపు కుంకుమల పచ్చటి వాతావరణంలో 'నువ్వులు తిని నూరేండ్లు బతుకు... చక్కెర తిని తీయగా మాట్లాడు' అంటూ పంచిపెడతారు. సకినాలు, సర్వపిండి, సజ్జ రొట్టెలు, ఆకాశాన్ని తాకే గాలిపటాలతో పిల్లల ఆనందం అంబరాన్నంటుతుంది. ఎవరెక్కడున్నా ఈ పండుగకు మాత్రం ఊరికి పోవాల్సిందే. అమ్మకోసం, ఊరమ్మ కోసం, పుట్టిన మట్టి వాసన– మధుర స్మృతుల కోసం పరుగెడతారు.

పండుగ సంప్రదాయాల్లో వ్యాపార ధోరణి ప్రవేశించింది. కార్పొరేట్ సంస్థలు తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ప్రజా సంస్కృతిని వికృతం చేస్తున్నాయి. ప్రజా కళలను ప్రచార సరుకులుగా మార్చి సొమ్ము చేసుకుంటున్నాయి. అభివృద్ధి నిరోధక శక్తులు, మతతత్వ శక్తులు ఆ యా సందర్భాల్లో ఆధిపత్యం వహించి పండుగ వాతావరణాన్ని చెడగొడుతున్నాయి. కార్పొరేట్ కంపెనీల ప్రచారంతో మన పండగలన్నీ వినిమయ సంస్కృతిని ప్రతిబింబించేలా తయారు కావడం నేటి విషాదం! దాన్నుండి బయటపడాలంటే మన పండగలను అచ్చమైన దేశీయ పద్ధతిలో జరుపుకోవడమే మార్గం.

– భూపతి వెంకటేశ్వర్లు
తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు

# మహాజన సమ్మేళనానికి శ్రీకారం

విష్ణు పాదోద్భవి గంగ ఆకాశమార్గం గుండా వచ్చి హిమాలయాల పైన చేరి, అక్కడి నుండి శివుడి జటాజూటంలో పడి, హరిద్వార్ వద్ద దివి నుండి భువికి దిగివచ్చి భూలోకంలో ప్రవహిస్తూ ప్రయాగరాజ్ వద్ద గంగా యమునా అంతర్వాహిని సర్వసతి నదిని కలుపుకొని త్రివేణి సంగమంగా విరాజిల్లుతున్నదని భక్తుల నమ్మకం. అందుకే కుంభమేళా అక్కడ జరుపుతారు.

12 ఏళ్లకు ఒకసారి జరిగే పవిత్ర స్నానాల సమయాన్ని 'కుంభమేళా' అనీ, ఆరు సంవత్సరాలకు ఒకసారి జరిగే దాన్ని 'అర్ధ కుంభమేళా' అనీ, ప్రతి సంవత్సరం మాఘమాసంలో జరిగే పవిత్ర స్నానాలను 'మాఘీమేళా' అనీ పిలుస్తారు. 'కుంభము' అంటే బాండము అనీ, 'కలశం' అనీ మనకు తెలుసు. ఖగోళంలో జరిగే మార్పులను అనుసరించి పంచాంగం ప్రకారం లెక్కించిన విధంగా ఒక్కొక్క స్థలంలో ఒక్కొక్క సమయంలో కుంభమేళా జరుగుతుంది. 'సూర్యుడు మకర రాశిలో, బృహస్పతి వృషభ రాశిలో ఉన్నప్పుడు ప్రయాగలో పూర్ణ కుంభమేళా', వృశ్చిక రాశిలో ఉన్నప్పుడు అర్ధ కుంభమేళా జరుగుతుంది.

**మహా కుంభమేళా జరిగే స్థలాలు**

గంగానదిలో (హరిద్వార్- ఉత్తరాఖండ్)
క్షిప్రానదిలో (ఉజ్జయిని- మధ్యప్రదేశ్)
గోదావరి నదిలో (నాసిక్- మహారాష్ట్ర)
గంగా నదిలో (ప్రయాగ్‌రాజ్-ఉత్తరప్రదేశ్; గంగా, యమునా, అంతర్వాహినిగా ప్రవహిస్తున్న సరస్వతి నది సంగమం వద్ద.)

కుంభమేళా సమయంలో అనేక ఏనుగులు, గుర్రాలు, రథాలపై వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న సాంప్రదాయిక ఊరేగింపు జరుగుతుంది. ఈ సమయంలో నాగ సాధువులు, మండలేశ్వరులు, మహా మండలేశ్వరులు, అఖాడాలు ముందు నడుస్తుండగా వెనుక శిష్యులు, సామాన్య భక్తులు లక్షలాదిగా అనుసరిస్తారు. అనంతరం 'షాహిస్నాన్' (పుణ్యస్నానాలు) ఆచరిస్తారు. కుంభమేళాకు హాజరయ్యేందుకు సంక్రాంతి



నుండి శివరాత్రి వరకు కోట్లమంది భక్తులు వస్తారు. వీరంతా 'ధర్మరక్షణ అంటే వ్యక్తిగతంగా ధర్మాన్ని పాటించడమే అని భావించి సంకల్పం తీసుకొని పుణ్య స్నానాలు ఆచరించి తిరిగి వస్తుంటారు. పూజ్యులు, పీఠాధిపతులు, మఠాధిపతులు భక్తులకు మంత్రోపదేశం చేస్తుంటారు, ప్రవచనాలు చేస్తుంటారు. జనవరి 24, 25వ తేదీలలో మార్గదర్శక మండలి సమ్మేళనం, 26 తేదీన దేశం నలుమూలల నుండి 128 ఆరాధన మార్గాలకు చెందిన 'సంత్ సమ్మేళనం', 27వ తేదీన 'యువ సంత్' (యువ సన్యాసుల) సమ్మేళనం జరుగబోతున్నది

ప్రపంచంలోని 13వ వంతు ప్రజలు పాల్గొనే సన్నివేశం కుంభమేళ. సగం దేశాల జనాభా కంటే ఎక్కువ. 2017లో అర్ధ కుంభమేళాలో మూడు కోట్ల మంది పాల్గొన్నట్లు, 2001వ సంవత్సరం కుంభమేళాలో ఆరు కోట్ల మంది పాల్గొన్నట్లుగా నివేదికలు చెబుతున్నాయి. ఈ సంవత్సరం కనీసం 40 కోట్ల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారని ఏర్పాట్లు చేస్తున్నారు.

దేశవ్యాప్తంగా కుంభమేళాలలో కలిసే ప్రజలు ఆధ్యాత్మిక సంకల్పాలతో పాటు స్వాతంత్ర్యం సాధిస్తామని ప్రతిజ్ఞను కూడా చేసి తిరిగి వెళ్లేవారు. అంతేకాదు తల్లిని బానిసత్వం నుండి విడిపించిన గరుత్మంతుడిని గుర్తు చేసుకొని భారతమాతను బందీ నుండి విడిపిస్తామని సంకల్పాన్ని తీసుకొని వెళుతుండేవారు. దేశవ్యాప్తంగా తిరుగుబాటు ఆందోళనలు జరగడానికి, స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించే నాయకులను గుర్తించి వారి నాయకత్వాన్ని స్వీకరించడానికి వారి మార్గదర్శనాన్ని పొందడానికి దేశ ప్రజలకు ఈ కుంభమేళాలు వేదికలుగా ఉపయోగపడేవి.

నానా సాహెబ్ పీష్వా, ధుంధుపంత్, బాలాసాహెబ్ పేష్వా, తాంతియా తోపే, ఝాన్సీరాణి లక్ష్మిబాయి, రంగోజి బాపు, జగదీష్పూర్ జమీందార్ బాబు కున్వర్ సింగ్ మొదలైన వారు పాల్గొన్న ఈ ఉద్యమంలో సామాన్య ప్రజలను కూడా భాగస్వాములు కావాలనే సందేశాన్ని తెలియజేయడానికి తామర పువ్వును, రొట్టెలను ప్రసాదంగా పంచి పెట్టాలని ఇక్కడే నిర్ణయించారు.

**ముఖ్యమైన రోజులు**

1. పౌష్య పూర్ణిమ: జనవరి 13 సోమవారం
2. మకర సంక్రాంతి: జనవరి 14 మంగళవారం– మొదటి షాహిస్నానం.
3. మౌని అమావాస్య (సోమవతి): జనవరి 29 బుధవారం– రెండవ షాహిస్నానం.
4. వసంత పంచమి: ఫిబ్రవరి 3 సోమవారం– మూడవ షాహిస్నానం.
5. మాఘీ పూర్ణిమ: ఫిబ్రవరి 12 బుధవారం
6. మహాశివరాత్రి: ఫిబ్రవరి 26 బుధవారం

ఈ సంవత్సరం ప్రయాగరాజ్ 'మహా కుంభమేళా' జనవరి 13, 2025 నుండి ఫిబ్రవరి 26 వరకు జరుగబోతోంది. కుంభమేళా వల్ల ఉత్తరప్రదేశ్‌కు 1.2 లక్షల కోట్ల రూపాయల ఆదాయం వచ్చే అవకాశం ఉందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) తెలిపింది. భక్తులకు ఏర్పాట్లు సౌకర్యాల నిమిత్తం గతంలో ఎన్నడూ లేని విధంగా కేంద్ర ప్రభుత్వం రూ. 2,100 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించింది. అలాగే కుంభ మేళ్లా జరిగే రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు కూడా భారీగా నిధులను కేటాయించి ఈ అద్భుత యజ్ఞాన్ని నిర్వహించ తలపెట్టడం ముదావహం.

– ఆకారపు కేశవరాజు | వీహెచ్‌పీ కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల ఆర్గనైజింగ్ సెక్రటరీ

# భోగాల రాగాలు

మన్మథుడికి వసంతుడి లాగా, భోగి పండగ సంక్రాంతికి సామంతుడు. పెద్ద పండగకు హంగుదారు. 'సంక్రాంతి లక్ష్మి వేంచేస్తున్నదహో, బహుపరాక్!' అని ముందస్తు హెచ్చరికలు చేస్తూ, ఊరంతటినీ ఉత్తేజపరిచి, పండగ కళకు పటిష్ఠమైన పునాది వేస్తుంది.

ధనుర్మాసపు ముచ్చటలకు యథోచితంగా భరతవాక్యం పలికి, పౌష్యయోష ఆగమనానికి అంగరంగ వైభవంగా రంగం సిద్ధం చేస్తుంది. మకర సంక్రమణం జరగబోతున్న మహత్తర ముహూర్తం వేళకు, చప్పటి సాధారణ జీవితపు స్తబ్దతను వదిలించే ప్రయత్నం చేస్తుంది. చలిమంటల నెపంతో, అబాల గోపాలంలోనూ సంబరాల వేడి పుట్టిస్తుంది. పల్లె సీమలలో ప్రతి ఇంటి ముంగిటా సమృద్ధికి సంకేతాలుగా, సంతుష్టికి గుర్తులుగా, పూర్ణ కలశాల 'కుండ ముగ్గులు' పూయిస్తుంది.



జ్యోతిర్మయం

**వచ్చింది వచ్చింది పచ్చ సంక్రాంతి/ వచ్చింది వచ్చింది లచ్చి సంక్రాంతి! /అరటి స్తంభాలతో అందగింతాము, / బంతి పూదండలన్ భావించుదాము, / తామరాకులతోడ దళ్ళల్లు దాము, / కలవ కాడల తోడ మెలికలేతాము!** అంటూ (రాయప్రోలు వారి) పాటలు పాడుతూ వచ్చి, అందరినీ హుషారు చేస్తుంది.

మరో రకంగా చూస్తే, సుదీర్ఘమైన సంక్రాంతి ఉత్సవంలో భోగి పండగ భోగానుభవాల రోజు. పులకింతలు కలిగించే చలిమంటలూ, ఉత్సాహం పెంచే ఉష్ణోదక అభ్యంగన స్నానాలతో ఆరంభించి, కొత్త బట్టల కోలాహలాలతో, వంటలు, పిండి వంటల ఆటోపాలతో, ఆత్మారాముడిని ఆనందపరిచే రోజు భోగి. సంక్రాంతి రోజు ఉత్తరాయణ పుణ్యకాలం ఆరంభ సమయం. మార్తాండుడి మకర సంక్రమణ వేళ. కనుక దానికి ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఎక్కువ. ఆ రోజు ఆస్తికులు దానాలూ, తపాలూ, పితృతర్పణాల లాంటి ఆధ్యాత్మిక వ్యాసంగాలలో ఎక్కువ కాలం గడుపుతారు. కాబట్టి, సరదాలకూ, భోగాలకూ సమయం సరిపోకపోవచ్చు. కాబట్టి భోగినాడే చలిమంటలలో విభేదాలూ, విద్వేషాలూ, ఈర్ష్యాసూయల లాంటి నకారాత్మక భావనలు యథాశక్తి దహించేసుకొని, ఆ రోజంతా బంధుమిత్రుల సాంగత్యంలో ఉల్లాసంగా గడిపి, జీవితంలో కొత్త శక్తినీ, ఉత్సాహాన్నీ నింపుకొని, ఆపైన జరపవలసిన సంక్రాంతి విధులకు సన్నద్ధం కావాలి.

అందరికీ భోగి పండగ శుభాకాంక్షలు!

– ఎం. మారుతి శాస్త్రి

## గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** పౌర్ణమి తె.3.59 వరకు (తెల్లవారితే మంగళవారం) తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** ఆరుద్ర ఉ.11.02 వరకు, తదుపరి పునర్వసు, **వర్జ్యం:** రా.10.59 నుండి 12.31 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.34 నుండి 1.22 వరకు, తదుపరి ప.2.48 నుండి 3.36 వరకు, **అమృతఘడియలు:** ఉ.8.25నుండి 10.02 వరకు, భోగి పండగ ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.39.



# అయ్యవారికి దండం పెట్టు..

## పల్లెల్లో కనిపించని గంగిరెద్దుల ఆటలు

## ఆధునిక సమాజంలో ఆదరణ కరువు

## ఇబ్బందుల్లో గంగిరెద్దులవారి బతుకులు

**వేలేరు:** సంక్రాంతి పండుగ వచ్చిందంటే గంగిరెద్దుల వారికి పండుగే. బసవన్న కాలికి, మెడకు గజ్జెల పట్టీలు కట్టి.. రంగురంగుల వస్త్రాలతో అందంగా అలంకరించి, కొమ్ములకు రంగులద్ది.. సన్నాయి ఊదుతూ.. ఊరూరా తిరుగుతూ సందడి చేస్తారు. అయితే పండుగ వేళ ఇళ్ల ఎదుట సందడి చేసే గంగిరెద్దుల ఆటలు నేటి ఆధునిక సమాజంలో కనుమరుగవుతున్నాయి. హనుమకొండ జిల్లా వేలేరు మండలం మద్దెలగూడెం గ్రామంలో సుమారు 45 గంగిరెద్దుల వారి కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరికి గంగిరెద్దుల ఆటనే ప్రధాన వృత్తి. తాతల కాలం నుంచి అదే వృత్తిని నమ్ముకుని జీవనాన్ని గడుపుతున్నారు. వీరికి అంతో ఇంతో ఆదాయం వచ్చేది సంక్రాంతి పండుగ సమయంలోనే. మిగతా సమయంలో గంగిరెద్దుల ఆటతో వచ్చే ఆదాయం సరిపోక బతుకుదెరువు కష్టమై కూలి పనులు చేస్తున్నారు. అలాగే ఎవరైనా చనిపోతే దశదినకర్మ సమయంలో వెళ్లి ఆటలు ఆడిస్తూ ఉంటారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ జీవితాల్లో వెలుగులు రావడం లేదని వారు వాపోతున్నారు.

### ప్రభుత్వం ఆదుకోవాలి..



తాతల కాలం నుంచి గంగిరెద్దులను ఆడిస్తూనే బతుకుతున్నాం. మాకు ఏ ప్రభుత్వంలో ఎలాంటి పథకాలు అందలేదు. ఎన్నికలప్పుడు నాయకులు ఓట్లు వేయించుకోవడానికే మా దగ్గరికి వస్తారు. తర్వాత మా ఇళ్లవైపు కన్నెత్తి చూడరు. మా గంగిరెద్దుల కుటుంబాలకు 25 ఏళ్ల క్రితం ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇచ్చింది. ఇప్పుడు అవి కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ ప్రభుత్వమైనా మాకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించి ఆదుకోవాలి.

– బత్తుల మల్లయ్య

### కులవృత్తే జీవనాధారం..



కులవృత్తిలో భాగంగా నా భర్త గంగిరెద్దులను ఆడిస్తాడు. సంక్రాంతికి గంగిరెద్దులను ఆడించడంతో పండుగ ఖర్చులు వస్తాయి. గ్రామాల్లో ఎవరైనా చనిపోతే దశదినకర్మ వద్దకు వెళ్లి గంగిరెద్దులను ఆడిస్తుంటారు. మిగతా సమయాల్లో కూలి, ఇతరత్రా పనులు చేసుకుంటూ పిల్లలను సాదుకుంటున్నాం. ప్రభుత్వం నుంచి ఏ సాయమూ లేదు.

– ఆవుదొడ్డి దుర్గమ్మ



# ఆన్‌లైన్‌లోనే ఉద్యోగుల సమస్యలు పరిష్కారం

- పంచాయతీరాజ్ శాఖ నిర్ణయం
- ప్రతీ రెండు, నాల్గవ శుక్రవారాల్లో ఆన్‌లైన్ సమావేశం



సాక్షి, హైదరాబాద్: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో ఉద్యోగుల సమస్యలను ఇకపై ఆన్‌లైన్‌లోనే పరిష్కరించాలని ఆ శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం వారు సచివాలయం, లేదా కమిషనర్ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ప్రతీ రెండు, నాల్గవ శుక్రవారం రోజు ఉద్యోగులు తమ సమస్యలను ఆన్‌లైన్ సమావేశంలోనే చెప్పుకోవచ్చు. ఈ సమావేశాలకు మంత్రి సీతక్క కూడా హాజరుకానున్నారు. ఈనెల 24వ తేదీన నాల్గవ శుక్రవారం రోజు ఆన్‌లైన్ సమావేశానికి ముహూర్తంగా నిర్ణయించారు. ఉద్యోగులు తమ పనుల కోసం వారు పనిచేసే ప్రాంతాన్ని వదిలి హైదరాబాద్ రావడం వల్ల క్షేత్రస్థాయిలో పనులకు ఆటంకం కలగటంతోపాటు, ఉన్నతాధికారుల సమయం కూడా వృథా అవుతుందని భావిస్తున్నారు. రెండు శుక్రవారాల్లో మధ్యాహ్నం మూడు నుంచి నాలుగు గంటల వరకు.. ఓ గంట పాటు ఉద్యోగుల సమస్యలపై ఉన్నతాధికారులు ఆన్‌లైన్ సమావేశం నిర్వహిస్తారు. పంచాయతీరాజ్ శాఖ ఇచ్చే వెబ్ లింక్ ద్వారా.. ఉద్యోగులు సమావేశంలో పాల్గొని తమ ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావచ్చు.

# శ్రీపాల్‌రెడ్డికి గురుకుల ఉపాధ్యాయ సంఘం మద్దతు



శ్రీపాల్‌రెడ్డికి మద్దతు ప్రకటిస్తున్న పీఆర్‌జీటీఏ నాయకులు

సాక్షి, హైదరాబాద్: ఖమ్మం–వరంగల్–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం నుంచి పీఆర్‌టీ యూటీఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పింగిలి శ్రీపాల్‌రెడ్డికి ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ గురుకుల టీచర్స్ అసోసియేషన్ (పీఆర్‌జీటీఏ) మద్దతు ప్రకటించింది. సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి దిలీప్‌కుమార్‌రెడ్డి ఈమేరకు ఆదివారం పీఆర్‌టీయూ నేతలను కలసి మద్దతు తెలిపారు. అలాగే కరీంనగర్–మెదక్–ఆదిలాబాద్– నిజామాబాద్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మహేందర్‌రెడ్డికి కూడా ఆయన మద్దతు తెలిపారు.

# దక్షిణ వలయం.. అయోమయం

## కేంద్రం, రాష్ట్రం సమాంతర కసరత్తులు

- డీపీఆర్, అలైన్‌మెంటును రూపొందించే పనిలో రాష్ట్ర సర్కారు.. కానీ ఆది నుంచి కేంద్రం అధీనంలోనే ప్రాజెక్టు
- ఇప్పటికే ఎన్‌హెచ్‌ఏఐ పరిశీలనలో కేంద్ర కన్సల్టెన్సీ రూపొందించిన అలైన్‌మెంటు
- రాష్ట్రం, ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల్లో గందరగోళం

సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగురోడ్డు దక్షిణ భాగం విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారం గందరగోళంగా మారింది. జాతీయ రహదారిగా నిర్మిస్తున్నందున, ఆ ప్రాజెక్టును ప్రతిపాదించినప్పటి నుంచి ట్రిపుల్ ఆర్ రెండు భాగాలూ ఎన్‌హెచ్‌ఏఐ పరిధిలోనే ఉన్నాయి. ప్రస్తుతం నేషనల్ హైవేస్ (ఒరిజినల్) జాబితాలో ఉత్తర భాగం ఉండగా, విజన్ 2047 పార్ట్ 2 జాబితాలో దక్షిణ భాగం ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం దక్షిణ భాగానికి డీపీఆర్‌ను రూపొందించే పనిలో ఉంది. గతంలో పిలిచిన టెండర్లకు స్పందన లేకపోవటంతో దాని గడువును పెంచింది. మరోవైపు దాని అలైన్‌మెంటును ఖరారు చేసేందుకు అధికారులతో గతంలో ఓ కమిటీని కూడా ఏర్పాటు చేసింది. ఎన్‌హెచ్‌ఏఐ చేపట్టే ప్రాజెక్టులకు అలైన్‌మెంట్లు, డీపీఆర్‌లను అదే సొంతంగా ఖరారు చేసుకుంటుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం వీటిపై కసరత్తు చేస్తుండటం అయోమయానికి కారణమవుతోంది.

### సీఎం సమీక్షలు, కమిటీలు

ఈ ప్రాజెక్టును ప్రతిపాదించిన సమయంలో అధికారులు ట్రాఫిక్ సర్వే నిర్వహించినప్పుడు దక్షిణ భాగం పరిధిలో వాహనాల రద్దీ అంత ఎక్కువగా ఉండదని తేలింది. టోల్ ఆదాయం అంతంత మాత్రంగానే ఉండే రోడ్లపై భారీ వ్యయం చేయటం సబబు కాదన్న ఉద్దేశంతో కేంద్రం అంత ఆసక్తి చూపలేదు. చివరకు రాష్ట్రప్రభుత్వ ఒత్తిడితో సరేనంది. తొలుత ఉత్తర భాగాన్ని చేపట్టి ఆ తర్వాత దక్షిణ భాగంపై దృష్టి సారించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర భాగాన్ని భారత్‌మాల పరియోజనలో చేర్చింది. అయితే అప్పటి రాష్ట్ర ప్రభుత్వంతో ఏర్పడిన విభేదాలతో జాప్యం జరిగి, భారత్‌మాల పరియోజన గడువు తీరిపోయింది. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మళ్లీ దాన్ని చేపట్టేందుకు నిర్ణయించి నిధులు, టెండర్ల ప్రక్రియ చేపట్టింది. దక్షిణ భాగాన్ని మాత్రం భవిష్యత్తులో చేపట్టేలా విజన్–2047 రెండో జాబితాలో చేర్చింది. అయితే ఆ భాగాన్ని తానే చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. సొంతంగా అలైన్‌మెంటు రూపొందించటంతో పాటు డీపీఆర్ కూడా సిద్ధం చేయాలని భావించి సీఎం పలుదఫాలు సమీక్షలు నిర్వహించారు. అధికారులతో కమిటీలు కూడా ఏర్పాటు చేశారు.

### ఎవరి పనిలో వారు..!

దక్షిణ భాగం నిర్మాణానికి దాదాపు రూ.20 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మధ్యలో మనసు మార్చుకుని, ఉత్తర భాగంతో పాటు దక్షిణ భాగం పనులు కూడా ప్రారంభించాలని కేంద్రాన్ని లిఖితపూర్వకంగా కోరింది. కానీ ఆ భాగం ఎన్‌హెచ్‌ఏఐ అధీనంలోనే ఉన్నందున కేంద్రం తన పనితాను చేసుకుపోతోంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం దక్షిణ భాగం డీపీఆర్ తయారీ కసరత్తును కొనసాగిస్తోంది. వాస్తవానికి గత ప్రభుత్వం ఈ భాగానికి సంబంధించి ఓ డ్రాఫ్ట్ అలైన్‌మెంటును రూపొందించి ఎన్‌హెచ్‌ఏఐకి అందించింది. అయితే అది అనుకూలంగా లేదని కేంద్రం ఏర్పాటు చేసిన కన్సల్టెన్సీ సంస్థ వేరే అలైన్‌మెంటును తయారు చేసి ఎన్‌హెచ్‌ఏఐకి సమర్పించింది. అది ఖరారైతే ఆ కన్సల్టెన్సీ డీపీఆర్‌ను రూపొందిస్తుంది. ఇలాంటి సమయంలో రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా డీపీఆర్ తయారీకి టెండర్లు కొనసాగిస్తుండటం ఇటు రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోని జాతీయ రహదారుల విభాగం, అటు కేంద్రం అధీనంలోని ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల్లో అయోమయానికి కారణమవుతోంది.



### మేమే కసరత్తు చేస్తాం: ఎన్‌హెచ్‌ఏఐ

‘దక్షిణ భాగం ముందునుంచీ మా అధీనంలోనే ఉంది. దానిపై మేమే కసరత్తు చేస్తాం. రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు చేస్తోందో మాకు తెలియదు. తానే సొంతంగా నిర్మిస్తానంటూ మాకు అధికారిక సమాచారం ఇప్పటివరకు లేదు. ఉత్తర భాగంతోపాటు దక్షిణ భాగాన్ని కూడా పూర్తి చేయాలన్న లేఖ మాత్రం వచ్చింది. ఇలాంటప్పుడు అలైన్‌మెంటు, డీపీఆర్ తదితరాలు మేమే పూర్తి చేయాల్సి ఉంటుంది..’ అని ఎన్‌హెచ్‌ఏఐ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

# ఎందుకీ కార్చిచ్చు?!

**మానవ తప్పిదాలతోనే పెను విపత్తులు ● కొంప ముంచుతున్న పర్యావరణ మార్పులు**

**తీవ్ర వర్షాభావం, ఎండిపోయిన అడవులు ● లాస్ ఏంజెలెస్‌లో మంటలకు అవే కారణం**



మ్యాన్‌డెవిల్ లోయలో విస్తరిస్తున్న కార్చిచ్చు

లాస్ ఏంజెలెస్‌కు కార్చిచ్చుకు కారణం ఏమిటన్నది చర్చనీయంగా మారింది. ఇలాంటి విపత్తులకు ప్రకృతి కంటే మానవ తప్పిదాలే ఎక్కువగా కారణమవుతుంటాయి. అడవుల్లో సాధారణంగా పిడుగుపాటు వల్ల కార్చిచ్చులు రగులుతుంటాయి. కరెంటు స్తంభాలు నేలకొరిగినప్పుడు చెలరేగే మంటలూ కార్చిచ్చుగా మారుతుంటాయి. ఇవిగాక మనుషుల నిర్లక్ష్యం కూడా ఈ ఉత్పాతానికి దారితీస్తుంటుంది. కాల్చిపడేసిన సిగరెట్ సైతం పెనువిపత్తుగా మారొచ్చు. తాజాగా లాస్ ఏంజెలెస్‌ను బుగ్గిపాలు చేస్తున్న కార్చిచ్చు సైంటిస్టులనే నిర్ఘాంతపరుస్తోంది. మంటలు ఇంత వేగంగా వ్యాప్తించడం మునుపెప్పుడూ చూడలేదని అగ్నిమాపక అధికారులు అంటున్నారు. వాతావరణ పరిస్థితులూ ఇందుకు దోహదం చేశాయని చెబుతున్నారు. లాస్ ఏంజెలెస్‌లో చాలా రోజులుగా వానలే లేవు. దాంతో చెట్లు చేమలతోపాటు కొండల దిగువ ప్రాంతాల్లో గడ్డి పూర్తిగా ఎండిపోయింది. కనుకనే మంటలు సులభంగా అంటుకుని వ్యాపించాయి. బలమైన ఈదురు గాలులతో పరిస్థితి మరింత విషమించింది. ఏటా ఇదే సీజన్‌లో 'శాంటా అనా' గాలులు వీస్తుంటాయి. వీటి వేగం గంటకు 129 కిలోమీటర్ల వరకు ఉంటుంది. అగ్నికి ఆజ్యంలా కార్చిచ్చుకు ఈ గాలులు జతకలిశాయి. వాటి ధాటికి విమానాలు, హెలికాప్టర్లు ఎగిరే పరిస్థితి లేకపోవడంతో ఆకాశం నుంచి నీరు, అగ్నిమాపక రసాయనాలు చల్లే వీల్లేకుండా పోయింది. దాంతో మంటలను అదుపులోకి తేవడం మరింత కష్టసాధ్యంగా మారింది.

**మానవ తప్పిదాలతో భారీ మూల్యం**

లాస్ ఏంజెలెస్ కార్చిచ్చు వంటివాటి రూపంలో వాతావరణ మార్పుల దుష్ప్రభావాన్ని స్పష్టంగా చూస్తున్నామని నిపుణులు చెబుతున్నారు. ''మానవ తప్పిదాల వల్ల ముున్ముందు ఇలాంటి విపత్తుల ముప్పు మరింత పెరుగుతుంది. అవి వ్యాప్తి చెందే వేగమూ పెరుగుతుంది'' అని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా పర్యావరణ పరిరక్షణపై దృష్టి పెట్టకపోతే ప్రకృతి విపత్తులు మరింతగా విరుచుకుపడడం ఖాయమని హెచ్చరిస్తున్నారు. ''కార్చిచ్చు అమెరికాకు పరిమితమైంది. కాదు. నేడు ప్రపంచమంతా ఈ ముప్పు ముంగిట ఉంది'' అని తేల్చిచెబుతున్నారు. చిన్న మంటగా మొదలయ్యే కార్చిచ్చులు క్షణాల్లోనే విస్తరించి నియంత్రించలేని స్థాయికి చేరుకుంటాయి. మానవ కార్యకలాపాల పుణ్యమా అని విపరీతంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు పరిస్థితిని మరింతగా దిగజారుస్తున్నాయి.

- లాస్ ఏంజెలెస్‌లో 2022, 2023లో వరుసగా రెండేళ్లు భారీగా వర్షాలు కురిశాయి. ఏకంగా 133 సెంటీమీటర్ల వర్షం పడింది. దీంతో చెట్లు బాగా పెరిగాయి. పచ్చదనం పరుచుకుంది. 2024లో పరిస్థితి ఒక్కసారిగా తారుమారైంది. వర్షాల్లేక కరువు తాండవించింది. చెట్లు ఎండిపోయాయి. దక్షిణ కాలిఫోర్నియా మొత్తం కరువు ఛాయలే! కార్చిచ్చు ఊహాతీత వేగంతో వ్యాపించడానికి ఇదే ప్రధాన కారణమని సైంటిస్టు మాట్ జోన్స్ విశ్లేషించారు.
- కాలిఫోర్నియా వంటి నగరాల్లో జనాభా అధికం. ప్రకృతి విపత్తులు పొంచి ఉన్న ఇలాంటి నగరాల్లో నివసించడం క్షేమమేనా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.
- ఇటీవలి కాలంలో బీమా సంస్థలు కూడా అప్రమత్తమయ్యాయి. లాస్ ఏంజెలెస్, పరిసర నివాసాలకు బీమా రక్షణ కల్పించేందుకు కొంతకాలంగా నిరాకరిస్తూ వస్తున్నాయి. ప్రమాదాలు జరిగితే భారీ మొత్తంలో బీమా సొమ్ము చెల్లించాల్సి ఉండటమే ఇందుకు కారణం.
- లాస్‌ఏంజెలెస్‌లో ధ్వంసమైన ఇళ్ల స్థానంలో కొత్తవి నిర్మించబోతున్నారు. అందుకు ప్రభుత్వం సాయం అందించబోతోంది. కార్చిచ్చులను దృష్టిలో పెట్టుకొని వాటి నిర్మాణంలో మరిన్ని జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

**- సాక్షి, నేషనల్ డెస్క్**

# మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్న మంటలు

**లాస్ ఏంజెలెస్‌లో ఆరని అగ్ని కీలలు**
- కొనసాగుతున్న కార్చిచ్చు..
- 16కు చేరిన మృతుల సంఖ్య
- రూ.12.92 లక్షల కోట్లకుపైగా ఆస్తి నష్టం
- అదృశ్యమైన వారి కోసం అధికారుల గాలింపు చర్యలు



పాలిసేడ్స్ ప్రాంతంలో మంటల్ని ఆర్పుతున్న అగ్నిమాపక హెలీకాప్టర్

**లాస్ ఏంజెలెస్:** అమెరికాలోని లాస్ ఏంజెలెస్ నగరంలో రగిలిన కార్చిచ్చు ఇళ్లు, చెట్లు, పుట్టలను కబళిస్తూ విలయతాండవం చేస్తోంది. అత్యంత ఖరీదైన గృహాలు బూడిద కుప్పలుగా మారిపోతున్నాయి. మనుషులతోపాటు పక్షులు, జంతువులు మంటల్లో పడి కాలిపోతున్నాయి. కార్చిచ్చులో మృతుల సంఖ్య 16కు చేరుకున్నట్లు స్థానిక అధికారులు ప్రకటించారు. ఈటాన్ ఫైర్‌లో 11 మంది, పసిఫిక్ పాలిసేడ్స్ ఫైర్‌లో ఐదుగురు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. అగ్నికీలలు ఇప్పటికిప్పుడు ఆరిపోయే పరిస్థితి లేకపోవడంతో మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. కార్చిచ్చు మొదలైన తర్వాత కొందరు కనిపించకుండాపోయారు. వారి ఆచూకీ కోసం అధికారులు గాలింపు చర్యలు ప్రారంభించారు. బూడిద కుప్పల్లో అన్వేషిస్తున్నారు. ఇందుకోసం జాగిలాల సాయం తీసుకుంటున్నారు. మరోవైపు అదృశ్యమైన తమవారి కోసం బాధితులు అధికారులను సంప్రదిస్తున్నారు. అధికారులు పాసాడెనాలో ఫ్యామిలీ అసిస్టెన్స్ సెంటర్ ఏర్పాటు చేశారు. కార్చిచ్చును అదుపు చేయడానికి అగ్నిమాపక సిబ్బంది శ్రమిస్తున్నప్పటికీ మంటలు మరికొన్ని ప్రాంతాలకు వ్యాపిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. జె.పాల్ గెట్టీ మ్యూజియం, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా వరకూ మంటలు చొచ్చుకొస్తున్నాయి. మంటలకు బలమైన ఈదురుగాలులు తోడవుతుండడంతో పరిస్థితి నియంత్రణలోకి రావడం లేదని అధికారులు చెప్పారు. ఆర్నాల్డ్ స్వార్జినెగ్గర్‌తోపాటు హాలీవుడ్ ప్రముఖులు నివాసం ఉండే మాండివిల్లే కాన్యాన్‌లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మంటలపై హెలికాప్టర్లతో నీటిని చల్లుతున్నారు. దట్టమైన పొగ అలుముకోవడం సహాయక చర్యలకు ఆటంకంగా మారుతోంది. అధిక జనాభాతో కిక్కిరిసి ఉండే హాలీవుడ్ హిల్స్, శాన్ ఫెర్నాండో వ్యాలీ వైపు మంటలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని అగ్నిమాపక శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

**12 వేలకుపైగా ఇళ్లు దగ్ధం**

లాస్ ఏంజెలెస్‌లో 145 చదరపు కిలోమీటర్ల భూభాగం కార్చిచ్చు ప్రభావానికి గురయ్యింది. ఇది శాన్ ఫ్రాన్సిస్కో నగర విస్తీర్ణం కంటే అధికం. కార్చిచ్చు మంగళవారం తొలుత లాస్‌ఏంజెలెస్ ఉత్తర డౌన్‌టౌన్‌లో మొదలైంది. క్రమంగా విస్తరించింది. మరో నాలుగు చోట్ల కార్చిచ్చులు రగిలాయి. ఇప్పటిదాకా 12 వేలకుపైగా ఇళ్లు మంటల్లో కాలిపోయి బూడిదగా మారాయి. విలాసవంతమైన గృహాలు, అపార్టుమెంట్ భవనాలు, వ్యాపార కేంద్రాలు నామరూపాల్లేకుండా పోయాయి. వాటిలో విలువైన వస్తువులు, గృహోపకరణాలు అగ్నికీలల్లో మాడిపోయాయి. కార్చిచ్చుకు కచ్చితమైన కారణం ఏమిటన్నది ఇంకా ధ్రువీకరించలేదు. మొత్తానికి ఇది కనీవిని ఎరుగని భారీ నష్టమేనని చెప్పొచ్చు. ఇప్పటిదాకా 150 బిలియన్ డాలర్ల (రూ.12.92 లక్షల కోట్లు) మేర నష్టం వాటిలినట్లు అక్యూవెదర్ అనే ప్రైవేట్ సంస్థ అంచనా వేసింది.

**బాధితుల కోసం షెల్టర్లు**

వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలంటూ 1.50 లక్షల మందికి ఆదేశాలు జారీ చేశారు. నిరాశ్రయుల కోసం తొమ్మిది షెల్టర్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ 700 మందికిపైగా బాధితులు ఆశ్రయం పొందుతున్నారు.

**అందని నీళ్లు, నిధులు**

కార్చిచ్చు నష్టపోయినవారిని ఆదుకోవడానికి మానవతావాదులు ముందుకొస్తున్నారు. డొనేషన్ కేంద్రాల్లో విరాళాలు అందజేస్తుందన్నారు. బాధితులకు కొందరు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్నారు. ఆహారం సైతం అందిస్తున్నారు. దగ్ధమైన తమ ఇళ్లను చూసుకోవడానికి బాధితులు వస్తున్నారు. సర్వం కోల్పోయామంటూ బోరున విలపిస్తున్నారు. అయితే, కాలిపోయిన ఇళ్ల వద్దకు రావొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. శిథిలాల నుంచి ప్రమాదకరమైన వాయువులు వెలువడుతున్నాయని, అవి పీల్చడం ప్రాణాంతకమని చెబుతున్నారు. మరోవైపు మంటలు ఆర్పడానికి చాలినంత నీరు లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. కొందరు సంపన్నులు విచ్చలవిడిగా నీరు వాడేశారని, అందుకే ఈ దుస్థితి ఏర్పడిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 440 మిలియన్ లీటర్ల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్ ఖాళీ అయ్యింది. అగ్నిమాపక శాఖకు తగినన్ని నిధులు కూడా అందడం లేదని చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మంటలు ఎలా ఆర్పాలని సిబ్బంది ప్రశ్నిస్తున్నారు.

1,354 ఫైర్ ఇంజన్లు, 84 హెలికాప్టర్లు నిర్విరామంగా పని చేస్తున్నారు. 14,000 వేల మంది అగ్నిమాపక సిబ్బంది విధి నిర్వహణలో నిమగ్నమయ్యారు. మంటలు ఆర్పడానికి శ్రమిస్తున్నారు.

# యువత బలమే దేశానికి కలిమి

**వికసిత్ భారత్‌కు యువతే యజమానులు ● ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటన**

**న్యూఢిల్లీ:** మన యువత బలమే మన దేశాన్ని అగ్రగామిగా మారుస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. యువతీ యువకుల శక్తి సామర్థ్యాలతో భారత్ ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా అభివృద్ధి చెందడం ఖాయమని చెప్పారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం ఢిల్లీలో 'వికసిత్ భారత్ యువ నాయకుల చర్చా కార్యక్రమం'లో ప్రధాని మోదీ మాట్లాడారు. '2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్' అనేది మన లక్ష్యమని గుర్తుచేశారు. ఆ లక్ష్యం సాధించడం కష్టం కావొచ్చేమో గానీ అసాధ్యం మాత్రం కాదని తేల్చిచెప్పారు. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి అవసరమైన సత్తా మన యువతలో ఉందన్నారు. మనది యువదేశమని, పూర్తిగా అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడాన్ని ఎవరూ అడ్డుకోలేరని స్పష్టంచేశారు. మనం వేసే ప్రతి అడుగులో, ప్రతి విధానంలో, ప్రతి నిర్ణయంలో వికసిత్ భారత్ స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో వేర్వేరు కీలక రంగాల్లో ఎన్నో విజయాలను మన దేశం సాధించబోతోందని మోదీ వెల్లడించారు. దేశం ముందుకు పరుగులు తీయాలంటే గొప్ప లక్ష్యాలు నిర్దేశించుకోవాలని, మనం ఇప్పుడు అదే పనిలో నిమగ్నమై ఉన్నామని వివరించారు.

**ప్రభుత్వానికి యువత భుజం కలపాలి**

2030 నాటికి పెట్రోల్‌లో 20 శాతం బ్లెండింగ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, వాస్తవానికి అంతకంటే ముందే అది సాధించబోతున్నామని ప్రధానమంత్రి పేర్కొన్నారు. కేవలం ప్రభుత్వం ఒక్కటే అన్ని పనులూ చేయలేదని, యువత సైతం భుజం కలపాలని పిలుపునిచ్చారు. వికసిత్ భారత్‌కు యువతే యజమానులని ఉద్ఘాటించారు. మన విధాన నిర్ణయాల్లో యువత ఆలోచనలు కూడా ఒక భాగమని చెప్పారు. వారి దిశానిర్దేశం దేశానికి అవసరమని అన్నారు. మనం అనుకున్నది సాధించాలంటే అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. దేశ ప్రగతికి ప్రతి ఒక్కరి సమ్మిళిత కృషి అవసరమన్నారు. 1930లో తలెత్తిన ఆర్థిక సంక్షోభం తర్వాత అమెరికా అగ్రదేశంగా ఎదిగిందని, ఒకప్పుడు ఎంతో వెనుకబడిన దేశమైన సింగపూర్ ప్రస్తుతం బలీయమైన ఆర్థిక శక్తిగా మారిందని మోదీ గుర్తుచేశారు. గొప్ప లక్ష్యాలు పెట్టుకోవడం, వాటిని సాకారం చేసుకోవడానికి కష్టపడి పనిచేయడం చాలా ముఖ్యమని ఉద్బోధించారు. రాబోయే 25 ఏళ్లు మనకు అమృతకాలమని వివరించారు. వికసిత్ భారత్ కలను యువత సాకారం చేస్తుందన్న విశ్వాసం తనకు పూర్తిగా ఉందని పేర్కొన్నారు. రాబోయే పదేళ్లలో మన దేశంలో ఒలింపిక్స్ క్రీడలు నిర్వహించేలా యువత సన్నద్ధం కావాలని మోదీ పిలుపునిచ్చారు. 'వికసిత్ భారత్ యువ నాయకుల చర్చా' కార్యక్రమానికి 3 వేల మందికిపైగా యువతీ యువకులు హాజరయ్యారు.



వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ ఎగ్జిబిషన్‌లో యువతితో మాట్లాడుతున్న మోదీ



వృత్తంలో చూపినట్లు కేవలం మూడు మీటర్ల దూరం ఉండేలా జంట ఉపగ్రహాలను అత్యంత సమీపానికి తీసుకొచ్చిన దృశ్యం

## స్పేడెక్స్ డాకింగ్‌లో ఇస్రో పురోగతి

**జంట ఉపగ్రహాలను 15 మీటర్ల నుంచి 3 మీటర్ల దగ్గరకు తీసుకొచ్చిన ఇస్రో**

**సూళ్లూరుపేట:** గత ఏడాది డిసెంబర్ 30వ తేదీన పీఎస్ఎల్వీ–సీ60 రాకెట్ ద్వారా నింగిలోకి ప్రయోగించిన స్పేడెక్స్ జంట ఉపగ్రహాలను ఇస్రో శాస్త్రవేత్తలు ఆదివారం మరింత చేరువలోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం 15 మీటర్ల దూరంలో ఉన్న ఎడీఎస్ఎక్స్–01 (చేజర్), ఎస్‌డీఎక్స్–02 (టార్గెట్) జంట ఉపగ్రహాలను మూడు మీటర్ల సమీపానికి తీసుకు రాగలిగామని ఇస్రో తెలిపింది. తర్వాత మళ్లీ వాటిని సురక్షిత దూరాలకు పంపేశామని ఇస్రో పేర్కొంది. అత్యంత సమీపానికి తీసుకొచ్చినప్పుడు నమోదైన డేటాను క్షుణ్ణంగా అధ్యయనం చేశాక మరోసారి మరింత సమీపానికి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామని ఇస్రో వివరించింది. ఈసారి రెండు ఉపగ్రహాలను 1.6 మీటర్ల దగ్గరగా తీసుకువచ్చే అవకాశముందని ఇస్రో పేర్కొంది. ఈ నెల ఏడో తేదీనే రెండు ఉపగ్రహాలను డాకింగ్ చేయాల్సి ఉండగా పరిస్థితులు అనుకూలించకపోవడంతో 9వ తేదీకి వాయిదా వేయడం తెలిసిందే. ఈ ప్రక్రియ విజయవంతమైతే భవిష్యత్తులో అంతరిక్షంలో భారత్ స్పేస్ స్టేషన్ నిర్మాణం చేపట్టేందుకు మార్గం ఏర్పడుతుందని ఇస్రో తెలిపింది.

## భర్తతో కలిసి ఉండకపోతే భరణం కోరవచ్చు: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ:** భర్త నుంచి విడాకులు తీసుకోకుండా విడిగా ఉంటున్న మహిళ అతడి నుంచి భరణం పొందడానికి అర్హురాలేనని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. భర్తతో కలిసి ఉండలేకపోవడానికి తగిన కారణం ఉంటే భరణం కోరవచ్చని వెల్లడించింది. జార్ఖండ్‌కు చెందిన యువతి, యువకుడికి 2014 మే 1వ తేదీన పెళ్లి జరిగింది. 2015 ఆగస్టులో వారు విడిపోయారు. అధికారికంగా విడాకులు తీసుకోలేదు. చివరకు ఈ వ్యవహారం ఫ్యామిలీ కోర్టుకు చేరింది. వారిద్దరూ కలిసి ఉండొచ్చని, వివాహ సంబంధం ఎప్పటిలాగే కొనసాగించవచ్చని సూచిస్తూ ఫ్యామిలీ కోర్టు 2022 మార్చి 23న డిక్రీ జారీ చేసింది. అయితే, భార్య ఈ డిక్రీకి కట్టుబడి ఉండలేదు. భర్త నుంచి తనకు భరణం ఇప్పించాలంటూ అదే కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఆమెకు నెలకు రూ.10 వేల చొప్పున ఇవ్వాలని భర్తను ఆదేశిస్తూ ఫ్యామిలీ కోర్టు ఆదేశాలిచ్చింది. ఆ దేశాలను భర్త జార్ఖండ్ హైకోర్టులో సవాలు చేశాడు. భార్య తన వద్దకు తిరిగి రాలేదు కాబట్టి భరణం చెల్లించే ప్రసక్తే లేదని పేర్కొన్నాడు. అతడి వాదనతో హైకోర్టు ఏకీభవించింది. భార్యకు భరణం ఇవ్వాల్సిన అవసరం లేదని తేల్చిచెబుతూ తీర్పు వెలువరించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ భార్య సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టింది. భర్తతో కలిసి ఉండకపోయినా భార్య భరణం పొందవచ్చని తేల్చిచెప్పింది. సీఆర్‌పీసీ సెక్షన్ 125 ప్రకారం భర్త నుంచి భరణం పొందడం భార్య హక్కు అని గుర్తుచేసింది.

## ఉత్తరాఖండ్‌లో బస్సు ప్రమాదం.. ఐదుగురు మృతి, 17 మందికి గాయాలు

**డెహ్రాడూన్:** ఉత్తరాఖండ్‌లో ఆదివారం సంభవించిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా 17 మంది గాయపడ్డారు. పౌరీ నుంచి దహల్‌చౌరీకి 22 మంది ప్రయాణికులతో బయలుదేరిన బస్సు పౌరీ జిల్లా శ్రీనగర్ ప్రాంతంలో అదుపు తప్పి 100 మీటర్ల లోతైన లోయలోకి దూసుకెళ్లింది. ఘటనలో నలుగురు అక్కడికక్కడే చనిపోగా మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. క్షతగాత్రులైన 17 మందిలో 8 మంది పరిస్థితి విషమంగా ఉందని అధికారులు చెప్పారు. ఘటనకు దారి తీసిన కారణాలపై దర్యాప్తు చేపట్టామన్నారు.

## సరిహద్దుల్లో ఫెన్సింగ్ నిర్మాణం.. భారత హై కమిషనర్‌కు బంగ్లా సమన్లు

**ఢాకా:** రెండు దేశాల సరిహద్దుల్లోని ఐదు ప్రాంతాల్లో ఫెన్సింగ్ నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నించిందంటూ బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ ఆదివారం ఢాకాలోని భారత హై కమిషనర్ ప్రణయ్ వర్మకు సమన్లు జారీ చేసింది. కంచె నిర్మాణం ద్వైపాక్షిక ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొంది. ప్రణయ్ వర్మ ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ కార్యాలయానికి వెళ్లి విదేశాంగ శాఖ కార్యదర్శి జషీముద్దీన్‌తో దాదాపు 45 నిమిషాలపాటు చర్చలు జరిపినట్లు ప్రభుత్వ వార్తా సంస్థ బీఎస్ఎస్ తెలిపింది. ఈ పరిణామంపై అక్కడి ఆపద్ధర్మ ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు. సమావేశం అనంతరం హైకమిషనర్ వర్మ మీడియాతో మాట్లాడారు. 'రెండు దేశాల సరిహద్దులను బీఎస్ఎఫ్, బీజీబీలు కాపలాకాస్తున్నాయి. ఈ రెండు విభాగాలు ఎప్పటికప్పుడు సంప్రదింపులు కొనసాగిస్తున్నాయి కూడా. సరిహద్దుల వెంట నేరాల కట్టడికి రెండు దేశాల మధ్య ఉన్న అంగీకారానికి అనుగుణంగా సహకారం కొనసాగుతుందని ఆశిస్తున్నాం'అని చెప్పారు. అంతకుముందు, బంగ్లాదేశ్ హోం శాఖ సలహాదారు జహంగీర్ ఆలం చౌదరి మీడియాతో మాట్లాడుతూ..ఒప్పందానికి విరుద్ధంగా సరిహద్దుల్లో భారత్ ఫెన్సింగ్ ఏర్పాటుకు చేసిన ప్రయత్నాలను బంగ్లా జవాన్లు, స్థానికులు అడ్డుకున్నారని చెప్పారు. 1974లో కుదిరిన ఒప్పందాన్ని భారత్ ఉల్లంఘించిందని చెప్పారు.

## కెనడా ప్రధాని రేసు నుంచి వైదొలిగిన అనిత



**ఒట్టావా:** కెనడా ప్రధాని బరినుంచి భారత సంతతికి చెందిన అనితా ఆనంద్ వైదొలిగారు. ప్రస్తుతం రవాణా శాఖ మంత్రిగా పనిచేస్తున్న అనిత.. పోటీ నుంచి తప్పుకొంటున్నట్లు శనివారం ప్రకటించారు. అంతేకాదు తాను ఎంపీగా మళ్లీ పోటీ చేయబోనని ఆమె స్పష్టం చేశారు. ప్రధానిగా, పార్టీ అధినేతగా జస్టిన్ ట్రూడో రాజీనామా చేయడంతో ఆమె బరిలోకి వచ్చారు. అయితే.. వారంలోపే తాను పోటీ నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటన చేశారు. ఈ సందర్భంగా లిబరల్ బృందానికి, ఓక్‌విల్లే ప్రజలకూ కృతజ్ఞతలు తెలిపారు. ''పార్లమెంటు సభ్యురాలిగా లిబరల్ జట్టులోకి నన్ను ఆహ్వానించినందుకు, కీలకమైన కేబినెట్ శాఖలను అప్పగించినందుకు ప్రధాని ట్రూడోకు హృదయపూర్వక ధన్యవాదాలు. కెనడా హౌస్ ఆఫ్ కామన్స్‌కు ప్రాతినిధ్యం వహించడానికి నన్ను ఎన్నుకున్నందుకు, గత ఇరవై సంవత్సరాలుగా నా భర్త, నేను మా నలుగురు పిల్లలను పెంచేందుకు స్వాగతించిన అద్భుతమైన ఓక్‌విల్లే ప్రజలకు నేను నిజంగా కృతజ్ఞురాలిని'' అని అనిత తన ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల వరకు తాను ఎంపీగా కొనసాగుతానన్నారు. భారత సంతతికి చెందిన వ్యక్తి ఓక్‌విల్లేలో గెలవడం సాధ్యం కాదని చాలా మంది రాశారని, అయినప్పటికీ ఒక్కసారి కాదు రెండుసార్లు గెలిపించి ప్రజలు తన వెనుకే నిలిచారని చెప్పారు. ఈ గౌరవం ఎప్పటికీ తన గుండెల్లో నిలిచిపోతుందన్నారు.


## ఎన్నికల్లో పోటీకి క్రౌడ్ ఫండింగ్: ఆతిశీ



**న్యూఢిల్లీ:** అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ విరాళాలు సేకరిస్తున్నారు. క్రౌడ్ ఫండింగ్ కోసం ఆన్‌లైన్ లింక్‌ను ఆమె ఆదివారం విడుదల చేశారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి తనకు రూ.40 లక్షలు అవసరమని చెప్పిన ఆతిశీ.. సామాన్యులు ఇచ్చిన విరాళాలతోనే ఆప్ గత ఎన్నికల్లో పోటీ చేసిందన్నారు. నిజాయితీ రాజకీయాలను కొనసాగించడానికి దోహదపడిందని చెప్పారు. పదేళ్లు ఢిల్లీలో అధికారంలో ఉన్నా తమ పార్టీ అవినీతి చేయలేదని, ఒక్క రూపాయి కూడా సంపాదించుకోలేదని వెల్లడించారు. గతంలోలాగే ఢిల్లీ, దేశ ప్రజల మద్దతుతో ఎన్నికల్లో పోటీ చేస్తామన్నారు. బీజేపీ నేతలు.. తమ స్నేహితుల నుంచి, ప్రభుత్వ కాంట్రాక్టుల ద్వారా తగినంత డబ్బు వసూలు చేసి ఉంటారని, అందుకే ఎన్నికలకోసం నిధులు సేకరించాల్సిన అవసరం వారికి లేదని ఎద్దేవా చేశారు. కల్కాజీ అసెంబ్లీ స్థానం నుంచి మాజీ ఎంపీ, బీజేపీ అభ్యర్థి రమేశ్ బిధురిపై ఆతిశీ పోటీ చేస్తున్నారు.

## నిరుద్యోగ యువతకు నెలకు రూ.8,500

**ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మరో హామీ**



**న్యూఢిల్లీ:** ఢిల్లీలో తాము అధికారంలోకి వస్తే విద్యావంతులైన నిరుద్యోగ యువతకు ఏడాదిపాటు నెలకు రూ.8,500 అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ ఆదివారం ప్రకటించింది. యువ ఉడాన్ యోజన కింద ఈ ఆర్థిక సాయాన్ని అందిస్తామని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ తెలిపారు. అయితే, ఈ డబ్బు ఊరికే ఇంట్లో ఉండే వారికి, ఉచితంగా అందించేది మాత్రం కాదని ఆయన స్పష్టం చేశారు. కంపెనీ, ఫ్యాక్టరీ లేదా సంస్థలో శిక్షణ సమయంలో తగు ప్రతిభను చూపిన వారికి, ఆయా సంస్థలే అందజేస్తాయని వివరించారు. ఇది కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాదు, వారిలో నైపుణ్యాలను మెరుగు పర్చుకునేందుకు ఉపయోగపడుతుందని పైలట్ వివరించారు. ప్రతిభ ఉండీ ఎలాంటి అవకాశాలు దొరకని వారికి మాత్రమే ఈ స్కీము కింద ఏడాది పాటు నెలకు రూ.8,500 అందజేస్తామన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు.

## ట్రంప్ ప్రమాణ స్వీకారానికి జైశంకర్



**సాక్షి, న్యూఢిల్లీ:** ఈనెల 20వ తేదీన జరిగే అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి మన దేశం తరఫున విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ హాజరవనున్నారని కేంద్రం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడిగా జేడీ వాన్స్ కూడా ప్రమాణం చేయనున్నారు. ప్రమాణ స్వీకారం తర్వాత అక్కడ అమెరికా పరిపాలన అధికారులు, భారత్ అధికారులు, వివిధ దేశాల అధినేతలతో జరిగే చర్చల్లో మంత్రి జై శంకర్ పాల్గొంటారని వెల్లడించింది.

## నేను సీఎం అభ్యర్థిని కాదు: రమేశ్ బిధూరీ



**న్యూఢిల్లీ:** సీఎం అభ్యర్థి కాదు కదా.. తాను ఏ పదవికీ పోటీలో లేనని బీజేపీ కల్కాజీ అభ్యర్థి రమేశ్ బిధూరీ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పదవికి పార్టీ అభ్యర్థి బిధూరీనేనని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలను బీజేపీ నేత ఖండించారు. అవన్నీ ఊహాగానాలని, అంకితభావం కలిగిన పార్టీ కార్యకర్తగా ప్రజలకు సేవ చేయడంపైనే తాను దృష్టి సారించానని బిధూరీ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక లేఖను విడుదల చేశారు. తనకు ఎలాంటి పదవులపై ఆకాంక్షలు లేవన్నారు. అవి పుకార్లని కొట్టిపారేశారు. పార్టీ తనకు ఎంతో ఇచ్చిందన్నారు. తన గురించి ప్రకటనలు చేయడమంటే.. ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోందని కేజ్రీవాల్ పరోక్షంగా అంగీకరించినట్లేనని వ్యాఖ్యానించారు.

## అంత అహంకారం మంచిదికాదు

**సీఎం స్టాలిన్‌పై తమిళనాడు గవర్నర్ రవి ఆగ్రహం**



**చెన్నై:** తమిళనాడు అసెంబ్లీలో జాతీయ గీతాలాపన వివాదం కొనసాగుతోంది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీరుపై గవర్నర్ ఆర్ఎన్ రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశాన్ని, రాజ్యాంగాన్ని అవమానిస్తే ప్రజలు సహించబోరని రాజ్‌భవన్ సోషల్ మీడియాలో పోస్టుచేసింది. కాగా, జనవరి 6న ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల్లో మొదటిరోజు జాతీయ గీతాలాపన చేయకపోవడంతో గవర్నర్ రవి ప్రసంగం చేయకుండానే వెళ్లిపోయారు. శనివారం అసెంబ్లీలో ప్రసంగించిన సీఎం స్టాలిన్.. గవర్నర్ తీరు అసంబద్ధంగా, చిన్న పిల్లల చర్యలా ఉందని అభివర్ణించారు. రాష్ట్రం అభివృద్ధి చెందడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. సీఎం ప్రసంగంపై రాజ్‌భవన్ స్పందించింది. ''జాతీయ గీతాన్ని గౌరవించాలని, ప్రాథమిక విధులను నిర్వర్తించాలని చెప్పడాన్ని అసంబద్ధ, చిన్నపిల్లల చర్యగా సీఎం స్టాలిన్ అభివర్ణించారు. భారత్‌ను ఒక దేశంగా, భారత రాజ్యాంగాన్ని అంగీకరించని, గౌరవించని నాయకుడు.. రాజ్యాంగ ప్రయోజనాలు, సిద్ధాంతాలకు ద్రోహం చేశారు. ఇలాంటి అహంకారం మంచిది కాదు. దేశం సర్వోన్నతమైనది, రాజ్యాంగం సర్వోన్నత విశ్వాసమనే విషయాన్ని మరచిపోవద్దు. ఇలాంటి అవమానాన్ని ప్రజలు సహించబోరు'' అని తన అధికారిక ఎక్స్‌ఖాతాలో పేర్కొంది.

## పవార్ ద్రోహ రాజకీయాలకు అంతం

**బీజేపీ గెలుపుతోనే సాధ్యమైందన్న అమిత్ షా**



**షిర్డీ:** అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం మహారాష్ట్రలో శరద్ పవార్ నమ్మకద్రోహ రాజకీయాలకు ముగింపు పలికిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఆదివారం షిర్డీలో జరిగిన పార్టీ రాష్ట్ర సదస్సుకు ఆయన హాజరై, మాట్లాడారు. సీనియర్ నాయకుడైన శరద్ పవార్ 1978 నుంచి మహారాష్ట్రలో ద్రోహ రాజకీయాలు చేశారని, తిరస్కరించిన మహారాష్ట్ర ప్రజలు వారి స్థానమేంటో చూపించారని ఎద్దేవా చేశారు. అదేవిధంగా వారసత్వ రాజకీయాలను ఉద్ధవ్ ఠాక్రే చేసిన ద్రోహాన్ని కూడా తిరస్కరించారన్నారు. పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు.. రాష్ట్రంలో పార్టీ భారీ విజయానికి కారణం బీజేపీ కార్యకర్తలేనన్నారు. బీజేపీని అజేయుడిగా మార్చాలని అప్పుడు మళ్లీ ద్రోహం చేయడానికి ఎవరూ సాహసించరని చెప్పారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి సారించాలని, మహిళలు, రైతులను పెద్ద సంఖ్యలో చేర్చుకోవాలని ఆయన సూచించారు.

సాక్షి
హైదరాబాద్
సోమవారం । 13 । జనవరి । 2025



**ఇచ్చేదే లే!**
ఔటర్ నుంచి ఆకుతోటపల్లి వరకు ప్రభుత్వం తలపెట్టిన గ్రీన్ ఫీల్డ్ రోడ్డుకు భూసేకరణ అంశం వివాదాస్పదంగా మారుతోంది. తమ డిమాండ్లు నెరవేరకుండా భూములివ్వబోమని రైతులు తెగేసి చెబుతున్నారు. -8లో



**ఫెస్ట్ @ ఫామ్..**
సంక్రాంతి పండగకు పల్లెలకు వెళ్లలేని వారు ఫామ్ హౌస్‌లలో సంబరాలు చేసుకునేందుకు కుటుంబ సమేతంగా తరలివెళ్తున్నారు. దీంతో ఫామ్‌హౌస్‌లు సందడికి వేదిక అవుతున్నాయి. - సిటీప్లస్‌లో

**వాతావరణం**
గరిష్టం/కనిష్టం
27.0/18.0
నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళ పొగమంచు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. గరిష్టంగా 27, కనిష్టంగా 18 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



మాదాపూర్ శిల్పారామంలో గంగిరెద్దుల ఆట

శిల్పారామంలో హరిదాసుల సందడి



పల్లె'టూరు'..

# పట్నంలో జోరు!

భోగి మంటలు. పిండి వంటలు. గుడి గంటలు. యువ జంటలు.. గ్రామసీమల్లో సంక్రాంతి సంబరమే వేరు. ఆ సరదాలను తనివితీరా ఆస్వాదించేందుకు సిటీజనులు పల్లెబాట పట్టారు. సొంతూళ్లకు వెళ్లిపోవడంతో పలు ప్రాంతాల్లోని నగర రహదారులు ఆదివారం నిర్మానుష్యంగా కనిపించాయి. అలాగే.. నగరంలోని మాదాపూర్ శిల్పారామంలో సంక్రాంతి ఉత్సవాలు వేడుకగా కొనసాగుతున్నాయి. పల్లె వాతావరణాన్ని తలపించే దృశ్యాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. డూడూ బసవన్నలు.. హరిదాసుల కీర్తనలు.. తీర్చిదిద్దిన గొబ్బెమ్మలు కనువిందు చేశాయి. నేడు భోగి మంటలతో నగరం ఎర్రని కాంతుల వెలుగుల్లో తళుకులీననుంది.

హైటెక్ సిటీ సమీపంలో బోసిపోయిన రహదారి





జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ముగ్గులు వేస్తున్న యువతులు

---

బాధితుల భయమే సైబర్ నేరగాళ్లకు వరం

# సెన్స్ చూపితేనే.. సీన్ మారేది!

**ఆందోళనలో ఆలోచన కోల్పోతున్న వైనం**
**పొంతన లేని లింకులు చెప్పినా నమ్మేస్తూ..**
**దీన్ని స్పష్టం చేస్తూ ఇటీవల నమోదైన కేసు**

రూ.20 లక్షలు.. ఓ పేద కుటుంబానికి అసాధ్యమైన మొత్తం. దిగువ మధ్య తరగతికి జీవితం. మధ్య తరగతికి కొన్ని దశాబ్దాల కష్టం. ఉన్నత వర్గాలకు సైతం పెద్ద లెక్కే. ఇంతటి నగదుని నగరానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగికి కేవలం కొన్ని గంటల వ్యవధిలో జరిగిన 'డిజిటల్ అరెస్టు' ఫ్రాడ్‌లో పోగొట్టుకున్నారు. దీనిపై ఇటీవల హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేరగాళ్ల మాటకు భయపడిపోతున్న సామాన్యులు సాధారణ పోలీసులు శాంతి భద్రతలు, నేరాలకు సంబంధించిన వ్యవహారాలు, సైబర్ క్రైమ్ పోలీసులు ఆన్‌లైన్ ఫ్రాడ్స్, కస్టమ్స్ అధికారులు సుంకం ఎగవేత, అక్రమ రవాణా వ్యవహారాలు పర్యవేక్షిస్తారనే విషయాన్ని విస్మరిస్తున్నారు. రూ.20 లక్షలకు సంబంధించిన కేసు పూర్వాపరాలను ఒకసారి పరిశీలిస్తే..
–సాక్షి, సిటీబ్యూరో

1. బాధితుడికి సైబర్ నేరగాళ్లు తాము ఇంటర్నేషనల్ డీహెచ్‌ఎల్ ఎక్స్‌ప్రెస్ కొరియర్ ఆఫీస్ నుంచి ఫోన్ చేస్తున్నట్లు చెప్పారు. మీ ఆధార్ కార్డుతో బ్యాంకాక్‌కు బుక్ అయిన పార్శిల్‌లో పాస్‌పోర్టులు, ఏటీఎం కార్డులు, బ్యాంకు పత్రాలు, 140 గ్రాముల డ్రగ్ కూడా ఉందన్నారు. ఆ పార్శిల్‌కు తనకు ఎలాంటి సంబంధం లేదంటూ బాధితుడు చెప్పడంతో... తాము ఫోన్‌కు ఢిల్లీ సైబర్ సెల్‌కు బదిలీ చేస్తున్నామన్నారు.
- విదేశాలకు పంపే నిషేధిత, నియంత్రిత వస్తువులకు సంబంధించిన కేసు కస్టమ్స్ పరిధిలోకి వస్తుంది. మాదక ద్రవ్యాలతో కూడిన డ్రగ్ పార్శిల్‌కు సంబంధించిన కేసులను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ), తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ నాబ్), ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ లేదా సాధారణ పోలీసులు దర్యాప్తు చేస్తారు. ఢిల్లీ సైబర్ సెల్ వంటి ఏజెన్సీలకు ఈ తరహా కేసులతో ఏ మాత్రం సంబంధం ఉండదు. కొరియర్ ఆఫీసులకు, పోలీసులకు మధ్య ఎలాంటి లింకులు ఉండవు. అలాంటప్పుడు కొరియర్ సంస్థ తాము చేసిన కాల్‌ని పోలీసులు బదిలీ చేయడం అసాధ్యం.

2. బాధితుడితో సైబర్ సెల్ అధికారిగా మాట్లాడిన సైబర్ నేరగాడు మీ ఆధార్ దుర్వినియోగంపై ఫిర్యాదు చేయాలంటూనే అదే ఆధార్‌తో తెరిచిన నాలుగు బ్యాంకు ఖాతాలు మనీలాండరింగ్‌కు వాడారని చెప్పాడు.
- మనీలాండరింగ్ సంబంధిత అంశాలన్నీ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) పర్యవేక్షించే అంశం. ఈ తరహా కేసుల్ని వీళ్లే నమోదు చేసి, దర్యాప్తు చేస్తుంటారు. ఆ వివరాలు సైబర్ సెల్‌కు తెలిసే అవకాశమే ఉండదు. ఆధార్ కార్డు దుర్వినియోగం పైనా సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం ఉండే ఆస్కారం లేదు.



3. అసలు కథ మొదలెట్టిన సైబర్ నేరగాళ్లు వాట్సాప్ వీడియో కాల్ ద్వారా బాధితుడితో మాట్లాడి 'డిజిటల్ అరెస్టు' చేశారు. మీపై నిఘా ఉందంటూ బాధితుడికి చెప్పి ప్రతి గంటకూ తమను సంప్రదించాలని స్పష్టం చేశాడు.
- స్థానిక పోలీసుల నుంచి సీబీఐ వరకు ఏ ఏజెన్సీ కూడా డిజిటల్ అరెస్టు అనేది చేయదు. కేసు నమోదు తర్వాత దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అంశాలు, ఇతర వ్యవహారాలను పరిగణనలోకి తీసుకుని అరెస్టు చేయడమో, నోటీసులు ఇవ్వడమో చేస్తారు. ఆపై దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేస్తారు. నిఘా ఉంచాల్సి వస్తే దానికి వారి మార్గాలు వారికి ఉంటాయి తప్ప వీడియో కాల్ ద్వారా మాత్రం కాదు.

4. బాధితుడిని భయపెట్టడంలో భాగంగా సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు విషయం ఎవరికీ చెప్పొద్దని, దీన్ని రహస్యంగా ఉంచకపోతే మీతో పాటు కుటుంబీకుల కిడ్నాప్ లేదా హత్య చేస్తామని బెదిరించారు.
- రాష్ట్రం, దేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఏ ఏజెన్సీ కూడా ఇలాంటి షరతు పెట్టదు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే.. పోలీసులు, సీఐడీ, సీబీఐ సహా ఏ విభాగమైనా ఓ వ్యక్తిని అరెస్టు చేస్తే... దానిపై వారి సంబంధీకులకు కచ్చితంగా సమాచారం ఇవ్వాలి. ఎవరికి సమాచారం ఇచ్చామనే విషయాన్నీ కోర్టు దృష్టికి తీసుకువెళ్లాలనే నిబంధన ఉంది. అలాంటిది ఇక కిడ్నాప్‌లు, హత్యలు చేసే ఆస్కారం పోలీసులకు, ఏజెన్సీలకు ఎలా ఉంటుందనేది విస్మరించకూడదు.

5. ఇది జరిగిన తర్వాత సైబర్ నేరగాళ్లు బాధితుడికి సీబీఐ, ఆర్బీఐ పేర్లతో ఉన్న రెండు నకిలీ లేఖల్ని వాట్సాప్ ద్వారా పంపారు. వాటిలో బాధితుడికి మనీలాండరింగ్‌తో పాటు ఫోర్జరీ కేసులతో సంబంధం ఉన్నట్లు ఉంది.
- ఆర్బీఐ, సీబీఐలతో సైబర్ క్రైమ్ పోలీసులు అవసరమైనప్పుడు మాత్రమే సంప్రదింపులు జరుపుతారు. ఏదైనా కేసుకు సంబంధించి వాళ్లు ఇచ్చిన ఆధారాలు, సమాచారాన్ని కేవలం కోర్టుకు మాత్రమే సమర్పిస్తారు. ఇలా బాధితుడికి వాట్సాప్ చేసి, డబ్బు డిమాండ్ చేయడం జరగని పని.

6. ఈ కేసుల నుంచి విముక్తి పొందాలంటే తాము చెప్పినట్లు చేయాలని బాధితుడిని భయపెట్టిన సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాల వివరాలు పంపారు. వాటిలో విడదల వారీగా రూ.20 లక్షలు డిపాజిట్ చేయించుకున్నారు.
- కేసుల్లో రెండు రకాలు ఉంటాయి. మొదటి రకం వాటిలో శిక్షలు పడితే.. రెండో రకం వాటిలో కేవలం జరిమానాలే విధిస్తారు. అనధికారికంగా ఇతరుల పాస్‌పోర్టులు కలిగి ఉండటం, వీటిని విదేశాలకు పంపే ప్రయత్నం చేయడం, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా... ఇవన్నీ తీవ్రమైన నేరాలు. వీటికి కాంపౌండబుల్ అఫెన్సుల మాదిరిగా జరిమానాలు విధించరు.



7. ఈ బాధితుడు సైబర్ నేరగాళ్లు డబ్బు డిపాజిట్ చేయమంటూ హెచ్‌డీఎఫ్‌సీ, ఫెడరల్ బ్యాంక్ ఖాతాల వివరాలు ఇచ్చారు. వీటిలోకి నగదు బదిలీ చేసిన బాధితుడు దాని కోసం తన ఫిక్స్‌డ్ డిపాజిట్లనూ క్యాన్సిల్ చేశాడు.
- పోలీసులు లేదా ఏదైనా ఏజెన్సీకి నగదు చెల్లించాల్సి వస్తే సేవింగ్స్ లేదా కరెంట్ ఖాతాలకు చెల్లింపులు ఉండదు. కేవలం డీడీలు, చెక్కులు, చలాన్ల రూపంలోనే ఈ చెల్లింపులు జరుగుతాయి. బ్యాంకు ఖాతాలోకి జమ చేయాల్సి వచ్చినా అది ప్రభుత్వానికో, పోలీసు అధిపతి పేరుతో ఉన్న దానికో మాత్రమే జమ చేయాలి.

---

# జలసత్వాలు!

- వాటర్ బోర్డు అభివృద్ధిపై సీఎం నజర్
- తాగునీరు, సీవరేజీపై ముందస్తు ప్రణాళికలకు ఆదేశాలు
- సమగ్ర ప్రాజెక్టు నివేదికల రూపకల్పన కోసం కసరత్తు



సాక్షి, సిటీబ్యూరో: గ్లోబల్ సిటీగా విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగరం తాగునీరు, మురుగు నీటి వ్యవస్థపై స్వాక్షాత్తూ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే పెరిగిన అవసరాలకు అనుగుణంగా తాగునీటి సరఫరా, మురుగు నీటి వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తాయి. ప్రస్తుతం పదేళ్ల క్రితం నాటి అవసరాలకు సరిపడు తాగునీరు, ఏళ్లనాటి డ్రైనేజీ వ్యవస్థనే కొనసాగుతోంది. వాస్తవంగా పదేళ్లలో దేశం నలుమూలల నుంచి వలసలు పెరగడంతో మహా నగర జనాభా 30 శాతానికిపైగా పెరిగింది. దానికి అనుగుణంగా జలమండలి పరిధి కూడా విస్తరించింది. నల్లా కనెక్షన్లు అదే స్థాయిలో పెరిగాయి. ప్రధాన జలాశయాల్లో తాగునీటి కేటాయింపు మాత్రం పెరగలేదు. పాత కేటాయింపులతోనే నీటి సరఫరా కొనసాగుతోంది. మహానగరానికి తాగునీటిని సరఫరా చేసే ప్రధాన జలాశయాల్లో నీటి మట్టాలు డెడ్‌స్టోరేజీకి చేరడంతో పరిస్థితి అగమ్య గోచరంగా తయారవుతోంది. ఇటీవల జరిగిన జలమండలి పాలకవర్గ సమావేశంలో కమిటీ చైర్మన్ హోదాలో హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి దూరదృష్టితో తాగునీటి సరఫరా, సీవరేజీ వ్యవస్థపై దశ దిశ నిర్దేశించారు. భవిష్యత్ అవసరాలను అంచనా వేసుకొని తాగునీటి సరఫరాకు సరిపడే మౌలిక సదుపాయాల ప్రణాళికను తయారు చేయాలని ఆదేశించారు. 2050 నాటికి పెరిగే జనాభా అవసరాలకు సరిపడేలా ఇంటింటికీ తాగునీటితో పాటు సీవరేజీ ఫ్యూచర్ ప్లాన్ ఉండాలని దిశానిర్దేశం చేశారు. దీంతో సమగ్ర ప్రణాళికలు రూపొందించేందుకు జలమండలి యంత్రాంగం కసరత్తు చేస్తోంది.



**సమగ్ర సీవరేజీ మాస్టర్ ప్లాన్..**
ఇప్పటికే మూసీ ప్రక్షాళనలో భాగంగా హైదరాబాద్ 'సమగ్ర సీవరేజీ మాస్టర్ ప్లాన్' ప్రాజెక్టుకు ప్రభుత్వం రూపకల్పన చేసింది. ప్రస్తుతం ఏళ్లనాటి మురుగు పైపులైన్ వ్యవస్థ కొనసాగుతోంది. శివారుతో పాటు ఓఆర్ఆర్ పరిధిలో సైతం సరైన మురుగు నీటి పారుదల వ్యవస్థ లేదు. మొత్తం మీద ప్రస్తుతం 9,769 కిలో మీటర్లు మాత్రమే పైపులైన్ నెట్‌వర్క్ విస్తరించి ఉంది. కొత్తగా జీహెచ్ఎంసీ పరిధిలో 2,656 కిలోమీటర్లు, ఓఆర్ఆర్ పరిధిలో 4,378 కిలో మీటర్లు విస్తరించాలని ప్రణాళిక రూపొందించింది. మొత్తం మీద హైదరాబాద్‌తో పాటు శివారు, ఓఆర్ఆర్ వరకు విస్తరించిన స్థానిక సంస్థల (యూఎల్‌బీ) పరిధిలో సుమారు 7,034 కి.మీ పొడవునా మురుగు నీటి పైపులైన్ నెట్‌వర్క్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. శివారు పరిధిలో మూడు ప్యాకేజీల్లో తొమ్మిది సర్కిళ్లు కలుపుకొని 2,232 కి.మీ, కోర్‌సిటీ పరిధిలోని నాలుగు జోన్లలో 424 కి.మీ పైపులైన్ నెట్‌వర్క్ విస్తరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

**ఇక గోదావరి రెండో దశ..**
తాజాగా మహా నగర తాగునీటి అవసరాల కోసం గోదావరి రెండో దశకు గ్రీన్ సిగ్నల్ లభించింది. కాళేశ్వరం ఎత్తిపోతలలో భాగంగా నిర్మించిన మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి 20 టీఎంసీల నీరు తరలింపునకు ప్రణాళిక సిద్ధమైంది. ప్రస్తుతం నాగార్జునసాగర్ నుంచి మూడు దశలుగా కృష్ణా జలాలు, శ్రీపాద ఎల్లంపల్లి నుంచి గోదావరి మొదటి దశతో పాటు సింగూర్, మంజీరా, ఉస్మాన్ సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల నుంచి మొత్తం మీద రోజువారీ సుమారు 555 ఎంజీడీల నీటి సరఫరా కొనసాగుతున్నా సరిపడని పరిస్థితి నెలకొంది. దీంతో గోదావరి రెండో దశకు జలమండలి ప్రతిపాదించగా సీఎం ఆమోదం కూడా లభించింది. దీంతో ఈ నెలాఖరులోగా టెండర్లు ఆహ్వానించేందుకు సిద్ధమవుతోంది. గోదావరి జలాల్లో హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలకు 30 టీఎంసీల నీటి కేటాయింపులుండగా, ప్రస్తుతం గోదావరి మొదటి దశ కింద శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 10 టీఎంసీలను తరలిస్తున్నారు. మరో 20 టీఎంసీలు తరలించేందుకు వెసులుబాటు ఉంది. మహా నగరానికి రోజురోజుకూ తాగునీటి అవసరాలు పెరుగుతుండడంతో పాటు రెండో దశకు సిద్ధమైంది. మరోవైపు మంజీరా పాత పైపులైన్ లీకేజీల నేపథ్యంలో దాని వెంట ప్రత్యామ్నాయంగా మరో అధునాతన లైన్లు నిర్మించేలా కొత్త ప్రాజెక్టుకు సీఎం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. మంజీరా 1965 నుంచి జలాశయం నుంచి సిటీలో పలు ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తున్న పైపులైన్లు రిపేర్లు వస్తే దాదాపు పది నుంచి పక్షం రోజులు నీటి సరఫరా నిలిచిపోతోందని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్లడతో కొత్తలైన్ ప్రణాళిక రూపొందించాలని సీఎం ఆదేశించారు. దీంతో తాగునీటి అవసరాలు మరింత కలిసి వచ్చినట్లయింది.

---

# 26 నుంచి రేషన్ కార్డుల జారీ

- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ప్రకటన
- స్థలం లేని పేదలకూ ఇంటి సదుపాయం
- హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 26 నుంచి హైదరాబాద్‌లో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అదే రోజు నుంచి ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారుల వివరాలు కూడా వెల్లడిస్తామన్నారు. ఆదివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలకతీతంగా, ఇతర జిల్లాలకు ఆదర్శంగా రాజధాని నగరంలో రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సొంత స్థలమున్న పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు ఎంతో ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. గతంలో ఉన్న నిబంధనల కనుగుణంగానే కొత్త రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన 50 శాతం పూర్తయిందని, వాటిలో దాదాపు 10 వేల మంది అర్హులున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పేదలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలకు 'ప్రజాపాలన' సందర్భంగా దరఖాస్తులు ఇవ్వలేకపోయిన వారు ఇప్పుడు కూడా సంబంధిత కార్యాలయాల్లో ఇవ్వవచ్చని పొన్నం తెలిపారు. సమావేశంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ప్రకాశ్‌గౌడ్, జాఫర్ హుస్సేన్, మీర్ జుల్ఫికర్ అలీ, మాజిద్ హుస్సేన్, రాజాసింగ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, జిల్లా కలెక్టర్ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు
- ఇందిరమ్మ ఇళ్లు కేటాయించే క్రమంలో దరఖాస్తు చేస్తున్నవారి అర్హత విషయంలో ప్రభుత్వం కొన్ని సాంకేతిక సవరణలు చేయాలని మంత్రికి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సూచించారు. ఎల్లో కలర్ ప్లేట్ ట్యాక్సీ డ్రైవర్లను కూడా కారు ఓనర్లుగా గుర్తించడం ద్వారా పేదలకు అన్యాయం జరుగుతోందన్నారు. వికలాంగుల జాబితాలో తలసేమియా బాధితులను, కీమో థెరపీ చేయించుకునే వారిని, డయాలసిస్ పేషెంట్లకు కూడా చేర్చాలని కోరారు. వీరికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు.

---

## ఎగ్జిబిషన్.. కిక్కిరిసెన్!

అబిడ్స్: ఎగ్జిబిషన్‌కు సందర్శకులు పోటెత్తారు. 84వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన శాల (నుమాయిష్‌కు) ఆదివారం సందర్శకులు భారీగా తరలివచ్చారు. దాదాపు 75 వేల మంది సందర్శించారని ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు కె.నిరంజన్, కార్యదర్శి సురేందర్‌రెడ్డిలు తెలిపారు. ఇప్పటివరకు 2.75 లక్షల మంది ఎగ్జిబిషన్‌కు వచ్చినట్లు వారు వివరించారు. ఆదివారం రాత్రి అజంతా గేట్, గాంధీభవన్ గేట్లు సందర్శకులతో నిండిపోయాయి. అబిడ్స్ ఏసీపీ ఆకుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ అదనపు సిబ్బందితో బందోబస్తు చేపట్టారు. దాదాపు 80 సీసీ కెమెరాల ద్వారా ఎగ్జిబిషన్‌లో నిఘా ముమ్మరం చేశారు.



---

## రాజేంద్రనగర్‌లో మరోసారి చిరుత కలకలం



చిరుత జాడ కోసం వెతుకుతున్న అటవీ శాఖ అధికారులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లో మరోసారి చిరుత సంచారం కలకలం సృష్టించింది. ఉదయం వాకింగ్ చేసేందుకు వచ్చిన ఓ వ్యక్తికి చిరుత కనిపించిందని తెలియడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. 15 రోజుల క్రితం యూనివర్సిటీ ప్రాంతంలో చిరుత కనిపించిందని జొమాటో డెలివరీ బాయ్ సెక్యూరిటీ గార్డులకు సమాచారం అందించాడు. ఆ సమయంలో సిబ్బంది రెండు రోజుల పాటు చిరుత జాడ కోసం వెతికినా ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదు. శనివారం ఉదయం యూనివర్సిటీ వాకింగ్‌కు వచ్చిన గగన్ పహాడ్‌కు చెందిన వ్యక్తి చిరుతను చూసినట్లు తోటి వాకర్లకు తెలిపాడు. ఈ విషయాన్ని వాకర్లు యూనివర్సిటీ అధికారులతో పాటు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఆదివారం ఉదయం అటవీ శాఖ అధికారులు, యూనివర్సిటీ సెక్యూరిటీ సిబ్బంది రాజేంద్రనగర్, ఆర్‌జీఐ పోలీసులు యూనివర్సిటీ ప్రాంగణంలోని అడవుల్లో వెతికారు. యూనివర్సిటీ ప్రాంతంలో స్థానికులు గొర్రెలు, బర్రెలను మేపుతున్నారు. దీంతో పాటు హైకోర్టుకు కేటాయించిన స్థలం పక్కనే ప్రైవేటు నిర్మాణ సంస్థ పెద్ద ఎత్తున నిర్మాణ పనులను జరుపుతోంది. వారితో పాటు యూనివర్సిటీ సెక్యూరిటీ సిబ్బందిని ప్రశ్నించారు. ఏ ఒక్కరూ తమకు చిరుత కనిపించలేదని తెలపడంతో అటవీ శాఖ అధికారులు చిరుత సంచారం లేదని వెల్లడించారు. ఎవరూ భయభ్రాంతులకు గురి కావద్దని సూచించారు.

# అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం


అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ రమేష్‌కుమార్, ఫైర్ సిబ్బంది


దగ్ధమైన గృహోపకరణాలు

- షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని గృహోపకరణాలన్నీ దగ్ధం

**చిక్కడపల్లి:** గాంధీనగర్ డివిజన్ వై జంక్షన్ సమీపంలో ఓ అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సంఘటన జరిగిన సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. పోలీసులు, స్థానికులు తెల్పిన వివరాల ప్రకారం రాఘవేంద్ర అపార్ట్‌మెంట్ మూడవ అంతస్తులోని ఫ్లాట్ నెం.307, 308ను కలిపి విశాలంగా ఒకే ఫ్లాట్‌గా నిర్మించారు. ఈ ఫ్లాట్‌లో కొత్త సూర్యనారాయణ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కుటుంబంతో కలిసి నివసిస్తున్నారు. సంక్రాంతి నేపథ్యంలో ఆదివారం ఉదయం 8 గంటలకు ఇంటికి తాళం వేసి తమ సొంతూరు ఖమ్మం జిల్లా అశ్వరావుపేటకు బయలుదేరారు. దాదాపు 10 గంటల సమయంలో ఫ్లాట్ నుంచి దట్టమైన పొగలు, మంటలు రావడాన్ని గుర్తించి స్థానికులు వెంటనే ఫైరింజన్‌కు సమాచారం అందించారు. చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేష్‌కుమార్, ముషీరాబాద్ ఫైర్ సేఫ్టీ ఆఫీసర్ భానుప్రతాప్ తదితరులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇంట్లోని గృహోపకరణాలన్నీ దగ్ధమయ్యాయని, దాదాపు రూ.10 లక్షల వరకు ఆస్తి నష్ట వాటిల్లిందని, ఫ్రిడ్జ్‌లో షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు తెలిపారు.

# ఇచ్చేదే లే!

## గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం సర్వే

- ఎక్కడికక్కడ అడ్డుతగులుతున్న రైతులు
- భూమిలిచ్చేందుకు ససేమిరా
- ఎలా బతకాలని ఆవేదన
- బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్
- నచ్చజెప్పే ప్రయత్నంలో రెవెన్యూ అధికారులు


సర్వే పనులను అడ్డుకుంటున్న ఎక్వాయిపల్లి గ్రామస్తులు (ఫైల్)

**సాక్షి, రంగారెడ్డిజిల్లా:** ఔటర్ నుంచి ఆకుతోటపల్లి వరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన 330 ఫీట్ల ఎలివేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు భూసేకరణ అంశం వివాదాస్పదంగా మారుతోంది. నష్టపరిహారాన్ని తేల్చకుండా, కనీసం రైతులకు సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వం ఏకపక్షంగా భూములను నోటిఫై చేసి, ఆ మేరకు సర్వే పనులు మొదలు పెట్టడాన్ని రైతులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. సర్వే కోసం వచ్చిన అధికారులను ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. విధిలేని పరిస్థితుల్లో పోలీసుల భద్రత మధ్య సర్వే పనులు చేపట్టాల్సి వస్తోంది. ఔటర్ రింగ్‌రోడ్డు ఎగ్జిట్ నంబర్ 13 నుంచి ఆమనగల్లు సమీపంలోని ఆకు తోటపల్లి వరకు 41.5 కిలోమీటర్ల రోడ్డుకు 4,725 మంది రైతుల నుంచి 1,004.22 ఎకరాల భూమిని సేకరిస్తున్న విషయం తెలిసిందే. బహిరంగ మార్కెట్‌లో భూముల ధరలకు.. ప్రభుత్వం చెల్లిస్తున్న పరిహారానికి పొంతన లేకపోవడంతో మెజార్టీ రైతులు తమ భూములు ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు. కొంత మంది భూమికి బదులుగా భూమి కోరుతుండగా.. మరి కొంత మంది ఎకరానికి కనీసం రూ.రెండు కోట్లు అయినా ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్నారు. అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నా అంగీకరించడం లేదు.

### పరిహారం ఇస్తామన్నా అంగీకరించని రైతులు..

ఫార్మాసిటీ కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల్లోని పది గ్రామాల్లో 19,333 ఎకరాలు సేకరించాలని నిర్ణయించింది. 2017 నుంచి 2024 వరకు 13,500 ఎకరాలు సేకరించింది. మొదట్లో ప్రభుత్వ భూముల్లో కబ్జాలో ఉన్న రైతులకు ఎకరానికి రూ.7.70 లక్షలు, అసైన్డ్ పట్టాదారులకు రూ.8 లక్షలు, పట్టా భూములకు రూ.12.50 లక్షల చొప్పున పరిహారం చెల్లించింది. రైతుల ఆందోళనలతో రూ.16 లక్షలకు పెంచింది. మీర్‌ఖాన్‌పేటలో టీజీఐఐసీ వెంచర్‌లో ఎకరానికి 121 గజాల చొప్పున ప్లాట్లకు ప్రొసీడింగ్స్ ఇచ్చింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఓటమి పాలవడం.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం.. ఫార్మాసిటీ స్థానంలో ఫ్యూచర్‌సిటీని ప్రతిపాదించడం చకచకా జరిగిపోయాయి. ఫ్యూచర్‌సిటీ అభివృద్ధి పనుల్లో భాగంగా గ్రీన్‌ఫీల్డ్‌రోడ్డుకు సంకల్పించారు. భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి రూ.25 లక్షలు పరిహారం చెల్లించనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుత ప్రభుత్వ మార్కెట్ వాల్యూపై నాలుగు రెట్లు అదనంగా పరిహారం పెంచినప్పటికీ రైతులు భూములిచ్చేందుకు సుముఖత వ్యక్తం చేయడం లేదు. కొన్ని చోట్ల రెండు పంటలు పండుతుంటే, మరికొన్ని చోట్ల మూడు పంటలు పండే భూములు ఉన్నాయి. ఏళ్లుగా ఈ భూములనే నమ్ముకుని జీవిస్తున్న వాళ్లు.. ఉన్నపళంగా వదులుకోవాల్సి వస్తుండటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.

**ఫేజ్-1లో భూ సేకరణ**

| మండలం | గ్రామం | రైతులు | భూమి(ఎకరాల్లో) |
|---|---|---|---|
| ఇబ్రహీంపట్నం | ఫిరోజ్‌గూడ | 84 | 1.03 |
| ఇబ్రహీంపట్నం | కొంగరకలాన్ | 361 | 55.05 |
| మహేశ్వరం | కొంగరకుర్దు | 278 | 53.20 |
| కందుకూరు | లేమూరు | 497 | 84.28 |
| కందుకూరు | తిమ్మాపూర్ | 290 | 47.02 |
| కందుకూరు | రాచలూరు | 351 | 87.22 |
| కందుకూరు | గుమ్మడవెల్లి | (రిజర్వ్‌డ్ ఫారెస్ట్) | 32.11 |
| కందుకూరు | పంజాగూడ | (టీఎస్ఐఐసీ) | 18.33 |
| కందుకూరు | మీర్‌ఖాన్‌పేట | 48 | 62.08 |

**ఫేజ్-2లో భూ సేకరణ**

| మండలం | గ్రామం | రైతులు | భూమి (ఎకరాల్లో) |
|---|---|---|---|
| ఆమనగలు | ఆమనగల్లు | 331 | 68.35 |
| ఆమనగల్లు | ఆకుతోటపల్లి | 229 | 83.35 |
| యాచారం | కుర్మిద్ధ | 529 | 144.75 |
| కడ్తాల్ | కడ్తాల్ | 440 | 72.67 |
| కడ్తాల్ | ముద్విన్ | 1287 | 184.76 |

### భూమికి బదులు భూమి



కుర్మిద్ధ రెవెన్యూలో వ్యవసాయ భూమి ఉంది. సర్వే నంబర్ 286, 287లో మొత్తం రెండు ఎకరాలు పోతుంది. ఏళ్లుగా ఆ భూమినే నమ్ముకుని జీవిస్తున్నా. భూమి పోతే మా జీవితాలు నాశనమైనట్లే. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు తీసుకునే భూమికి గాను కుర్మిద్ధ గ్రామ రెవెన్యూ పరిధిలోనే భూమి ఇవ్వాలి.

– నేనావత్ పంత్య, రైతు, మంగలిగడ్డతండా

### ఆత్మహత్యలే శరణ్యం



కుర్మిద్ధ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 281, 284లో మూడు ఎకరాలకు పైగా పట్టా భూమి ఉంది. మొత్తం గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు పోతోంది. కనీసం మాతో చర్చించకుండా బలవంతంగా సర్వే చేస్తున్నారు. ఏటా మూడు పంటలు పండే భూమి పోతే ఎట్లా బతుకాలి. మా కుటుంబానికి ఆత్మహత్యలే శరణ్యం.

– విస్లావత్ రాజు, మర్లకుంటతండా

### రూ.కోటి పరిహారం ఇవ్వాలి



సర్వే నంబర్ 311లో నా భూమి ఉంది. ఇదే నంబర్ నుంచి గ్రీన్ ఫీల్డ్ రోడ్డు వెళ్తుంది. మాకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా సర్వే చేశారు. ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారాన్ని తేల్చకుండా నోటిఫై ఎలా చేస్తారు. ఎకరానికి రూ.కోటి పరిహారం చెల్లించిన తర్వాతే భూములు తీసుకోవాలి.

– పాలకుర్ల కరుణాకర్ గౌడ్, ఎక్వాయిపల్లి

### ఎలా బతికేది..?



ఎక్వాయిపల్లి సర్వే నంబర్ 310లో భూమి ఉంది. వ్యవసాయం చేసుకుంటూ ఇద్దరి పిల్లలను చదివిస్తున్నా. ఉన్న కొద్దిపాటి భూమిని కూడా రోడ్డుకు తీసుకుంటే ఎలా జీవించేది? పిల్లలను ఎలా చదివించేది? భూమికి భూమి పరిహారంగా ఇప్పించాలి. లేదంటే అడిగినంత పరిహారం ఇచ్చాకే భూ సేకరణ చేపట్టాలి.

– నరసింహగౌడ్, ఎక్వాయిపల్లి

# యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

– మంత్రి శ్రీధర్‌బాబు



**కవాడిగూడ:** యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి. అపజయాలకు కుంగిపోకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచించారు. ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణ మఠంలో నిర్వహించిన జాతీయ యువజనోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. మనం నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునే ప్రయాణంలో ఎదురయ్యే సవాళ్లు, ఒడిదొడుకులను ఎదుర్కొని ముందుకు సాగితే విజయ తీరాలకు చేరుకుంటామన్నారు. క్రమశిక్షణ నిరంతర శ్రమ, సంస్కృతీ సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. యువతను జాగృతం చేసి సన్మార్గం వైపు నడిపించేందుకు రామకృష్ణ మఠం అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. యువతలో జాతీయ భావాన్ని పెంపొందిస్తు వారిలో దాగి ఉన్న శక్తిని వెలికి తీసేందుకు రామకృష్ణ మఠం చేస్తున్న కృషి ఎనలేనిదని కొనియాడారు. రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద మాట్లాడుతూ.. ఆధ్యాత్మికత, మానవతా విలువలను అలవర్చుకుని భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలని యువతకు పిలుపునిచ్చారు.

# దగ్గుబాటి కుటుంబంపై కోర్టు ఆదేశాల ఉల్లంఘన కేసు

**ఫిలింనగర్:** సినీ హీరో దగ్గుబాటి వెంకటేష్ కుటుంబ సభ్యులపై ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..ఫిలింనగర్ రోడ్డునెంబర్-1లో ఉన్న దక్కన్ కిచెన్ హోటల్ కూల్చివేత వ్యవహారంలో బాధితుడు నందకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోర్టు ఆదేశాలతో పోలీసులు ఆదివారం నిర్మాత దగ్గుబాటి సురేష్‌బాబు (ఏ1), దగ్గుబాటి వెంకటేష్ (ఏ2), దగ్గుబాటి రానా (ఏ3), దగ్గుబాటి అభిరామ్ (ఏ4)లపై ఐపీసీ సెక్షన్ 448, 452, 458, 120 (బి) కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. 2022 నవంబర్‌లో దక్కన్ కిచెన్ హోటల్‌ను జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేశారు. నందకుమార్‌కు చెందిన దక్కన్ కిచెన్ హోటల్ అంశంలో దగ్గుబాటి కుటుంబంతో స్థల వివాదం ఉంది. నందకుమార్ సిటీ సివిల్ కోర్టులో కేసు కూడా వేశారు. ఈ అంశంలో స్టేటస్ కో కొనసాగించాలని, సదరు స్థలంలో ఎలాంటి చర్యలకు దిగవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలు బేఖాతరు చేస్తూ గతేడాది జనవరిలో దగ్గుబాటి కుటుంబం హోటల్‌ను పూర్తిగా నేలమట్టం చేసింది. దీంతో మరోసారి బాధితుడు నందకుమార్ దగ్గుబాటి కుటుంబ సభ్యులపై కోర్టు ఆదేశాల ఉల్లంఘన కేసు నమోదు చేయాలని కోరుతూ నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. స్పందించిన నాంపల్లిలోని 17వ నెంబర్ న్యాయస్థానం ఈ ఘటనలో కేసు నమోదు చేసి విచారణ చేయాలంటూ ఫిలింనగర్ పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది.

## నేటి నుంచి కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

**సాక్షి, సిటీబ్యూరో:** తెలంగాణ సాంస్కృతిక, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 15 వరకు అంతర్జాతీయ కైట్, స్వీట్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ ఈ ఫెస్టివల్‌కు వేదిక కానుంది. వివిధ రకాల ఆహార ఉత్పత్తులు, చేనేత వస్త్రాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేకించి రాత్రి కైట్స్ ఎగురవేసే కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సందర్శకులకు ఉదయం 10.30 నుంచి రాత్రి 10. 30 గంటల వరకు అనుమతిస్తామని సంబంధిత అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


శివకుమార్ (ఫైల్)

**రాజేంద్రనగర్:** అర్ధరాత్రి వేళ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లి ప్రాంతానికి చెందిన శివకుమార్ (26) పాతనగరంలోని ఓ విద్యాసంస్థలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి 10 గంటలకు బుద్వేల్‌లో ఉండే స్నేహితుని ఇంటికి వెళ్తున్నానని చెప్పి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. రాత్రి వరకు స్నేహితుని ఇంట్లో ఉండి తిరిగి ఉప్పర్‌పల్లి వెళుతుండగా వెటర్నరీ కళాశాల సమీపంలో రోడ్డుపై ఉన్న డివైడర్‌ను ఢీకొని కింద పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. శివ కుమార్ బుద్వేల్‌లో ఎవరి ఇంటికి వచ్చాడు అనే వివరాలను సేకరిస్తున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. దీనిపై కేసు నమోదు చేశారు.

## గ్యాస్ లీకై ఎగసిన మంటలు

**హయత్‌నగర్:** పండుగకు పిండివంటలు చేసేందుకు గ్యాస్ పొయ్యి వెలిగించగా...గ్యాస్ లీకై ఇల్లంతా మంటలు అంటుకున్న సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు హయత్‌నగర్ ముదిరాజ్ బస్తీకి చెందిన కాశమోని రాంచందర్, కమలమ్మ దంపతులు పాత రోడ్డు సమీపంలోని ఓ పెంకుటింట్లో అద్దెకు ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం పిండి వంటలు చేసేందుకు గ్యాస్ స్టౌ వెలిగించారు. అప్పటికే గ్యాస్‌లీకై ఉండడంతో ఒక్కసారిగా మంటలు అంటుకుని ఎగసిపడ్డాయి. అప్రమత్తమైన రాంచందర్ ఇంట్లోని దుప్పట్లు తీసుకొచ్చి సిలిండర్‌పై వేసి మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. ఇంట్లోని వారందరూ బయటకు వచ్చారు. ఫైర్ సిబ్బంది, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చెరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవటంతో ఊపిరి పీల్చుకున్నారు.

# మన సంస్కృతికి ప్రతీక సంక్రాంతి

### జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి



**లక్డీకాపూల్:** సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఇలంబర్తి నగర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంక్రాంతి భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని, ఈ పండుగ ప్రకృతితో మమేకమై ఆనందంగా జీవించడాన్ని గుర్తు చేస్తుందని చెప్పారు. ఇది కుటుంబ బంధాలు, సంప్రదాయాలు, సమాజానికి సంబంధించిన విలువలను నొక్కి చెబుతుందన్నారు. ఈ పండుగ సందర్భంగా నగరాన్ని స్వచ్ఛంగా..పర్యావరణ హితంగా ఉంచడంపై జీహెచ్ఎంసీ ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. పర్యావరణానికి హాని కలిగించే పదార్థాలను వాడకుండా పండుగ జరుపుకోవాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, కమ్యూనిటీ స్థాయిలో పండుగ వేడుకలు నిర్వహించుకుని సమాజానికి ప్రేరణ కలిగించాలని కోరారు. ప్రజలందరూ సంతోషంగా ఉల్లాసంగా సంక్రాంతి పండగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. నగర ప్రజల సహకారంతో హైదరాబాద్‌ను మరింత అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దగలమని ఆశాభావం వ్యక్తం చేశారు.

### ఐక్యత.. అనురాగం పెంపొందాలి: మేయర్

సంక్రాంతి పండుగ మన సంప్రదాయాలను, సంస్కృతిని ప్రతిబింబించే అద్భుతమైన పండుగని, ఈ పండుగ స్నేహభావం, ఐక్యత, అనురాగం పెంపొందించేందుకు ప్రేరణ కలిగిస్తుందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. మకర సంక్రాంతి నాడు సూర్యుని పూజించి, ప్రకృతి ప్రసాదాలకు కృతజ్ఞతలు తెలియజేయడం మన పురాతన ఆచారాలలో ఒకటన్నారు. పండుగ వేళ ప్లాస్టిక్ ఉపయోగం తగ్గించి, పర్యావరణానికి హానికరం కాని విధానాలను అనుసరించాలని మేయర్ కోరారు.

### సిరిసంపదలు తీసుకురావాలి: డిప్యూటీ మేయర్

సంక్రాంతి పండుగ ప్రజలకు సిరి సంపదలు తీసుకురావాలని డిప్యూటీమేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ పండుగ మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, శాంతి, సంతోషం కలగాలని ఆమె కోరారు. పతంగులను అత్యంత జాగ్రత్తగా ఎగురవేయాలని, ప్రతి లోగిలి, ముంగిలి ముగ్గులతో కళకళలాడినట్లుగానే హైదరాబాద్ నగరం పరిశుభ్రత, పచ్చదనంతో కళకళలాడాలని, అందుకు నగర ప్రజలందరూ కంకణబద్ధులై సహకరించాలని ఆమె కోరారు.

# లౌకికవాదాన్ని చాటిన నిజాం నవాబులు



ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం ..

**పంజగుట్ట:** నిజాం నవాబులు 1953లోనే దళితులు, క్రిస్టియన్స్, ఆదివాసీలు, క్రైస్తవులను చదువులో ప్రోత్సహించడం, స్కాలర్‌షిప్‌లు, పీహెచ్‌డీ ప్రదానం చేయడం లాంటి కార్యక్రమాలు చేశారని పలువురు వక్తలు అన్నారు. దళిత, ముస్లిం, క్రైస్తవ సంస్థలు, జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాజ్యాంగ రూపకర్త అంబేద్కర్ 1953 జనవరి 12వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన రోజును పురస్కరించుకుని డి.లిట్ డే (డాక్టర్ ఆఫ్ లిటరేచర్), నేషనల్ స్కాలర్స్‌డే వేడుకలు ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి అతిథులుగా జస్టిస్ ఈశ్వరయ్య, 6వ నిజాం రౌనక్ యార్ ఖాన్, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్‌లు హాజరై అంబేద్కర్ చిత్రపటానికి నివాళ్లు అర్పించి, ఉస్మానియా యూనివర్సిటీ డీన్ స్థాయి పదవి వదులుకుని, ప్రజా క్షేత్రంలోకి వస్తున్న ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పట్లోనే నిజాం రాజులు సామరస్యాన్ని, లౌకికవాదాన్ని, లింగ తటస్థత పట్ల వారి అంకితభావాన్ని కోరుకున్నట్లు అంబేద్కర్‌కు డాక్టరేట్ ప్రదానం చేయడం ద్వారా అర్థమయ్యిందన్నారు. వారి పాలన పట్ల కొంత మందికి ఎన్నో అపోహలు ఉన్నాయని అందులో వాస్తవం లేదన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో నిలిచిన ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్‌కు మద్దతు ప్రకటిస్తున్నట్లు ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం తెలంగాణ పేర్కొంది. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకట్, ప్రధాన కార్యదర్శి చవాన్ సుభాన్ సింగ్. బైరి వెంకటేష్, పవన్ కుమార్, అశోక్, రమేష్ పాల్గొన్నారు.





# వైభవంగా ప్రకాశ్ పురబ్


ప్రకాశ్ పురబ్‌లో పాల్గొన్న సిక్కులు

**కంటోన్మెంట్:** సికింద్రాబాద్ గురుద్వారా సాహెబ్ ప్రబంధక్ కమిటీ ఆధ్వర్యంలో బాలంరాయి క్లాసిక్ గార్డెన్స్ ఆవరణలో 10వ సిక్కు గురువైన గురు గోవింద్ సింగ్ 358వ ప్రకాశ్ పురబ్‌ను ఘనంగా నిర్వహించారు. వందలాది మంది సిక్కులు ఈ ఆధ్మాత్మిక కార్యక్రమాలలో పాలుపంచుకున్నారు. సరబ్‌జిత్ సింగ్ (పాట్నా), జాస్కరన్ సింగ్ (పాటియాలా), గ్యానీ జగ్‌దేవ్ సింగ్, చరణ్‌జిత్ సింగ్ సహా ప్రముఖ రాగి జాతాలు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. కార్యక్రమంలో ప్రబంధక్ కమిటీ అధ్యక్షులు ఎస్. బల్‌దేవ్ సింగ్ బగ్గా, ప్రధాన కార్యదర్శి జగన్మోహన్ సింగ్, ఉపాధ్యక్షులు హర్‌ప్రీత్ సింగ్ గులాటీ తదితరులు పాల్గొన్నారు.

## కేలండర్ ఆవిష్కరణ

**శ్రీనగర్‌కాలనీ:** తెలంగాణా గంగపుత్ర సంఘం నూతన సంవత్సర కేలండర్–2025ను ఆదివారం మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దీటి మల్లయ్య, ప్రధాన కార్యదర్శి శీలం రాజ్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు కె.స్వరూప, ఉపాధ్యక్షుడు మోహనకృష్ణ, కార్యదర్శులు దేవేందర్, రాజేష్‌ఖన్నా, నరహరి, మధుసూదన్, స్వామి, గంగాధర్, దయానంద్ పాల్గొన్నారు.

## ముదిరాజ్‌ల సమస్యలను పరిష్కరించాలి

**లిబర్టీ:** అత్యంత దయనీయ జీవితాలు వెళ్లదీస్తున్న ముదిరాజులను బీసీ–బీ గ్రూప్ నుంచి ఈ గ్రూప్‌లో చేర్చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆర్డినెన్స్ తీసుకురావాలని తెలంగాణ ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టియాదగిరి ముదిరాజ్ కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని ముదిరాజుల పక్షపాతిగా ముద్ర వేసుకోవాలని కోరారు. ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తరతరాలుగా సంప్రదాయ కులవృత్తి నమ్ముకొని బతుకుబండి లాగుతూ ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారని పేర్కొన్నారు. ఆర్థికంగా చితికిపోయి అనేక ఏళ్లుగా ముదిరాజులు జీవనం సాగిస్తున్నారని, బీసీ జనాభాలో ముదిరాజ్‌లే అత్యధికమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ముదిరాజ్‌ల అభ్యున్నతికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. అనంతరం హైదరాబాద్ నగర మహిళా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సి.సుప్రియ, జి.లక్ష్మిలను నియమిస్తూ యాదగిరి ముదిరాజ్ నియామక పత్రాలు అందజేశారు.ఈ సమావేశంలో మహిళా విభాగం నాయకురాలు రమ, దివ్య, శ్రీదేవి, తులసి ముదిరాజ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## నియామకం



శివరామకృష్ణకు నియామక పత్రం అందజేస్తున్న వేముల లక్ష్మణ్

**రహమత్‌నగర్:** బ్రహ్మశంకర్‌నగర్‌కు చెందిన ద్యారంగుల శివరామ కృష్ణ (చిన్న) అఖిల భారత వడ్డెర వడ్డెభూవి సంక్షేమ సంఘం రహమత్‌నగర్ డివిజన్ యువజన సంఘం అధ్యక్షుడిగా నియామకమయ్యారు. ఈ మేరకు ఆ సంఘం జాతీయ వేముల లక్ష్మణ్ ఆదివారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివరామ కృష్ణ మాట్లాడుతూ వడ్డెర కులస్తుల సమస్యలు, హక్కుల కోసం పోరాడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి గుంజ శ్రీనివాస్, జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు పల్లపు శ్రీకాంత్‌లతో పాటు ముదిరాజ్ మహాసభ నాయకుడు అనిల్ ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

## సుమాల్యకు 'తెలుగు వెలుగు' నంది పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకుంటున్న అన్నమరాజు సుమాల్య

**లిబర్టీ:** తెలుగు వెలుగు జాతీయ సాహితి వేదిక, కాళోజీ బుక్ ఆఫ్ తెలుగు రికార్డ్స్ వేదిక ఆధ్వర్యంలో జాతీయ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీ, సేవరంగంలో విశిష్ట సేవలను అందించిన డాక్టర్ అన్నమరాజు సుమాల్యకు తెలుగు వెలుగు నంది పురస్కారంతో పాటు కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ బంగారు పతకం, ప్రశంసా పత్రాన్ని సమాచార, పౌర సంబంధాల శాఖ సంయుక్త సంచాలకులు కన్నెకంటి వెంకట రమణ, ప్రముఖ చిత్ర కళాకారుడు డాక్టర్ మండలి లక్ష్మణబాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టుల సంఘం సభ్యులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, డాక్టర్ పోలోజు భాస్కరాచార్యులు, అమృతపూడి రేవతి, తెలుగు వెలుగు జాతీయ అధ్యక్షులు పోలోజు రాజకుమారాచార్యులు, శాంతికృష్ణ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

## డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు

**ఫిలింనగర్:** పార్కు చేసి ఉన్న డీసీఎం వాహనం కింద నిద్రపోతున్న వ్యక్తిని గమనించకుండా వాహనాన్ని నిర్లక్ష్యంగా అతనిపై నుంచి నడిపి మృతికి కారణమైన డ్రైవర్‌పై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... టోలిచౌకి ఫ్లైఓవర్ కింద డీసీఎం వాహనాలను పార్కింగ్ చేస్తుంటారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం సమయంలో పార్కింగ్ చేసి ఉన్న టీఎస్ 13 యూడీ 2644 నెంబర్ గల వాహనం కింద ఓ వ్యక్తి పడుకుని ఉన్నాడు. డ్రైవర్ మొసిన్ ఆ వ్యక్తిని గమనించకుండా డీసీఎం వాహనాన్ని నడుపుకుంటూ వెళ్లిపోయాడు. దీంతో ఆ వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. అయితే ఘటన జరిగినప్పుడు అక్కడే ఉన్న మరో డ్రైవర్ అమీర్ గాయపడిన వ్యక్తిని పరిశీలించగా అప్పటికే మరణించాడు. దీంతో అమీర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, మొసిన్‌పై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ముగ్గు మెరిసె.. మనసు మురిసె..!

● కనువిందు చేసిన రంగవల్లులు, కైట్ ఫెస్టివల్ ● కొనసాగుతున్న సంక్రాంతి సంబురాలు



జూబ్లీహిల్స్ క్లబ్‌లో పతంగులు ఎగురవేస్తూ సందడి చేసిన సభ్యులు..







బహుమతులు అందిస్తున్న కార్పొరేటర్ వనం సంగీత



**బంజారాహిల్స్:** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో మహిళలు రంగురంగులతో కనువిందు చేసే ముగ్గులు వేసి విశేషంగా ఆకట్టుకున్నారు. మూడు రోజుల ముందే సంక్రాంతిని కళ్లముందుకు తీసుకువచ్చారు. క్లబ్ కార్యదర్శి కిలారు రాజేశ్వరరావు ముగ్గులతో ఆకట్టుకున్న మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. జూబ్లీహిల్స్ కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**జూబ్లీహిల్స్ క్లబ్‌లో కైట్ ఫెస్టివల్...**

**బంజారాహిల్స్:** జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఆదివారం సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. వేడుకల్లో భాగంగా కైట్ ఫెస్టివల్ నిర్వహించారు. చిన్నా పెద్దా తేడా లేకుండా పతంగులు ఎగురవేస్తూ సరదాగా గడిపారు. మ్యూజిక్‌కు స్టెప్పులు వేస్తూ, డ్యాన్స్‌లు చేస్తూ చిన్నారులు, యువత రంగురంగుల పతంగులను గాలిలోకి ఎగురవేశారు. జేపీసీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కార్యదర్శి కిలారు రాజేశ్వరరావు తదితరులు సభ్యులకు పతంగులు పంపిణీ చేసి వారితో కలిసి ఎగురవేసి కార్యక్రమానికి మరింత ఉత్సాహాన్ని నింపారు. సుమారు నాలుగు గంటలపాటు గాలిపటాల పండుగ కనువిందుగా సాగింది. వయస్సుతో నిమిత్తం లేకుండా క్లబ్ సభ్యులందరూ ఉల్లాసంగా ఉత్సాహంగా విజిల్స్ వేస్తూ పతంగులను ఎగురవేశారు.



**లిటిల్‌స్టార్ హైస్కూల్‌లో...**

**ఫిలింనగర్:** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని నేటితరం విద్యార్థినులకు పండుగ ప్రాశస్త్యాన్ని చెప్పడమే కాకుండా తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు అలవర్చుకునేందుకు వీలుగా జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–10లోని గాయత్రీహిల్స్ లిటిల్ స్టార్ హైస్కూల్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో రంగురంగులతో వేసిన రంగవల్లులు అందరినీ ఆకట్టుకున్నాయి. స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ అస్మతున్నీసా విద్యార్థినులు వేసిన ముగ్గులను చూసి అబ్బురపడ్డారు. ప్రతి పండుగతో మన సంస్కృతీ సంప్రదాయాలను తెలుసుకునేందుకు వీలుగా విద్యార్థినీ విద్యార్థులు అందులో మమేకం కావాలని ఈ సందర్భంగా సూచించారు.

**శ్రీనగర్‌కాలనీలో...**

**శ్రీనగర్‌కాలనీ:** సంక్రాంతి ముగ్గుల పోటీలు ఆదివారం ఎల్లారెడ్డిగూడ హనుమాన్ దేవాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలకు సోమాజీగూడ కార్పొరేటర్ వనం సంగీత పాల్గొని వేడుకల్లో పాల్గొన్నారు. ముగ్గుల పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులు అందజేశారు. నేతలు వనం శ్రీనివాసయాదవ్, మనోజ్‌యాదవ్, గొంటి సాయినాథ్‌యాదవ్, మహేష్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

**రహమత్‌నగర్‌లో...**

అదేవిధంగా రహమత్‌నగర్‌లో స్థానిక కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం క్వారీ మైదానంలో నిర్వహించిన సంక్రాంతి వేడుకలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు సీఎన్‌రెడ్డి బహుమతులు అందించారు.



జేపీసీలో ముగ్గులు వేస్తూ..





ఆకట్టుకున్న ముగ్గులు...

## మహిళలకు సంక్రాంతి ఎంతో ప్రత్యేకం



కార్పొరేటర్ విజయారెడ్డి

ముగ్గులను పరిశీలిస్తున్న విజయారెడ్డి

**వెంకటేశ్వరకాలనీ:** సంక్రాంతి పండుగ మహిళలకు ఎంతో ప్రత్యేకత అని, ముగ్గులు వేయడంలో ఒకరికి మించి మరొకరు పోటీ పడి ముగ్గులు వేస్తారని టీపీసీసీ కార్యదర్శి, పీజేఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు విజయారెడ్డి అన్నారు. ఆదివారం బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని గౌరీ శంకర్‌నగర్ బస్తీలో పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు ఆమె బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విజయారెడ్డి మాట్లాడుతూ ఒక్కో మహిళ నచ్చిన ముగ్గును వేయడానికి ఎంతో కష్టపడి ప్రాక్టీస్ చేస్తారని వేసిన ముగ్గును చూసి మురిసిపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి బహుమతి బి.శ్రావణి, రెండో బహుమతి పూజ, తృతీయ బహుమతి శ్యామలకు అందజేయడంతో పాటు పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భీమ్‌రావు, సతీష్, నజీర్, శ్యాం, అప్పారావు, ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 21, 22 తేదీల్లో సీనియర్ సిటిజన్స్‌కు పోటీలు

**సనత్‌నగర్:** గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17 ఆసరా కమిటీ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్‌కు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి, కార్యదర్శి రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21, 22 తేదీల్లో మోడల్‌కాలనీ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఇండోర్ గేమ్స్ అయిన క్యారమ్స్, చెస్, జనరల్ నాలెడ్జ్ పోటీలు, సుందర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్స్ (లేడీస్ అండ్ జంట్స్), బ్రిస్క్ వాకింగ్ అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. వివరాలకు 89779 14856 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

## అర్హులకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

**బంజారాహిల్స్:** అర్హులకు కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, కొత్త రేషన్‌కార్డుల ప్రక్రియపై జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, కొత్త రేషన్‌కార్డుల జారీ జనవరి 26 నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఈ నేపథ్యంలో అర్హులైన లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు.

## జాతీయ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు బీవీబీపీ స్కూల్ విద్యార్థిని

**బంజారాహిల్స్:** జాతీయ స్థాయిలో జరిగే ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్ సైన్స్ ఎగ్జిబిషన్‌కు జూబ్లీహిల్స్ భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని శ్రీ వైష్ణవి గోవర్ధన్ ఎంపికయ్యారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో జడ్చర్లలో జరిగిన రాష్ట్రస్థాయి మానక్ ఇన్‌స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న శ్రీ వైష్ణవి గోవర్ధన్ బహుమతిని కైవసం చేసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుంచి 290మంది విద్యార్థులు ఈ సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అరుణశ్రీ విద్యార్థిని వైష్ణవిని, గైడ్ టీచర్ వి. దాక్షాయణిని అభినందించారు.

## రహమత్‌నగర్‌లో అగ్ని ప్రమాదం

ఇంట్లోని సామగ్రి దగ్ధం..
రూ. 10 లక్షల ఆస్తినష్టం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న నవీన్ యాదవ్

**రహమత్‌నగర్:** రహమత్‌నగర్‌లో ఆదివారం తెల్లవారుజామున షార్ట్‌సర్క్యూట్ జరిగి ఇంట్లోని సామగ్రి పూర్తిగా దగ్ధమైన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...రహమత్‌నగర్‌లోని న్యూటన్ హైస్కూల్ వెనుక వీధిలో సంతోషి కుమారి నివాసముంటుంది. ఆదివారం తెల్లవారుజామున 4గంటల ప్రాంతంలో ఇంట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో నిద్రిస్తున్న వారంతా లేచి బయటికి పరుగులు తీశారు. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఈ ఘటనలో ఇంట్లోని దాదాపు రూ.10 లక్షల విలువ చేసే సామగ్రి పూర్తిగా కాలిపోయిందని బాధితురాలు వాపోయింది. సమాచారం అందుకున్న కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి, నగర కాంగ్రెస్ నాయకుడు నవీన్‌యాదవ్‌లు అక్కడకు చేరుకుని బాధితురాలిని ఓదార్చారు. ప్రభుత్వ పరంగా సాయం అందించేందుకు తమవంతు కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.

### బీఆర్ఎస్ హయాంలో జరిగిన

## అవినీతిపై విచారణ జరపాలి

మాజీ మంత్రి రవీందర్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి రవీంద్రనాయక్

**పంజగుట్ట:** బీఆర్ఎస్ హయాంలో వివిధ శాఖల్లో జరిగిన వేలకోట్ల అక్రమాలపై విచారణ జరిపించి అక్రమాలకు పాల్పడ్డ కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, మాజీ ఎంపీ, కాంగ్రెస్ నాయకుడు రవీందర్‌నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేవలం ముఖ్యమంత్రిని తిట్టడమే పనిగా పెట్టుకుని ముఖ్యమంత్రికి ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వకుండా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా విఫలమైన కేసీఆర్ ప్రతిపక్ష నాయకుడిగా పేద ప్రజల పక్షాన మాట్లాడకుండా, ఒక కేబినెట్ హోదా అనుభవిస్తూ ఫాంహౌస్‌లో ఉండడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. కేవలం ఫార్ములా ఈ కేసే కాకుండా బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రతీ జిల్లాల్లో కట్టుకున్న బీఆర్ఎస్ కార్యాలయాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఆ భూములను ఎస్సీ, ఎస్టీలకు పంచాలన్నారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా బంజారా సంఘం నాయకుడు కె.రవినాయక్ పాల్గొన్నారు.

## పేదల పెన్నిధి పీజేఆర్

జీవితాంతం పేదల కోసం పరితపించిన నాయకుడు పీజేఆర్ అని పలువురు అన్నారు. మాజీ సీఎల్పీ నేత పీజేఆర్ జయంతి సందర్భంగా ఆదివారం ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపటానికి పీజేఆర్ నిరంతరం శ్రమించారని, ఆయన భౌతికంగా లేకపోయిన పేదల గుండెల్లో మాత్రం ఎప్పటికీ ఉండిపోతారని అన్నారు. – బంజారాహిల్స్



పీజేఆర్ ఆలయ ఆవరణలో కేక్‌కట్ చేస్తున్న నిరంజన్



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్



కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ తదితరులు

### సనాతన ధర్మాన్ని చాటిచెప్పిన

## తత్వవేత్త స్వామి వివేకానంద

అతి చిన్న వయస్సులోనే భారతీయ సనాతన ధర్మం గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప తత్వవేత్త స్వామి వివేకానంద అని పలువురు కొనియాడారు. ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని వివేకానందుడి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సన్మానమార్గంలో నడిచేందుకు ఆయన అనేక సూచనలు చేశారన్నారు. నేటితరం యువత వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.



నివాళులు అర్పిస్తున్న ఆదినారాయణ తదితరులు



నివాళులర్పిస్తున్న డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి



స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నేతలు



స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నర్సింగ్‌రావు



స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం

# ఆఖిరి మోఖా.. అవినీతి పక్కా!

- శివారు పురపాలక సంఘాల్లో యథేచ్ఛగా కట్టడాలు
- ఈ నెల 25న ముగియనున్న పురపాలక సంఘాల పదవీకాలం
- నేతల కనుసన్నల్లో ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు
- సర్కారు ఆదాయానికి భారీగా గండి... పట్టించుకోని యంత్రాంగం



**సాక్షి,సిటీబ్యూరో:** నగర శివారు మున్సిపలిటీల్లో భవన నిర్మాణాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఎక్కడ చూసినా బహుళ అంతస్తుల జోరు కనిపిస్తోంది. చిన్న వీధుల్లో కూడా మూడు, నాలుగు అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి. ఇందులో అనుమతి లేనివి అనేకం. ఈ నెల 25వ తేదీతో పురపాలక సంఘాల పాలకవర్గం పదవీ కాలం ముగియనుంది. ఇదే అదనుగా ఇబ్బడిముబ్బడిగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ, అసైన్డ్, దేవాదాయ, చెరువు శిఖం భూముల్లో కూడా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. పురపాలక సంఘాల్లోని పలువురు ప్రతినిధులు ఇదే ఆఖరి మోఖా అన్నట్లుగా అందినకాడికి దండుకుంటూ అక్రమాలకు తెరలేపారు. పురపాలికల్లో కౌన్సిలర్/ కార్పొరేటర్ నుంచి మొదలుకుని చైర్మన్/మేయరు వరకు పర్సేంటేజీలు కాజేస్తూ 'తిలా పాపం తలా పిడికెడు' అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. పలు పురపాలక సంఘాలకు ఇటీవల పలువురు కొత్త చైర్మన్లు, మేయర్లు వచ్చారు. వీరు కూడా ఆఖరి మోఖా అన్న రీతితో నడుచుకుంటున్నారు.

### ప్రభుత్వ ఆదాయానికి గండి..

పురపాలికల్లో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న అక్రమార్కులపై అధికార యంత్రాంగం ఉదాసీనంగా ఉంది. ఇరిగేషన్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ శాఖలు సంయుక్తంగా అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల పరిశీలన నిర్వహిస్తుండగా, మరోవైపు నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో అక్రమ కట్టడాలు, లేఅవుట్లు వెలుస్తున్నాయి.

### పర్యవేక్షణ డొల్ల...

బోడుప్పల్, పీర్జాదిగూడ, మేడ్చల్, జవహర్‌నగర్, నిజాంపేట్, కొంపెల్లి, దుండిగల్, తూముకుంట, దమ్మాయిగూడ, నాగారం, ఘట్కేసర్, పోచారం, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లో అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లు, ఇండిపెండెంట్ ఇళ్లు విచ్చలవిడిగా దర్శనమిస్తున్నా పట్టించుకున్న వారే కరువయ్యారు. పురపాలక సంఘాలను పర్యవేక్షిస్తున్న కొందరు కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా ప్రజాప్రతినిధులకు తీసిపోని విధంగా అందిన కాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వీటిపై కలెక్టర్‌కు, సంబంధిత అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా ఏమాత్రం పట్టించుకోవటం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.

### అక్రమ కట్టడాలివే..

మేడ్చల్ జిల్లాలోని పురపాలక సంఘాల పరిధిలో ఇటీవల ప్రత్యేక టీమ్‌ల ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో అక్రమ కట్టడాలు, వెంచర్లు బయటపడుతున్నాయి. జిల్లాలో మొత్తంగా 1.43 లక్షల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు రాగా, 13 పురపాలక సంఘాల పరిధిలో 1.39 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల సంఖ్యను పరిశీలిస్తేనే జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ కట్టడాలు ఎన్ని ఉన్నాయన్న విషయం విదితమవుతోంది. అందులో భాగంగానే ఘట్కేసర్ మండలంలో 656 అక్రమ లేఅవుట్లు, దుండిగల్ 1950, కీసర 650, శామీర్‌పేట్ 191, మేడ్చల్ మండలం 196 లేఅవుట్లు ఉన్నాయి. నాగారం మున్సిపాలిటీలో 12 అక్రమ లేఅవుట్లు ఉండగా, దమ్మాయిగూడ ఏడు, మేడ్చల్ 10, నిజాంపేట్ 20, కొంపెల్లి 11, దుండిగల్ 12,, తూముకుంట 15 ,పోచారం 12, ఘట్కేసర్ మున్సిపాలిటీలో ఎనిమిది ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలోని 16 పురపాలక సంఘాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉంది.

## రిపబ్లిక్ డే వేడుకలకు ఆహ్వానం

**శివపురాణం పెయింట్‌పై మన్‌కీ బాత్‌లో ప్రధాని ప్రశంస**



ధనాలకోట వైకుంఠం నకాష్



రాకేష్ నకాష్

**బోడుప్పల్:** బోడుప్పల్ శ్రీసాయిరాంనగర్ కాలనీకి చెందిన ధనాలకోట వైకుంఠం నకాష్, రాకేష్ నకాష్ ఉజ్జయినీలోని మ్యూజియంలో శివపురాణంపై వేసిన పెయింట్స్ కు ఈ నెల 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే వేడుకలకు ఆహ్వానం లభించింది. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ మన్ కీ బాత్‌లో వారి పేర్లను ప్రస్తావించారు. అంతరించిపోతున్న మన సంస్కృతి, సంప్రదాయాలు, కళలకు పునరుజ్జీవం పోయడానికి కృషి చేస్తున్నట్లు వైకుంఠం చెప్పారు. ఇప్పటి వరకు రామాయణం, మహాభారతం, భాగవతంపై పెయింటింగ్స్ వేసినట్లు వివరించారు. రాష్ట్రంలో 8 కులాల పురాణాలపై పెయింటింగ్స్ వేసి ఈ తరానికి అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి తమకు ఆహ్వానం వచ్చిందని, ఎంతో ఆనందంగా ఉందని అన్నారు.

## 49 రైల్వేస్టేషన్లలో మహిళా సంఘాలకు స్టాల్స్

**సెర్ప్ డైరెక్టర్ జాన్సన్**




**సాక్షి, సిటీబ్యూరో:** జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్‌లో భాగంగా రైల్వేస్టేషన్లలో మహిళా సంఘాలు స్టాల్స్ ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నామని సెర్ప్ డైరెక్టర్ జాన్సన్ పేర్కొన్నారు. సికింద్రాబాద్ స్టేషన్‌లో పారిజాత ఇంటి రుచులు స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఒక స్టేషన్ ఒక ఉత్పత్తి'నినాదంతో స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా ఎదిగేందుకు భారతీయ రైల్వే, జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ సంయుక్తంగా పనిచేస్తున్నాయన్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మొత్తం 49 స్టేషన్లలో మహిళా సంఘాల ఉత్పత్తులు అమ్ముకునేందుకు సహకారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ శరవణన్, భువనగిరి డీఆర్‌డీవో నాగిరెడ్డి, ఎస్ఈఆర్‌పీ ప్రాజెక్టు మేనేజర్ నాగరాజారావు, సునీల్ రెడ్డి, రమణారావు పాల్గొన్నారు.

## 18న త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం



ఉత్సవ సంప్రదాయ కీర్తనల్లో శిక్షణ ఇస్తున్న సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్ పోపూరి శ్రీనివాస శర్మ

**నల్లకుంట:** శ్రీ సరస్వతి సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 18న శ్రీ త్యాగరాజ స్వామి 178వ ఆరాధన ఉత్సవం, సరస్వతీ సంగీత విద్యాలయం 69వ వార్షికోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్, వీణాగానరత్న పోపూరి శ్రీనివాస శర్మ చెప్పారు. ఆదివారం నల్లకుంట సిండికేట్ బ్యాంక్ చౌరస్తా సమీపంలో గల సంగీత విద్యాలయంలో ఆయన ఆరాధన ఉత్సవ వివరాలు వెల్లడించారు. బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలోని ధ్యానమందిరంలో సాయంత్రం 5 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. దీనికి ముఖ్యఅతిథులుగా టీవీ దర్శక, నిర్మాత శోభా శంకర్, ప్రముఖ వీణా విద్వాంసురాలు మల్లాది శాంతామూర్తి హాజరు కానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా సంగీత విద్యాలయం అధ్యాపకులు తేజస్విని, యశస్వినిలచే ప్రార్థనా గీతం, చిన్నారులు హారణ్య, భావన, హితాంష్, సూర్యతేజ, దివిజ, శ్రీవిద్య, శ్రీకర్, విదీష, సాయి, చేతన్‌శర్మ, గాయత్రి, శ్రావణి, ప్రణీత, సాయి శ్రేయాస్, తేహిత, అభిగ్నలచే సంప్రదాయ కీర్తనలు ఉంటాయని చెప్పారు. అనంతరం వీణా గానరత్న పోపూరి శ్రీనివాస శర్మ స్వీయ పర్యవేక్షణలో పంచరత్న కీర్తనల గానం ఉంటుందని తెలిపారు. ఇందులో యశస్విని, వాసుకీదేవి, అరుణశ్రీ, విజయ్ కృష్ణ, రఘురాం తదితరులు పంచరత్న కీర్తనలు ఆలపిస్తారని చెప్పారు. సంగీత విద్యాలయం విద్యార్థులచే స్వామివారి అష్టోత్తర పూజ ఉంటుందన్నారు. ఈ వేడుకల్లో సంగీతాభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## నేడు హైడ్రా ప్రజావాణికి సెలవు

**సాక్షి, సిటీబ్యూరో:** ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం హైడ్రా నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఉండదని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండగ సెలవుల కారణంగా దీన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. వచ్చే సోమవారం యథావిధిగా ప్రజావాణి కార్యక్రమాన్ని కొనసాగిస్తామని ప్రకటించారు.

## రంగనాథస్వామి ఆలయంలో రాపత్తు ఉత్సవాలు

**పూజలకు హాజరైన డీజీపీ**



జియాగూడ రంగనాథుడిని దర్శించుకున్న రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్

**జియాగూడ:** జియాగూడ రంగనాథస్వామి దేవస్థానంలో రాపత్తు ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం శ్రీ వెంకటేశ్వర లక్ష్మీ పద్మావతి ఉత్సవ విగ్రహాలకు అభిషేకం, అలంకరణ, అర్చన, హారతి, తీర్థప్రసాద వితరణ జరిగాయి. ఈ పూజలకు రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్, ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ పి.విశ్వప్రసాద్ ఐపీఎస్, సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్, అడిషనల్ డీసీపీ వెంకటేశ్వర్లు, హైదరాబాద్ వాటర్‌వర్క్స్, సివరేజ్ బోర్డు ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్‌లకు ఆలయ ప్రతినిధి శేషాచారి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఎస్‌టీ చారి, బద్రినాథ్, శ్రీనివాస రంగనాథచార్యులు, సందీప్‌లాల్ యాదవ్ పాల్గొన్నారు.

## ఉద్యోగుల రిటైర్మెంట్ కాలాన్ని పొడిగించొద్దు



పీసీసీ అధ్యక్షుడితో ఆళ్ల రామకృష్ణ

**బంజారాహిల్స్:** ఉద్యోగ విరమణ వయస్సు 63 ఏళ్లకు పెంచే ప్రతిపాదనను తెలంగాణ ప్రభుత్వం తక్షణం విరమించుకోవాలని, అది ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డ పేరు తెస్తుందని జాతీయ ఓబీసీ ఇంటెలెక్చువల్ ఫోరం అధ్యక్షులు, విశ్రాంత చీఫ్ ఇంజినీర్ ఆళ్ల రామకృష్ణ తెలంగాణ ప్రభుత్వానికి కోరారు. ఈ మేరకు ఆదివారం ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత మూడు రోజులుగా వివిధ వార్తా చానళ్లలో ఉద్యోగ విరమణ పెంపుపై వార్తలు ప్రసారం అవుతున్నాయని, అయినా ప్రభుత్వం నుంచి ఎటువంటి ఖండన రాలేదన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 61 ఏళ్లకు పెంచి పెద్ద తప్పు చేసిందని, దాని ప్రతిఫలంగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా ఓటమి పాలైందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడానికి రాష్ట్రంలోని లక్షలాది నిరుద్యోగులు ఎంతో కృషి చేశారని, జాబ్ కేలండర్ కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారని ఆయన వివరించారు. ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 63 ఏళ్లకు పెంచి తెలంగాణలో పెద్ద ఎత్తున నిరుద్యోగులు, విద్యార్థులు ఉద్యమాలు చేపట్టే అవకాశాలకు ఆస్కారం ఇవ్వవద్దని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, అద్దంకి దయాకర్ వంటి ప్రముఖ నాయకులను కలిసి అభ్యర్థించారు. ఇప్పటికే ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఎన్నో వ్యయ ప్రయాసలు భరిస్తూ ఎన్నో ఏళ్లుగా పరీక్షలకు ప్రిపేర్ అవుతూ, ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారని ఆళ్ల రామకృష్ణ అన్నారు.

## హెడ్‌మాస్టర్‌పై దాడి హేయం: ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

**విద్యాసంస్థల్లో మతోన్మాదాన్ని అడ్డుకోవాలి**



విద్యాపరిరక్షణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

**సుందరయ్యవిజ్ఞానకేంద్రం:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కంబలి రాములపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మెల్సీ ఎ.నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. హెడ్‌మాస్టర్‌పై దాడిని ఖండిస్తూ ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ మతోన్మాదాన్ని బడిలోకి తేవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. హెడ్‌మాస్టర్ రాములుకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని తెలిపారు. ప్రభుత్వస్కూళ్లలో చదివే పేద విద్యార్థులను చదువుకు దూరం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు.

**ఆత్మహత్య చేసుకోవాలనుకున్నా...**

బాధిత హెడ్‌మాస్టర్ రాములు మాట్లాడుతూ తనపై విశ్వహిందూ పరిషత్‌కు చెందిన కొంతమంది వ్యక్తులు భౌతికంగా దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గుడికిపోయి బొట్టు పెట్టుకోవాలని, ముక్కు నేలకు రాయాలని, తమ విద్యార్థి కాళ్లతోపాటు అందరి కాళ్లు మొక్కాలని హెచ్చరిస్తూ భయభ్రాంతులకు గురిచేశారని పేర్కొన్నారు. దిక్కుతోచని పరిస్థితుల్లో విద్యార్థి కాళ్లు మొక్కాల్సి వచ్చిందన్నారు. ఆ తర్వాత పాఠశాలకు పోలీసులు వచ్చి తన ఫిర్యాదు తీసుకొనిపోయారని తెలిపారు. అయితే కొంతమంది స్కూల్‌లోనే రాయబారాలు నడిపి కేసు వెనక్కు తీసుకునేలా ఒత్తిడి చేశారని అన్నారు. అన్ని ఉపాధ్యాయ సంఘాల సహకారంతో మళ్లీ పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైందని తెలిపారు. అవమానాన్ని జీర్ణించుకోలేక ఒక దశలో ఆత్మహత్య చేసుకోవాలని అనిపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ నిందితులు బెదిరింపు కాల్స్ చేస్తున్నారని తెలిపారు. డీబీఎఫ్ జాతీయ కన్వీనర్ పి.శంకర్ మాట్లాడుతూ నిందితులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ జి.హరగోపాల్, కార్యనిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ, వివిధ సంఘాల నాయకులు ఎం. సోమయ్య, పి.లింగారెడ్డి, ఎంఎస్ కిష్టప్ప, కేఎస్ ప్రదీప్, పి.రామకృష్ణ, సకినాల అనిల్ కుమార్, నన్నబోయిన తిరుపతి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలి

**సాక్షి, సిటీబ్యూరో:** యువత ప్రశ్నించేతత్వాన్ని అలవాటు చేసుకోవాలని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ (వైఏసీ) సలహాదారు, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ కేలండర్ ఆవిష్కరించారు. చట్టాలపై అవగాహన పెంచుకుని, అవినీతిని ప్రశ్నించినప్పుడే ఉత్తమ సమాజం నిర్మితమవుతోందన్నారు. యువతరం చెడు అలవాట్లకు బానిస కాకుండా అవినీతిరహిత సమాజంలో భాగస్వాములు కావాలన్నారు. మీ ప్రాంతంలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి, కోర్ కమిటీ సభ్యులు కోమటి రమేశ్ బాబు, రాకేశ్ పాల్గొన్నారు.



## జాతి నిర్మాణంలో యువతే కీలకం

**హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ**



ట్యాంక్‌బండ్‌పైనున్న వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దత్తాత్రేయ తదితరులు

**కవాడిగూడ:** జాతినిర్మాణంలో యువత పాత్ర ఎంతో శక్తివంతమైందని చెప్పిన స్వామి వివేకానందుడి మాటలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. స్వామి వివేకానంద 163వ జయంతి సందర్భంగా ఆదివారం దేశ వ్యాప్తంగా జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని ట్యాంక్‌బండ్‌పై ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి దత్తాత్రేయ, పలువురు బీజేపీ నేతలు హాజరై పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ యువత దేశభక్తి, ధర్మభక్తి, పెంపొందించుకోవడమే స్వామి వివేకానందకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, పరిమళ్‌కుమార్, కవాడిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్, మాజీ అధ్యక్షుడు ఎంసీ మహేందర్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎ.ప్రభాకర్ గంగపుత్ర, మురారిశెట్టి కేశవరాజు, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

## గోదావరి, కృష్ణా నదుల అనుసంధానం వద్దు

**రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్**



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సారంపల్లి మల్లారెడ్డి

**సుందరయ్య విజ్ఞానకేంద్రం:** గోదావరి, కృష్ణా నదుల అనుసంధానం ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని పలువురు వక్తలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పాలమూరు అధ్యయన వేదిక నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కోదండరాం, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ బ్రిజేష్ కుమార్ ట్రిబునల్ తీర్పు ఇచ్చినా కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు నీటిని పంచలేదని విమర్శించారు. రాష్ట్రం ఏర్పడి 10 ఏళ్లు దాటినా నదుల నీటి పంపకం జరగకపోవడం విచారకరమని అన్నారు. పాలమూరు-డిండి ప్రతిపాదనను వెంటనే రద్దు చేయాలని, తెలంగాణకు కృష్ణానది నీటి వాటాను పంచాలని, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని సగం శ్రీశైలం నుంచి, సగం జూరాల ఎగువ నుంచి చేపట్టి రెండు జిల్లాల నీటి సమస్యను తీర్చాలని కోరారు. అచ్చంపేట లిఫ్టులో రుసుల్ చెరువును రిజర్వాయర్‌గా మార్చి భూముల ముంపును నిరారించాలని, నిర్వాసితులకు భూమి, ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గోదావరి, కృష్ణానదుల స్వాధీన ఉత్తర్వుల రద్దు కోసం రాష్ట్ర ప్రభుత్వం పోరాడాలని కోరారు. కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎ.రాఘవచారి, జంటనగరాల కన్వీనర్ ఎ.రాజేంద్రబాబు, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కె.గోవర్ధన్, విమలక్క, వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, రిటైర్డ్ ఇంజనీర్ రామకృష్ణారెడ్డి, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్ జి.విజయ్, బండారు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు లైన్ల కింద కైట్ ఎగురవెయ్యొద్దు

**టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ**



**సాక్షి, సిటీబ్యూరో:** 'సంక్రాంతి పండగ రోజుల్లో పతంగులు ఎగురవేయడం ఆనవాయితీ. అయితే ముందుజాగ్రత్తలు, భద్రతా చర్యలు తీసుకోవడం కూడా ముఖ్యం. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో గాలిపటాలు ఎగరవేయడం ప్రమాదకరం. ఒక్కోసారి విద్యుత్ అంతరాయాలు కలిగే అవకాశం ఉంటుంది' అని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సిటిజన్లకు పలు సూచనలు చేశారు.

- విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా, బహిరంగ ప్రదేశాలు, మైదానాల్లో మాత్రమే పతంగులు ఎగురవేయండి.
- విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్ల వద్ద ఎగురవేయడం ప్రమాదకరం. ఒకవేళ పతంగులు కానీ, మాంజాలు కానీ విద్యుత్ లైన్లపై, ఇతర విద్యుత్ పరికరాలపై పడితే సరఫరాలో అంతరాయం, ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.
- కాటన్, నైలాన్, లినెన్‌తో చేసిన మాంజాలను మాత్రమే వాడండి. మెటాలిక్ మాంజాలు వాడొద్దు. మెటాలిక్ మాంజాలు విద్యుత్ వాహకాలు కనుక అవి లైన్లపై పడ్డప్పుడు విద్యుత్ షాక్ ఏర్పడే ప్రమాదం ఉంది. పొడి వాతావరణంలో మాత్ర మే పతంగులు ఎగురవేయాలి. తడి వాతావరణంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ.
- పతంగులు కానీ, మాంజాలు కానీ విద్యుత్ లైన్లపై, ఇతర విద్యుత్ పరికరాలపై పడ్డప్పుడు వాటిని వదిలేయండి. ఒకవేళ వాటిని పట్టుకు లాగినప్పుడు విద్యుత్ తీగలు ఒక దానికొకటి రాసుకుని విద్యుత్ ప్రమాదం జరిగే అవకాశం ఉంది.
- బాల్కనీ/ గోడల మీద నుంచి పతంగులు ఎగురవేయరాదు. ఇది ప్రమాదకరం. ప్రమాదాలు జరిగే అవకాశం వుంది.
- పతంగులు ఎగురవేసేటప్పుడు తమ పిల్లలను గమనించగలరు. పిల్లలు తెగిన, కింద పడ్డ విద్యుత్ వైర్లను తాకనివ్వొద్దు.
- ఎలాంటి అత్యవసర పరిస్థితులు లేదా ప్రమాదకర పరిస్థితులు/ఘటనలను 1912కు కాల్ చేసి తమకు సమాచారం ఇవ్వండి లేదా సమీప విద్యుత్ కార్యాలయానికి తెలియజేయండి. అంతేకాకుండా, మొబైల్ యాప్ లేదా వెబ్‌సైట్: www.tgsouthernpower.org ద్వారా కూడా సంస్థకు సమాచారం అందజేయగలరు.

## 'దండోరా'ను అడ్డుకునేందుకు భట్టి కుట్ర: మంద కృష్ణ

**అంబర్‌పేట:** మాదిగ దండోరా కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి ఈ నెల 8న జారీ చేసిన సర్క్యూలర్ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్నారు. తెలంగాణ కళాకారులు రాజకీయ, ప్రజా సంఘాల సభలు, సమావేశాల్లో పాల్గొంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని పేర్కొనడం శోచనీయమని పేర్కొన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక సారథి వెన్నెల గద్దర్ పేరిట, భట్టి విక్రమార్క ప్రాద్బలంతో ఈ సర్క్యూలర్ జారీ అయిందని ఆరోపించారు కళాకారులు గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ సభల్లో పాల్గొన్న విషయాన్ని గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని సర్క్యూలర్‌ను ఉపసంహరించాలని కోరారు. సమావేశంలో గాయకులు దరువు ఎల్లన్న, ఓయూ ఉద్యమ నేత నలిగంటి శరత్ గోవింద్ నరేష్, ఇస్మాయిల్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఆ వ్యాఖ్యలు కార్మికుల హక్కుల్ని హరించేవే: ఐద్వా

**ముషీరాబాద్:** 'కార్మికులు వారానికి 90 గంటలు పనిచేయాలి, భార్యల ముఖాలు ఎంతసేపు చూస్తారు, ఆదివారాలు కూడా ఆఫీసులకు వచ్చి పనిచేయాలి'అని ఎల్ అండ్‌టీ సంస్థ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణియన్ చేసిన వ్యాఖ్యలు కార్మికులనే కాకుండా కుటుంబ సంబంధాలను కూడా అవమానించేవిధంగా ఉన్నాయని ఐద్వా గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.పద్మ, వై.వరలక్ష్మి, సహాయ కార్యదర్శి కె.నాగలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా పని గంటల పరిమితి, పని పరిస్థితుల మెరుగుదల కోసం కార్మికులు పోరాటాలు చేసి 8 గంటల పనివిధానాన్ని, ఆదివారం సెలవు దినాన్ని సాధించుకున్నారని, ప్రపంచవ్యాప్తంగా జరిగిన అనేక సర్వేలలో కూడా కార్మికులకు 8 గంటల పనివిధానం ఉంటేనే ఉత్పాదకత పెరుగుతుందని తేలిందని పేర్కొన్నారు. అయితే రోజుకు 13 గంటల పనివిధానం తేవాలని, తమ లాభాలను ఇంకా ఇబ్బడిముబ్బడిగా పెంచుకోవాలనే తపనతో కార్పొరేట్ కంపెనీల అధిపతులు ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. వీరికి వంత పాడుతున్న బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాల్లో మార్పులు చేసి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో 12 గంటల పని విధానాన్ని అమలు చేస్తోందని ఆరోపించారు.

## వర్గీకరణ ఉద్యమంలో ధర్మం ఉంది

**మంద కృష్ణమాదిగ**



అభివాదం చేస్తున్న ఎంబీసీ, కుల సంఘాల నేతలు, మందకృష్ణ మాదిగ

**పంజగుట్ట:** ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో న్యాయం, ధర్మం ఉందని, అందుకే యావత్ సమాజం తమ వెనక నిలబడిందని, దాన్ని అడ్డుకుంటున్నవారిలో కేవలం ఆర్థిక, రాజకీయ, మీడియా బలం ఉందని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. మహనీయుడు అంబేడ్కర్ సాధించిన రిజర్వేషన్ ఫలాలను అందరూ సమానంగా పంచుకోవాలంటుంటే కొందరేమో అడ్డుకుంటామనడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. జాతీయ ఎంబీసీ, డీఎన్‌టీ సంక్షేమ సంఘం ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. తన 30 ఏళ్ల సుదీర్ఘ వర్గీకరణ ఉద్యమంలో ఎన్నో పార్టీల అధినాయకులు తనకు వివిధ పదవులు ఇస్తామని ప్రకటించారని, కానీ తాను పార్టీలకు మద్దతు పలికానే తప్ప ఏ పార్టీలో చేరలేదని స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణ అంశం పూర్తి కాగానే పేదలు, ఎంబీసీల సమస్యల పరిష్కారానికి జీవితాంతం కృషి చేస్తానని ప్రకటించారు. తన భుజంపై నల్లకండువా ఉంటేనే సమస్యలపై స్వతంత్రంగా పోరాడగలనని అన్నారు. పది డప్పులు కొడితేనే ఊరుమొత్తం వినిపిస్తుందని, అదే ఫిబ్రవరి 7వ తేదీన లక్ష డప్పులు, వెయ్యి గొంతులు ఒకేసారి మోగితే యావత్ ప్రపంచం మారుమోగుతుందని అన్నారు. ఎంబీసీలు కూడా సంఘీభావంగా తరలివచ్చి తమ సంప్రదాయ వాయిద్యాలతో ప్రదర్శన చేయాలన్నారు. సమావేశంలో సంఘం జాతీయ అధ్యక్షుడు సంగెం సూర్యారావు, రాష్ట్ర అధ్యక్షుడు బంగారు నర్సింహ్మా సాగర్, ఆయా సంఘాల నాయకులు పృథ్వీ యాదవ్, డాక్టర్ విజయ్‌భాస్కర్, సత్యం వంశరాజ్, జానయ్య యాదవ్, భూమన్న యాదవ్, సిద్దేశ్వర్, సోగరాబేగం పాల్గొన్నారు.



సంక్రాంతి తెలుగుదనానికి, స్వచ్ఛమైన పల్లె వాతావరణానికీ ప్రతీక. అందమైన రంగవల్లులు.. గొబ్బెమ్మలు.. భోగిమంటలు.. స్వచ్ఛమైన పిండివంటలు.. హరిదాసు పాటలు.. గంగిరెద్దుల విన్యాసాలతో వెల్లివిరిసే ఆనందోత్సాహాలతో సందడిగా జరుపుకుంటాం.. ఇలాంటి అందమైన వేడుకకు పల్లెను మించిన వేదిక మరొకటి ఉండదు. అందుకే నగరవాసులు ప్రతి పండుగకూ పల్లెకు పయనమవుతారు. సంవత్సరం పొడవునా చేసుకొనే రొటీన్ వేడుకలకు ఇది భిన్నం.. అయితే ఇటీవలి కాలంలో.. పల్లెకు వెళ్లలేని వారు ఫామ్‌హౌస్‌లలో సంక్రాంతి సంబరాలకు కుటుంబ సమేతంగా తరలివెళ్తున్నారు. దీంతో నగర శివారు ప్రాంతాల్లోని ఫామ్‌హౌస్‌లు సంక్రాంతి సందడికి వేదికవుతున్నాయి. బంధువులు, స్నేహితులతో కలిసి సంక్రాంతి విడిది కేంద్రాల్లో సరదాగా సేదదీరుతున్నారు. దీంతో నగర శివారులోని సిద్దిపేట్, గండిపేట్, చేవెళ్ల, వికారాబాద్, కడ్తాల్ వంటి ప్రాంతాల్లోని ఫామ్‌హౌస్‌లలో సంక్రాంతి సందడి నెలకొంది..ఆ విశేషాలు..

- సాక్షి, సిటీబ్యూరో

# ఫెస్ట్ @ఫామ్..

- స్వచ్ఛమైన పల్లె వాతావరణంలో..
- శివారులో అచ్చతెలుగు సంక్రాతి సంబరాలు
- పండుగ సందడికి సరికొత్త విడిది కేంద్రాలు
- ఇటీవలి కాలంలో పెరిగిన ఫామ్ హౌస్ కల్చర్
- కొత్త తరహా వేడుకలకు నగరవాసుల ఆసక్తి
- సకల సదుపాయాలతో అద్దెకు ఫామ్‌హౌస్‌లు



సంక్రాంతి అంటే సరదగా సాగే వేడుక.. బంధువులు.. పిండి వంటలు.. ఆటలు.. పాటలు.. ముచ్చట్లు.. ఇలా చెప్పుకుంటూ పోతే అబ్బో చాలానే ఉన్నాయి.. ఓ రకంగా సంక్రాంతి సంబరాలు అంటే అంబరాన్ని తాకేలా ఉంటాయి.. దీంతో ఒత్తి జీవనానికి అలవాటుపడిన నగరవాసులు కనీసం రెండు మూడు రోజులు నగరానికి దూరంగా ఉండాలని భావిస్తున్నారు.. అందుకే 'భోగి రోజు కంటే ముందే ఫామ్‌హౌస్‌కు చేరే విధంగా ప్లాన్ చేసుకున్నాం'.. అని ఉప్పల్‌కు చెందిన సుధాకర్‌రెడ్డి చెబుతున్నారు. తెల్లవారు జామున నిద్రలేచి భోగిమంటలు వేసుకొని, అందమైన ముగ్గుల నడుమ వేడుకలు చేసుకోవడం గొప్ప అనుభూతిని కలిగిస్తుంది. ఈ తరహా వేడుకలు జరుపుకునే వారికోసం నగర శివారులోని ఫామ్ హౌస్‌లు వేదికలుగా మారుతున్నాయి.



### సకల సదుపాయాలు..

రోజుకు కనిష్టంగా రూ.3000 నుంచి గరిష్టంగా రూ.10,000 వరకూ అద్దెకు ఫామ్‌హౌస్‌లు లభిస్తున్నాయి. ఇందులో స్విమ్మింగ్ పూల్స్, క్రీడా ప్రాంగణాలు, కేర్‌టేకర్ వంటి హై సెక్యూరిటీతో సకల సదుపాయాలూ కల్పిస్తున్నారు. దీంతో ఇటీవల పల్లె వాతావరణాన్ని ఇష్టపడే వారు ఈ ఫామ్ హౌస్‌ల కేంద్రంగా వేడకలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వీటికి డిమాండ్ పెరిగి యజమానులు అద్దెలు పెంచడం గమనార్హం.



### పతంగుల పండుగ..

సంక్రాంతి పండుగ రైతులకు ఎంత ముఖ్యమైనదో.. పిల్లలకూ అంతే ప్రధానమైనది. కాంక్రీట్ అరణ్యంలా మారిన నగరంలో పతంగులు ఎగరేయడం ఓ సవాల్. దీంతో విశాలమైన మైదానాలు, భవనాలపై నుంచి పతంగులు ఎగరేస్తారు. ఇది పూర్తి స్థాయి ఆనందాన్ని కలిగించదు.. అందుకే ఫామ్ హౌస్‌లలో పతంగుల పండుగకు ప్రత్యేక గుర్తింపు ఉంది. విశాలమైన పొలాలు, పచ్చిక బయళ్లలో పిల్లలు గంటలతరబడి పతంగులతో కాలం గడుపుతారు.. 'పిల్లలకు ప్రకృతి, వ్యవసాయం, ఆహార ఉత్పత్తి గురించి తెలియజెప్పాలి. అందుకే ఫామ్ హౌస్‌లను ఎంపిక చేసుకున్నాం' అని ఈసీఐఎల్‌కు చెందిన చంద్రశేఖర్ చెబుతున్నారు.

### 'రియల్' సంస్థల ప్రత్యేక ఏర్పాట్లు..

నగవాసుల ఆసక్తి, అభిరుచిని గుర్తించిన 'రియల్' సంస్థలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి. వెంచర్‌లో కొంత స్థలాన్ని పండుగ వాతావరణం ఉట్టిపడేవిధంగా డిజైన్ చేసి అద్దెకు ఇస్తున్నారు. ఇటు వెంచర్‌లకు ప్రచారం.. అటు ఆదాయం రెండూ సమకూరుతున్నాయి. తద్వారా గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాలు, అపార్ట్‌మెంట్‌లలో ఉండే నగరవాసులు ఫామ్‌హౌస్ సంస్కృతికి ఆకర్షితులవుతున్నారు.



## సాంస్కృతిక సోయగం.. శిల్పారామం..

### పల్లె వాతావరణంలో కళాకారుల సందడి

గచ్చిబౌలి: పల్లె వాతావరణమైన శిల్పారామంలో హరినామస్మరణ, గంగి రెద్దుల విన్యాసాలు, నృత్యకారుల గవ్వల సవ్వడి సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచాయి. వివిధ ప్రాంతాలకు చెందిన జానపద కళాకారులతో సంక్రాంతి శోభ సంతరించుకుంది.

#### జానపద కళాకారులు..

రాజమండ్రికి చెందిన విభూతి బ్రదర్స్ బృందం హరిదాసులు, బుడబుక్కలు, జంగమ దేవర, సోది చేప్పే వేషధారణలతో ఆకట్టుకున్నారు. దాదాపు పది మంది కళాకారులు వివిధ అలంకరణలో సందర్శకులను ఆకట్టుకున్నారు. అంకిరెడ్డి పాలెం, వలిగొండకు చెందిన కళాకారులు గంగిరెద్దుల విన్యాలతో అబ్బురపరిచారు. సాయంత్రం ఆంఫిథియేటర్‌లో కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. మంగళవారం సురభి కారులు 'మాయ బజార్' నాటకాన్ని ప్రదర్శిస్తారు. శేరిలింగంపల్లి సురభి కాలనీకి చెందిన దయానంద్ బృంధం, మరికొందరు కళాకారులు కూచిపూడి, భరత నాట్యాన్ని ప్రదర్శిస్తారు.



తెలుగు ప్రజల జీవన శైలిలో ప్రత్యేక స్థానం పొందిన పండుగ సంక్రాంతి. ఇది ప్రకృతితో, పంటలతో, కుటుంబ బంధాలతో ముడిపడి ఉంది. సంస్కృతి, సంప్రదాయాల ప్రతీక. అలాంటి పండుగను ఒక వేడుకలా ప్రతి యేటా హైదరాబాద్ నగర శివారులోని ఓ ఫామ్‌హౌస్‌లో జరపడం ఆనవాయితీ. దాదాపు మూడేళ్ల నుంచి ఈ సంక్రాంతి వేడుకలను నాగరత్నం నాయుడు ఇక్కడ జరుపుతున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో

# తెలుగు ప్రజల జీవనశైలి..



- సంస్కృతి, సంప్రదాయాలను గుర్తు చేస్తూ
- వ్యవసాయంలో నలుగురికీ మెళకువలు నేర్పుతూ
- మూడేళ్లుగా సంక్రాంతి సంబరాలు జరుపుతూ
- ఫామ్ హౌస్ నిర్వాహకులు నాగరత్నం నాయుడు కృషి

### సంప్రదాయాలు మర్చిపోకుండా..

మూడేళ్ల నుంచి మా ఫామ్ హౌస్‌లో సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తున్నాను. అందుకే ఫామ్‌లో అన్ని రకాల పంటలూ పండిస్తాం. దీంతో పాటు యేటా నిర్వహించే సంక్రాంతి వేడుకలకు సాధారణ ఎంట్రీ ఫీజునే వసూలు చేస్తున్నాం. పొద్దున టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తాం.. కాబట్టి.. ఆ ఖర్చులను పార్టిసిపెంట్స్ భరిస్తుంటారు. నేను కేవలం బియ్యం , కూరగాయలు అందిస్తుంటాను. మిగతా ఖర్చంతా ఔత్సాహికులైన యువకులు పెట్టుకుంటారు. ముగ్గుల పోటీలు, ఎడ్లబండ్ల పోటీలు, టగ్ ఆఫ్ వార్ లాంటి పోటీలు నిర్వహించి మన సంస్కృతి పట్ల ఇప్పటి యువతకు అవగాహన కల్పించడమే నా సంకల్పం. ఆ ప్రయత్నంలో నూటికి నూరు శాతం ఫలితాన్ని పొందుతున్నా.. అందరికీ సంక్రాంతి ఒక ఎమోషన్ అవ్వాలనేదే నా ఆకాంక్ష.

- నాగరత్నం నాయుడు, ప్రోగ్రెసివ్ ఆర్గానిక్ ఫార్మర్

### ప్రకృతికి హానిచేయొద్దు..

జననీ జన్మభూమిశ్చ.. స్వర్గాదపి గరీయసి.. అన్నారు. అందుకే వందల మైళ్ల ప్రయాణం చేసి సొంత ఊర్లకు వెళ్లి అక్కడి సంస్కృతిని పాడుచేయొద్దు. మన ఇంటిని కాపాడుకున్నట్లే.. మన సంస్కృతిని, వ్యవసాయాన్ని, చేతి వృత్తులను, పాడి పంటలను కాపాడుకోవాలి. కుల మతాలకు అతీతంగా అందరూ కలిసి సంబరాన్ని చేసుకోవాలి. ఈ క్రమంలో ప్రకృతికి హానిచేయొద్దు. ఇటీవల కాలంలో జూదాలపై ఆసక్తి పెరుగుతోంది. వాటితో జీవితానుల పాడుచేసుకోవద్దు. ప్రకృతిని మనం కాపాడితే.. ఆ ప్రకృతే మనల్ని పది కాలాల పాటు జీవించేలా చేస్తుంది.

- గొట్టిపాటి సత్యవాణి

### ఏడాది కష్టాన్ని దూరం చేసే వేడుక..

మాది మణికొండలోని కళాకృతి డాన్స్ ఇన్‌స్టిట్యూట్. మా పిల్లలు డీ షో వంటి పెద్ద షోస్‌లో పాల్గొన్నారు. నేను డాన్స్ కోరియో గ్రాఫర్‌ని. బంగారి బాలరాజు, ఉత్తర, అసలేం జరిగిందంటే వంటి చిత్రాల్లో, రాములమ్మ సీరియల్లో హీరోయిన్‌గా నటించాను. తమిళ్ చిత్రాల్లోనూ నటించా. మనది వ్యవసాయ కుటుంబం. ఏడాది పాటు సాగులో పడిన కష్టానికి ప్రతిఫలం వచ్చిన సందర్భంగా ఈ పండుగ చేసుకుంటాం.. మన సంస్కృతిని మర్చిపోకూడదు. అందుకే ఇలాంటి వేడుకల్లో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉంది.

- కరొన్య కాథరిన్, సినిమా నటి





### ఈ ఫామ్‌తో మంచి అనుబంధం ఉంది..

నేను రిటైర్డ్ పోలీస్ అధికారిని. మాకు పెద్దపల్లిలో ఫార్మ్ ఉంది. ముప్పై ఎకరాల్లో హార్టీ కల్చర్ చేస్తున్నాను. ఈ ఫామ్‌ని మూడు నాలుగు సార్లు విజిట్ చేశాను. ఇక్కడ చాలా మందికి ట్రైనింగ్ ఇచ్చారు. ఆంధ్ర, తెలంగాణ నుంచి ఇక్కడకి చాలా మంది రైతులు వస్తుంటారు. ఈ ఫార్మ్ దాదాపు 25 ఏళ్ల నుంచి నడుపుతున్నారు. ఈ రోజు సంక్రాంతి సంబరాల్లో మేము భాగా ఎంజాయ్ చేశాం. ఇక్కడికి నేనొక్కడినే వచ్చాను. నాకు ఈ ఫామ్‌తో మంచి అనుబంధం ఉంది.

- చిట్టిబాబు, రిటైర్డ్ పోలీసు అధికారి

# ప్రకృతి సిద్ధమైన ఆహారంతో మేలు..

### కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

మొయినాబాద్‌రూరల్ : రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో స్వర్ణ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడిపారు. సంబరాలకు వచ్చిన వారిని ఆత్మీయ పలకరించి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మన సంకల్పం మంచిదైతే, సమాజం మనతో కలిసి నడుస్తుందని, యువకుడిగా ఉన్నప్పటి నుంచి తాను నమ్మిన సిద్ధాంతం ఇదేనని చెప్పారు. ప్రతి ఒక్కరూ తెలుగు భాష ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. ఆహారం విషయంలో పాశ్చాత్య పోకడలను విడనాడాలని, ప్రకృతి సిద్ధమైన మన ఆహారంపై దృష్టిసారించి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని హితవుపలికారు. ఈ సందర్భంగా స్వామి వివేకానందుడికి ప్రత్యేక నివాళులర్పించారు. వేడుకల్లో సినీ నటుడు బ్రహ్మానందం, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటెల రాజేందర్ పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.





## ‘పీజీ వన్‌టైం’ పరీక్షల షెడ్యూలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీజీ కోర్సుల వన్‌టైం చాన్స్ బ్యాక్‌లాగ్ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఓయూ క్యాంపస్‌తో పాటు ఇతర కాలేజీల్లో 2000 నుంచి 2019 విద్యాసంవత్సరాల వరకు చదివి ఫెయిలైన విద్యార్థులు పరీక్షలు రాసుకునేందుకు వన్‌టైం చాన్స్ ఇచ్చిన విషయం విదితమే. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, బీసీజే, ఎంసీజే, లైబ్రరీ సైన్స్ తదితర పీజీ కోర్సుల 2, 4వ సెమిస్టర్ పరీక్షలను ఫిబ్రవరి 5 నుంచి ప్రారంభించనున్నట్లు ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొ.శశికాంత్ పేర్కొన్నారు. పూర్తి వివరాలను ఉస్మానియా.ఏసీ.ఇన్ వెబ్‌సైట్లో చూడవచ్చు.

## పండిత పరిషత్ అధ్యక్షుడిగా ఎండి అబ్దుల్లా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ ఆదివారం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకుంది. అధ్యక్షుడిగా మహ్మద్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శిగా గుళ్ళపల్లి తిరుమల క్రాంతి కృష్ణ, కోశాధికారిగా నాగుల భిక్షపతి, సహాధ్యక్షులుగా వీఎస్ఎస్‌సీఎస్ శర్మ, ఘనపురం దేవేందర్, లక్ష్మీనారాయణ, మధుసూదన్ రెడ్డి, రాజేందర్, లక్ష్మయ్య ఎన్నికయ్యారు.


ఎండి అబ్దుల్లా



## అల్లుళ్లకు 108 రుచులతో విందు

సంగారెడ్డి: సంక్రాంతి సందర్భంగా కొత్త అల్లుళ్లకు 108 రకాల వంటలతో విందును ఏర్పాటు చేశారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా శాంతినగర్ మాజీ సర్పంచ్ మంగ రాములు నివాసంలో ఈ విందును ఘనంగా నిర్వహించారు. ఇటీవల మంగరాములు రెండవ కుమార్తె డాక్టర్ నిషాకు డాక్టర్ శ్రీకాంత్‌తో వివాహం జరిపించారు. అలాగే, సినీ నటుడు ఏడిద రాజా కుమార్తె మేఘన వివాహాన్ని లక్ష్మణ్ యాదవ్‌తో జరిపారు. ఈ రెండు కొత్త జంటలను విందుకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా 108 వంటకాలను తయారు చేసి వారికి వడ్డించారు.

## హరిలో రంగహరీ.. బండిపై సవారీ!

సంక్రాంతి పండుగ సందర్భంగా హరిలో రంగహరీ అంటూ హరిదాసులు ఇంటింటికీ రావడం ఆనవాయితీ. రైతులు, ఇతరత్రా ప్రజలు ఇచ్చే ధాన్యం, బియ్యం, నగదు తీసుకుని కీర్తనలు ఆలపిస్తూ ముందుకు సాగుతారు. అయితే, నానాటికీ వీరికి ఆదరణ




ఎర్రుపాలెంలో ద్విచక్రవాహనంపై ఇంటింటికి తిరుగుతున్న హరిదాసు

తగ్గుతుండటంతో హరిదాసుల సంఖ్య తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో మిగిలిన కొందరు ఒకేరోజు ఎక్కువ ప్రాంతం చుట్టేయాలనే లక్ష్యంతో ద్విచక్ర వాహనాలు సమకూర్చుకున్నారు. వాహనానికే పాత్ర అమర్చుకోవడమే కాక మైక్ కూడా బిగించుకుని తిరుగుతున్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెంలో ఇలా ఆదివారం కనిపించిన హరిదాసు చిత్రమే ఇది!

–ఎర్రుపాలెం



# గ్రీన్ హైడ్రోజన్‌కు రెడ్ కార్పెట్!




**మహిళా పారిశ్రామికవేత్తలకు అదనంగా 10 శాతం..**

- కనీసం 500 మెగావాట్ల ప్లాంట్ పెడితేనే ఈ రాయితీలు
- తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025లో ప్రకటించిన ప్రభుత్వం
- గ్రీన్ హైడ్రోజన్, డెరివేటివ్ పరిశ్రమలకు భారీ ప్రోత్సాహకాలు
- ఎలక్ట్రోలైజర్ ప్లాంట్, ముడి పరికరాలపై 30% పెట్టుబడి రాయితీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్, అనుబంధ ఉత్పత్తుల (డెరివేటివ్స్) పరిశ్రమలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ నజరానాలు ప్రకటించింది. ఎలక్ట్రోలైజర్ ఆధారిత గ్రీన్ హైడ్రోజన్, అనుబంధ ఉత్పత్తుల ప్లాంట్లను స్థాపించే డెవలపర్లకు ఎలక్ట్రోలైజర్ స్టాక్ ప్లాంట్, పరికరాలపై 30 శాతం పెట్టుబడి రాయితీని అందించనుంది. ప్రతి మెగావాట్‌కి/1,400 టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యానికి రూ.కోటి చొప్పున రూ.30 కోట్ల గరిష్ట పరిమితికి లోబడి ఒక్కో ప్లాంట్‌కు పెట్టుబడి రాయితీ ఇస్తామని ‘తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ–2025’ ప్రభుత్వం హామీ ఇచ్చింది.

### ‘ఇంటిగ్రేటెడ్’ ప్రాజెక్టులకూ సబ్సిడీలు..

ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా, గ్రీన్ మిథనాల్ (బయోజెనిక్ కార్బన్‌తో సహా) పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం పాలసీలో ప్రాధాన్యతనిచ్చింది. ప్లాంట్, పరికరాల (ఎలక్ట్రోలైజర్‌తో సహా) వ్యయంలో 30 శాతాన్ని పెట్టుబడి రాయితీగా అందించనుంది. గ్రీన్ అమోనియా ప్లాంట్ల ప్రతి కేటీపీఏ సామర్థ్యానికి రూ.1.85 కోట్లు, గ్రీన్ మిథనాల్ ప్లాంట్ల ప్రతి కేటీపీఏ సామర్థ్యానికి రూ.2.25 కోట్ల గరిష్ట పరిమితికి లోబడి సబ్సిడీలు ఇస్తుంది. గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లలో వినియోగించే ఎలక్ట్రోలైజర్ పరికరాలు, హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ తయారీ పరిశ్రమల స్థాపనకు పెట్టే పెట్టుబడులపై 25 శాతాన్ని రాయితీగా ప్రభుత్వం అందించనుంది. కనీసం 500 మెగావాట్ల వార్షిక ఎలక్ట్రోలైజర్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన తొలి 5 ప్లాంట్లకు మాత్రమే ఇది వర్తిస్తుందని ప్రభుత్వం తెలిపింది.

గ్రీన్ హైడ్రోజన్/డెరివేటివ్స్, ఎలక్ట్రోలైజర్, హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ పరిశ్రమలకు వర్తించే కొన్ని రాయితీలు, ప్రోత్సాహకాలు..

- రాష్ట్రంలో జరిపే గ్రీన్ హైడ్రోజన్, అనుబంధ ఉత్పత్తుల అమ్మకాలపై 100 శాతం ఎస్‌జీఎస్టీని 5 ఏళ్ల పాటు రీయింబర్స్ చేస్తారు.
- ఎలక్ట్రోలైజర్, హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ పరిశ్రమల ఉత్పత్తుల అమ్మకాలపై ఏడేళ్ల పాటు 100 శాతం ఎస్‌జీఎస్టీ తిరిగి చెల్లిస్తారు.
- గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమలకు 10 ఏళ్ల పాటు, ఎలక్ట్రోలైజర్ పరిశ్రమలకు 5 ఏళ్ల పాటు 100 శాతం విద్యుత్ పన్ను మాఫీ.
- గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమలు రాష్ట్ర డిస్కంల నుంచి కొనుగోలు చేసే ప్రతి యూనిట్ విద్యుత్‌కు రూ.3 చొప్పున 20 ఏళ్ల పాటు విద్యుత్ బిల్లులను తిరిగి చెల్లిస్తారు. ఎలక్ట్రోలైజర్ పరిశ్రమలకు ఐదేళ్ల పాటు యూనిట్ విద్యుత్‌పై రూపాయి చొప్పున ఈ రాయితీ వర్తిస్తుంది.
- గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమల ఏర్పాటుకు కొనుగోలు చేసే స్థలాలకు 100 శాతం స్టాంప్ డ్యూటీని ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది.

### ఎలక్ట్రోలైజర్, హైడ్రోజన్ ఫ్యూయల్ పరిశ్రమలకు ప్రత్యేక రాయితీలు

- రూ.2 లక్షల పరిమితికి లోబడి 50 శాతం వరకు క్వాలిటీ సర్టిఫికేషన్ చార్జీలను ప్రభుత్వం తిరిగి చెల్లించనుంది.
- పేటెంట్ ఫైలింగ్ చార్జీల్లో 50 శాతాన్ని రూ.2 లక్షల పరిమితికి లోబడి చెల్లిస్తారు.
- మహిళలు ఏర్పాటుచేసే ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు రూ.10 లక్షల పరిమితికి లోబడి అదనంగా 10 శాతం వరకు పెట్టుబడి రాయితీ ఇస్తారు.
- గ్రీన్ హైడ్రోజన్ రీఫ్యూయలింగ్ స్టేషన్ల ఏర్పాటును ప్రోత్సహించడానికి 30 శాతం పెట్టుబడి రాయితీలను ప్రభుత్వం ఇవ్వనుంది. ఇది తొలి 10 యూనిట్లకు మాత్రమే.

### గ్రీన్ హైడ్రోజన్ అంటే ?

గ్రీన్ హైడ్రోజన్ స్వచ్ఛమైన ఇంధన వనరు. సౌర విద్యుత్‌ను ఉపయోగించి నీటిని హైడ్రోజన్, ఆక్సిజన్‌గా విడగొట్టుతారు. కాలుష్య రహిత సౌర, ఇతర పునరుత్పాదక విద్యుత్‌ను ఉపయోగించి ఇలా తయారు చేసిన హైడ్రోజన్‌ను గ్రీన్ హైడ్రోజన్ అంటారు. వాహనాలతో పాటు ఎరువులు, ఉక్కు, సిమెంట్ వంటి భారీ పరిశ్రమల్లో వినియోగిస్తున్న సాంప్రదాయ ఇంధనాలకు బదులుగా గ్రీన్ హైడ్రోజన్‌ను వినియోగిస్తే ‘నెట్ జీరో’ కర్బన ఉద్గారాల లక్ష్యాన్ని అందుకోవచ్చని ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. సౌర, పవన విద్యుత్‌తో గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేసుకుని అవసరమైనప్పుడు ఇంధనంగా వాడుకోవచ్చు.

# భూభారతిలో నమోదైన భూములకే భరోసా

- రైతులకు ఏటా ఎకరాకు రూ.12 వేల పెట్టుబడి సాయం
- 20 రోజులు ‘ఉపాధి’ పనులు చేసిన వ్యవసాయ కూలీ కుటుంబాలకు రూ.12 వేలు
- రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మార్గదర్శకాలు విడుదల

సాక్షి, హైదరాబాద్: భూభారతి (ధరణి) పోర్టల్‌లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమి విస్తీర్ణం ఆధారంగానే పట్టా భూమి గల రైతులకు ‘రైతు భరోసా’ కింద పెట్టుబడి సాయం అందనుంది. వ్యవసాయ యోగ్యం కాని భూములను రైతు భరోసా నుంచి తొలగిస్తారు. అటవీ భూముల్లో పోడు వ్యవసాయం చేసే ‘ఆర్ఓఎఫ్ఆర్’ పట్టాదారులకు సైతం రైతు భరోసా సాయాన్ని అందించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలో ఈనెల 26 నుంచి అమల్లోకి రానున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించిన విధి విధానాలపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. రైతులకు ఏటా ఎకరాకు రూ.12 వేల చొప్పున సాయం అందించే రైతు భరోసా పథకం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అమలు కానుండగా, వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఏటా రూ.12 వేలు సాయంగా అందించే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అమలు కానుంది. ఈ మేరకు రెండు వేర్వేరు జీవోలను ప్రభుత్వం విడుదల చేసింది.

**డీబీటీ విధానంలో జమ**

ఈ నెల 26వ తేదీ నుంచి మొదలుపెట్టి వ్యవసాయ యోగ్యమైన భూమికి ఎకరాకు సంవత్సరానికి రూ.12 వేల చొప్పున జమ చేయనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. రాష్ట్ర వ్యవసాయ సంచాలకుల నేతృత్వంలో అమలయ్యే ఈ పథకానికి సాయాన్ని ఆర్‌బీఐ నిర్వహించే ‘డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ)’ విధానంలో నేరుగా రైతుల ఖాతాల్లో జమచేస్తారు. నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) ఈ పథకానికి ఐటీ భాగస్వామిగా బాధ్యతలు నిర్వహించనుంది. జిల్లా కలెక్టర్లు తమ జిల్లాకు సంబంధించిన పథకం అమలు, ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించి బాధ్యత తీసుకొంటారు. పథకానికి సంబంధించిన లోటుపాట్లపై వ్యవసాయ సంచాలకులు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటారు. వ్య వసాయ ఉత్పాదకతను పెంచడం, రైతులకు ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించడంతో పాటు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అచరించేలా చూడటమే రైతుభరోసా ఉద్దేశమని ప్రభుత్వం పేర్కొంది.

### 10 లక్షల కుటుంబాలకు ఆత్మీయ భరోసా!

‘ఇందిరమ్మ ఆత్మీయ భరోసా’ పథకం కింద 10 లక్షల వ్యవసాయ కూలీ కుటుంబాలు లబ్ధి పొందే అవకాశం ఉంది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం గణాంకాల ప్రకారం రాష్ట్రంలో మొత్తం 55 లక్షల జాబ్ కార్డులు ఉండగా, 29 లక్షల కుటుంబాలకు ఎలాంటి భూమి లేదు. ఇందులో కనీసం 10 రోజులు పనిచేసిన కుటుంబాలు 11 లక్షలు ఉండగా, కనీసం ఒకరోజు పని చేసిన కుటుంబాలు 15 లక్షలు ఉన్నాయి. అయితే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 20 రోజుల పనిని ప్రామాణికంగా తీసుకుంటే 10 లక్షల కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద లబ్ధి చేకూరే చాన్స్ ఉంది. ఈ లెక్కన ప్రభుత్వం సంవత్సరానికి రూ.1,200 కోట్లు వెచ్చించనుంది.

### వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ భరోసా

గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న భూమిలేని వ్యవసాయ కూలీలకు భరోసా కల్పించేందుకే ‘ఇందిరమ్మ ఆత్మీయ భరోసా’ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ‘మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం’లో నమోదు చేయబడి, 2023–24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు పని చేసిన భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలు ఈ పథకానికి అర్హులు. ఒక్కో కుటుంబానికి ప్రతి విడతకు రూ.6 వేల చొప్పున సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయాన్ని డీబీటీ పద్ధతిలో కూలీ కుటుంబ యజమాని ఖాతాకు జమ చేస్తారు. రాష్ట్ర స్థాయిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ (కమిషనర్) నోడల్ విభాగంగా, జిల్లాల్లో కలెక్టర్ పర్యవేక్షణలో, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు.

## ఎన్నికల్లో లబ్ధి కోసమే జమిలి ఎన్నికల కుట్ర

**సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు**





మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తమ్మినేని, రాఘవులు, చుక్క రాములు

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల్లో లబ్ధి కోసమే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ‘ఒకే దేశం– ఒకే ఎన్నికలు’ పేరుతో కుట్రకు తెరలేపిందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు విమర్శించారు. ఆ పార్టీ రాష్ట్ర నాలుగో మహాసభల నేపథ్యంలో ఆదివారం హైద రాబాద్‌లోని ఎంబీ.భవన్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములుతో కలిసి మీడియా సమావేశంలో రాఘవులు మాట్లాడారు. దేశంలోని లౌకిక పార్టీ లన్నీ ఒక్కతాటిపైకి వచ్చి పార్లమెంట్‌లో వన్‌నేషన్ – వన్ ఎలక్షన్ బిల్లు ఆమోదం పొందకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ బిల్లుకు ఆమోద ముద్ర పడితే దేశంలోని ప్రాంతీయ పార్టీల ఉనికికే ప్రమాదకరమని హెచ్చరించారు.బీఆర్ఎస్ ఈ బిల్లుపై తన వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటుందని, గత సర్కార్ బాటలోనే కాంగ్రెస్ పయనిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. ఫార్మాసిటీ, ఫోర్త్ సిటీ, హైడ్రా ద్వారా ప్రభుత్వం ప్రజలకు దూరమవు తుందని విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా వ్యాఖ్యానించారు.

# కూసుమంచిలో ‘ఇందిరమ్మ’ నమూనా ఇల్లు

- రాష్ట్రంలోనే మొదటి మోడల్ హౌస్ రెడీ
- నేడు ప్రారంభించనున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


కూసుమంచిలో ఇందిరమ్మ నమూనా గృహం


ఇంటి లోపలి భాగం

కూసుమంచి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం మొదటి మోడల్ హౌస్‌ను సిద్ధం చేసింది. ప్రభుత్వం త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టనుండగా లబ్ధిదారులకు రూ.5 లక్షలు చెల్లిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. లబ్ధిదారులకు అవగాహన కల్పించేందుకు ప్రతీ మండల కేంద్రంలో ఒక నమూనా ఇంటిని నిర్మించాలని అధికా రులు నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతిని ధ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గతనెల 13న నమూ నా ఇంటి నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేయగా కేవలం 30 రోజుల్లో శనివారం సాయంత్రానికి పూర్తిచేశా రు. ఈ ఇంటిని సోమవా రం మంత్రి పొంగులేటి ప్రారంభించనున్నారు. దీంతో రాష్ట్రంలోనే తొలి నమూ నా ఇల్లు కూసుమంచిలో అందుబాటులోకి రానుంది. కాగా, ఇదే నమూనాలో ఇంటిని నిర్మించుకోవాలనే నిబంధన ఏదీ లేకపోయినా.. రూ.5 లక్షల వ్యయంతో నిర్మాణం పూర్తిచేయొచ్చని లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తారు.

### ఆకర్షణీయంగా నమూనా ఇల్లు..

కూసుమంచిలో 400 చదరపు అడుగుల్లో హాల్, కిచెన్, అటాచ్డ్ బాత్‌రూంతో బెడ్ రూంను నిర్మించారు. ఇంటి లోప లి గదులు, ముందు వరండాలో టైల్స్ వేశారు. అలాగే, డా బా మెట్ల కింద టాయిలెట్‌ను నిర్మించారు. ఇంట్లో విద్యుత్ సౌకర్యాన్ని కల్పించి ఫ్యాన్లు సైతం ఏర్పాటు చేశారు. ఇంటికి రంగులు, ఇతరత్రా వసతులను రూ.5 లక్షలతోనే పూర్తిచేసినట్లు కాంట్రాక్టర్ కంచర్ల జీవన్‌రెడ్డి తెలిపారు.

మా ఆయన ఉన్నప్పుడు ముగ్గుల పోటీకి తీసుకుని వెళ్లేవారు. ఒకసారి గవర్నర్ చేతుల మీదగా బహుమతి కూడా అందుకున్నాను. పండగ రోజున మంచి మంచి ముగ్గులు వేస్తుంటాను. నా ముగ్గులన్నీ డిఫరెంట్‌గా ఉంటాయి. దసరా, సంక్రాంతి అంటే ముగ్గుల పోటీలో నేను పాల్గొనాల్సిందే. ఆయన అలా తీసుకువెళ్లేవారు.
– గీతాభాస్కర్


గీతాభాస్కర్ వేసిన ముగ్గు

## గీతాభాస్కర్ సమర్పించు
# సంక్రాంతి సకినాలు

**గీతాభాస్కర్ సినిమాలలో నటిస్తే నటన ఎక్కడా కనిపించదు. పూర్తిగా సహజత్వమే. ఆమె ఏ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లోనూ శిక్షణ తీసుకోలేదు. 'దెస్టినీస్ చైల్డ్' అనే పుస్తకం రాస్తే.... 'పుస్తకం అంటే ఇలా ఉండాలి నాయనా' అనిపిస్తుంది. ఆమె పెద్ద పుస్తకాలు రాసిన పెద్ద రచయిత్రి కాదు. నటన అయినా రచన అయినా వంట అయినా... ఏదైనా ఇట్టే నేర్చుకోగల సామర్థ్యం గీతమ్మ సొంతం. గీత పుట్టి పెరిగింది చెన్నైలో. అయినప్పటికీ... ఆమె సకినాలు చేస్తే తెలంగాణ పల్లెకి చెందిన తల్లి చేసినంత రుచిగా ఉంటాయి. పెళ్లయిన తరువాత గీత... దాస్యం గీతాభాస్కర్ అయింది. అత్తగారిది పక్కా తెలంగాణ. తెలంగాణ అంటే ది గ్రేట్ సకినాలు. ఇక నేర్చుకోకుండా ఉంటారా! సకినాలు ఎలా చెయ్యాలి... నుంచి ఫ్యామిలి ముచ్చట్ల వరకు 'సాక్షి'తో పంచుకున్నారు గీతాభాస్కర్. ఆమె మాటల్లోనే..**

**గీతాభాస్కర్:** అరిసెల పిండిలానే సకినాల పిండి కూడా తయారు చేసుకోవాలి. మామూలుగా వరి పిండి అయితే గట్టిగా అయిపోతుంది. పైగా అంతకుముందు వేరే గోధుమ పిండిలాంటివి పట్టి ఉంటే... అదే గిర్నీలో ఈ పిండి పడితే సరిగ్గా ఉండదు. అదే తడి పిండి అనుకోండి వేరే పిండి ఏదీ పట్టరు... బియ్యం పిండి మాత్రమే పడతారు. అయితే అరిసెల పిండికి రోజంతా బియ్యం నానబెట్టాలి. కానీ సకినాలకి నాలుగు గంటలు నానబెడితే సరిపోతుంది.


గీతాభాస్కర్

### నువ్వులు ఎక్కువ వేస్తా

సకినాల పిండికి కొలతలు అంటూ ఉండవు. ఒక గ్లాసు పిండికి నేను పావుకిలో నువ్వులు వేస్తాను. నువ్వులు ఎక్కువ వేస్తే గ్యాప్ ఎక్కువ వస్తుంది... పైగా నువ్వుల నుంచి కూడా నూనె వస్తుంది కదా.. బాగా ఉడుకుతుంది. దాంతో సకినం కరకరలాడుతుంది. కొంతమందైతే పచ్చి నువ్వులు వేసేస్తారు. నేను చెన్నై నుంచి వచ్చినదాన్ని కదా... మాకు అక్కడ మురుకులు అలవాటు. అక్కడ వేయించిన నువ్వులు వేస్తారు. నేను సకినాల్లో అలానే వేస్తా. అసలు ఇక్కడికి వచ్చాకే నేను సకినాలు వండటం నేర్చుకున్నాను. సకినాలకి దొడ్డు బియ్యం బాగుంటుంది. నేను దాదాపు రేషన్ బియ్యమే వాడతాను. అవి ఎక్కువ పాలిష్ ఉండవు కాబట్టి సకినాలకి బాగుంటుంది. అలాగే వేరు శెనగ నూనె వాడతాను.


తరుణ్ భాస్కర్

### అమ్మ వైపు... నాన్న సైడు

మా తండ్రి, తల్లివైపు వాళ్లందరూ చెన్నైలో సెటిల్ అయ్యారు. నేను పుట్టింది, పెరిగిందీ అక్కడే. రెండు కుటుంబాల వాళ్లు బిగ్ బిజినెస్ పీపుల్. ఇక మా అమ్మగారి వైపు అయితే పూర్తిగా కాస్మోపాలిటన్. ఆవిడ హార్స్ రైడ్ చేసేవారు. చెన్నైలో శివాజీ గణేశన్‌లాంటి స్టార్స్ ఉండే మలోని స్ట్రీట్‌లో మా తాత ఉండేవారు. పొలిటికల్‌గా ఆయనకు చాలా స్ట్రాంగ్ కనెక్షన్స్ ఉండేవి. నెహ్రూగారితో పరిచయం ఉండేది. మా అమ్మ బట్టలన్నీ సినిమా కాస్ట్యూమర్స్ కుట్టేవారు. ఇక నాన్నవైపు పూర్తిగా భిన్నం. వాళ్లు కూడా వ్యాపారవేత్తలే. నాన్న వాళ్లది పప్పుల వ్యాపారం. నాన్నగారి కుటుంబంలో అమ్మాయిలు బయటకు వెళ్ల కూడదు... మగవాళ్లతో మాట్లా కూడదు... అలా ఉండేది. నేను ఇటు అమ్మవైపు అటు నాన్నవైపు ఇలాంటి కాంబినేషన్‌లో పెరిగా. మా అమ్మ ఒక్కతే కూతురు.

ఆమెకి ఇద్దరు బ్రదర్స్ ఉన్నారు. ఒక్కతే కూతురు కావడంతో రాణిలా పెంచారు. నాన్నవాళ్లు పదమూడుమంది. నాన్నమ్మ వాళ్లు బాగా ట్రెడిషనల్. ఇంటికి పెద్ద కోడలిగా అమ్మకి చాలా బాధ్యతలు ఉండేవి. అయితే అమ్మ ఎక్కడిది అక్కడే అన్నట్లుగా తనను మలచుకుంది.

అత్తింటి విషయాలు పుట్టింటికి, అక్కడివి ఇక్కడ ఎప్పుడూ చెప్పలేదు. మా నాన్నమ్మ సైడ్‌లో పూర్తి ట్రెడిషనల్ పిండి వంటలు వండే వాళ్లు. అమ్మ సైడ్ కొంచెం డిఫరెంట్. అలా నాకు అమ్మ వల్ల, నాన్నమ్మ వల్ల వంటలు చేయడం అలవాటైంది. ఇక నేను పెళ్లి చేసుకుని ఇక్కడికి (తెలంగాణ) వచ్చాక పూర్తి భిన్నమైన వంటలు వండాల్సి వచ్చింది.

### ఈ తరానికి నేర్పుదాం

మన యంగర్ జనరేషన్‌కి మనం స్ఫూర్తిగా ఉండాలనుకుంటాను. ఇప్పుడు మనం వండితే భవిష్యత్తులో అప్పట్లో మన అమ్మ అలా వండేది కదా అనుకుంటారు. సో... యంగర్ జనరేషన్‌కి మన కల్చర్ అలవాటు చేయాలి. అందుకే మనం ఇంట్లోనే వండాలి. అమ్మ కష్టపడి వంట చేస్తుంటే పిల్లలకు హెల్ప్ చేయాలనిపిస్తుంది. మా తరుణ్ ఈ మధ్య ఓ రెండు రోజులు ఇంటికి రావడానికి కూడా కుదరలేదు. ఒక సినిమాకి డైలాగ్స్ రాస్తున్నాడు. ఆ స్పేస్‌లో ఉన్నాడు. ఇంటికి వచ్చాక ఒక గిల్ట్‌తో 'ఇంకో రెండు మూడు పేజీలు రాయాలమ్మా... అయిపోతుంది' అన్నాడు. ఎంత బిజీగా ఉన్నప్పటికీ సకినాలు చేయడంలో నాకు హెల్ప్ చేశాడు (నవ్వుతూ).

### స్పేస్ ఉంటే తరుణ్ 'చెఫ్'

మా తరుణ్‌కి కూడా వంటలంటే ఇష్టం. నేను చేస్తుంటే వచ్చి చేస్తుంటాడు. నేనేదైనా బాగా వండితే, ఎలా వండావు అని అడిగి తెలుసుకుంటాడు. మా ఇంటి పక్కనే మాకు బాగా పరిచయం ఉన్న ఫ్యామిలీ ఉంది. అలాగే మా ఆఫీసు ఒకటి క్లోజ్ చేశాం... ఆ ఆఫీసులో ఉన్న ఇద్దరు పిల్లలు మా ఇంట్లో ఉంటారు. ఇక ఆ ఫ్యామిలీ, ఈ పిల్లలు అందరూ కలిసి చేస్తుంటాం. మా నాన్న కూడా సలహాలు ఇస్తుంటారు. మా తరుణ్‌కి చాలా స్పేస్ ఉండిందనుకోండి... అప్పుడు వంట చేస్తాడు. నా వంటిల్లు మొత్తం హైజాక్ అయిపోతుంది (నవ్వుతూ). వాడి బర్త్‌డేకి వాడికి తెలియకుండా వంటల బుక్ రాసి, గిఫ్ట్‌గా ఇచ్చాను.

గీతాభాస్కర్ వంటల వీడియో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

### అత్తింట్లోనే సకినాలు నేర్చుకున్నా

అత్తింటికి వచ్చాకే సకినాలు చేయడం నేర్చుకున్నాను. మా అత్తగారైతే అన్ని వంటలు బాగా వండుతావు... ఈ సకినాలు ఎందుకు చేయలేక పోతున్నావు... ఇవి కూడా చేయడం వస్తది అనే వారు. మా పెద్ద ఆడబిడ్డ, చిన్న ఆడబిడ్డ సకినాలు నేర్పించారు. మామూలుగా సకినాలకు ఉల్లికారం బాగుంటుంది. మా తరుణ్ (హీరో–దర్శకుడు–రచయిత తరుణ్‌భాస్కర్) కాస్త కారంగా తింటాడు. ఉల్లికారం తనకి తగ్గట్టుగా చేస్తాను. అయితే మా అత్తవాళ్లు ఉప్పు, కారం నూరి దాని మీద పచ్చి నూనె వేసేవారు. నేను కాస్త చింత పండు వేస్తాను. పండగకి అరిసెలు కూడా వండుతాను. యాక్కువల్లీ మా అమ్మ బాగా వండేది. నాకు కుదిరేది కాదు. అత్తింటికి వచ్చాక కూడా సరిగ్గా వండలేకపోయేదాన్ని. అయితే నా ఫ్రెండ్ వాళ్ల అమ్మ నేర్పించారు. అప్పట్నుంచి అరిసెలు చక్కగా మెత్తగా వండటం నేర్చుకున్నాను.

### ఇట్లు... బొబ్బట్లు

ఒకప్పుడు బుట్టలు బుట్టలు పిండివంటలు వండేవాళ్లు. మా ఇంట్లో మా అమ్మమ్మ, నాన్నమ్మ అలా వండటం చూశా. కానీ ఇప్పుడు ఒకట్రెండు కేజీలు వండటానికే కష్టపడిపోతున్నాం. అప్పట్లో పిండి దంచి వండేవాళ్లు. ఇప్పుడు అన్నింటికీ మిషన్ ఉంది. అయినా చేయలేకపోతున్నాం. కానీ బయట కొనుక్కుని తింటే అంత సంతృప్తి ఉండదు. ఇంట్లో వండితే పండగకి ఇంట్లో వండాం అనే తృప్తి ఉంటుంది. కానీ ఎందుకింత శ్రమ తీసుకుంటున్నావని తరుణ్ అంటుంటాడు. ఇప్పుడు తను కూడా బిజీ కాబట్టి హెల్ప్ చేసే వీలుండదు. కానీ నాకు పండగకి ఇంట్లో వండితేనే మనసుకి బాగుంటుంది. పోయిన గురువారం నాకు స్కూల్‌లో ఓ వర్క్‌షాప్ ఉంది. అలాగే కల్చరల్ డిపార్ట్‌మెంట్ వాళ్లు గవర్నమెంట్ సపోర్ట్‌తో ఓ నాలుగైదు ప్రోగ్రామ్స్ చేయమన్నారు. ఇంకా 'ఇట్లు బొబ్బట్లు' అని పిల్లలు తయారు చేస్తుంటారు. వాళ్ల పిలిస్తే వెళ్లాను. మా నాన్నగారు మాతోనే ఉంటారు. ఆయనకు 90 ఏళ్లు. ఆయన్ని చూసుకుంటూ, బయట పనులు చూసుకుని, ఇంటికొచ్చాక పిండి వంటలు మొదలుపెట్టా. ఇలా ఇంట్లో వండుకుంటే ఫీల్‌గుడ్ హార్మోన్స్‌తో మనసు హాయిగా ఉంటుంది. అది మన హెల్త్‌కి మంచిది.

– డి.జి. భవాని

# భోగి వైభోగం

సౌరమానాన్ని ఆధారంగా చేసుకున్న పండగ భోగి. తెల్లవారు జామునే భోగి మంట వేస్తారు. కర్ర పుల్లలు, పిడకల దండలు, పాత సామాన్లు, కొబ్బరిమట్టలు... లాంటివాటితో పెద్ద పెద్ద మంటలు వేస్తారు. పాత వస్తువులతో పాటు, మనుషుల మనసుల్లో దాగి ఉన్న పాత అలవాట్లను సైతం అగ్నిలో దహింపచేసి, ఆరోజు నుంచి కొత్త ఆయనంలోకి, కొత్త జీవితాన్ని మొదలుపెట్టడానికి కొత్త మార్గంలో ప్రయాణించడానికి సూచనగా భావిస్తారు. గ్రామాల్లో నాలుగు రోడ్ల కూడళ్లలో భోగిమంట వేస్తారు. అలా అందరూ ఒకచోట చేరటం వలన సమైక్యత ఏర్పడుతుంది. ఈ రోజున భోగి మంట వేసుకోవటం వెనుక కూడా ఆరోగ్య రహస్యం దాగి ఉంది. సరిగ్గా భోగితో దక్షిణాయనం పూర్తయ్యి ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం అవుతుంది. చలి కూడా వెనకపడుతుంది. ఒక్కసారిగా వాతావరణం వేడిగా మారుతుంది. ఆ వేడిని తట్టుకోవడం కోసమే ఈ మంట వేసుకునే సంప్రదాయం వచ్చి ఉండవచ్చునని ఆధ్యాత్మికవేత్తల అభిప్రాయం. వీటి నుండి వచ్చే పొగ ఆరోగ్యం కలిగించేదే కాని హాని కలిగించేది కాదు. ఈ మంట వేయడానికి పిల్లలందరూ ఇంటింటికీ వెళ్లి తోటి పిల్లల్నందర్నీ నిద్రలేపి పరాచికాలాడుకుంటూ, చలికాచుకుంటూ కోలాహలంగా కనిపిస్తారు. సైన్సుపరంగా చెప్పాలంటే, చలికాలం వాతావరణంలో సూక్ష్మక్రిములు అభివృద్ధి చెందడానికి అనువైన కాలం. అందువల్ల అందరూ ఏకకాలంలో భోగిమంటలు వేయడం వల్ల సూక్ష్మక్రిములన్నీ నశించిపోయి అంటువ్యాధులు ప్రబలకుండా ఉంటాయి. అదేవిధంగా ఎప్పటెప్పటి నుంచో మూలన పడి ఉన్న పాత సామానును ఏడాదికోసారి ఈ విధంగా వదిలించుకోవడం వల్ల దుమ్ము, ధూళి, ఎలుకలు, వాటిని తినడానికి పాములు చేరకుండా ఉంటాయనేది పెద్దల మాట.

భోగం అంటే పిల్లలకు భోగం చేయడం. పిల్లలకు భోగిపళ్లు పోసేటప్పుడు రేగు పళ్లు, రాగి పైసలు, పువ్వులు మూడిటినీ కలిపి తలచుట్టూ మూడుసార్లు తిప్పి తలమీద పోస్తారు. కొన్ని ప్రాంతాలలో రేగుపళ్లు, చిల్లరడబ్బులు, కొత్తబియ్యం, తేగ ముక్కలు, చెరకు ముక్కలు, పాలకాయలు, పచ్చి శనగ కాయలు, పూలరేకలు అన్నీ కలిపి పోస్తారు. దీనివల్ల దృష్టి దోషం పోతుందని విశ్వాసం. పిల్లలు కూర్చునే పీటకింద ఇంట్లో తయారు చేసుకున్న పిండివంటన్నీ వేస్తారు. వాటిని తరవాత ఇంట్లో నమ్మకంగా పనిచేసే వారికి ఇచ్చేస్తారు. చివర్లో పేరంటాళ్లకి వాయినం ఇస్తారు. ఇందులో ఆరోగ్యానికి ఉపకరించే మొలకెత్తిన శనగలు తమలపాకులు, వక్క ఇస్తారు. మన పండుగల వెనుక సంప్రదాయంతోపాటు ఆరోగ్య కోణమూ దాగి ఉంది. అందుకే ఈ వంటకాలు, వాయినాలు ఆనవాయితీగా వస్తున్నాయి.

### వస్తు వ్యామోహానికి మంట

మనుషుల మీదైనా, వస్తువుల మీదైనా వెర్రి వ్యామోహం పనికిరాదు. కరుడుగట్టిన అలాంటి కోరికలేవైనా ఉంటే వాటిని వదిలించుకోవాలి. అప్పుడే జీవితం నిశ్చింతగా ఉంటుంది. ఈ మాటను ఊరికే చెబితే ఎవరూ వినరు కాబట్టి భోగిమంట రూపంలో చెబితే వింటారన్నది పెద్దల నమ్మకం.



ఇక పోతే, భోగిపండ్లు లేదా రేగుపండ్లలో ఎనలేని ఔషధగుణాలు ఉన్నాయి. చలికాలంలో ఎవరికైనా జీర్ణశక్తి మందగిస్తుంది. పీచు పదార్థాలను ఎక్కువగా తీసుకుంటే కాని సమస్య తొలగిపోదు. ఒకప్పుడు ఇప్పుడున్నంత ఆరోగ్య చైతన్యం లేదు కనక.. ఆ లోటును పూడ్చేందుకు రేగుపండ్లను తినమనే వారు. రేగులోని జిగట పదార్థం అన్నవాహికను శుభ్రం చేస్తుంది. 'భుక్త్వాచ బదరీఫలం' అన్నది అందుకే. భోంచేసిన తర్వాత రేగుపండ్లు తింటే మంచిదని దాని అర్థం. రేగు పండ్లు శరీరంలో వేడిని పుట్టించే రసాయనాలను ఉత్పత్తి చేస్తాయి. ఆకలి పుట్టిస్తాయి.

రేగుపండ్లకున్న ప్రాశస్త్యాన్ని దృష్టిలో పెట్టుకునే.. పండగపూట పిల్లలకు చిల్లర నాణేలతో కలిపి భోగిపండ్లు పోస్తారు.

– డి.వి.ఆర్. భాస్కర్

### భోగి రోజున తలంటు

భోగి రోజున తలస్నానానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. బిడ్డల మాడుపై ఉండే బ్రహ్మరంధ్రం మీద నువ్వుల నూనె పెట్టి తల్లి తలంటు పోయాలి. ఆ రంధ్రంలోకి నూనె చేరటం ద్వారా నాడులన్నంటికీ చైతన్యం కలుగుతుంది. కుంకుడు కాయల రసంతోనే తలంటి, సాంబ్రాణి పొగ వేసి జుట్టు ఆరబెట్టాలి. దీనివల్ల జుట్టు కుదుళ్లు గట్టిపడతాయి. పెద్దలు ఎవరికి వారు తలంటి స్నానం చేయాలి. ఆ తరవాత నూతన వస్త్రాలు ధరించాలి. సంక్రాంతినాడు పితృకార్యాలకి మంచిది కాబట్టి ఆ కార్యాలు చేయవలసిన వాళ్లు వాటికి సంబంధించిన వంటకాలన్నీ ఏర్పాటు చేయాలి. అందువల్ల భోగినాడు సంబరాలు చేసుకోవాలి. సాధారణంగా భోగినాడు కొత్తబియ్యంతో వండిన బెల్లం పాయసం వండి, దానిని ఇంద్రుడికి, సూర్యుడికి నివేదించడం వల్ల ఆరోగ్య భోగం చేకూరుతుందని ప్రతీతి.



మహా భక్తురాలైన గోదాదేవి భోగినాడే రంగనాథుని పతిగా పొందిందని ద్రవిడ వేదం చెబుతోంది. అందువల్ల విష్ణ్వాలయాలలో భోగిరోజు గోదా రంగనాథులకు కల్యాణం జరిపిస్తారు.



# కరకరలూ... ఘుమ ఘుమలూ

**కనుల పండగ చేసే రంగవల్లులే కాదు... సంక్రాంతి అంటే కమ్మని కర కరలు కూడా**
**తెలుగు రాష్ట్రాల్లో ప్రతి ప్రాంతానికి ప్రత్యేక వంటకాలు ఉన్నాయి.**
**పెద్ద పండగ రోజు ఆ కరకరల స్వరాలు వినాల్సిందే.**
**తన సహజ నటనతో ప్రేక్షక అభిమానాన్ని**
**సొంతం చేసుకున్న గీతాభాస్కర్ చేసే సకినాల రుచి ఇంతా అంతా కాదు.**
**కృష్ణుడు అంటే అల్లరి. వెండితెర కృష్ణుడు అంటే నవ్వుల సందడి.**
**కోనసీమ బిడ్డ కృష్ణుడు పాకుండల గురించి చెబితే తీయగా నోరూరాల్సిందే.**
**తమకు ఇష్టమైన వంటకాల గురించి చెప్పడమే కాదు...**
**ఎలా చేయాలో కూడా చెబుతున్నారు గీతాభాస్కర్, కృష్ణుడు. ఆ కబుర్ల కరకరలు...**

## బ్రహ్మాండం...
# కృష్ణుడి పాకుండలు

**కృష్ణుడు నవ్వడు. తెగ నవ్విస్తాడు. కృష్ణుడు అమాయకంగా కనిపిస్తాడు. కానీ అల్లరల్లరి చేస్తాడు. 'అయ్ బాబోయ్... మా రాజోలులో ఇలా కాదండీ' అనేది 'వినాయకుడు' సినిమాలో కృష్ణుడి మార్క్ డైలాగ్. కృష్ణుడు నటుడు మాత్రమే కాదు ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్ కూడా. ఈ 'కూడా'కు మరో 'కూడా' కలిపితే వంటలు చేయడంలో దిట్ట కూడా! కృష్ణుడు కోనసీమ బిడ్డ. ఉమ్మడి కుటుంబాల విలువ తెలిసిన కృష్ణుడు ఈస్ట్, వెస్ట్ స్పెషల్ పాకుండల గురించి నోరూరించేలా చెబుతాడు. అంతేనా! 'అయ్ బాబాయ్. మా రాజోలులో అలా కాదండి. ఎలా ఉంటాయో చెప్పడంతో పాటు ఎలా చేయాలో కూడా చెబుతామండీ'... మరి ఆయన మాటల్లోనే... పాకుండలు, పెద్ద చెగోడీలతో పాటు... తన స్వీట్ ఫ్యామిలీ కబుర్లు...**

**కృష్ణుడు:** ట్రెడిషనల్ పిండి వంటలు చేయడం అనేది నాకు చిన్నప్పుడు అలవాటు. మా అమ్మ చేసేవారు. అలాగే మా ఇంట్లో సుబ్బయ్య అని కుక్ ఉండేవారు. ఆయన దగ్గర్నుంచి నేర్చుకున్నా. బియ్యం నానబెట్టి, తర్వాత ఆరబెట్టి, దంచేవాళ్లు. నా చిన్నప్పుడు బాగా గుర్తున్నది అంటే ఇదే. ఇప్పుడంటే మిషన్‌లో పిండి ఆడిస్తున్నారు కానీ అప్పట్లో దంచడమే. మన చిన్నప్పుడు మనం తిన్నంత టేస్టీగా ఇప్పుడు ఉండటంలేదు. చిన్నప్పుడు టేస్ట్ చూశాం కాబట్టి మనకు ఆ తేడా తెలుస్తుంది. ఇప్పటి జనరేషన్‌కి ఆ తేడా తెలియదు. అప్పట్లో ఎక్కువగా ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. అందరూ కలిసి రోజుకొక ఇంటికి అన్నట్లు వండేవారు. అది చాలా బాగుండేది.

### మాకు పాకుండలు ఫేమస్

మేం ఈ సంక్రాంతికి పాకుండలు చేశాం. మాకు అదే ప్రత్యేకత. ఈస్ట్, వెస్ట్‌లో సంక్రాంతికి పాకుండలు ఫేమస్. విడిగా పెద్దగా చేయరు. ఈ పండగకే చేస్తుంటారు. అరిసెల పిండి ఫార్మాట్‌లోనే పాకుండల పిండి కూడా ఉంటుంది. బియ్యాన్ని ఓ రోజంతా కానీ 30 గంటలు కానీ నానబెట్టి, పిండి పట్టించుకోవాలి. బెల్లం పాకం పట్టి చేసుకోవాలి. పాకం సరిగ్గా కుదరడానికి కొలతలు ముఖ్యం. నాలుగు గ్లాసుల బియ్యం పిండికి రెండు గ్లాసుల బెల్లం వాడాలి. ఒక అర గ్లాసు నీళ్లు పోసి, పాకం పట్టాలి. పాకుండలలో కొబ్బరి ముక్కలు వేస్తారు. అది టేస్టీగా ఉంటుంది. సంక్రాంతికి అరిసెలు ఉంటాయి కానీ కోనసీమ జిల్లాల్లో పాకుండలనే ప్రిఫర్ చేస్తారు.

### గుండాట అంటే ఇష్టం

సంక్రాంతికి కైట్స్, కోడి పందేల మీద నాకు పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. కానీ గుండాట అంటే ఇంట్రస్ట్. ఒక క్యాప్‌లో డైస్ వేసి, తిప్పుతారు. రెండు పువ్వులు కానీ రెండు యాపిల్స్ కానీ... ఇలా వస్తే డబ్బులు ఇచ్చేవారు. నాకు ఎప్పుడూ డబ్బులు రాలేదు. ఎప్పటికీ రావని పెద్దయ్యాక తెలిసింది (నవ్వుతూ). అది జగమెరిగిన సత్యం.


లలితా గాయత్రి, కృష్ణుడు

### బయటి ఫుడ్ తినదు

మాది లవ్ మ్యారేజ్. మా ఆవిడ (లలితా గాయత్రి) వాళ్లది నిజామాబాద్. ఆ వంటల స్టయిల్ వేరు. ఏ ప్రాంతం రుచి ఆ ప్రాంతానిది. నేను బేసిక్‌గా ఫుడ్ లవర్‌ని. బాగా వండిన ప్రతిదీ నాకు ఇష్టం. ఇక మా ఆవిడకి కూడా పాకుండలు చేడయం వచ్చు. నిజానికి పెళ్లయ్యాక నేను వంట చేయడం మానేశాను. అయితే అప్పుడప్పుడూ చేస్తుంటాను. ఈ పండగకి నేనే చేశాను... తను పక్కనే ఉండి, కాస్త హెల్ప్ చేసింది. మా పాపకు నచ్చిన పిజ్జా, గార్లిక్ బ్రెడ్ అవన్నీ కూడా చేస్తుంటాను. మా పాప బయటి ఫుడ్ దాదాపు తినదు. ఇంట్లోనే చేసి పెడతాం.

కృష్ణుడి పాకుండల వీడియో చూడాలంటే సరదాగా ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చూడండి.

### పండగకి పెద్ద చెగోడీలూ చేస్తాం

సంక్రాంతికి మేం పాకుండలతో పాటు పెద్ద చెగోడీలు చేస్తుంటాం. మా రాజోలులో ఈ చెగోడీలు ఫేమస్. కారప్పొడితో చేస్తాం. చాలా సాఫ్ట్‌గా ఉంటాయి. నాకు చాలా ఇష్టం. ఊరెళ్లినప్పుడుల్లా తింటాను. ఇప్పుడు పాకుండలతో పాటు అవి కూడా వండాను. చెగోడీలకు కూడా బియ్యం పిండినే వాడతాం. ఒక గ్లాసుడు పిండికి ఒక గ్లాసు నీళ్ల రేషియోతో చేయాలి. పచ్చి మిరపకాయలు, అల్లం, జీలకర్ర.. మూడూ నూరి, వేడి నీళ్లలో కలిపి, ఉప్పు వేసి, అందులో బియ్యం పిండి వేసి, కలపాలి. ఆ తర్వాత చెగోడీలను లావుగా వత్తి, పెసరపప్పు అద్ది, నూనెలో వేసి వేయించుకోవాలి.

### ఆ మంచు... అదో అందం

చిన్నప్పుడు సంక్రాంతి అంటే భోగి మంటలు, హరిదాసులు, ఇరుగుపొరుగు కలిసి పిండి వంటలు వండుకోవడం... ఊర్లో ఇలాంటి సందడి ఉండేది. ఇప్పటికీ ఊళ్లో ఉన్నాయి. కానీ సిటీలో అంత సందడి కనిపించదు. చిన్నప్పుడు ఆ మంచులో భోగి మంటలు వేయడం, హరిదాసులు రావడం, పెద్ద పెద్ద ముగ్గులు చూడటం... అంతా ఓ అందంగా ఉండేది. అదో మంచి అనుభూతి. సిటీల్లో గేటెడ్ కమ్యూనిటీల్లో భోగి మంటలు అవి వేస్తారు కానీ ఊళ్లో ఉన్నంత సందడి ఇక్కడ కనిపించదు. అందుకే చాలా మంది పండగలకి ఊరు వెళ్లిపోతుంటారు. నేను కూడా వీలున్నప్పుడల్లా వెళుతుంటాను. మా పాపకి ఆ కల్చర్ తెలియాలని తనని కూడా తీసుకెళుతుంటాను. ఉద్యోగాలు, వ్యాపారాలంటూ సిటీల్లో స్థిరపడుతున్నారు. వాళ్లల్లో ఎక్కువ మంది పండగకి ఊరికి వెళుతుంటారు. అందుకే సంక్రాంతి అంటే అందర్నీ కలిపే పండగ.

# 346 నాటౌట్

**దేశవాళీ మహిళల అండర్–19 వన్డే క్రికెట్‌లో ఇరా జాధవ్ కొత్త రికార్డు**

- 157 బంతుల్లో 42 ఫోర్లు, 16 సిక్స్‌లతో 346 నాటౌట్
- ట్రిపుల్ సెంచరీ చేసిన తొలి భారత ప్లేయర్‌గా చరిత్ర
- మేఘాలయ జట్టుపై 544 పరుగుల తేడాతో ముంబై ఘనవిజయం



**న్యూఢిల్లీ:** దేశవాళీ మహిళల అండర్–19 క్రికెట్‌లో ముంబై యువ బ్యాటర్ ఇరా జాధవ్ (157 బంతుల్లో 346 నాటౌట్; 42 ఫోర్లు, 16 సిక్స్‌లు) కొత్త చరిత్ర సృష్టించింది. వన్డేల్లో ట్రిపుల్ సెంచరీ చేసిన తొలి భారత మహిళగా రికార్డుల్లోకెక్కింది. బీసీసీఐ మహిళల అండర్–19 వన్డే ట్రోఫీలో భాగంగా మేఘాలయతో ఆదివారం జరిగిన పోరులో 14 ఏళ్ల ఇరా ఆకాశమే హద్దుగా చెలరేగిపోయింది. బంతి ఎక్కడ పడ్డా దాని గమ్యస్థానం బౌండరీనే అన్నట్లు చెలరేగిన ఇరా 220.38 స్ట్రయిక్‌రేట్‌తో పరుగులు రాబట్టింది. ఓపెనర్‌గా బరిలోకి దిగి అజేయంగా 'త్రిశతకం' తన పేరిట లిఖించుకుంది. మహిళల అండర్–19 క్రికెట్‌లో దక్షిణాఫ్రికా బ్యాటర్ లిజెల్ లీ గతంలో 427 పరుగులు చేసి ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉంది. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ చదువుకున్న శారదాశ్రమ్ పాఠశాలలోనే విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న ఇరాను... ఇటీవల మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ఏ ఫ్రాంచైజీ కొనుక్కోలేదు. త్వరలో జరగనున్న మహిళల అండర్–19 ప్రపంచకప్ కోసం ఇరాను స్టాండ్‌బై ప్లేయర్‌గా ఎంపిక చేశారు. ఇరా విజృంభణతో మొదట బ్యాటింగ్ చేసిన ముంబై జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 563 పరుగులు చేసింది. కెప్టెన్ హర్లీ గాలా (79 బంతుల్లో 116; 14 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి ఇరా రెండో వికెట్‌కు 274 పరుగులు జోడించింది. మూడో వికెట్‌కు దీక్ష పవార్ (39)తో కలిసి 186 పరుగులు జత చేయడంతో ముంబై జట్టు భారీ స్కోరు చేయగలిగింది. ఇరా ధాటికి ముగ్గురు మేఘాలయ బౌలర్లు వందకు పైగా పరుగులు సమర్పించుకున్నారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన మేఘాలయ జట్టు 25.4 ఓవర్లలో 19 పరుగులకు ఆలౌటైంది. ప్లేయర్లంతా 'సింగిల్ డిజిట్'కే పరిమితమయ్యారు. ఫలితంగా ముంబై జట్టు 544 పరుగుల తేడాతో విజయం సాధించింది.

## సుమిత్ నగాల్ తొలి రౌండ్‌లోనే...



**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్‌లో భారత కథ ముగిసింది. బరిలో ఉన్న ఏకైక భారత ప్లేయర్ సుమిత్ నగాల్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. ప్రపంచ 25వ ర్యాంకర్ టొమాస్ మఖచ్ (చెక్ రిపబ్లిక్)తో ఆదివారం జరిగిన తొలి రౌండ్‌లో ప్రపంచ 91వ ర్యాంకర్ నగాల్ 3–6, 1–6, 5–7తో ఓడిపోయాడు. 2 గంటల 5 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నగాల్ ఐదు డబుల్ ఫాల్ట్‌లు, 20 అనవసర తప్పిదాలు చేశాడు. 19 విన్నర్స్ కొట్టిన నగాల్ తన సర్వీస్‌ను ఏడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు. తొలి రౌండ్‌లో ఓడిన నగాల్‌కు 1,32,000 ఆస్ట్రేలియన్ డాలర్ల (రూ. 69 లక్షల 94 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

**సబలెంకా శుభారంభం**
**ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫలితాలు**

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో


జెమీమా సెంచరీ సంబరం

# టాప్ ఫోర్... వైల్డ్ ఫైర్

**'శత'క్కొట్టిన జెమీమా రోడ్రిగ్స్**

- అర్ధ సెంచరీలతో స్మృతి, ప్రతీక, హర్లీన్ వీరవిహారం
- వన్డేల్లో తమ అత్యధిక స్కోరు నమోదు (370/5) చేసిన భారత్
- రెండో వన్డేలో ఐర్లాండ్‌పై 116 పరుగుల తేడాతో ఘనవిజయం
- సిరీస్ 2–0తో సొంతం

భారత మహిళల జట్టు సొంతగడ్డలో ఐర్లాండ్‌పై 'వైల్డ్ ఫైర్' అయ్యింది. టాప్–4 బ్యాటర్లు గర్జించడంతో మన జట్టు వన్డేల్లో తమ అత్యధిక రికార్డు స్కోరును నమోదు చేసింది. ఓవరాల్‌గా అంతర్జాతీయ మహిళల వన్డే క్రికెట్లో మూడో అత్యధిక స్కోరు సాధించింది. మిడిలార్డర్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ శతకంతో... ఓపెనర్లు స్మృతి మంధాన, ప్రతీక రావల్, వన్‌డౌన్‌లో హర్లీన్ డియోల్ 'ఫిఫ్టీ'లతో చెలరేగారు. బౌలింగ్‌లో దీప్తి శర్మ, ప్రియా మిశ్రాలు ఐర్లాండ్ బ్యాటర్ల పని పట్టారు. దీంతో రెండో వన్డేలో స్మృతి మంధాన బృందం భారీ విజయాన్ని నమోదు చేసింది. తొలి రెండు వన్డేల్లో గెలుపుతో ద్వైపాక్షిక సిరీస్‌ను సొంతం చేసుకున్న భారత జట్టు ఈనెల 15న జరిగే చివరిదైన మూడో వన్డేలో క్లీన్‌స్వీప్ లక్ష్యంగా బరిలోకి దిగనుంది.

**రాజ్‌కోట్:** భారత టాపార్డర్ టాప్ లేపే ప్రదర్శనతో ఐర్లాండ్ మహిళల్ని చితగ్గొట్టింది. రెండో వన్డేలో ఓపెనింగ్ జోడీ సహా తర్వాత వచ్చిన మూడు, నాలుగో వరుస బ్యాటర్లూ ఆకాశమే హద్దుగా చెలరేగడంతో రాజ్‌కోట్ వేదిక పరుగుల 'పొంగల్' చేసుకుంది. ఆదివారం జరిగిన రెండో వన్డేలో భారత మహిళల జట్టు 116 పరుగుల భారీ తేడాతో ఐర్లాండ్‌పై ఘనవిజయం సాధించింది. మిడిలార్డర్ బ్యాటర్, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జెమీమా రోడ్రిగ్స్ (91 బంతుల్లో 102; 12 ఫోర్లు) తన కెరీర్‌లో తొలి శతకం సాధించగా... హర్లీన్ డియోల్ (84 బంతుల్లో 89; 12 ఫోర్లు), కెప్టెన్ స్మృతి మంధాన (54 బంతుల్లో 73; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు), ప్రతీక రావల్ (61 బంతుల్లో 67; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీలతో అదరగొట్టారు. దీంతో ముందుగా బ్యాటింగ్ చేపట్టిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 370 పరుగుల భారీ స్కోరు చేసింది. గతంలో భారత జట్టు 'బెస్ట్' స్కోరు 358. 2017లో ఐర్లాండ్‌పై 358/2 చేసిన అమ్మాయిల జట్టు గత నెల విండీస్‌పై కూడా 358/5తో ఆ 'బెస్ట్'ను సమం చేసింది.

తర్వాత కొండంత లక్ష్యాన్ని ఛేదించలేక ఐర్లాండ్ 50 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 254 పరుగులకు పరిమితమైంది. క్రిస్టీనా కూల్టర్ (113 బంతుల్లో 80; 10 ఫోర్లు) ఒంటరి పోరాటం చేసింది. దీప్తి శర్మ 3, ప్రియా మిశ్రా 2 వికెట్లు తీశారు. తొలి వన్డే గెలిచిన స్మృతి సేన తాజా విజయంతో 2–0తో సిరీస్ వశం చేసుకుంది. 15న చివరి వన్డే జరగనుంది.


హర్లీన్


ప్రతీక, స్మృతి

**స్మృతి, ప్రతీక ఫైర్**

బ్యాటింగ్‌కు దిగగానే ఓపెనర్లు స్మృతి, ప్రతీక ఐర్లాండ్ బౌలింగ్‌ను తుత్తునీయలు చేస్తూ భారీ స్కోరుకు గట్టి పునాది వేశారు. దీంతో 7.2 ఓవర్లలో 50 స్కోరు చేసిన భారత్ 100కు (13 ఓవర్లలో) చేరేందుకు ఎంతోసేపు పట్టలేదు. స్మృతి 35 బంతుల్లో, ప్రతీక 53 బంతుల్లో అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. ఇలా ఓపెనర్లిద్దరే తొలి 19 ఓవర్లలో 156 పరుగులు జోడించి శుభారంభం ఇచ్చారు. అదే స్కోరు వద్ద వరుస బంతుల్లో ఇద్దరు నిష్క్రమించారు. ఇక్కడ ముగిసింది సినిమాల్లోలాగా ఫస్టాఫే! అంటే విశ్రాంతి. తర్వాత శుభం కార్డు జెమీమా, హర్లీన్‌ల జోరు చూపించింది. దీంతో 28 ఓవర్లపాటు (19.1 నుంచి 47.1 ఓవర్ వరకు) వాళ్లిద్దరు మూడో వికెట్‌కు జతచేసిన 183 పరుగుల భాగస్వామ్యం స్కోరును కొండంతయ్యేలా చేసింది. హర్లీన్ 58 బంతుల్లో ఫిఫ్టీ కొడితే... జెమీమా 62 బంతుల్లో 50... 90 బంతుల్లో సెంచరీ సాధించింది.

### స్కోరు వివరాలు

**భారత్ ఇన్నింగ్స్:** స్మృతి (సి) జార్జినా (బి) ప్రెండెర్‌గాస్ట్ 73; ప్రతీక (ఎల్బీడబ్ల్యూ) (బి) జార్జినా 67; హర్లీన్ (సి) లౌరా (బి) కెల్లీ 89; జెమీమా (బి) కెల్లీ 102; రిచా ఘోష్ (సి) ఫ్రెయా (బి) ప్రెండర్‌గాస్ట్ 10; తేజల్ (నాటౌట్) 2; సయాలీ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 25; **మొత్తం (50 ఓవర్లలో 5 వికెట్లకు) 370. వికెట్ల పతనం:** 1–156, 2–156, 3–339, 4–358, 5–368. **బౌలింగ్:** వోర్లా ప్రెండర్‌గాస్ట్ 8–0–75–2, అవా క్యానింగ్ 10–0–51–0, అర్లెన్ కెల్లీ 10–0–82–2, ఫ్రెయా సర్జెంట్ 9–0–77–0, అలానా డాల్జెల్ 5–0–41–0, జార్జినా 8–0–42–1.

**ఐర్లాండ్ ఇన్నింగ్స్:** సారా (బి) దీప్తి 38; గాబీ లూయిస్ (సి) రిచా (బి) సయాలీ 12; క్రిస్టీనా (బి) టిటాస్ సాధు 80; వోర్లా (సి) సయాలీ (బి) ప్రియా 3; లౌరా (ఎల్బీడబ్ల్యూ) (బి) దీప్తి 37; లీ పాల్ (నాటౌట్) 27; కెల్లీ (బి) దీప్తి 19; అవ క్యానింగ్ (బి) ప్రియా 11; జార్జినా (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 21; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 254. వికెట్ల పతనం:** 1–32, 2–87, 3–101, 4–184, 5–188, 6–218, 7–234. **బౌలింగ్:** టిటాస్ సాధు 10–0–48–1, సయాలీ 9–1–40–1, సైమా ఠాకూర్ 9–0–50–0, ప్రియా మిశ్రా 10–0–53–2, దీప్తి శర్మ 10–0–37–3, ప్రతీక 2–0–12–0.

# భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

## విద్య, ఉద్యోగ సమాచారం

### కెనరా బ్యాంక్‌లో 60 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

బెంగళూరులోని కెనరా బ్యాంక్‌లో ఒప్పంద ప్రాతిపదికన దేశవ్యాప్తంగా ఉన్న కెనరా బ్యాంక్ శాఖల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 60.
» **విభాగాలు:** (ఐటీ) ఏపీఐ మేనేజ్‌మెంట్, (ఐటీ) డేటాబేస్/పీఎల్ ఎస్‌క్యూల్, క్లౌడ్ సెక్యూరిటీ, డేటా, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, నెట్‌వర్క్ సెక్యూరిటీ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీఈ/బీటెక్, బీసీఏ/ఎంసీఏ/ఎంఏ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** ఏడాదికి రూ.18 లక్షల నుంచి రూ.27 లక్షల ప్యాకేజీ లభిస్తుంది.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.01.2025.
» **వెబ్‌సైట్:** http://canarabank.com

### ఆర్‌ఆర్‌బీలో 1,036 మినిస్టీరియల్, ఐసోలేటెడ్ కేటగిరీ పోస్టులు

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్‌ఆర్‌బీ).. మినిస్టీరియల్, ఐసోలేటెడ్ కేటగిరీ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1036.
» **పోస్టుల వివరాలు:** పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్–187, సైంటిఫిక్ సూపర్‌వైజర్–03, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్–338, చీఫ్ లా అసిస్టెంట్–54, పబ్లిక్ ప్రాసిక్యూటర్–20, ఫిజికల్ ట్రైనింగ్ ఇన్‌స్ట్రక్టర్–18, సైంటిఫిక్ అసిస్టెంట్/ట్రైనింగ్–02, జూనియర్ ట్రాన్స్‌లేటర్–130, సీనియర్ పబ్లిసిటీ ఇన్‌స్పెక్టర్–03, స్టాఫ్ అండ్ వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్–59, మ్యూజిక్ టీచర్–10, ప్రైమరీ రైల్వే టీచర్–03, లైబ్రేరియన్–188, అసిస్టెంట్ టీచర్–02, ల్యాబొరేటరీ అసిస్టెంట్/స్కూల్–07, ల్యాబ్ అసిస్టెంట్ గ్రేడ్2–12.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా, ఎంబీఏ, టెట్ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 01.01.2025 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్, టీచింగ్ స్కిల్ టెస్ట్, ట్రాన్స్‌లేషన్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో..
» **దరఖాస్తులకు చివరితేది:** 06.02.2025.
» **వెబ్‌సైట్:** https://www.rrbapply.gov.in

### బీఈఈ, న్యూఢిల్లీలో 16 సీనియర్ సెక్టార్ ఎక్స్‌పర్ట్స్ పోస్టులు

న్యూఢిల్లీలోని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ(బీఈఈ) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో సీనియర్ సెక్టార్ ఎక్స్‌పర్ట్స్/సెక్టార్ ఎక్స్‌పర్ట్స్ టెక్నికల్ ప్రొఫెషనల్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 16.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, ఇంజనీరింగ్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 45 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ(బీఈఈ), నాలుగో అంతస్తు, సేవా భవన్, ఆర్కే పురం, సెక్టార్–1, న్యూఢిల్లీ –110066 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** నోటిఫికేషన్ వెలువడిన 30 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
» **నోటిఫికేషన్ వెలువడిన తేది:** 03.01.2025.
» **వెబ్‌సైట్:** https://beeindia.gov.in

# ఐఐఎంల మలిదశ.. మెరిసేదెలా!

» క్యాట్–2024 ఫలితాలు విడుదల
» మలిదశలో కీలకంగా జీడీ. పర్సనల్ ఇంటర్వ్యూ
» సమకాలీన పరిజ్ఞానం, స్పష్టతతో విజయం
» 21 ఐఐఎంలలో దాదాపు 5 వేల సీట్లు




**కామన్ అడ్మిషన్ టెస్ట్.. క్యాట్‌గా సుపరిచితం! దేశంలోని ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లలో.. మేనేజ్‌మెంట్ పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన పరీక్ష! తాజాగా ఈ పరీక్ష ఫలితాలను నిర్వాహక ఇన్‌స్టిట్యూట్ ఐఐఎం-కోల్‌కత విడుదల చేసింది!! తదుపరి దశలో ఐఐఎం క్యాంపస్‌లు.. గ్రూప్ డిస్కషన్ (జీడీ), పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రవేశాలు ఖరారు చేయనున్నాయి. ఈ నేపథ్యంలో.. క్యాట్ ఉత్తీర్ణులకు మలిదశలో ఎదురయ్యే.. జీడీ, పర్సనల్ ఇంటర్వ్యూలో రాణించేందుకు మార్గాలు..**

క్యాట్ స్కోర్ ఆధారంగా ఆయా ప్రోగ్రామ్‌లకు దరఖాస్తు చేసుకోవాలని ఐఐఎంలు పేర్కొంటున్నాయి. అలా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి.. తదుపరి దశలో రిటెన్ ఎబిలిటీ టెస్ట్, గ్రూప్ డిస్కషన్‌లను నిర్వహిస్తున్నాయి. వీటిలో ప్రతిభ ఆధారంగా చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఇంటర్వ్యూలోనూ విజయం సాధిస్తే.. ఐఐఎంల్లో ప్రవేశం ఖాయమైనట్లే!

#### గ్రూప్ డిస్కషన్

మలిదశ ఎంపిక ప్రక్రియకు అర్హత సాధించిన అభ్యర్థులకు ఆయా ఐఐఎం క్యాంపస్‌లలో గ్రూప్ డిస్కషన్ నిర్వహిస్తారు. అభ్యర్థులను బృందాలుగా ఏర్పాటు చేసి.. ఏదైనా ఒక అంశాన్ని ఇచ్చి దానిపై చర్చించమంటారు. ఇందులో కోర్ నుంచి కాంటెంపరరీ వరకు అనేక టాపిక్స్ ఉంటున్నాయి. కాబట్టి అభ్యర్థులు సబ్జెక్ట్ నాలెడ్జ్‌తోపాటు సమకాలీన పరిణామాలపైనా అవగాహన పెంచుకోవాలి. జీడీలో ఒకే అంశంపై పది లేదా ఇరవై మంది ఉన్న బృందంలో చర్చించాల్సి ఉంటుంది. అభ్యర్థులు అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో తమ అభిప్రాయాలు వ్యక్తం చేయాల్సిన పరిస్థితి ఉంటుంది.

#### రిటెన్ ఎబిలిటీ టెస్ట్

గ్రూప్ డిస్కషన్ తర్వాత అభ్యర్థులు తమ ప్రతిభను నిరూపించుకోవాల్సిన మరో పరీక్ష.. రిటెన్ ఎబిలిటీ టెస్ట్! ఇందులో నిర్దిష్టంగా ఒక అంశాన్ని పేర్కొని.. అభ్యర్థుల అభిప్రాయాలు తెలుసుకునేలా ప్రశ్నలు అడుగుతున్నారు. సదరు అంశానికి సంబంధించి మూడు నుంచి నాలుగు వందల పదాల్లో అభ్యర్థులు తమ సమాధానం రాయాల్సి ఉంటుంది. ఇవి సబ్జెక్ట్ నాలెడ్జ్, సోషల్ అవేర్‌నెస్ సమ్మిళితంగా ఉంటున్నాయి. రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌లో అభ్యర్థులు వినియోగించిన పదజాలం, వాక్య నిర్మాణం, స్థూలంగా వారు వ్యక్తం చేసిన అభిప్రాయాల ఆధారంగా మార్కులు లభిస్తాయి.

#### చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ

గ్రూప్ డిస్కషన్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌లో ప్రతిభ చూపిన అభ్యర్థులకు చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఇందులో సదరు అభ్యర్థికి మేనేజ్‌మెంట్ విద్యపట్ల ఉన్న వాస్తవ ఆసక్తి, అతని భవిష్యత్తు లక్ష్యాలు, వాటిని అందుకునేందుకు ఎంపిక చేసుకున్న మార్గాలు తదితర అంశాలను నిపుణులైన ప్రొఫెసర్స్ కమిటీ తెలుసుకునే ప్రయత్నం చేస్తుంది.

#### పీజీపీఎక్స్‌కు కొంత విభిన్నంగా

- ఐఐఎంల జీడీ/పీఐ ప్రక్రియలో భాగంగా పీజీపీఎం, పీజీపీఎక్స్ కోర్సుల మధ్య కొంత వ్యత్యాసం ఉంటుంది. ముఖ్యంగా రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌లో ఈ వ్యత్యాసం కనిపించకపోయినా.. గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలలో ప్రస్ఫుటమవుతుంది. వర్క్ ఎక్స్‌పీరియన్స్ కచ్చితంగా అవసరమైన పీజీపీఎక్స్ కోర్సుకు ఎంపిక పరంగా గ్రూప్ డిస్కషన్‌లో ఆయా రంగాల్లో ప్రస్తుత వ్యాపార, వాణిజ్య పరిస్థితులపై అంశాలు ఉంటాయి.
- అదే విధంగా పర్సనల్ ఇంటర్వ్యూలోనూ వర్క్ ఎక్స్‌పీరియన్స్‌కు సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు. ఉదాహరణకు ఆటో మొబైల్ రంగంలో అనుభవం ఉన్న అభ్యర్థికి సదరు రంగంలో తాజా పరిస్థితి, చేసిన ప్రాజెక్ట్ ఏంటి, దాని వల్ల కంపెనీకి కలిగిన ప్రయోజనం, ఆటోమొబైల్ రంగం నుంచి మేనేజ్‌మెంట్ వైపు ఎందుకు రావాలనుకుంటున్నారు? వంటి ప్రశ్నలు అడిగే అవకాశముంది.

#### 'క్యాట్'కు 40 శాతం వెయిటేజీ

మొత్తంగా చూస్తే ఐఐఎంలు క్యాట్ స్కోర్‌కు కల్పిస్తున్న వెయిటేజీ తక్కువగానే ఉంటోంది. తుది జాబితా రూపకల్పనతో క్యాట్ స్కోర్‌కు 40 శాతం వెయిటేజీ లభిస్తోంది. గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలకు 40 నుంచి 50 శాతం వెయిటేజీ ఇస్తున్నాయి.

#### జీడీ, పీఐలకు వెయిటేజీ

- తుది జాబితా ఖరారులో ఐఐఎంలు క్యాట్ స్కోర్, జీడీ, ఆర్‌ఏటీ, పర్సనల్ ఇంటర్వ్యూలలో ప్రతిభతోపాటు మరెన్నో అంశాలను ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. వీటికి కూడా నిర్దిష్ట వెయిటేజీ కేటాయిస్తున్నాయి. వంద మార్కులకు 35 నుంచి 50 శాతం మేరకు జీడీ, పీఐలకు వెయిటేజీ ఉంటోంది. డైవర్సిటీ వెయిటేజీ పేరుతో జండర్ డైవర్సిటీ, కల్చరల్ డైవర్సిటీలకు మూడు నుంచి అయిదు శాతం చొప్పున వెయిటేజీ ఇస్తున్నాయి.

#### అకడమిక్ వెయిటేజీ

పలు ఐఐఎంలు అకడమిక్ వెయిటేజీ నిబంధన కూడా అమలు చేస్తున్నాయి. పదో తరగతి, ఇంటర్మీడియెట్, బ్యాచిలర్ డిగ్రీ కోర్సులకు ఒక్కో కోర్సుకు ప్రత్యేకంగా వెయిటేజీ ఉంటోంది. అన్ని ఐఐఎంలు ఈ వెయిటేజీని ఒక్కో కోర్సుకు పది శాతంగా పరిగణిస్తున్నాయి. అకడమిక్ వెయిటేజీలోనే ప్రొఫెషనల్ అర్హతలున్న వారికి ప్రత్యేక వెయిటేజీని కల్పిస్తున్నాయి. బ్యాచిలర్ డిగ్రీ తర్వాత ప్రొఫెషనల్ కోర్సులు చదివిన విద్యార్థులకు ఈ వెయిటేజీ లభిస్తోంది. ఇది రెండు నుంచి మూడు శాతం మధ్యలో ఉంటోంది.

#### పని అనుభవానికీ ప్రాధాన్యం

ఐఐఎంలు తుది జాబితా రూపకల్పనలో పని అనుభవానికి కూడా వెయిటేజీ కల్పిస్తున్నాయి. పని అనుభవం ఉన్న వారికి తుది జాబితా రూపకల్పనలో అయిదు నుంచి పది శాతం మధ్యలో వెయిటేజీ ఇస్తున్నాయి. ఈ వెయిటేజీ కూడా అభ్యర్థులు పని చేస్తున్న రంగం, పనిచేసిన సంవత్సరాల ఆధారంగా ఉంటోంది.

#### మహిళలను ప్రోత్సహించేలా

మేనేజ్‌మెంట్ విద్యలో మహిళా విద్యార్థులు చేరేలా ప్రోత్సహించేందుకు ఐఐఎంలు జెండర్ డైవర్సిటీ విధానాన్ని అమలు చేస్తున్నాయి. ప్రాథమిక దశలో క్యాట్ స్కోర్‌తో పాటు జెండర్ వెయిటేజీ, అకడమిక్ వెయిటేజీలకు ప్రత్యేక మార్కులు/పాయింట్లు కేటాయిస్తున్నాయి. రెండు నుంచి మూడు పాయింట్ల వరకు మహిళా విద్యార్థులకు కేటాయిస్తున్నారు.

#### నాన్ ఇంజనీరింగ్

క్యాట్ స్కోర్‌తోపాటు ఐఐఎంల ప్రవేశాల్లో ఇంజనీరింగ్ అభ్యర్థులే ముందంజలో ఉంటున్నారనే అభిప్రాయాలు నెలకొన్న సంగతి తెలిసిందే. దీంతో ఐఐఎంలలో నాన్–ఇంజనీరింగ్ విద్యార్థులకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో అకడమిక్ డైవర్సిటీకి కూడా ఈ ఇన్‌స్టిట్యూట్స్ పెద్ద పీట వేస్తున్నాయి. నాన్–ఇంజనీరింగ్ బ్యాచిలర్ డిగ్రీ విద్యార్థులకు కనిష్ఠంగా 15 శాతం, గరిష్ఠంగా 30 శాతం వెయిటేజీ కల్పిస్తున్నాయి.

**క్యాట్-2024 మలి దశ.. ముఖ్యాంశాలు**

- మలి దశలో గ్రూప్ డిస్కషన్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ.
- మేనేజ్‌మెంట్ కోర్సుల్లో చేరే ఉద్దేశం, భవిష్యత్తు లక్ష్యాలపై ఇంటర్వ్యూ.
- జీడీలో సమకాలీన అంశాలపై ఉన్న పరిజ్ఞానాన్ని పరిశీలిస్తున్న ఐఐఎంలు.
- దేశ వ్యాప్తంగా 21 ఐఐఎంలలో దాదాపు 5 వేల సీట్లు.

**కెరీర్ కౌన్సెలింగ్**
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

**నేటి భవిత ఈ పేపర్‌లో..**
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-జాగ్రఫీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- మెంటల్ ఎబిలిటీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- రీజనింగ్

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
13-1-2025

**స్టాక్ మార్కెట్లు** (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

| సెన్సెక్స్ ▽ | నిఫ్టీ ▽ |
|---|---|
| 241 | 95 |
| 77,379 | 23,431 |

విదేశీ సూచీలు

| సూచీ | ముగింపు | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 19,162 | ▽ | 317 |
| డోజోన్స్ | 41,956 | ▽ | 679 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 8,248 | ▽ | 71 |
| డాక్స్ | 20,215 | ▽ | 102 |
| షాంఘై | 3,169 | ▽ | 43 |
| నికాయ్ | 39,190 | ▽ | 415 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 84.48 | 86.50 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 105.80 | 108.66 |
| € | యూరో | ఎస్‌బీఐ | 87.27 | 89.87 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 53.68 | 55.01 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 52.22 | 54.40 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 60.50 | 65.19 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 22.03 | 23.58 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 22.52 | 24.30 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 10.84 | 12.67 |

# పన్ను ఆదా కోసం ఇన్వెస్ట్ చేస్తున్నారా?




- పెట్టుబడుల డిక్లరేషన్‌కు సమయం వచ్చేసింది
- యాజమాన్యాలకు 12బీబీ ఫారమ్ సమర్పించాలి
- దీని ఆధారంగానే ఉద్యోగుల నుంచి టీడీఎస్
- అందుబాటులో బోలెడు పెట్టుబడి సాధనాలు

ఉద్యోగులు తమ పెట్టుబడుల వివరాలను యాజమాన్యాలకు సమర్పించాల్సిన సమయం ఆసన్నమైంది. అన్ని ప్రైవేటు సంస్థలూ జనవరి, ఫిబ్రవరిలో ఉద్యోగుల నుంచి పన్ను ఆదా పెట్టుబడుల వివరాలను సమీకరిస్తాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏ సాధనాల్లో ఎంత పెట్టుబడులు పెట్టారు, వాటికి సంబంధించి వివరాలతో 12బీబీ ఫారమ్ సమర్పించాల్సి ఉంటుంది. ఆధారాలను కూడా జత చేయాలి. ఈ వివరాల ఆధారంగా ఉద్యోగి వార్షిక వేతన ప్రయోజనాలపై ఎంత పన్ను పడుతుందో అంచనాకు వచ్చి, ఆ మేరకు చివరి మూడు నెలల్లో వేతనాల నుంచి మినహాయించి ఆదాయపన్ను శాఖకు జమ చేస్తాయి. వీటి విషయంలో ఉద్యోగులు అవగాహనతో వ్యవహరించడం వల్ల అనవసర పెట్టుబడులను నివారించొచ్చు. పన్ను ఆదా కోసం ఏదో ఒక సాధనంలో ఇన్వెస్ట్ చేయకుండా, తమ లక్ష్యాలకు అనుకూలమైన సాధనాన్ని ఎంపిక చేసుకోవాలి. దీనిపై అవగాహన కల్పించే కథనమిది...

– సాక్షి, బిజినెస్‌డెస్క్

## కొత్త పన్ను విధానం

ఉద్యోగులు నూతన పన్ను విధానాన్ని ఎంపిక చేసుకుంటే, పెట్టుబడుల ఆధారాలు సమర్పించనక్కర్లేదు. నూతన పన్ను విధానంలో పెద్దగా మినహాయింపుల్లేవు. సెక్షన్ 87ఏ కింద రూ.7 లక్షల వరకు ఆదాయంపై రాయితీ లభిస్తుంది. రూ.75,000 స్టాండర్డ్ డిడక్షన్ ప్రయోజనం నేరుగా లభిస్తుంది. వీటితో కలిపితే రూ.7,75,000 లక్షల వరకు ఆదాయం ఉన్న వారు పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఆదాయం ఇంతకు మించితే నిబంధనల మేరకు పన్ను చెల్లించాలి. సెక్షన్ 80సీసీడీ(2) కింద తమ మూలవేతనం, డీఏలో 14 శాతాన్ని పనిచేసే సంస్థ ద్వారా ఎన్‌పీఎస్ ఖాతాలో జమ చేయించుకుంటే, అంత మేరకు పన్ను లేకుండా చూసుకోవచ్చు. కన్వేయన్స్, ట్రావెల్ అలవెన్స్ ప్రయోజనాలపైనా పన్ను మినహాయింపు పొందొచ్చు. ఉదాహరణకు ఆఫీస్ పనిపై వేరే ప్రాంతానికి వెళ్లి చేసే ఖర్చును తిరిగి పొందడం ద్వారా ఆ మొత్తంపైనా పన్ను చెల్లించక్కర్లేదు. ఆఫీస్‌కు వచ్చి పోయేందుకు చేసే చెల్లింపులపై ప్రతి నెలా రూ.1,600 మొత్తంపైనా పన్ను లేదు.

| ఆదాయ శ్లాబులు | రేటు(%) పన్ను |
|---|---|
| రూ.3 లక్షల వరకు | లేదు |
| రూ.3-7 లక్షలు | 5 |
| రూ.7-10 లక్షలు | 10 |
| రూ.10-12 లక్షలు | 15 |
| రూ.12-15 లక్షలు | 20 |
| రూ.15 లక్షలు దాటితే | 30 |




## పాత పన్ను విధానం

పాత విధానంలో రూ. 5 లక్షల వరకు ఆదాయంపై సెక్షన్ 87ఏ కింద రాయితీ ఉంది. రూ.50,000 స్టాండర్డ్ డిడక్షన్ ప్రయోజనం కూడా ఉంది. సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షలు, 80డీ కింద రూ.25,000–75,000, 80సీసీడీ(1బి) కింద రూ.50,000, హౌస్ రెంట్ అలవెన్స్‌పై మినహాయింపు పొందొచ్చు. కొత్త విధానంలో మాదిరే కన్వేయన్స్, ట్రావెల్స్ ఎక్స్‌పెన్స్‌పై మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. గృహ రుణం ఈఎంఐలు చెల్లిస్తున్నట్టు అయితే. ఈఎంఐలో అసలు భాగాన్ని సెక్షన్ 80సీ కింద, వడ్డీ భాగాన్ని సెక్షన్ 24 కింద చూపించుకోవచ్చు. ఇంటిని సొంతానికి వినియోగిస్తుంటే గృహ రుణంపై ఎంత వడ్డీ చెల్లించినా.. గరిష్టంగా రూ.2 లక్షలపైనే పన్ను చెల్లించక్కర్లేదు. అదే ఇంటిని అద్దెకు ఇస్తే.. ఒక ఆర్థిక సంవత్సరంలో గృహ రుణం కోసం చేసే వడ్డీ చెల్లింపులు మొత్తంపై (పరిమితి లేకుండా) పన్ను లేకుండా చూసుకోవచ్చు. కేవలం 80సీ పరిధిలోని పన్ను ప్రయోజనాలకే పరిమితమైతే రూ.7 లక్షల ఆదాయంపై పన్ను పడదు. హెచ్‌ఆర్‌ఏ, హెల్త్ ఇన్సూరెన్స్, ఎన్‌పీఎస్, గృహ రుణంపై ప్రయోజనాలను వినియోగించుకుంటే రూ.10.25 లక్షల ఆదాయం వరకు పన్ను బాధ్యత లేకుండా చూసుకోవచ్చు.

| ఆదాయ శ్లాబు | పన్ను రేటు(%) |
|---|---|
| రూ.2.5 లక్షలు | లేదు |
| రూ.2.5-5 లక్షలు | 5 |
| రూ.5-10 లక్షలు | 20 |
| రూ.10 లక్షలు మించితే | 30 |

## ఎంపికలో జాగ్రత్త?

వేతన జీవులు (వేతనం రూపంలోనే ఆదాయం ఉన్న వారు) ఏటా పాత, కొత్త విధానంలో ఎందులో అయినా రిటర్నులు సమర్పించొచ్చు. ఒకవేళ పనిచేసే సంస్థకు తన పన్ను విధానం గురించి వెల్లడించని సందర్భంలో.. కొత్త పన్ను విధానంలోనే యాజమాన్యం టీడీఎస్‌ను మినహాయిస్తుంది. పెట్టుబడుల డిక్లరేషన్ సమయంలో యాజమాన్యాలు పన్ను విధానం మార్చుకునేందుకు అనుమతించకపోవచ్చు. అయినప్పటికీ రిటర్నులు సమర్పించే తరుణంలో తమకు అనుకూలమైన విధానాన్ని ఎంపిక చేసుకోవచ్చు. యాజమాన్యం ఉద్యోగి నుంచి పన్ను కోత విధించినప్పటికీ, రిటర్నులు సమర్పించిన అనంతరం రిఫండ్ కోరొచ్చు.





## ముందస్తు ప్రణాళిక

ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే పన్ను ఆదాకు సంబంధించి పెట్టుబడుల ప్రణాళిక వేసుకోవడం మెరుగైన మార్గం అవుతుంది. అయినా, ఇప్పటికీ చాలా మంది ఆర్థిక సంవత్సరం చివర్లోనే వీటి గురించి పట్టించుకుంటూ ఉంటారు. ''పన్ను మినహాయింపులను గరిష్ట స్థాయిలో వినియోగించుకోవాలంటే ముందుగానే ఈ దిశగా ప్రణాళిక వేసుకోవాలి. కొత్త పన్ను విధానాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. కానీ, పాత పన్ను విధానం పొదుపును, లక్ష్యం ఆధారిత పెట్టుబడులను ప్రోత్సహిస్తోంది'' అని ట్యాక్స్‌స్పానర్ డాట్ కామ్ కోఫౌండర్ సుధీర్ కౌశిక్ తెలిపారు. సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనం కోసం లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకోవడం మెరుగైన నిర్ణయం కాబోదు. వీటికి బదులు సెక్షన్ 80సీ పరిధిలో ఇతర సాధనాలను పరిశీలించాలి.

## సెక్షన్ 80సీ అర్హత సాధనాలు

| సాధనం | లాకిన్/మెచ్యూరిటీ | వార్షిక రాబడి |
|---|---|---|
| ఈఎల్ఎస్ఎస్ | మూడేళ్లు | మార్కెట్ ఆధారితం |
| ఎన్‌పీఎస్ | 60 ఏళ్లు నిండే వరకు | మార్కెట్ ఆధారితం |
| సుకన్య సమృద్ధి | కుమార్తెకు 21 ఏళ్లు వచ్చే వరకు | 8.2 శాతం |
| పీపీఎఫ్ | 15ఏళ్లు | 7.1 |
| ఎన్ఎస్‌సీ | ఐదేళ్లు | 7.7 |
| ఎస్‌సీఎస్ఎస్ | ఐదేళ్లు | 8.2 |
| పోస్టాఫీస్ టైమ్ డిపాజిట్ | ఐదేళ్లు | 7.5 |
| ట్యాక్స్ సేవింగ్ బ్యాంక్ | ఎఫ్‌డీ | 6.5-7.5 |

- ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్‌పై దీర్ఘకాలంలో (పదేళ్లకు మించి) 12–15% మధ్య రాబడులు ఉంటాయని అంచనా. గత చరిత్రను గమనిస్తే ఇవి దీర్ఘకాలంలో 25% వరకు వార్షిక రాబడిని ఇచ్చాయి.




- సుకన్య పథకం మెచ్యూరిటీ బాలిక వయసు 21 ఏళ్లు నిండిన వెంటనే ముగుస్తుంది. లేదా బాలిక వయసు 18 ఏళ్లు నిండి, 21 ఏళ్లలోపే వివాహం నిశ్చయమైన సందర్భంలోనూ క్లోజ్ చేసుకోవచ్చు.
- ఎన్‌పీఎస్‌లో ఈక్విటీ పెట్టుబడులపై మూడేళ్లలో వార్షిక సగటు రాబడి వివిధ ఫండ్ మేనేజర్ల మధ్య వేర్వేరుగా ఉంది. 15.80 శాతం నుంచి 17.55 శాతం మధ్య ఉంది. ఐదేళ్లలో 19 శాతం నుంచి 21.17 శాతం మధ్య ఉంది. ఏడేళ్లలో 14.69 శాతం నుంచి 16.01 శాతం మధ్య ఉంది. ఈక్విటీ, డెట్‌తో కూడిన ఎంపికపై రాబడులు దీర్ఘకాలంలో 9–12 శాతం మధ్య ఉంటాయని అంచనా.

## నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)




ప్రైవేటు రంగ ఉద్యోగులు తమ మూల వేతనం, డీఏలో 10 శాతాన్ని ఎన్‌పీఎస్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. వీరు 80సీసీడీ(1) కింద పాత విధానంలో పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. 80సీ రూ.1.5 లక్షల పరిధిలోనే 80సీడీసీ(1) భాగంగా ఉంటుంది. దీనికి అదనంగా 80సీసీడీ(1బి) కింద మరో రూ.50,000 ఇన్వెస్ట్ చేసి, ఆ మొత్తంపైనా పన్ను లేకుండా చూసుకోవచ్చు. సెక్షన్ 80సీసీడీ(2) కింద కార్పొరేట్ ఎన్‌పీఎస్ ప్రయోజనం కూడా ఉంది. పనిచేసే సంస్థ అనుమతిస్తే పాత, కొత్త విధానాల్లో ఈ ప్రయోజనాన్ని వినియోగించుకోవచ్చని కౌశిక్ తెలిపారు. పాత పన్ను విధానంలో మూలవేతనం, డీఏలో 10 శాతం, కొత్త విధానంలో 14 శాతం చొప్పున యాజమాన్యం జమలపై పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చని చెప్పారు.

## వైద్య వ్యయాలపై మినహాయింపులు



ఆరోగ్యం కోసం చేసే వ్యయాలకు సెక్షన్ 80డీ కింద పన్ను ప్రయోజనాలున్నాయి. పన్ను చెల్లింపుదారు, తన జీవిత భాగస్వామి, పిల్లల కోసం హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకుని ప్రీమియం చెల్లిస్తుంటే.. గరిష్టంగా రూ.25,000 వరకు ఒక ఆర్థిక సంవత్సరంలో పన్ను మినహాయింపు పొందొచ్చు. ఒకవేళ అదే వ్యక్తి తన జీవిత భాగస్వామి, పిల్లలతోపాటు 60 ఏళ్ల వయసు లోపు తన తల్లిదండ్రుల కోసం హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తుంటే అప్పుడు రూ.50,000 మొత్తంపై పన్ను మినహాయింపు పొందొచ్చు. ఇక పన్ను చెల్లింపుదారు తన కుటుంబంతోపాటు 60 ఏళ్లు నిండిన తల్లిదండ్రుల కోసం హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తుంటే అప్పుడు గరిష్టంగా రూ.75 వేల వరకు (తన కుటుంబానికి రూ.25 వేలు, తల్లిదండ్రులకు రూ.50 వేలు) పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఒకవేళ పన్ను చెల్లింపుదారు, జీవిత భాగస్వామి, పిల్లలతో కూడిన కుటుంబంలో ఒకరి వయసు 60 ఏళ్లు నిండి, వీరితోపాటు 60 ఏళ్లు నిండిన తల్లిదండ్రులకు సైతం హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తుంటే అప్పుడు చెరో రూ.50 వేలు చొప్పున మొత్తం రూ.1,00,000 వరకు పన్ను మినహాయింపు ప్రయోజనం ఈ సెక్షన్ కింద ఉంది. వేతన జీవుల వయసు 60 ఏళ్లలోపే ఉంటుంది కనుక, వీరు తమ కుటుంబం, తమ తల్లిదండ్రుల పేరిట మొత్తంగా రూ.75,000పై పన్ను మినహాయింపు ప్రయోజనం పొందొచ్చు. హెల్త్ చెకప్‌ల కోసం చేసే వ్యయం రూ.5,000 వరకు ఈ సెక్షన్ కింద గరిష్ట పరిమితి లోపు చూపించుకోవచ్చు.

## పిల్లల ట్యూషన్ ఫీజులు



పిల్లల ట్యూషన్ ఫీజుల భారాన్ని సెక్షన్ 80సీ కింద చూపించుకోవడం ద్వారా పన్ను భారాన్ని దింపుకోవచ్చు. ముఖ్యంగా దంపతులు ఇద్దరూ ఉద్యోగులు అయితే, ఇరువురూ ఈ ప్రయోజనాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చు. ఉదాహరణకు ఇద్దరు పిల్లల కోసం ట్యూషన్ ఫీజు రూ.2.5 లక్షలు ఖర్చు చేశారనుకుందాం. అప్పుడు ఒకరు రూ.1.5 లక్షల, మరొకరు రూ.1 లక్ష వరకు క్లెయిమ్ చేసుకోవచ్చు. సెక్షన్ 80సీ రూ.1.5 లక్షల్లో ఇతర పెట్టుబడులు పోగా, మిగిలిన మొత్తానికి దంపతులు ఇద్దరూ ట్యూషన్ ఫీజులో తమకు కావాల్సినంత చూపించుకుని, అంత వరకే క్లెయిమ్ చేసుకోవచ్చు. స్కూల్ డొనేషన్, బస్సు చార్జీలు, స్పోర్ట్స్ తదితర వాటి కోసం చేసే చెల్లింపులపై పన్ను మినహాయింపుల్లేవు.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

13-1-2025

| | |
|---|---|
| విశాఖ | 520-00 |
| చిత్తూరు | 523-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 515-00 |
| విజయవాడ | 515-00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| హైదరాబాద్ | 490-00 |
| వరంగల్ | 492-00 |
| రిటైల్ ధర | 5.50 |

## కొటక్ నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 ఇండెక్స్ ఫండ్


కొటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ కొత్తగా కొటక్ నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 ఇండెక్స్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ జనవరి 20 వరకు అందుబాటులో ఉంటుంది. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 సూచీని ప్రతిబింబించేదిగా ఇది ఉంటుంది. వివిధ రంగాలవ్యాప్తంగా స్మాల్ క్యాప్ కంపెనీల శ్రేణిలో ఇన్వెస్ట్ చేసేందుకు ఈ ఫండ్ అవకాశం కల్పిస్తుందని కొటక్ మహీంద్రా ఏఎంసీ ఎండీ నీలేష్ షా తెలిపారు. ప్రస్తుతం వేల్యుయేషన్లు అధిక స్థాయిలో ఉన్నందున దీర్ఘకాలిక దృష్టికోణంతోనే పెట్టుబడులు పెట్టాలని సూచించారు.




'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
మార్కెట్‌పై గణాంకాలు, ఫలితాల ఎఫెక్ట్
సులభతర వ్యాపారానికి సీఐఐ 10 సిఫార్సులు

## బ్యాటరీ చార్జింగ్ స్టేషన్లకు మార్గదర్శకాలు

న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని మరింత ప్రోత్సహించే దిశగా కేంద్ర విద్యుత్‌శాఖ బ్యాటరీ చార్జింగ్ మౌలిక సదుపాయాలకు సంబంధించి మార్గదర్శకాలను విడుదల చేసింది. వీటి ప్రకారం బ్యాటరీ చార్జింగ్ స్టేషన్లు (బీసీఎస్), బ్యాటరీ స్వాపింగ్ స్టేషన్ల (బీఎస్ఎస్) ఓనర్లు, మార్పు కోతగిన బ్యాటరీలను చార్జ్ చేసేందుకు ప్రస్తుతమున్న విద్యుత్ కనెక్షన్‌నే ఉపయోగించుకోవచ్చు. కనెక్టెడ్ లోడ్‌ను పెంచుకున్నా, పెంచుకోకపోయినా ఈ వెసులుబాటును ఉపయోగించుకోవచ్చు. మెరుగైన స్వాపింగ్, చార్జింగ్ కోసం ట్రక్కులు, బస్సులు లాంటి భారీ వాహనాలు లిక్విడ్-కూల్డ్ స్వాపబుల్ బ్యాటరీలను వినియోగించవచ్చు.



## మనవడి భవిష్యత్తుకు ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి?

**Q & A**





ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

**నేను మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసిన ప్రతిసారీ నాకు కేటాయించే యూనిట్ల విలువ కొంత తక్కువగా ఉంటుంది. కాకపోతే నా పెట్టుబడులు, నాకు కేటాయించే యూనిట్ల మధ్య వ్యత్యాసం చాలా స్వల్పంగానే ఉంటోంది. ఎందుకు ఇలా?**

– నంబూద్రి ప్రసాద్

మీరు గుర్తించిన ఈ స్వల్ప వ్యత్యాసం అన్నది మీ ప్రతి పెట్టుబడికి సంబంధించి మినహాయించే స్టాంప్ డ్యూటీ. అన్ని మ్యూచువల్ ఫండ్స్ కొనుగోళ్లకు దీన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. పెట్టుబడి విలువపై 0.005 శాతాన్ని స్టాంప్ డ్యూటీ చార్జీ కింద వసూలు చేస్తారు. ప్రతి పెట్టుబడి మొత్తంలో ఈ మేరకు మినహాయించగా, మిగిలిన మొత్తానికి యూనిట్ల కేటాయింపు జరుగుతుంది. ఉదాహరణకు సిప్ రూపంలో రూ.5,000 ఇన్వెస్ట్ చేశారు. ఇందులో 0.005 శాతం అంటే రూ.0.25 అవుతుంది. అప్పుడు రూ.4,999.75 మొత్తం పెట్టుబడి కిందకు వెళుతుంది. సిప్‌లు, ఏక మొత్తంలో పెట్టుబడులు, డివిడెండ్ రీ ఇన్వెస్ట్‌మెంట్ లావాదేవీలు అన్నింటికీ వర్తిస్తుంది. ఒక మ్యూచువల్ ఫండ్ నుంచి మరో మ్యూచువల్ ఫండ్‌లోకి బదిలీ, మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల ఉపసంహరణకు స్టాంప్ డ్యూటీ వర్తించదు. చట్టపరమైన ఈ చార్జీల గురించి పెద్దగా ఆలోచించకుండా, పెట్టుబడుల ప్రణాళిక, దీర్ఘకాలిక లక్ష్యాలపై దృష్టి సారించండి.

**నా మూడేళ్ల మనవడి భవిష్యత్ అవసరాల కోసం ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. ఇందుకు అనుకూలించే ఫండ్స్ ఏవి? వాటి విషయంలో ఎలా వ్యవహరించాలి?**

– రవిగుప్తా

పిల్లల ఉన్నత విద్య కోసం ఈక్విటీ, అగ్రెస్సివ్ ఈక్విటీ ఫండ్స్ అనుకూలంగా ఉంటాయి. ఈక్విటీ పెట్టుబడుల పట్ల సౌకర్యంగా లేకపోతే అప్పుడు అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. దీనికి అదనంగా ఒకటి లేదా రెండు మిడ్‌క్యాప్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. 15 ఏళ్ల కాలంలో మార్కెట్లు ఎన్నో ఎత్తు పల్లాలు చూసినప్పటికీ డైవర్సిఫైడ్ పోర్ట్‌ఫోలియో (వైవిధ్యమైన పెట్టుబడులతో కూడిన) మెరుగైన రాబడులు ఇస్తుంది. కాకపోతే పెట్టుబడులు అలాగే కొనసాగించి, మధ్య మధ్యలో వచ్చే మార్కెట్ పతనాలను పట్టించుకోకుండా ఉంటే చాలు. మార్కెట్ ఊగిసలాటల్లో పెట్టుబడులు కొనసాగించడం ద్వారానే దీర్ఘకాలంలో విజయం సాధించగలరు. మనవడు, మనవరాలి భవిష్యత్ అవసరాల కోసం ఇన్వెస్ట్ చేసుకునేందుకు రెండు రకాల విధానాలను అనుసరించొచ్చు. చిన్నారి పేరు మీద బ్యాంక్ ఖాతా తెరవాలి. ఈ ఖాతాలోకి నగదు బదిలీ చేయాలి. తర్వాత ఎంపిక చేసిన పథకాల్లో ఇన్వెస్ట్ చేయాలి. మనవడి పేరు మీదే ఖాతా ఉంటుంది కనుక 18 ఏళ్లు నిండిన తర్వాత సంబంధిత ఖాతా యాజమాన్య హక్కులు చిన్నారికి బదిలీ చేయవచ్చు. లేదంటే మీ మనవడికి బదులు మీ పేరు మీదే పెట్టుబడులు పెట్టుకోవడం మరొక ఆప్షన్. మనవడికి 18 ఏళ్లు నిండగానే, ఆ పెట్టుబడులను ఉపహరించుకుని ఆ మొత్తాన్ని మనవడికి గిఫ్ట్ కింద బదిలీ చేయవచ్చు. అప్పటి వరకు ఆ పెట్టుబడులకు నామినీగా మనవడి (మైనర్)ని ప్రతిపాదించొచ్చు.



### కల్పతరు ప్రాజెక్ట్స్

**బ్రోకరేజ్: ఎమ్‌కే గ్లోబల్** | **కొనొచ్చు**

**ప్రస్తుత ధర: రూ. 1,204 టార్గెట్: రూ. 1,550**

**ఎందుకంటే:** మౌలిక సదుపాయాల దిగ్గజం కల్పతరు ప్రాజెక్ట్స్ ఇంటర్నేషనల్ టార్గెట్ ధరను రూ. 1,450 నుంచి రూ. 1,550కు పెంచుతున్నాం. మరిన్ని కాంట్రాక్టులను అందుకోనున్న పరిస్థితులు ఇందుకు తోడ్పాటునిస్తున్నాయి. ప్రధానంగా దేశ, విదేశాలలో విద్యుత్ ప్రసారం, పంపిణీ(టీఅండ్‌డీ) బిజినెస్‌కు.. బిల్డింగ్ అండ్ ఫ్యాక్టరీస్(బీఅండ్‌ఎఫ్) విభాగం జత కలవనుంది. నిలకడైన ఎగ్జిక్యూషన్, క్రమంగా పుంజుకుంటున్న నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు, వర్కింగ్ క్యాపిటల్‌పై కఠిన నియంత్రణలు వంటి అంశాలు తాజాగా టార్గెట్ ధర పెంపునకు ప్రోత్సాహాన్నిస్తున్నాయి. ఇప్పటివరకూ కంపెనీ ఆర్డర్ల రాక రూ. 16,300 కోట్లకు చేరింది. వీటిలో 85 శాతంవరకూ టీఅండ్‌డీ, బీఅండ్‌ఎఫ్ విభాగాల నుంచి అందుకుంది. పూర్తి చేయవలసిన ఆర్డర్ల విలువ రూ. 60,000 కోట్లవరకూ ఉంది. వెరసి భవిష్యత్‌లో పటిష్ట ఆదాయ వృద్ధికి దారి చూపుతున్నాయి. షేరుకి రూ. 1,215 ధరలో కంపెనీ యాజమాన్యం అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ(క్విప్) ద్వారా నిధులు సమకూర్చుకుంది. కంపెనీకి కీలకంకాని ఆస్తుల విక్రయం ద్వారా రూ. 650 కోట్ల క్యాష్‌ఫ్లో సాధించగలమని యాజమాన్యం భావిస్తోంది. వీటిలో వింధ్యాచల్ ఎక్స్‌ప్రెస్ వే, ఇండోర్ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులున్నాయి. తద్వారా ఆర్ఓసీఈ సైతం మెరుగుపడనున్నట్లు అంచనా వేస్తోంది. ఎగ్జిక్యూషన్, నగదు వసూళ్ల(కలెక్షన్లు)పై ప్రత్యేక దృష్టి పెట్టడం ద్వారా కొన్నేళ్లుగా వర్కింగ్ క్యాపిటల్ అవసరాలను కంపెనీ నియంత్రిస్తూ వస్తోంది. దీంతో ప్రత్యర్థి కంపెనీలతో పోలిస్తే బ్యాలెన్స్‌షీట్‌ను ఆకర్షణీయస్థాయిలో నిర్వహిస్తోంది. అధిక వృద్ధికి వీలున్న మార్కెట్లలో కార్యకలాపాలు, మార్జిన్లను నిలుపుకోవడం, విభిన్న పరిస్థితుల్లోనూ నికర వర్కింగ్ క్యాపిటల్(ఎన్‌డబ్ల్యూసీ) నిర్వహణ కంపెనీ బలాలుగా పేర్కొనవచ్చు.






### దీప్ ఇండస్ట్రీస్

**బ్రోకరేజ్: యూఎల్‌జేకే రీసెర్చ్** | **కొనొచ్చు**

**ప్రస్తుత ధర: రూ. 572 టార్గెట్: రూ. 690**

**ఎందుకంటే:** చమురు, గ్యాస్ రంగంలో వన్ స్టాప్ సొల్యూషన్‌గా నిలుస్తున్న దీప్ ఇండస్ట్రీస్ ప్రధానంగా డ్రిల్లింగ్, వర్క్‌ఓవర్, గ్యాస్ డీహైడ్రేషన్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ సర్వీసులు సమకూర్చుతోంది. కంపెనీ 9 వర్క్‌ఓవర్ రిగ్గులకుతోడు మరో 2 రిగ్గులను జత చేసుకునే యోచనలో ఉంది. 5 డ్రిల్లింగ్ రిగ్గులుసహా అదనంగా మరొకటి పనులకు సిద్ధంగా ఉంది. ఈ విభాగం కంపెనీ మొత్తం ఆదాయంలో 33 శాతం వాటా ఆక్రమిస్తోంది. 40 శాతం మార్జిన్లను సాధిస్తోంది. 25 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది. ఇక నేచురల్ గ్యాస్ కంప్రెషన్ విభాగం సర్వీసులు 90 శాతం మార్కెట్ వాటాను ఆక్రమిస్తోంది. మొత్తం ఆదాయంలో 37 శాతం వాటాను సాధిస్తోంది. మార్జిన్లు 60 శాతంగా నమోదయ్యాయి. వార్షికంగా ఈ విభాగం 15 శాతం పురోగతిని అందుకోగలదని అంచనా. నేచురల్ గ్యాస్ డీహైడ్రేషన్ విభాగం 55 శాతం మార్జిన్లతో మొత్తం ఆదాయంలో 10 శాతం వాటాను సమకూర్చుతోంది. రూ. 75-80 కోట్ల పెట్టుబడులతో కొత్తగా ఏర్పాటు చేసిన నేచురల్ గ్యాస్ ప్రాసెసింగ్ విభాగం ఒకే ప్యాకేజీగా విభిన్న సర్వీసులను అందిస్తోంది. ఈ విభాగం నెలకు రూ. 4 కోట్లు చొప్పున ఆదాయం ఆర్జించనున్నట్లు అంచనా. సమీకృత ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ సర్వీసులు 30 శాతం మార్జిన్లతో మొత్తం ఆదాయంలో 10-15 శాతం వాటాను ఆక్రమిస్తున్నాయి. దేశీయంగా ఈ విభాగంలో సర్వసులందిస్తున్న ఏకైక కంపెనీగా దీప్ నిలుస్తోంది. కొత్త రిగ్గులను జత కలుపుకునే ప్రణాళికలు, ప్రభ పేరున ఏర్పాటు చేసిన బార్జ్, నేచురల్ గ్యాస్ ప్రాసెసింగ్ సర్వీసులు తదితరాల ద్వారా కంపెనీ అమలు చేస్తున్న విస్తరణ ప్రణాళికలు వృద్ధి బాటలో కొనసాగేందుకు సహకరించనున్నాయి. ఇటీవల ఓఎన్‌జీసీ నుంచి లభించిన రూ. 1,402 కోట్ల కాంట్రాక్ట్, పటిష్ట ఆర్డర్ బుక్ ఆదాయ వృద్ధికి వీలు కల్పిస్తున్నాయి.





## పతంగి ఎగరేద్దామా బసవా!

లంగర్‌హౌస్‌లో పతంగులు కొనుగోలు చేస్తున్న యువతులు.. శిల్పారామంలో గంగిరెద్దు ఆటను తిలకిస్తున్న విదేశీ వనితలు





## శ్రీరామాలంకారంలో యాదగిరీశుడు



యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడవ రోజైన ఆదివారం ఉదయం శ్రీస్వామివారు శ్రీరామాలంకారం, రాత్రి శ్రీవెంకటేశ్వరస్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలంకార సేవలను ఆలయ తిరు, మాఢ వీధుల్లో ఊరేగించగా, భక్తులు దర్శించుకుని తన్మయత్వం పొందారు. ఈ వేడుకల్లో దేవస్థానం ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, అర్చకులు, పారాయణీకులు, వేద పండితులు పాల్గొన్నారు.

## గవర్నర్ భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సమృద్ధి, సంతోషాలకు ప్రతీక ఈ పండుగ అని, అందరి జీవితాల్లో సుఖసంతోషాలు, సౌభాగ్యం, ఆయురారోగ్యాలు రావాలని ప్రార్థించారు. మన సాంస్కృతిక వారసత్వంలో గొప్ప ప్రాముఖ్యతను కలిగి ఉన్న ఈ పండుగలను అపారమైన ఆనందోత్సాహాలతో జరుపుకుంటారని తెలిపారు.

## కొత్త వెలుగులు తెస్తుంది



తెలుగు ప్రజలందరికీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగభాగ్యాలను అందించే భోగి.. కొత్త కాంతులు తెచ్చే సంక్రాంతి.. కనుమ పండుగలను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని దాదాపు కోటి మంది రైతులు, నిరుపేదలు, వ్యవసాయ కూలీ కుటుంబాల్లో ఈ పండుగ కొత్త వెలుగులు తెస్తుందని అన్నారు. రైతు భరోసాను రూ.12 వేలకు పెంచటంతో పాటు వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నగదు సాయం, ఆహార భద్రతను అందించే కొత్త రేషన్ కార్డులు, గూడులేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసే నాలుగు సంక్షేమ పథకాల అమలుకు సంక్రాంతి పండుగ నాంది పలుకుతోందని చెప్పారు. ప్రజలందరూ సంతోషంగా తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా పండుగ సంబురాలు జరుపుకోవాలని సీఎం కోరారు.

## సుఖసంతోషాల పండుగ: భట్టి



రాష్ట్ర ప్రజల జీవితాల్లో సంక్రాంతి పండుగ సుఖసంతోషాలను నింపాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన రాష్ట్ర ప్రజలకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సిరి సంపదలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

## సానుకూల మార్పులకు సంకేతం




సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతిఇంటా ఆనందాలు వెల్లివిరియాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆకాంక్షించారు. తెలుగు ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులకు సంక్రాంతి సంకేతం కావాలని, ప్రజలంతా సుఖ శాంతులతో, సిరి సంపదలతో తులతూగాలని ఆయన ఆకాంక్షించారు.

# భవిత ఏఐతుందో..?

- యువతలో గుబులు పుట్టిస్తున్న కృత్రిమ మేధ సాంకేతిక పరిజ్ఞానం
- లార్జ్ లాంగ్వేజ్ మాడ్యూల్స్‌తో జాబ్స్‌కు గండి తప్పదని ఆందోళన
- ఆ భావన సరికాదంటున్న నిపుణులు
- వృత్తి నైపుణ్యం పెంచుకుంటే ఉద్యోగాలకు ధోకా ఉండదని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) శరవేగంగా దూసుకొస్తోంది. అన్ని రంగాలనూ ప్రభావితం చేస్తోంది. ఈ టెక్నాలజీ వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కొన్ని సంస్థలు చెబుతుంటే మరికొన్ని సంస్థలు మాత్రం ఏఐ రాకతో ఉపాధికి గండి తప్పదని వాదిస్తున్నాయి. అయితే వృత్తి నైపుణ్యం, సాంకేతికతతో పోటీ పడే సామర్థ్యం పెంపొందించుకోవడం ద్వారానే యువత ఉపాధికి ధోకా ఉండదని నిపుణులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో ఏఐ భాషా విధానంపై విశ్వవ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు పలు సంస్థలు రంగంలోకి దిగాయి.




### ఏఐ స్పీడ్ ఎంత?

గ్లోబల్ సిస్టమ్ అనే సంస్థ రూపొందించిన తాజా నివేదిక ప్రకారం ఏఐ వేగం కోసం భారత్ పరుగులు పెడుతోంది. తెలంగాణ సహా దేశంలోని అన్ని ప్రధాన ఐటీ నగరాలు ఏఐ టెక్నాలజీపై విస్తృతంగా పనిచేస్తున్నాయి. ఏఐ స్టార్టప్స్‌లో బెంగళూరు 21వ స్థానంలో, ఢిల్లీ 24, ముంబై 37, హైదరాబాద్ 41వ స్థానంలో ఉందని ఆ సంస్థ పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ సంస్థలు ఏఐపై 40 వేల కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టినట్లు స్కిల్ ఇండియా పేర్కొంది. మొత్తం 67200 కృత్రిమ మేధ సంస్థలున్నాయి. అందులో 25 శాతం అమెరికాలోనే ఉన్నాయి. భారత్‌లో 1,67,000 స్టార్టప్స్ ఉంటే వాటిలో 6,636 సంస్థలు ఏఐపైనే పనిచేస్తున్నాయి. ఇవి ఈ రంగంపై రూ. లక్ష కోట్లు పెట్టుబడులు పెట్టాయి. దేశంలోని ఆరోగ్య సేవా సంస్థలు ఏఐను ఉపయోగించి టెలి మెడిసిన్, వ్యక్తిగత ఆరోగ్య సేవలు, ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్ చేస్తున్నాయి. దేశీయ వైద్య సాంకేతికతల రంగంలో సుమారు 12 వేల స్టార్టప్స్ పనిచేస్తున్నాయి. ఫిన్‌టెక్ రంగంలో ఉన్న ఏఐ పెట్టుబడుల విలువ 90 వేల కోట్ల డాలర్లు. 2021లో దేశంలో 2,100 ఫిన్‌టెక్ కంపెనీలు ఉండగా ఇప్పుడు 10,200కు చేరాయి. స్టార్టప్ రంగంలో వ్యవస్థాపక పెట్టుబడులు 2021లో 53 వేల కోట్ల డాలర్లు. 2023 నాటికి భారీగా పెరిగింది.

### భారత్‌లో ఏటా బయటికొస్తున్న సాంకేతిక గ్రాడ్యుయేట్లు

| | |
|---|---|
| ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ | 8.30 |
| ఐటీ అండ్ కంప్యూటర్స్ | 2.68 |
| పీజీ (పైరెండు విభాగాలు) | 1.25 |
| పాలిటెక్నిక్ | 3.29 |

మొత్తం విభాగాల వారీగా పట్టభద్రులు 15.52 లక్షలు

### ఇప్పుడున్న స్కిల్స్ ఇలా

| | |
|---|---|
| ఇంజనీరింగ్ పట్టభద్రుల్లో | 60% |
| పరిశ్రమల ప్రమాణాలు అందుకుంటున్న వారు | 45% |
| ఏఐ కొత్త సాంకేతికతల్లో నైపుణ్యాల కొరత | 25%-30% |
| ఉపాధి పొందే అవకాశం ఉన్న వారు | 10%-15% |

### ఉపాధికి విఘాతమా?

స్కిల్ ఇండియా నివేదిక ప్రకారం దేశంలో 2026 నాటికి 10 లక్షల మంది ఏఐ నిపుణుల అవసరం ఉంది. దాదాపు 152 సంస్థల అవసరాలు, 3.88 లక్షల మంది నిపుణుల అభిప్రాయాలతో ఈ నివేదిక రూపొందింది. 2023 ఆగస్టు లెక్కల ప్రకారం దేశంలో 4.16 లక్షల మంది ఏఐ నిపుణులు ఉండగా ప్రస్తుతం 6.29 లక్షల మంది అవసరం ఉందని నివేదిక అంచనా వేసింది. ప్రపంచ మేధో సంపత్తి ఆర్థిక నవీకరణ సూచీ-2024 ప్రకారం 133 దేశాలతో కూడిన ఈ జాబితాలో భారత్ 39వ స్థానంలో ఉంది. 2015లో 81వ స్థానంలో ఉంది. అంటే ఏఐ ఎంత వేగంగా దూసుకెళ్తుందో అర్థం చేసుకోవాలని నిపుణులు అంటున్నారు. అయితే ఏఐలో కీలకమైన లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎం)పైనే యువతలో ఆందోళన ఉంది. ఇవి మానవ మేధస్సును మించి పనిచేస్తాయని.. దీనివల్ల మానవ వనరుల అవసరం ఉండదని భావిస్తున్నారు. కానీ ఈ భావనను నీలమ్ కర్న్ అనే ఏఐ నిపుణుడు తోసిపుచ్చుతున్నారు. ఎల్ఎల్ఎంలకు సరికొత్త ప్రోగ్రామ్ ఇవ్వగల స్థాయికి మన యువత ఎదగడం సాధ్యమేనని అంటున్నారు. అప్పుడు ఏఐని మించిన మేధోశక్తి మనకు ఉంటుందని చెబుతున్నారు.

### ఏఐతో పోటీ తప్పదు

సర్వీస్ సెక్టార్‌లో మార్పులొస్తున్నాయి. ఇప్పటి వరకు డెవాప్స్‌పై పనిచేశా. ఏఐ టెక్నాలజీ అంతర్లీనంగా ప్రభావం చూపిస్తోంది. టెక్నాలజీ మార్పు అనివార్యమని గుర్తించా. పదేళ్ల సీనియారిటీ ఉన్న నాకు ఏఐతో పోటీ పడే పరిస్థితి వచ్చింది. ఇది అనివార్యమనే భావిస్తున్నా.

-శ్రీరాంకుట్టి (ఏఐ స్టార్టప్ ఉద్యోగి)

### ఆందోళన తొలగించాలి

టెక్నాలజీ వేగాన్ని అందుకోవాలంటే ఇప్పుడున్న మానవ వనరులకు శిక్షణ అవసరం. కొత్త సాంకేతికతపై ఆందోళన చెందుతుంటే మార్పు ఎలా సాధ్యం? కాకపోతే శిక్షణపై ప్రభుత్వాలు, ఐటీ సంస్థలు ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఏఐతో ఉద్యోగాలు పోతాయనే భయాన్ని తొలగించే ప్రయత్నం చేయాలి.

- నవీన్ చావ్లా (ఐటీ నిపుణుడు)

### ఏఐ వల్ల ఉద్యోగాలు పెరుగుతాయా? తగ్గుతాయా? అనే అంశంపై ఓ సంస్థ జరిపిన అభిప్రాయ సేకరణ వివరాలు.. (దేశాల వారీగా శాతాల్లో)

| దేశం | ఉపాధి పెరుగుతుంది | ఉపాధి పెరగదు |
|---|---|---|
| చైనా | 20 | 77 |
| ఇండోనేషియా | 74 | 23 |
| థాయ్‌లాండ్ | 71 | 24 |
| టర్కీ | 67 | 27 |
| మలేషియా | 65 | 29 |
| ఇండియా | 58 | 31 |

| | | |
|---|---|---|
| సింగపూర్ | 57 | 32 |
| దక్షిణాఫ్రికా | 52 | 42 |
| మెక్సికో | 47 | 44 |
| బ్రెజిల్ | 46 | 44 |
| ఫిలిప్పీన్స్ | 43 | 51 |
| ఐర్లాండ్ | 40 | 47 |
| కొలంబియా | 40 | 49 |
| పెరూ | 40 | 46 |


| | | |
|---|---|---|
| ఆస్ట్రేలియా | 38 | 49 |
| అర్జెంటీనా | 38 | 48 |
| స్పెయిన్ | 38 | 48 |
| దక్షిణ కొరియా | 37 | 54 |
| రుమేనియా | 37 | 54 |
| నెదర్లాండ్స్ | 36 | 54 |
| అమెరికా | 36 | 49 |
| చిలీ | 34 | 53 |

| | | |
|---|---|---|
| స్విట్జర్లాండ్ | 34 | 55 |
| ఫ్రాన్స్ | 33 | 52 |
| జపాన్ | 33 | 47 |
| కెనడా | 33 | 52 |
| స్వీడన్ | 33 | 54 |
| యునైటెడ్ కింగ్‌డమ్ | 32 | 54 |
| బెల్జియం | 31 | 58 |

| | | |
|---|---|---|
| ఇటలీ | 30 | 58 |
| పోలెండ్ | 29 | 58 |
| జర్మనీ | 29 | 59 |
| హంగేరీ | 24 | 65 |
| ప్రపంచ వ్యాప్తంగా సగటు | 43 | 46 |

## నో యువర్ డాక్టర్

**తన విద్యాభ్యాసం, ప్రాక్టీస్ వివరాలు తెలిసేలా ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన ఓ డాక్టర్**




ఫ్లెక్సీ విషయమై డాక్టర్ హరీశ్‌కుమార్‌ను 'సాక్షి' సంప్రదిస్తే 'నా చదువు నా పేషెంట్లకు తెలవాలనే ఉద్దేశంతోనే ఫ్లెక్సీ ఏర్పాటు చేశాను. ఏదో గొప్ప కోసం చేసింది కాదు' అని చెప్పారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ఆ ఆస్పత్రిలో అడుగుపెట్టగానే.. మీ డాక్టర్ గురించి తెలుసుకోండి అంటూ గోడపై ఓ ఫ్లెక్సీ కనిపిస్తుంది. ఆ ఫ్లెక్సీలో ఆయన చదువు, ప్రాక్టీస్‌కు సంబంధించిన అన్ని వివరాలూ ఉన్నాయి. పేషెంట్లు, వారితో వచ్చిన వారు ఈ ఫ్లెక్సీని ఆసక్తిగా చదువుతున్నారు. డాక్టర్లుగా చలామణి అవుతూ కొందరు నకిలీలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నేపథ్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని విష్ణు ఈఎన్‌టీ హాస్పిటల్ డాక్టర్ ఎస్. హరీశ్‌కుమార్ తన చదువు, వైద్యం గురించి వినూత్నంగా ఓ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఆయన పీజీ పూర్తి కాగానే కామారెడ్డికి చేరుకున్నారు. 2009 - 2016 వరకు కామారెడ్డి ఈఎన్‌టీ ఆస్పత్రిలో పనిచేశారు. 2016 నుంచి విష్ణు ఈఎన్‌టీ ఆస్పత్రిలో సేవలందిస్తున్నారు.


## 'కవ్వాల్'లో బర్డ్‌వాక్



వైట్ ఐ బజార్డ్

జన్నారం: మంచిర్యాల జిల్లా కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అడవుల్లో ఆదివారం బర్డ్‌వాక్ ఉత్సాహంగా సాగింది. వరంగల్, నిర్మల్, హైదరాబాద్, మంచిర్యాల జిల్లాలకు చెందిన 15 మంది పక్షి ప్రేమికులు దీనికి హాజరయ్యారు. హైకోర్టు స్పెషల్ ప్రభుత్వ ప్లీడర్ స్వరూప్ ఊరిల్లా, ఏజీపీ రవి కుమార్ కుటుంబసభ్యులతో కలసి వచ్చారు. వీరికి శనివారం రాత్రి బైసన్‌కుంటలో బస ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం వారు సమీపంలోని కుంటలో పక్షులను పరిశీలించారు. బైనాక్యులర్లతో పక్షులను వీక్షించారు. వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ గొడిసెల విజయ్, యూట్యూబర్లు కెమెరాల్లో పక్షులను బంధించారు. ఈ ప్రాంతంలో 30 రకాల పక్షులను గుర్తించినట్లు వారు తెలిపారు. బైసన్‌కుంట నుంచి నీలుగాయికుంట, మల్యాలవాచ్ టవర్ల వరకు సఫారీ ద్వారా వెళ్లారు. ఆయా ప్రాంతాల్లో కూడా పక్షులు, వన్యప్రాణుల ఫొటోలను తీసుకున్నారు. జిల్లా అటవీ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్ ఆదేశాల మేరకు రేంజ్ అధికారి సుష్మారావు ఆధ్వర్యంలో బర్డ్‌వాక్ నిర్వహించారు. బర్డ్‌వాక్‌కు వచ్చిన వారికి అధికారులు భోజనం, వసతి సౌకర్యాలను కల్పించారు.

# ఎలాగైనా వెళ్లాల్సిందే



గూడూరు టోల్‌ప్లాజా వద్ద బారులుదీరిన వాహనాలు

- ఆదివారం కూడా భారీగా తరలిన జనం
- పండుగకు ఇప్పటికే 30 లక్షల మందికి పైగా సొంతూళ్లకు..!

సాక్షి, హైదరాబాద్/ నెట్‌వర్క్ : సంక్రాంతి పండుగ వేళ...ప్రయాణాలు సాగుతూనే ఉన్నాయి. ఆదివారం కూడా మహానగరం పల్లెబాట పట్టింది. వారం రోజులుగా సుమారు 30 లక్షల మందికి పైగా నగరవాసులు సొంత ఊళ్లకు వెళ్లినట్టు అంచనా. తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాలకు రాకపోకలు సాగించే బస్సులు, రైళ్లు కిక్కిరిసిపోయాయి. సొంత వాహనాల్లోనూ ప్రజలు పెద్ద సంఖ్యలో బయలుదేరారు. సుమారు 8 లక్షల మందికి పైగా రైళ్లలో తరలివెళ్లినట్టు అధికారులు అంచనా వేశారు. ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో ఏపీ వైపు వెళ్లే బస్సులను కూకట్‌పల్లి, మియాపూర్, అమీర్‌పేట, లక్డీకాపూల్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్ మీదుగా నడిపారు. వరంగల్ వైపు వెళ్లే బస్సులను ఉప్పల్‌కే పరిమితం చేశారు. కొన్నింటిని సాగర్‌రోడ్డు, బీఎన్‌రెడ్డినగర్, హయత్‌నగర్ వరకు పరిమితం చేశారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ బస్సులు, ఇతర వాహనాల్లో కలిపి 12 లక్షల మందికి పైగా వెళ్లారు.

**హైవేలన్నీ వాహనాలతో నిండుగా..:** హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం కూడా రద్దీ కొన సాగింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ బస్టాండ్ జంక్షన్ వద్ద ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. పంతంగి టోల్‌ప్లాజా వద్ద తెల్లవారుజాము నుంచి రాత్రి 7 గంటల వరకు 65 వేల వాహనాలు వెళ్లాయి. నల్లగొండ జిల్లాలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకు 30 వేల వాహనాలు వెళ్లాయి. హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారిపై యాదాద్రి భువనగిరి జిల్లా గూడూరు టోల్‌ప్లాజా నుంచి సాధారణ రోజుల్లో 30వేల వరకు వాహనాలు రాకపోకలు సాగించగా, ఆదివారం 70 వేలకు పైగా వాహనాలు వెళ్లాయి. ఫాస్టాగ్ స్కానింగ్ ఆలస్యం కావడంతో వాహనాలు నెమ్మదిగా కదిలాయి. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నట్లు మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ తెలిపారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# ఆరోగ్యం... ఆధ్యాత్మికం



సంక్రాంతి ముగ్గులకు అనేక ప్రత్యేకతలు | పంటలు ఇంటికొచ్చే వేళ క్రిమికీటకాలు దరి చేరకుండా ముగ్గులు, గొబ్బెమ్మలు | మరోపక్క ఇంటింటా పిండివంటల ఘుమఘుమలు | సమైక్య జీవనానికి ప్రతీకగా వంటల తయారీ

**ఖమ్మం గాంధీచౌక్:** సంక్రాంతి అంటేనే ముగ్గుల పండుగ. సంక్రాంతి ముగ్గుకు విశిష్టత ఉంది.పూర్వీకుల నుంచి ఆ ఆనవాయితీ కొనసాగుతోంది. పంటలు ఇళ్లకు చేరే వేళ ఇంటి అలంకరణ, వాకిళ్లు శుభ్రం చేసుకోవటం, ఆవుపేడతో కల్లాపు చల్లడం, వాకిళ్లలో పెద్దపెద్ద ముగ్గులు వేసుకోవడం ప్రతీ కుటుంబం సంక్రాంతికి నెల ముందు నుంచే మొదలుపెడతారు. ఇలా ఇళ్ల అలంకరణ, ఇంటి ముందు ముగ్గులు వేయడం వెనుక ఆరోగ్యం, ఆధ్యాత్మికత దాగి ఉంది.



### పంటలకు ప్రతిరూపంగా..

పంటలు ఇళ్లకు చేరే వేళ ప్రతిరూపంగా సంక్రాంతి నిలుస్తుంది. ఇళ్లన్నీ పంటలతో నిండుగా ఉన్న వేళ ఆనందాలను పంచుకోవడం కోసం ఇళ్లను అలంకరిస్తారు. ఇళ్లనే కాక పశువుల పాకలను శుభ్రం చేయడం, ఇంటి గుమ్మాలను బంతి, చామంతి పూలమాలలతో అలంకరించడంతోపాటు మహిళలు ఆనందాలను పంచుకుంటూ ఇంటి ఎదుట ముగ్గులు వేస్తారు.

### ముగ్గులు, గొబ్బెమ్మల వెనుక ఆరోగ్యం

ధనుర్మాసం నెల పాటు సాగే పండుగ సంక్రాంతి. ఈ పండుగ వేళ పంటలు ఇంటికి చేరతాయి. ప్రధానంగా ధాన్యం ఇళ్లకు చేరుతుంది. పొలాల్లో ఉన్న క్రిమి కీటకాలు పంటలతో పాటే ఇళ్లకు చేరే అవకాశం ఉంటుంది. తద్వారా కుటుంబాలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం పొంచి ఉన్నట్టే. అలా క్రిమికీటకాలు ఇళ్లకు చేరకుండా పూర్వీకుల నుంచి ఓ ఆచారం కొనసాగుతోంది. ఇళ్లను శుభ్రం చేసుకోవటంతో పాటు గుమ్మాలను పూలతో అలంకరించుకోవడం, వాకిళ్లను ఆవు పేడతో కూడిన కల్లాపు చల్లుకోవడం ఈ ఆనవాయితీలో భాగం. వాకిళ్లలో పెద్ద పెద్ద ముగ్గులు వేస్తారు. ఆ ముగ్గుల్లో ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలను పెడతారు. ఆవుపేడతో కల్లాపు చల్లి ముగ్గుల్లో పెట్టే గొబ్బెమ్మలు పంటలతో వచ్చే క్రిమి కీటకాలు ఇళ్లలోకి చేరకుండా నిలువరిస్తాయి. అందుకే ఆవుపేడతో కల్లాపు చల్లడం, గొబ్బెమ్మలు పెట్టడం అనాదిగా వస్తున్న ఆచారం.

### నక్షత్రాల ప్రత్యేకతను తెలిపేలా..

ఆకాశంలో నక్షత్రాల ప్రత్యేకతను చుక్కల ముగ్గులు తెలుపుతాయి. ఆకాశంలో చుక్కలను కలుపుతూ కూటమి ఉంటుంది. గొరుకొయ్యలు, సప్తరుషి మండలం వంటివి ఉండి ఇవన్నీ ఒకదాన్ని ఒకటి కలుపు తూ ఉంటాయి. వాటి నుంచి వచ్చినవే చుక్కల ముగ్గులు. వసుదేవుడంతటి వాడు ఈ ముగ్గులోకి లాగబడతాడని చరిత్ర. ఎంతటి వాడినైనా ముగ్గులోకి లాగటం అనే నానుడి దీన్ని నుంచే పుట్టింది.

### ఆధ్యాత్మికం కూడా..

ముగ్గుల వెనుక ఆధ్యాత్మికత సైతం దాగి ఉంది. చుక్కలతో మారేడు దళం, పద్మం, అష్టదళ పద్మం, నాగవల్లి, తాబేలు, కూర్మం, వంటి దశావతారాలకు సంబంధించిన ముగ్గులు ఇందులో భాగమే. వీటితోపాటు రథం ముగ్గులు, మల్లె పందిరి, పూజా సంబంధిత ఆధ్యాత్మిక ముగ్గులు వేయడం ఆనవాయితీ.

### దిక్కులకు సూచిక

ధనుర్మాస సమయంలో సూర్యుడు దక్షిణాయనం నుంచి ఉత్తరాయనం వైపునకు మారతాడు. సంక్రాంతి సమయంలో ఈ ప్రక్రియ జరుగుతుంది. దీనికి సూచికగా కూడా ముగ్గులు వేస్తారు. రథం ముగ్గు ఇందులో భాగంగా ప్రతీ ఇంటా వేస్తారు. పండుగ రోజున సూర్యుడు ఇంటికి వస్తున్నట్లుగా రథం ఇంటి ముఖద్వారం వైపు వేయడం, కనుమ రోజున సూర్యుడు ఉత్తరం దిశగా రథం ఇంటి నుంచి బయటకు వెళుతున్న దిక్కుగా వేయడం ఆచారం. వైకుంఠ ఏకాదశి పండుగలో కూడా ఈ ప్రత్యేకత ఉంటుంది. ధనుర్మాస చివరి సమయంలో వైకుంఠ ఏకాదశిని జరుపుకుంటారు. ఈ సమయంలో స్వర్గ ద్వారాలు(తలుపులు) తెరుచుకుంటాయని నమ్మకం. ఆ సమయాన్ని తెలిపే విధంగా ముగ్గులు వేస్తూ మహిళలు ఆధ్యాత్మికతను చాటుతారు. సంక్రాంతి ముగ్గులకు ఆరోగ్యం, ఆధ్యాత్మికత మేళవింపు ఉండడంతో మహిళలు ఇప్పటికీ ఈ ఆనవాయితీ కొనసాగిస్తున్నారు.



సత్తుపల్లిలో పిండి వంటలు చేస్తున్న మహిళలు

# ఘుమఘుమల సంక్రాంతి

## సమష్టి జీవనానికి ప్రతీకగా పిండి వంటల తయారీ
## ఇరుగుపొరుగుతో కలిసి వంటల్లో నిమగ్నం

**సత్తుపల్లిటౌన్:** తెలుగురాష్ట్రాల ప్రజలకు ఇష్టమైన పండుగల్లో సంక్రాంతి ఒకటి. అయితే, సంక్రాంతి అంటేనే ముగ్గులు, గాలిపటాలు, గంగిరెద్దులతో పాటు పిండి వంటలూ గుర్తుకొస్తాయి. నోరూరించే పిండి వంటల కోసం చిన్నాపెద్ద ఎదురుచూస్తుంటారు. ఖరీఫ్ పంటల డబ్బు చేతికి వచ్చేవేళ పండుగ సందడి మొదలవుతుంది. వారం ముందు నుంచే ఇంటింటా పిండి వంటలు చేస్తూ మహిళలు, యువతులు బిజీబిజీ అయ్యారు. అరిసెలు, గారెలు, సకినాలు, నువ్వుల లడ్డూలు, బూందీ లడ్డు, గవ్వలు, సున్నుండలు, చక్రాలు, కారప్పూస ఇలా రకరకాల పిండి వంటల తయారీతో వీధులు ఘుమఘుమలాడుతున్నాయి. ఆధునిక యువతకు వారి అమ్మలు దగ్గరుండి పిండి వంటలు తయారు చేయటం నేర్పిస్తున్నారు.



### ఇరుగుపొరుగు వారితో కలిసి..

సంక్రాంతి పండుగకు వారం, పదిరోజుల ముందు నుంచే పల్లె, పట్టణంలోని ఇళ్లల్లో పిండి వంటల తయారీ మొదలవుతుంది. వీటిని ఒక్కరే చేయటం సాధ్యం కాదు కాబట్టి ఆడపడుచులంతా ఇరుగుపొరుగు బంధువుల సాయంతో పిండి వంటలు చేస్తారు. ఒకరోజు పక్కింట్లో.. మరోరోజు ఎదురింట్లో కబుర్లు చెప్పుకుంటూ పిండివంటలు తయారీ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇది సమష్టి జీవన విధానానికి తార్కాణంగా నిలుస్తోంది.

### సంబురంగా చేసుకుంటాం..



సంక్రాంతి పండుగ వచ్చిందంటే అందరం ఒకచోట కలుసుకొని కబుర్లు చెప్పుకుంటూ పిండివంటలు చేసుకుంటాం. వీధిలో ఒకరి తర్వాత ఒకరు ఇళ్లకు వెళ్లి పిండి వంటలు చేస్తాం. రకరకాల పిండి వంటలు చేసుకోవటం ఈ పండుగ ప్రత్యేకం.

- తోట జానకి, సత్తుపల్లి

### ఇది అరిసెల పండుగ



ఏటా సంక్రాంతి పండుగకి అరిసెలు ఎక్కువగా చేస్తుంటాం. పంటలు చేతికి వస్తాయి కాబట్టి అన్ని రకాల వంటలు చేసుకునే వీలు ఉంటుంది. ఈ పిండి వంటలలో పోషకాలు ఉంటాయి. లడ్డూలు, చక్రాలు వంటివి చేసుకుంటాం.

- ఏ.సుబ్బలక్ష్మి, సత్తుపల్లి



నువ్వుల అరిసెలు



చెక్కలు



అరిసెలు



బూందీ

## బీఆర్ఎస్ కార్యాలయంపై దాడిని ఖండిస్తున్నాం


• మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



**సాక్షి, హైదరాబాద్:** భువనగిరి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని ఖండిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఖూనీ చేస్తున్నారని ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రేవంత్ కుటుంబ సభ్యులు రాజ్యాంగేతర శక్తులుగా మారి పెత్తనం చెలాయిస్తున్నారని, వికారాబాద్ జిల్లాలో సీఎం సోదరుడు తిరుపతిరెడ్డికి అధికారులు రాచ మర్యాదలు చేస్తున్నారని, తిరుపతిరెడ్డి ఇపుడు వికారాబాద్‌కు సీఎం అయ్యారని ధ్వజమెత్తారు.

## ఉస్మానియా ఆసుపత్రి పునర్నిర్మాణం హర్షణీయం

• తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం



**సాక్షి, హైదరాబాద్:** ఉస్మానియా నూతన ఆసుపత్రి భవన నిర్మాణ శంకుస్థాపనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా చొరవ చూపడం పట్ల తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరహరి, సెక్రెటరీ జనరల్ డాక్టర్ లాలుప్రసాద్ రాథోడ్, రాష్ట్ర కోశాధికారి డాక్టర్ రాయూఫ్ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పురాతన ఉస్మానియా హాస్పిటల్‌ను కొత్త భవనంలోకి మార్చాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు వారు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం గతంలో ఎన్నోసార్లు నూతన భవనం కొరకు విన్నవించినా గత ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని, ముఖ్యమంత్రి, ఆరోగ్యశాఖ మంత్రి ఉస్మానియా ఆసుపత్రి పునర్నైభవం కొరకు చర్యలు చేపట్టడం హర్షణీయమని అన్నారు. ఇన్ని సంవత్సరాల తర్వాత వైద్యుల, ప్రజాసంఘాల చిరకాల కోరిక నెరవేరుతుందని చెప్పారు. అలాగే ప్రభుత్వ వైద్యుల అపరిష్కృత డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరారు.



## స్వామి వివేకానందకు సీఎం రేవంత్ నివాళి

**సాక్షి, హైదరాబాద్:** స్వామి వివేకానంద 162వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సంజయ్ కుమార్, యశస్వినిరెడ్డి పాల్గొన్నారు.



## తెలంగాణభవన్‌లో వివేకానంద జయంతి..

**సాక్షి, హైదరాబాద్:** బీఆర్ఎస్‌పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణభవన్‌లో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాసన మండలిలో ప్రతిపక్షనేత మధుసూదనాచారి మాట్లాడుతూ.. భారత దేశ ఔన్నత్యం, సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిశోర్‌గౌడ్, ఫైనాన్స్ కమిషన్ మాజీ సభ్యుడు గోసుల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## ఔరా.. తాబేలు..!

**మిరుదొడ్డి(దుబ్బాక):** కాస్త దూరం నుంచి చూస్తే.. ఔరా! ఎంత పెద్ద తాబేలో అనుకుంటారు ఎవరైనా. కానీ అది నిజం కాదు.. కొంచెం దగ్గరగా వెళ్లి పరిశీలిస్తే తాబేలు ఆకారంలో ఉన్న పెద్ద బండరాయి అని అర్థం అవుతుంది. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి, లింగుపల్లి శివారులోని కూడవెల్లి హైలెవల్ బ్రిడ్జి సమీపంలో తాబేలు ఆకారంలో ఉన్న ఈ బండరాయిని చూసిన ప్రతి ఒక్కరూ ముచ్చట పడిపోతున్నారు. తాబేలు ఆకారంలో కనిపిస్తున్న ఈ బండరాయిని 'సాక్షి'కెమెరా క్లిక్‌మనిపించింది.



## యాదగిరి క్షేత్రంలో సంక్రాంతి భక్తుల రద్దీ

**యాదగిరిగుట్ట:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో భక్తుల రద్దీ నెలకొంది. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సెలవులు రావడంతో ఆదివారం శ్రీస్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధికంగా తరలివచ్చారు. జంట నగరాల్లో ఉండే ప్రజలు తమ సొంతూర్లకు వెళ్లే క్రమంలో శ్రీస్వామిని దర్శించుకునేందుకు యాదగిరీశుడి క్షేత్రానికి వచ్చారు. దీంతో శ్రీస్వామి వారి ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల వంటి ప్రాంతాల్లో సందడి నెలకొంది. శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి మూడు గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు వెల్లడించారు. శ్రీస్వామిని 35 వేల మందికిపైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో స్వామివారికి నిత్యాదాయం రూ.50,74,808 వచ్చినట్లు అధికారులు తెలిపారు.



ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి. శ్రీసుధ

## మొక్కల కూర్పుతో 'సంక్రాంతి విషెస్'




తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం కడియపులంకలోని పల్ల వెంకన్న నర్సరీ అధినేత పల్ల సత్తిబాబు, యువ రైతులు వెంకటేష్, వినయ్‌లు సంక్రాంతి సందర్భంగా మొక్కలను అందంగా కూర్చారు. 'హ్యాపీ పొంగల్' అనే పదాల మధ్యలో గొబ్బెమ్మల ఆకృతులను తీర్చిదిద్దారు. దీనికి పలు రకాల ఆర్నమెంటల్, ఇండోర్, ఔట్‌డోర్ మొక్కలు వాడినట్లు సత్తిబాబు తెలిపారు. – కడియం

## కూటమి మేనిఫెస్టోని భోగిమంటల్లో తగలేద్దాం

### వలంటీర్ల అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పిలుపు

**సాక్షి, అమరావతి:** ఎన్నికల ముందు హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చాక మాట తప్పిన కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా భోగి పండుగ రోజున వలంటీర్లంతా అధికార పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను దహనం చేయాలని వలంటీర్ల అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. తాము అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థ కొనసాగించడంతో పాటు గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచుతామని ఎన్నికల ముందు ఉగాది రోజున చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. 7 నెలలు గడిచినా వలంటీర్లకు ఇచ్చిన హామీ ఒక్కటి కూడా నెరవేరలేదని, ఫలితంగా ఇప్పటికే నలుగురు వలంటీర్లు ఆత్మహత్య చేసుకున్నారని గుర్తు చేశారు. తక్షణం కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు.

## కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ 475 కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అసోసియేషన్ రాష్ట్రస్థాయి సమావేశం ఆదివారం విజయవాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ సలహాదారుగా కె.శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడిగా కుమ్మరికుంట సురేశ్, ప్రధాన కార్యదర్శిగా గొర్ల మాణిక్యం, కోశాధికారిగా కె.రత్నకుమారి, సభ్యులుగా పి.ముద్దుబాబు (శ్రీకాకుళం), శ్యామ్ కిరణ్ (పశ్చిమగోదావరి), నాగేశ్వరరావు శేషగిరి, రవిశంకర్ (కృష్ణాజిల్లా), బాలయ్య, సుధీర్, రాబర్ట్, రమేష్‌బాబు (గుంటూరు), జాన్‌బాబు, ఖాదర్‌వలీ (ప్రకాశం), కల్లూరు శ్రీనివాస్, కాశిరత్నం (నెల్లూరు), లత, ఓబయ్య, కృష్ణమూర్తి (చిత్తూరు), ఉమాదేవి (అనంతపురం) ఎన్నుకున్నట్టు పేర్కొన్నారు.

**సంక్రాంతికి డీఏ మంజూరు చేయాలి: ఏపీటీఎఫ్**

ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు, విద్యార్థులకు రూ.6,700 కోట్ల బిల్లులు, బకాయిలు విడుదల చేస్తున్నట్టు ప్రకటించిన ప్రభుత్వం.. ఏపీజీఎల్ఐ పార్ట్ ఫైనల్స్/లోన్స్ కూడా ప్రతి నెలా వేతనం నుంచి తీసుకుంటున్నా ఆ మొత్తాన్ని మంజూరు చేయలేదని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే సంక్రాంతికి కొత్త డీఏ మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# అక్రమ కేసుల 'కుప్పం'

## చంద్రబాబు సొంత నియోజకవర్గంలో అరాచక పాలన

- కూటమి అధికారం చేపట్టిన నాటి నుంచే టీడీపీ నేతల దౌర్జన్యాలు
- వైఎస్సార్‌సీపీ కేడర్‌పై అడ్డగోలుగా తప్పుడు కేసులు, వేధింపులు
- పథకాల గురించి ప్రశ్నించిన సామాన్యులపైనా కేసులు
- దళిత మహిళా సర్పంచిని గ్రామం నుంచి వెళ్లగొట్టిన టీడీపీ నేతలు
- ఆమె భర్తపై అక్రమంగా హత్యాయత్నం కేసు నమోదు
- మరో సర్పంచి పైనా అక్రమ కేసు
- ఇసుక వ్యాపారమే చేయని నేతపై ఇసుక అక్రమ రవాణా కేసు
- ఇలా అనేకానేక తప్పుడు కేసులతో అట్టుడుకుతున్న కుప్పం



**శాంతిపురం:** ఓ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించే అసెంబ్లీ నియోజకవర్గం అభివృద్ధి, శాంతితో వర్ధిల్లడం సహజం. అక్కడి ప్రజలు కూడా ఇదే కోరుకుంటారు. అక్కడి ప్రజలు అభివృద్ధి, సంక్షేమ ఫలాలను మెరుగ్గా అందుకోవాలని ఏ ముఖ్యమంత్రి అయినా ఆశిస్తారు. కానీ సీఎం చంద్రబాబు ప్రాతినిత్యం వహిస్తున్న చిత్తూరు జిల్లాలోని కుప్పం నియోజకవర్గంలో ఇందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. రాజకీయ వేధింపులు, కక్షలు, అక్రమ కేసులతో అట్టుడికిపోతోంది. తప్పుడు కేసులను ఉపేక్షించేది లేదని చంద్రబాబు పైకి చెబుతున్నా, ఆయన సొంత నియోజకవర్గంలోనే అనేక అక్రమ కేసులు పెడుతున్నారు. విపక్ష నేతలు, కార్యకర్తలు, పథకాల గురించి అడిగిన సామాన్యులపై అక్రమ కేసులు, బైండోవర్ కేసులు, ఆంక్షలు, పోలీసుల వేధింపులు, నిర్బంధాలు, పథకాల నిలిపివేత వంటి చర్యలు ఎదుర్కోవాల్సిందే. రాష్ట్రంలో అధికార మార్పు జరిగిన తొలిరోజు నుంచే కుప్పంలో ఆటవిక రాజ్యం సాగుతోంది. పోలీసులను అడ్డు పెట్టుకొని టీడీపీ నేతలు దౌర్జన్యకాండను సాగిస్తున్నారు. అందుకు ఉదాహరణలు కొన్ని..

**ఊరి నుంచి తరిమేసి..**

రాష్ట్రంలో చంద్రబాబు కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రామకుప్పం మండలం 89 పెద్దూరు పంచాయతీ దళిత మహిళా సర్పంచి మల్లిక రాజీనామా చేయాలంటూ ఆమె ఇంటిపై దాడిచేసి, సీసీ కెమెరాలను సైతం ధ్వంసం చేశారు. ఆమె కుటుంబాన్ని గ్రామం నుంచి వెళ్లగొట్టారు. దీనిపై స్థానిక పోలీసులతో పాటు జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయింది. ప్రాణ భయంతో ఆ కుటుంబం దూర ప్రాంతానికి వెళ్లడంతో గ్రామంలో అందుబాటులో లేరని, మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు రాలేదంటూ సర్పంచి చెక్ పవర్‌ను రద్దు చేశారు. పైగా ఇసుక అక్రమ రవాణాపై టీడీపీలోని రెండు వర్గాలు ఘర్షణ పడగా, గాయపడిన వారితో మల్లిక భర్త గోవిందప్పపై తప్పుడు ఫిర్యాదు చేయించి, ఆయనపై హత్యాయత్నం కేసు పెట్టారు. దీనిపై న్యాయం కోరుతూ బాధితులు మానవ హక్కుల కమిషన్, ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించారు.

**పొలానికి మట్టి తోలారని**

తమిళనాడు సరిహద్దుల్లోని ఓ ఎన్ కొత్తూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ సర్పంచి దేవప్పనాయుడు బంధువులు తమిళనాడు భూభాగంలోని చెరువు నుంచి అదే రాష్ట్రంలోని వారి పొలాలకు మట్టి తోలుకున్నారు. అయితే గుడుపల్లె మండలం తలిఅగ్రహారంలోని ఆంధ్ర భూభాగం గుండా మట్టిని రవాణా చేశారంటూ దేవప్పనాయుడు, ఆయన బంధువులపై తప్పుడు కేసు పెట్టారు. తమిళనాడు అధికారుల నుంచి అన్ని అనుమతులు తీసుకుని, మట్టిని తరలిస్తున్నామని చెప్పినా పట్టించుకోలేదు. దేవప్పనాయుడు, ఆయన తమ్ముడు పొండప్పనాయుడును రోజంతా పోలీసు స్టేషన్‌లో కూర్చోబెట్టారు. రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఇలాంటి కేసులు, వేధింపులతో కుప్పంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, సామాన్యులను అధికార పక్షం నిత్యం వేధిస్తోంది. వైఎస్సార్‌సీపీ నాయకులు వారి అభిమాన నాయకుడైన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను కూడా జరుపుకోనివ్వకుండా పలుచోట్ల పోలీసులను మోహరించారు. తమ పార్టీ వారిపై పదుల సంఖ్యలో అక్రమ కేసులు, బైండోవర్ కేసులు పెట్టారని వైఎస్సార్‌సీపీ నాయకులు చెబుతున్నారు. అయినా వైఎస్సార్‌సీపీ నాయకులు భయపడకుండా న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నారు.

**ఇసుక రవాణా కేసులో ఇరికించి**

నాయనపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ డైరెక్టర్ కృష్ణమూర్తి పైనా తప్పుడు కేసు పెట్టి వేధింపలకు గురిచేస్తున్నారు. ఎప్పుడూ ఇసుక వ్యాపారం చేయని ఆయనపై కర్ణాటకకు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారంటూ ఓ తప్పుడు కేసు పెట్టారు. సొంతిల్లు కట్టుకొనేందుకు ఆయన బంధువులు చట్టబద్ధంగా పన్నులు చెల్లించి, బైరెడ్డిపల్లి స్టాక్ యార్డు నుంచి తెచ్చుకున్న ఇసుకను చూపి జైలుకు పంపారు. ఉదయం అదుపులోకి తీసుకుని, సాయంత్రం వీఆర్వో నుంచి ఫిర్యాదు రాయించుకుని, నిబంధనలు పాటించకుండా తనను అరెస్టు చేశారని కృష్ణమూర్తి చెప్పారు. పార్టీ మారాలని, లేదంటే ఊరు వదిలి వెళ్లిపోవాలని అధికారులు బెదిరించారని వాపోయారు. పైగా, సీజ్ చేసిన ఇసుకను కూడా అక్రమ మార్గంలో తరలించేశారని కృష్ణమూర్తి బంధువులు చెబుతున్నారు.

**హామీలపై మాట్లాడితే బైండోవర్ కేసు**

గుడుపల్లె మండలం బోయనపల్లికి చెందిన రవి కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయడంలేదని మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేయడంతో ఓ రోజు ఆయన్ని పోలీసుల ఇంటి నుంచి పట్టుకెళ్లిపోయారు. ఆయనపై బైండోవర్ కేసు పెట్టి, సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. మళ్లీ ఇలా మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# చలికాలపు కానుక



వివిధ ఆకృతుల్లో షాపులో అమ్మకాలకు సిద్ధంగా ఉన్న ముువ్వ చెక్కీలు

ఉద్దానం తోటలపై తెల్లగా పరచుకునే పొగమంచు, పల్లె కోవెలలో తెల్లవారుజామున వినిపించే పాశురాలు, వీధి అరుగులపై ముచ్చటగా కనిపించే రంగవల్లులు.. ధనుర్మాస ఆగమనానికి ప్రతీక. ఇవే కాదు ఇంకో గుర్తు కూడా ఉంది. అదే నెయ్యి నెక్కీ. నెలగంటు పెట్టాక నెయ్యి చెక్కీ రుచి చూడాలంటారు. ఈ నెలన్నర సీజన్‌లో అధికంగా దొరికే నెయ్యి చెక్కీ చలికాలపు కానుక. సంక్రాంతి వరకు మార్కెట్‌లలో విరివిగా లభిస్తుంది.

- ఉద్దానంలో నోరూరించే చెక్కీలు
- కొత్త ధాన్యం పేలాలతో ధనుర్మాస చెక్కీ
- నెలన్నర పాటు అమ్మకాలు

**ఇచ్ఛాపురం రూరల్:** సూర్యుడు ధనస్సు రాశిలోకి ప్రవేశించిన మొదలు మకర సంక్రాంతి(పెద్ద పండగ) వరకు ఉత్కళాంధ్ర పల్లెలు తీపి రుచిని చూస్తాయి. శ్రీకాకుళం జిల్లాలోని ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాల్లోని 'గుడియా' 'నెయ్యిల' కులాలకు చెందిన వారు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పండించిన కొత్త ధాన్యంను సేకరించి వాటిని పేలాలుగా మార్చి అందులో నెయ్యి, బెల్లం, చక్కెరను కలిపి పాకం చేస్తారు. వేడివేడిగా పాగలు చిమ్మే ఈ పాకాన్ని వివిధ ఆకృతుల్లో అమర్చి చెక్కీలుగా తయారు చేస్తారు. చెక్కీలపై అలంకరణ కోసం ఎండు కొబ్బరి ముక్కలను సన్నగా తరిగి అతికిస్తారు. వీటితో పాటు పోషక విలువలు గల కిస్మిస్, బాదం పప్పు, జీడి పప్పు బద్దలను అలంకరిస్తారు. ధనుర్మాసం మొదలు మకర సంక్రాంతి వరకు ప్రతి రోజు విష్ణుమూర్తి, జగన్నాథ స్వామి వారికి నైవేద్యంగా ఈ చెక్కీలను పెడతారు. కేవలం ధనుర్మాసంలోనే తయారు చేసే ఈ చెక్కీలను 'ధనుర్మువ్వ' అని కూడా పిలుస్తారు.



**దోస్తీలకు దొన్ను చెక్కీ..**

ఉత్తరాంధ్ర పల్లెల్లో నేస్తరికం అనే అపురూప సంప్రదాయం ఉంది. నేస్తరికం కట్టుకుంటే ఇక పేర్లు పెట్టి పిలవడం ఉండదు. నేస్తం అంటూ జీవితాంతం పిలుచుకుంటారు. నేస్తరికం, మిత్తరికం, మొఖ రా, సాంగాతి, దోస్తీ, వరిపండు, ముళ్ల వంటి పేర్లతో పిలుచుకుంటూ వారి స్నేహాన్ని మరింత బలపరుచుకుంటారు. ఈ సందర్భంగా తమ స్నేహం దృఢంగా, ప్రేమానుబంధాలుగా ఉండేందుకు ముువ్వ చెక్కీని బహుమతిగా ఇవ్వడంతో పా టు కొత్త బట్టలు కానుకగా ఇస్తారు. అత్తారింటిలో ఉన్న ఆడపిల్లను సంక్రాంతి పండక్కి పిలుపు చేసేందుకు బంధువులు 'ముువ్వ చెక్కీ'ని తీసుకువెళ్లి కానుకగా అందజేయడం ఉత్కళాంధ్రుల ఆచారం.

**మూడు నెలలు నిల్వ**

ధనుర్మాసం మొదలు మకర సంక్రాంతి వరకు ఒడిశాతో పాటు ఉత్తరాంధ్రలోని అన్ని స్వీట్, పాన్ షాపుల్లో విరివిగా అమ్మకాలు జరుగుతుంటాయి. మూడు నెలలు పాటు నిల్వ ఉండే ఈ ముువ్వ చెక్కీలు మార్కెట్‌లో రూ.50 నుంచి రూ.600 వరకు లభిస్తున్నాయి. ఇందులో బెల్లంతో తయారీ చేసిన చెక్కీలు, పంచదారతో తయారు చేసిన నేతి చెక్కీలు ఉంటాయి.

**ఆరోగ్య ప్రదాయిని..**

బెల్లం, పంచదారతో తయారు చేసిన ఈ ముువ్వ చెక్కీని శీతాకాలంలో తింటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముువ్వ చెక్కీ తయారు చేసిన సమయంలో అందులో కొబ్బరి, జీలకర్ర, సోపు, జీడి పప్పు, బాదం పప్పు, ఎండు ద్రాక్ష, నెయ్యి వంటి పోషక పదార్థాలు ఉండటం వల్ల అన్ని రకాల వయస్సు గల వారు తింటే రక్త ప్రసరణ, జీర్ణక్రియ బాగా జరుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

**అమ్మకాలు జోరందుకున్నాయి**



ప్రస్తుతం ధనుర్మాసం మొదలు కావడంతో మా షాపులో ముువ్వ చెక్కీల అమ్మకాలు జోరందుకున్నాయి. గ్రాముల నుంచి కేజీల్లో నేతి చెక్కీలను అందరికీ అందుబాటు ధరలో అమ్మకాలు చేస్తుంటాము. ముఖ్యంగా బరంపురం చెక్కీలకు మంచి గిరాకీ ఉంటోంది. మా షాపు నుంచి ఇతర రాష్ట్రాలకు చెక్కీలు వెళ్తుంటాయి.
– గుడియా బబ్లూ, తయారీదారు, ఇచ్ఛాపురం

## రూ.4 కోట్ల విలువైన చోరీ సొత్తు బాధితులకు పంపిణీ

- 23 కేసుల్లో 2.206 కిలోల బంగారు, 9.400 కిలోల వెండి వస్తువులు
- ఏలూరు జిల్లాలో తొలిసారిగా బాధితులకు నేరుగా అందజేత



రికవరీ సొత్తును బాధితులకు అందజేస్తున్న ఏలూరు జిల్లా ఎస్పీ శివకిషోర్

**ఏలూరు టౌన్:** ఏలూరు జిల్లాలోని భీమడోలు, పెదపాడు, పెదవేగి, ఏలూరు త్రీటౌన్, ఏలూరు రూరల్ తదితర ప్రాంతాల్లో చోరీలకు సంబంధించి రికవరీ చేసిన సొత్తును ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం జిల్లా ఎస్పీ శివకిషోర్ స్వయంగా తన చేతులమీదుగా బాధితులకు అందజేశారు. చోరీ కేసులను ఛేదించటమే కాకుండా విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను వెనక్కి తిరిగి అందజేయటం పట్ల బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ అధికారుల పనితీరును వారంతా మెచ్చుకుంటూ కృతజ్ఞతలు తెలిపారు.

**23 కేసుల్లో భారీగా చోరీ సొత్తు పంపిణీ**

ఏలూరు జిల్లాలో గత కొంతకాలంగా ఇళ్ళలో దొంగతనాలకు పాల్పడుతూ బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదును అపహరించిన కేసులను పోలీస్ అధికారులు ఛేదించారు. 23 కేసులకు సంబంధించి నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకోగా, నూతన చట్టాలను అమలు చేస్తూ జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ విలువైన సొత్తును బాధితులకు అందజేశారు. సుమారుగా 2 కిలోల 206.6 గ్రాముల బంగారు ఆభరణాలు, 9.40 కిలోల వెండి వస్తువులు, లక్ష రూపాయల నగదును బాధితులకు అందజేశారు. ఈ సొత్తు విలువ సుమారు రూ.4 కోట్లకు పైబడి ఉంటుందని పోలీసుల అంచనా.

## ఐడెంటీ కార్డు పేరుతో అక్రమ వసూళ్లు

### బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

**సాక్షి, అమరావతి:** ఉపాధిహామీ కార్మికులు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఫొటో గుర్తింపు కార్డుల పేరుతో చేస్తున్న అక్రమ వసూళ్లు ఆపాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. పశ్చిమగోదావరి జిల్లాలో సాగుతున్న ఈ అక్రమ తంతుపై సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గుర్తింపు కార్డు ఒక్కొక్కదానికి రూ.60 చొప్పున వసూలు చేసుకునేలా అక్షయ కమ్యూనికేషన్ అనే ప్రైవేటు సంస్థకు పశ్చిమ గోదావరి జిల్లా డ్వామా పీడీ అనుమతివ్వడాన్ని తీవ్రంగా ఖండించారు. నిబంధనలకు విరుద్ధంగా ఆ అధికారి ఏకంగా సర్క్యులర్ ఆర్సీ నెంబర్ ఎ/8/2024ను జారీ చేయడం ఎవరి ప్రయోజనాల కోసమని ప్రశ్నించారు. వాస్తవానికి గ్రామీణ ఉపాధిహామీ పథకంలో జాబుకార్డులున్న ప్రతి ఒక్కరు ఉపాధిహామీ పనులకు అర్హులేనని, వారికి ఎటువంటి గుర్తింపు కార్డులు అవసరంలేదన్నారు. జిల్లాల్లోని మంత్రి, ఎమ్మెల్యేల వత్తిడితో ఈ వసూళ్లు చేస్తున్నారని, ఈ మొత్తం రూ.కోట్లలో ఉంటుందని ఆరోపించారు.

# బరిలో ఉరకలు వేసే ఉత్సాహం

## ఎడ్ల బళ్ల పోటీలకు చోడవరం, మాడుగుల పరిసర ప్రాంతాలు సిద్ధం



**చోడవరం:** ధాన్య, ధన రాశులతో తులతూగుతూ రైతులు ఆనందంగా ఉన్న రోజుల్లో వచ్చే సంక్రాంతి పండగ ఎన్నో సంప్రదాయ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలకు నెలవుగా ఉంటుంది. ఎన్నో పల్లె సంప్రదాయాలు కనుమరుగవుతున్నప్పటికీ ఇప్పటికీ పల్లె క్రీడలు కొన్ని జనాన్ని అలరిస్తూనే ఉన్నాయి. వీటిలో ప్రధానంగా ఎడ్లబళ్ల పోటీఉ, కోడిపందాలు, గుర్రాల పరుగు పోటీలు పల్లెల్లో సంక్రాంతి శోభను ఇనుమడింపజేస్తాయి. కోడిపందాలపై నిషేధం విధించడంతో సంక్రాంతి పండగంతా ఎడ్ల బళ్ల పరుగు పోటీల వైపే ఆసక్తిగా చూస్తుంది. కనుమ పండగ నుంచి ప్రారంభమయ్యే ఈ ఎడ్ల బళ్ల పోటీలు తీర్థాలు, గ్రామదేవల పండగల సందర్భంగా కూడా నిర్వహిస్తారు. పెద్దపండగ వచ్చిందంటే ఎడ్లబళ్ల పోటీల కోసం జనం ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తుంటారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎడ్లబళ్ల పోటీలు ప్రధానంగా చోడవరం, మాడుగుల పరిసర మండలాలైన దేవరాపల్లి, కె.కోటపాడు, చీడికాడ, వూడుగుల, సబ్బవరం, చోడవరం, బుచ్చెయ్యపేట, రోలుగుంట, రావికమతం మండలాల్లో జరిగేవి. క్రమేణా రాంబిల్లి, అచ్యుతాపురం, యలమంచిలి, నక్కపల్లి, కోటవురట్ల, అనకాపల్లి, నర్సీపట్నం, పాయకరావుపేట, కోటవురట్ల తదితర మండలాలకు విస్తరించాయి. కొందరైతే ప్రత్యేకంగా ఈ సంక్రాంతిలో ఎడ్ల బళ్ల పోటీల కోసమే ఒంగోలు, మైసూర్‌తో పలు మేలుజాతి ఎడ్లను లక్షలాది రూపాయలు ఖర్చుచేసి మరీ కొనుగోలు చేసి వాటికి శిక్షణ ఇస్తారు. హింస, జూదానికి తావు లేకుండా కేవలం ఆటవిడుపుగా ఉల్లాసంగా ప్రతి ఒక్కరిలోనూ ఆనందాన్ని నింపే విధంగా గెలుపే లక్ష్యంగా పోటీ ప్రతిష్ఠతో నిర్వహించే ఈ ఎడ్ల బళ్ల పరుగుల పోటీలు క్రీడాస్ఫూర్తితో జరుగుతాయి. అందుకే ఈ పోటీలకు ప్రజల నుంచి విశేష స్పందన ఉంటుంది. సుదూర ప్రాంతాల నుంచి కూడా ఈ పోటీల సమయానికి సందర్శకులు చేరుకుని ఉత్సాహంగా పోటీలను తిలకిస్తారు.

**పోటీలు ఇలా...**

పందెంలో పాల్గొనే ఎడ్ల (జత)ను ఎంట్రీల ప్రకారం వరుస నంబర్లు వేసి తేలికపాటి ఎడ్లబళ్లకు ఎద్దులను బూని పరుగెత్తిస్తారు. ఒక్కో బండి నిర్వహణకు ఇద్దరు వ్యక్తులు ఉంటారు. ఏ ఎడ్ల బండి తక్కువ సమయంలో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకొని తిరిగి వస్తుందో ఆ ఎద్దులు విజయం సాధించినట్టుగా పరిగణిస్తారు. కొన్ని ప్రదేశాల్లో నాలుగైదు ఎడ్లబళ్లను ఒకేసారి మైదానంలో ఉంచి పరుగుల పోటీ నిర్వహిస్తారు. ఈ తరహా పోటీలు తక్కువగా ఉండగా ఒక్కో బండి పరుగుతీసే పోటీలే ఎక్కువగా జరుగుతుంటాయి. పోటీలో గెలుపొందిన ఎద్దులకు ముందుగా నిర్దేశించిన పారితోషకాన్ని బహుమతిగా ఇస్తారు.



పోటీలు ఉత్సాహంతో తిలకిస్తున్న ప్రజలు



పరుగు తీస్తున్న ఎడ్లు

**పోటీలో పాల్గొనే ఎడ్లబళ్లు**

వుంచి వయస్సులో మేలుజాతి హుషారైన ఎద్దులను ఈ పోటీలకు దించుతారు. పందెం సమయంలో బండి బోల్తా పడినా ఎద్దులకు గానీ ఎవరికీ పెద్దగా ప్రమాదం కలగజేయకుండా ఉండే తేలిక పాటి బళ్లను ఉపాయోగిస్తారు. ఈ పోటీల కోసం తేలికగా ఉండి ప్రత్యేకంగా బేరింగ్‌లు వేసిన చక్రాలను ఈ బళ్లకు ఏర్పాటు చేస్తారు. ఒక వేళ పోటీల్లో బండి బోల్తా పడినా వెంటనే నిర్వాహకుడు బండి తిరిగి లేపి పరుగు తీసే విధంగా అత్యంత తేలిగ్గా బండి తయారు చేస్తారు.

**పోటీలకు ఆటస్థలం**

రైతుతో ముడిపడి నిత్యం రైతుతోనే కలిసి ఉండే ఎడ్లబండితోఎద్దులు పరుగెత్తే ఈ పోటీలో పాఠశాలల్లోను, ఆట స్థలాల్లోను నిర్వహించరు. ఎద్దులు, రైతులు నిత్యం కలియతిరిగే పంట పొలాల్లోనే ఈ పోటీలు నిర్వహిస్తారు. జనవరి నెల ప్రారంభానికి ఖరీఫ్ వరిపంట కోతలు పూర్తవ్వడంతో చాలా పొలాల్లో సంక్రాంతి పండగ జరిగే వరకు ఏ పంట వేయరు. దీంతో కోతలు జరిగిపోయి ఖాళీగా ఉన్న పొలాలను నిర్దేశించిన లక్ష్యం మేర పొలాల మడుల మధ్య ఉన్న గట్లను తొలగించి ఎడ్లపందాలు నిర్వహిస్తారు. కొన్ని గ్రామాల్లో సమీపంలో నీరులేని సాగునీటి చెరువుల్లో కూడా నిర్వహిస్తారు. రైతులంతా పిల్లా పాపలతో ఉరకలెత్తుతున్న ఎడ్లను తిలకించి వాటికి మరింత ప్రోత్సాహం ఇస్తూ చప్పట్లు కొడుతూ ప్రదర్శనను ఆస్వాదిస్తారు. పోటీలు నిర్వహించే టప్పుడు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందుగా అన్ని ఏర్పాట్లు నిర్వాహకులు చేస్తారు.

**ఎన్నో బహుమతులు గెలుచుకున్నా...**



నేను పొలం పనులతో పాటు ఎడ్ల బళ్ల పోటీలపై ప్రధానంగా దృష్టి పెట్టి మేలు జాతి ఎద్దులను పెంచుతున్నాను. నా దగ్గర రెండు జతల మేలు జాతి ఎద్దులు ఉన్నాయి. వీటి పెంపకానికి రోజూ భారీగానే ఖర్చవుతుంది. ఏటా జరిగే పందాల్లో 80 నుంచి 110 వరకు పోటీల్లో నా ఎద్దులు ఎక్కువసార్లు మొదటి బహుమతులు తెచ్చాయి. జిల్లా, ఉత్తరాంధ్ర, ఉభయగోదావరితోపాటు రాష్ట్ర స్థాయి పోటీల్లో సైతం నా ఎద్దులు బహుమతులు గెలుచుకున్నాయి. గతేడాది తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో వరుసగా మొదటి, రెండో బహుమతులు గెలుచుకున్నాయి.
–లెక్కల సత్తిబాబు, లెక్కలవానిపాలెం, చోడవరం

**పెంపకంలో జాగ్రత్తలు**



వ్యవసాయంలో నాతో కలిసి జీవించే ఎద్దులు పోటీల్లో పరుగులు తీస్తుంటే ఆ ఆనందం చెప్పలేను. రూ.లక్షా 60వేలుపెట్టి ఎద్దులు కొన్నాను. వీటి పెంపకంలో చాలా జాగ్రత్తలు తీసుకొంటాను. మంచి పోషకాహారంతోపాటు పరిసరాల పరిశుభ్రత కూడా చాలా అవసరం. ఇప్పటి వరకు అనేక పందాల్లో బహుమతులు సాధించాను. ఈ ఏడాది మరిన్ని పోటీలు గెలవాలని ఉత్సాహంగా ఉన్నాను.
–ముమ్మిన రామకృష్ణ, ఎడ్లపెంపకందారుడు, నర్సయ్యపేట

## 17న విజయవాడలో రైతుల మహా ధర్నా

- ఏపీ రైతు సంఘం పిలుపు
- ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని మండిపాటు

**సాక్షి, అమరావతి :** రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైన టీడీపీ కూటమి ప్రభుత్వం పట్ల రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాయలసీమ జిల్లాలలో దాదాపు 80కు పైగా మండలాలు కరువు కోరల్లో చిక్కుకున్నప్పటికీ మొక్కుబడిగా 54 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి చేతులు దులుపుకుందే తప్ప పైసా పరిహారం ఇచ్చిన పాపాన పోలేదు. 2023–24లో ఖరీఫ్‌తో పాటు రబీ సీజన్‌లలో వర్షాభావ పరిస్థితుల వల్ల నష్టపోయిన 3.91 లక్షల మంది రైతులకు చెల్లించాల్సిన రూ.328 కోట్ల కరువు సాయం బకాయిలు విడుదల చేయలేదు. ఖరీఫ్–2023 సీజన్‌లో రైతుల తరఫున రూ.930 కోట్ల ప్రీమియం బకాయిలు చెల్లించకపోవడం వల్ల రైతులకు న్యాయంగా దక్కాల్సిన రూ.1,385 కోట్ల పంటల బీమా పరిహారం అందలేదు. ఇలా రైతులకు చెల్లించాల్సిన రూ.12,563 కోట్లు ఎగ్గొట్టింది. ఈ నేపథ్యంలో రైతాంగ సమస్యలపై ఈ నెల 17న విజయవాడలో భారీ ధర్నా నిర్వహణకు ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, కే ప్రభాకరరెడ్డి పిలుపునిచ్చారు. ప్రతి రైతుకు రూ.20 వేల పెట్టుబడి సాయం ఇస్తామన్న హామీని ఎప్పుడు అమలు చేస్తారంటూ ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని నిలదీశారు. ఎన్నికలలో ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తున్నామని గొప్పగా చెబుతున్న చంద్రబాబు.. రైతులకు ఇచ్చిన హామీల సంగతేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. పెట్టుబడి సాయం హామీ ముఖ్యమంత్రికి గుర్తులేదా? గుర్తు ఉన్నా రైతులకు ఇవ్వటం ఇష్టం లేక అమలు చేయటం లేదా.. అన్నది స్పష్టం చేయాలన్నారు. ఈ నేపథ్యంలో రైతాంగ సమస్యల సాధనకు డిమాండ్ చేస్తూ ఈ నెల 17న విజయవాడ ధర్నా చౌక్ వద్ద మహా ధర్నా నిర్వహించబోతున్నామని వారు స్పష్టం చేశారు.



# ఉనకోటి

**నేలకు దిగివచ్చిన కైలాసం**
**ఉనకోటి అంటే కోటికి ఒకటి తక్కువ.**
**త్రిపురలోని అందమైన పర్యాటక ప్రదేశం.**
**ప్రకృతి ఒడిలో కొలువైన భారీ శిల్పాలు.**
**హెరిటేజ్ సైట్ హోదా సొంతమైన చరిత్ర.**



ఈశాన్య రాష్ట్రాల టూర్‌లో ప్రకృతి పచ్చదనానిదే పైచేయి. జనారణ్యానికి దూరంగా వెళ్లే కొద్దీ అచ్చమైన స్వచ్ఛత ఒడిలోకి చేరుకుంటాం. చెట్లు చేమలు నిండిన పచ్చటి కొండలు బారులుతీరి ఉంటాయి. రఘునాథ హిల్స్‌లో పచ్చదనం లోపించిన కొండవాలు ఒకింత ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. పరికించి చూస్తే అందమైన రూపాలు కనువిందు చేస్తాయి. విఘ్నేశ్వరుడు, ఈశ్వరుడు, దుర్గాదేవి, గంగ, ఇతర కైలాసగణమంతా కొలువుదీరినట్లు ఉంటుంది. ఇంతటి భారీ శిల్పాలను ఎవరు చెక్కి ఉంటారు? ఎప్పుడు జరిగిందీ వింత?

ఉనకోటి శిల్పాల సముదాయాన్ని ఏడు నుంచి తొమ్మిది శతాబ్దాల మధ్యలో చెక్కి ఉండవచ్చనేది ఆర్కియాలజిస్టుల అంచనా. 'కల్లు కుమ్‌హార్' అనే గిరిజన శిల్పకారుడు ఈ శిల్పాలను చెక్కినట్లు స్థానికులు చెబుతారు. కైలాస పర్వతంలోని శివపార్వతులను దర్శించుకోవడం అందరికీ సాధ్యమయ్యే పని కాదు కాబట్టి, ఆ రూపాలను, కైలాసాన్ని కళ్లకు కట్టడానికే ఈ శిల్పాలను చెక్కాడని చెబుతారు. క్రీ.శ 16వ శతాబ్దంలో కాలాపహాడ్ అనే మొఘలు గవర్నర్ భువనేశ్వర్‌లోని శివుడిని, ఉనకోటికి సమీపంలో ఉన్న తుంగేశ్వర శివుడిని ధ్వంసం చేశాడని, ఈ ప్రదేశం మీద దాడిచేయడానికి అతడు చేసిన ప్రయత్నం కుదరక వదిలేసినట్లు చెబుతారు. ఇక్కడ ఏటా ఏప్రిల్ మాసంలో జరిగే 'అశోకాష్టమి మేళా'లో ఈశాన్యరాష్ట్రాలన్నింటి నుంచి వేలాదిగా భక్తులు పాల్గొంటారు.


### జనపద కథనం...

శివుడితోపాటు కోటిమంది కైలాసగణం కాశీయాత్రకు బయలుదేరింది. ఈ ప్రదేశానికి వచ్చేసరికి చీకటి పడింది. ఆ రాత్రికి ఈ అడవిలోనే విశ్రమించారంతా. తెల్లవారక ముందే నిద్రలేచి ఈ ప్రదేశాన్ని విడిచిపెట్టాలని, ఆలస్యమైతే రాళ్లలా మారిపోతారని, నిద్ర కుపక్రమించే ముందు శివుడు అందరినీ హెచ్చరిస్తాడు. చెప్పిన సమయానికి శివుడు తప్ప మరెవరూ నిద్రలేవలేకపోవడంతో మిగిలిన వారంతా శిలలుగా మారిపోయారు. కోటి మంది బృందంలో శివుడు మినహా మిగిలిన వారంతా శిలలు కావడంతో ఈ ప్రదేశానికి 'ఉనకోటి' అనే పేరు వాడుకలోకి వచ్చిందని స్థానికులు ఆసక్తికరమైన కథనం చెబుతారు. ఆ కథనం ప్రకారమైతే ఈ శిల్పాల సముదాయంలో శివుడి శిల్పం ఉండకూడదు, కానీ శివుడి శిల్పం కూడా ఉంది. దేశంలో అత్యంత పెద్ద శివుడి శిల్పం ఇదే. వాస్తవాల అన్వేషణకు పోకుండా ఆ శిల్పాల నైపుణ్యాన్ని ఆస్వాదిస్తే ఈ టూర్ మధురానుభూతిగా మిగులుతుంది.

### పెద్ద శివుడు

ఈ భారీ శివుడి పేరు ఉనకోటేశ్వర కాలభైరవుడు. విగ్రహం 30 అడుగుల ఎత్తు ఉంటుంది. తలమీద ఎంబ్రాయిడరీ చేసిన తలపాగా ధరించినట్లు చెక్కారు. ఆ తలపాగా ఎత్తు పది అడుగులుంది. తలకు రెండు వైపులా సింహవాహనం మీద దుర్గాదేవి, గంగామాత శిల్పాలుంటాయి. నంది విగ్రహం సగానికి నేలలో కూరుకుపోయి ఉంటుంది. గణేశుడు ప్రశాంతంగా మౌనముద్రలో ఉంటాడు. ఈ శిల్పాలు కొన్ని ఎకరాల విస్తీర్ణంలో పరుచుకుని ఉన్నాయి. ప్రధానమైన వాటిని చూడడంతోనే మనకు శక్తి తగ్గిపోతుంది. కొన్ని శిల్పాలను సమీప గ్రామాల వాళ్లు ఇళ్లకు పట్టుకుపోగా మిగిలిన వాటి కోసం ఇండియన్ ఆర్కియాలజీ సర్వే నోటీస్ బోర్డులుంటాయి. ఏఎస్‌ఐ అడవినంతా గాలించి, పరిశోధించింది. ఏఎస్‌ఐ ప్రమాణాల ప్రకారం ఈ ప్రదేశం హెరిటేజ్ సైట్‌ల జాబితాలో చేరింది. యునెస్కో గుర్తించి సర్టిఫికెట్ జారీ చేసే లోపు చూసివద్దాం.

– వాకామంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి





### ఉనకోటి ఎక్కడ ఉంది!

త్రిపుర రాష్ట్ర రాజధాని అగర్తల నగరానికి 178 కి.మీ.ల దూరంలో 'కైలాస్‌హర' పట్టణానికి దగ్గరగా ఉంది.

**ఎలా వెళ్లాలంటే...**

- సమీప విమానాశ్రయం అగర్తలలో ఉంది.
- సమీప రైల్వేస్టేషన్ కుమార్‌ఘాట్‌లో ఉంది.

ఇది ఉనకోటికి 20 కి.మీ.ల దూరంలో ఉంది.

**ఎప్పుడు వెళ్లవచ్చు!**

ఇది పర్వతశ్రేణుల ప్రదేశం కాబట్టి వర్షాకాలం మంచిది కాదు. అక్టోబర్ నుంచి మే నెల మధ్య వాతావరణం అనువుగా ఉంటుంది.

## ట్రావెల్ టిప్స్

ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో ప్రధానంగా గుర్తుంచుకోవాల్సింది బస గురించి. రాష్ట్ర రాజధాని నగరాల్లో మాత్రమే 3 స్టార్, 4 స్టార్ హోటళ్లు ఉంటాయి. అక్కడ కూడా ఫైవ్‌స్టార్, సెవెన్ స్టార్‌లుండవు.

- బడ్జెట్ హోటళ్లు కూడా పరిశుభ్రత విషయంలో మంచి ప్రమాణాలనే పాటిస్తాయి. హోమ్‌స్టేలు నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో కూడా ఉంటాయి.
- గ్రామాల్లో పర్యటించాలంటే హోమ్‌స్టేలతోపాటు పంచాయితీ గెస్ట్ హౌస్‌లు బాగుంటాయి. చర్చిలు కూడా గెస్ట్ హౌస్‌లను నిర్వహిస్తుంటాయి. వాటిని కూడా ఎంచుకోవచ్చు. పంచాయితీ గెస్ట్ హౌస్, చర్చి గెస్ట్ హౌస్‌లలో బస కోసం ముందుగా బుక్ చేసుకోవాలి.
- ఇక్కడ తెల్లవారు జామునే నిద్రలేచి చీకటి పడగానే నిద్రపోవడం అనే ప్రకృతి జీవనశైలిని అనుసరించాల్సిందే.
- అటవీ ప్రదేశాల్లో పర్యటించేటప్పుడు గైడ్ సహాయం తప్పనిసరి. అలాగే అక్కడ ప్రభుత్వ ఆంక్షలను విధిగా పాటించాలి. నదులు శీతాకాలంలో గడ్డకట్టి మంచు పీఠభూమిని తలపిస్తాయి. కానీ ఆ నదుల్లో దిగరాదు. పైకి మంచు పీఠభూమిలాగ ఉన్నప్పటికీ ఎక్కడో ఒక చోట పలుచటి పలక విరిగి నీటలో మునిగిపోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ప్రభుత్వం దిగకూడని నదుల దగ్గర హెచ్చరిక బోర్డులు పెడుతుంది. వాటిని అనుసరించాలి.


## చిత్తోర్‌ఘర్ పన్నా దాయిది కూడా




రాజస్థాన్, చిత్తోర్‌ఘర్... పేరు వినగానే మేవార్‌రాజుల ఘనచరిత్ర కళ్ల ముందు మెదులుతుంది. రాణి పద్మిని త్యాగం గుర్తు వస్తుంది. పద్మావత్ సినిమా తర్వాత చిత్తోర్ ఘర్ పేరు అనేక వివాదాలకు, విచిత్ర భాష్యాలకు నెలవైంది. సినిమాలో చూసిన చిత్తోర్‌ఘర్ కోటను స్వయంగా చూడడం కూడా అవసరమే. చిత్తోర్‌ఘర్ చరిత్రలో ఉన్న మహిళ రాణి పద్మినిది మాత్రమే కాదు. ఈ కోటలో చరిత్ర సృష్టించిన ముగ్గురు. భక్త మీరాబాయి, రాణి పద్మిని, పన్నాదాయి. భక్త మీరాబాయి... కృష్ణుడి భక్తురాలిగా సుపరిచితమే. ఇక పన్నా దాయి మాత్రం సినిమాటిక్ అట్రాక్షన్ లేని పాత్రకావడంతో చరిత్రపుటల్లో అక్షరాలుగా మాత్రమే మిగిలిపోయింది.

### త్యాగమయి పన్నా

రాజపుత్ర రాజు రాణా సంగా భార్య రాణి కర్ణావతి దగ్గర దాదిగా పని చేసింది పన్నాదాయి. పిల్లల్ని పెంచే బాధ్యత ఆమెది. రెండవ ఉదయ్ సింగ్ చంటిబిడ్డగా ఉన్నప్పుడు కోట మీద దాడి జరిగింది. ఉదయ్ సింగ్‌ను కాపాడడానికి శత్రువుల దృష్టి మళ్లించడానికి ఊయలలో తన బిడ్డను పెట్టి ఉదయ్‌సింగ్‌ను భద్రంగా కోట నుంచి బయటకు పంపించింది. రాజ కుటుంబం పట్ల ఆమెకున్న ప్రేమకు,







త్యాగానికి గుర్తుగా కోట లోపల ఆమె విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ కోటలో రాణా కుంభ కట్టిన విజయ్ స్తంభ్, రాణి పద్మిని ప్యాలెస్ ముఖ్యమైనవి. అల్లావుద్దీన్ ఖిల్జీ అద్దంలో రాణిని చూసిన ప్రదేశం ముఖ్యమైనది. పద్మిని తన ప్యాలెస్ మెట్ల మీద కూర్చుంటే, ఆమె ప్రతిబింబం... ప్యాలెస్ మెట్లకు అభిముఖంగా ఉన్న చిన్న బిల్డింగ్‌లోని అద్దంలో కనిపిస్తుంది. ఖిల్జీ ఆ ప్రతిబింబాన్ని చూసిన అద్దం ఇప్పటికీ ఉంది.

### జోవార్ గద్దె

రాణి పద్మిని అందచందాలను విని ఆశ్చర్యపోయిన ఖిల్జీ ఆమె కోసమే దండెత్తి యుద్ధం చేశాడు. రాజ్యాన్ని ధ్వంసం చేశాక కూడా కోట స్వాధీనం కాకపోవడంతో రాణి పద్మినిని ఒకసారి చూసి వెళ్లిపోతానని కోరాడని, అప్పుడు మంత్రివర్గ ప్రముఖులు ఆమెను స్వయంగా చూపించకుండా అద్దంలో చూపించారని గైడ్‌లు చెప్తారు. చూసి వెళ్లిపోతానన్న ఖిల్జీ ఆ తర్వాత మాటతప్పి కోటలోకి ఆహార పదార్థాలు అందకుండా దిగ్బంధించి కోటను స్వాధీనం చేసుకున్నాడు. అప్పుడు పద్మినితోపాటు నాలుగు వేల మంది మహిళలు నిప్పుల్లో దూకి ప్రాణత్యాగం(జోవార్) చేసిన ఆ స్థలాన్ని చూపించి ఈ వివరాలన్నీ చెప్తారు. కోట లోపల శివాలయం, జైనమందిరం ఉన్నాయి.

ఇక్కడ ఉన్న ఆలయాలు, ప్యాలెస్‌లు, గార్డెన్‌లు, జ్ఞాపక నిర్మాణాలు ఏవైనా సరే అందులో ఇమిడిన నైపుణ్యానికి తలవంచి నమస్కరించాల్సిందే.




## చిత్ర కళ

# మది నిండుగా మహా కుంభమేళా!



**మహాకుంభమేళా ఆర్ట్ వర్క్‌తో అందమైన రూపాన్ని నింపుకుంది. కళాకారులు తమదైన శైలిలో భారతీయ సంస్కృతిని కళ్లకు కడుతున్నారు, రికార్డులు కొల్లగొడుతున్నారు.**

మహాకుంభమేళా ఈవెంట్‌కు దాదాపు 40 – 45 కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా.




### రూపు మారిన రైల్వే స్టేషన్లు

అధిక సంఖ్యలో భక్తులు రైలు ప్రయాణం ద్వారా ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుంటారు. ఈ సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌తో పాటు చుట్టుపక్కల రైల్వే స్టేషన్లు హిందూ పురాణాల నుండి ప్రేరణ పొందిన ఆకర్షణీయమైన కుడ్యచిత్రాలతో అందమైన హబ్‌లుగా మారిపోయాయి. రామాయణం, కృష్ణ లీల, లార్డ్ బుద్ధ, శివశక్తి, గంగా హారతి, మహిళా సాధికారత.. వంటి పౌరాణిక ప్రతిబింబాలను అందించడానికి థీమ్‌లను ఎంపిక చేశారు. యాత్రికులకు ఆధ్యాత్మిక వారసత్వాన్ని సజీవంగా అందించడానికి, స్వాగతం పలకడానికి మన సంప్రదాయానిన ఈ విధంగా కళ్లకు కట్టారు. ప్రయాగ్‌రాజ్ జంక్షన్, నైని జంక్షన్, ఫఫామా, ప్రయాగ్ జంక్షన్, ఝూన్సీ స్టేషన్, రాంబాగ్ స్టేషన్, చెయోకి, సంగం, సుబేదర్‌గంజ్, ప్రయాగ్‌రాజ్‌తో సహా ప్రయాగ్‌రాజ్‌లోని అన్ని రైల్వే స్టేషన్లను 'పెయింట్ మై సిటీ' డ్రైవ్ కింద సుందరీకరించింది.

### లోతైన సంస్కృతి

గురు–శిష్య బంధం, విజ్ఞానం, పరిత్యాగం సామరస్య సమ్మేళనంతో సహా ఒక లోతైన సంప్రదాయాలను నగరం లోపల గోడలపై కళాకారులు చిత్రించారు. ఈ శక్తివంతమైన ఈ కుడ్యచిత్రాలు ప్రతి మూల మహాకుంభ వైభవంతో ప్రతిధ్వనిస్తుందనడానికి నిదర్శనంగా నిలిచాయి.

### 'రామ నామం' మహాకుంభం

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభ్ మేళా సందర్భంగా చాలా మంది కళాకారులు తమ ప్రతిభను నిరూపించుకుంటూనే ఉన్నారు.

మహాకుంభంలో ముఖ్యమైన ఆచారంగా ఉన్న అమృత కలశాన్ని కళాకారిణి ప్రతిభాపాండే 'రామ నామం'తో చిత్రించింది. 'ఈ కుంభ కళశాన్ని మహాకుంభ మేళాకు అంకితం చేస్తున్నాను. ఈ కళశాన్ని పూర్తి చేయడానికి ఏడు రోజులు పట్టింది. ఇది నాకు ధ్యాన వ్యాయామంలా ఉపయోగపడింది. గృహిణిగా ఇంటి పనులను త్వరగా పూర్తి చేసుకొని, పగలు–రాత్రి ఈ రామ కళశ కుంభాన్ని చిత్రించాను' అని చెబుతోంది ఈ చిత్రకారిణి.

### వరల్డ్ లార్జెస్ట్ రంగోళి రికార్డ్

ఇండోర్‌కు చెందిన శిఖా శర్మ నాయకత్వంలో రూపొందించిన అతి పెద్ద మహాకుంభ మేళా రంగోలీ లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదయ్యింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో యమునా క్రిస్టియన్ కళాశాల ప్రాంగణంలో 55,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో 11 టన్నుల సహజ రంగులను ఉపయోగించి, 72 గంటలలో శిఖా శర్మ, ఆమె బృందం ఈ రంగోలీని పూర్తి చేశారు. నదీ జలాలు, జన సంద్రం, పడవలు, భారీ సాధువు బొమ్మను ఇందులో చిత్రించారు.

'రామ నామం'తో అమృతకలశాన్ని చిత్రిస్తున్న ప్రతిభాపాండే!





ప్రయాగ్‌రాజ్‌లో శిఖాశర్మ ఆధ్వర్యంలో చిత్రించిన వరల్డ్ లార్జెస్ట్ రంగోలీ

## వారసత్వం

# భావోద్వేగాల కిజిక్ తివాచీ

- మహిళలు నేసిన వారసత్వం, భవిష్యత్తు కోసం భద్రం.
- భావోద్వేగాలతో నిండిన కార్పెట్
- నేతలో పాల్గొన్న మహిళలకు ఆర్థిక అవకాశాలు.




ఏ దేశ చారిత్రక సంస్కృతి చూసినా అక్కడి స్థానిక మహిళల సంప్రదాయ వారసత్వం ఉనికిలోకి వస్తూనే ఉంటుంది. టర్కీలోని మధ్య-నల్ల సముద్రం ప్రాంతంలోని కిజిక్ గ్రామానికి ప్రత్యేకమైన సాంప్రదాయ కళ ఒకటుంది. ఆ వారసత్వం పేరు కిజిక్ కార్పెట్. సాంస్కృతికపరంగా, మహిళలకు ఆదాయ వనరుగా సంరక్షించబడుతోంది అక్కడి తివాచీ. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అధ్యయనాలు, జియొగ్రాఫికల్ ఇండికేషన్ రిజిస్ట్రేషన్‌తో కిజిక్ కార్పెట్ ఇప్పటికీ రక్షించబడుతుంది. భవిష్యత్ తరాలకు దాని నిరంతర ఉనికిని తెలియజేస్తుంది.

### చారిత్రక జీవనశైలి

కిజిక్ గ్రామ మహిళల ఆనందం, దుఃఖం, ఆశ.. భావోద్వేగాలు, ఆలోచనలను ప్రతిబింబించే దాని సంక్లిష్టమైన మూలాంశాలతో కిజిక్ కార్పెట్ తయారీ విభిన్నంగా ఉంటుంది. ఈ తివాచీలు అలంకార వస్తువులు మాత్రమే కాదు. అవి లోతైన సాంస్కృతిక అర్థాన్ని కూడా కలిగి ఉంటాయి. కిజిక్ ప్రాంత చరిత్ర, జీవనశైలి, సంస్కృతిని ఈ కార్పెట్లు సూచిస్తాయి. టోకాట్ ప్రావిన్షియల్ డైరెక్టరేట్ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్, టోకాట్ మెచ్యూరేషన్ ఇన్‌స్టిట్యూట్ మధ్య సహకార ప్రయత్నం ద్వారా, విస్తృతమైన, ఫీల్డ్ పరిశోధనలు నిర్వహించారు. ఫలితంగా కిజిక్ కార్పెట్ భౌగోళిక సూచిక విజయవంతంగా నమోదయ్యింది. టోకాట్ మెచ్యూరేషన్ ఇన్స్టిట్యూట్‌లో ఉపాధ్యాయురాలు సెరాప్ బుజ్లుదేరే, ఈ సాంస్కృతిక విలువలను కాపాడటంలో ప్రాముఖ్యతను హైలైట్ చేసింది.

### మూలాంశాల ద్వారా సందేశం

తివాచీలలో ఉపయోగించే మూలాంశాలు తరచుగా స్త్రీల నుండి వారి కాబోయే భర్తలకు సందేశాలు, బహిరంగంగా తెలియజేయలేని భావోద్వేగాలను వ్యక్తపరుస్తాయి. కిజిక్ సంస్కృతి సంఘం అధ్యక్షుడు అహ్మెట్ ఓజ్టెక్, కిజిక్ తివాచీల చారిత్రక ప్రాముఖ్యతను చెబుతూ– 'కిజిక్ ప్రజలు ఓఘుజ్ టర్క్‌లకు చెందినవారు. చారిత్రాత్మకంగా, వారు సంచార జీవితాన్ని గడిపారు. పశుపోషణ, మేకల పెంపకం ప్రధాన జీవనోపాధిగా ఉంది. గొర్రెల నుండి ఉన్ని తివాచీలు తయారు చేయడంతో సహా వివిధ ప్రయోజనాల కోసం ఉపయోగించబడింది. సుదీర్ఘ శీతాకాలపు రాత్రులలో, పెద్దలు పర్యావరణం నుండి సేకరించిన సహజ మూలికలతో ఉన్నిని తయారుచేయడం, వాటికి రంగు వేయడం, తరువాత తివాచీలు, సంచులు, రగ్గులు వంటి ఇతర ఉత్పత్తులను నేసేవారు. తమ కమ్యూనిటీలో ఎవరి వివాహం కుదిరినా, ఆ వధూవరులకు స్వయంగా తివాచీని తయారుచేసి, ఇచ్చేవారు' అని వివరిస్తారు. ఈ తివాచీలు కేవలం గృహోపకరణాలు మాత్రమే కాదు, వ్యక్తిగత సందేశాలు, భావాలను కలిగి ఉంటాయి. అయితే, సాంప్రదాయ కిజిక్ తివాచీలు పారిశ్రామికీకరణతో సవాళ్లను ఎదుర్కొన్నాయి. కానీ, సాంస్కృతిక వారసత్వాన్ని ముందు తరాలకు సజీవంగా అందజేయడానికి కిజిక్ మహిళ కృషి జరుపుతూనే ఉంది.



కంపెనీకి ఒకే ఒక్క బాస్ ఉంటాడు.. అతనే కస్టమర్...
చైర్మన్‌సహా ప్రతి ఒక్కరినీ అతను కిందకు తోయగలడు..
- సామ్ వాల్టన్, ప్రముఖ అమెరికన్ వ్యాపారవేత్త



## బిజినెస్ రీల్

### ఓయో షేర్లపై సెలబ్రిటీల ఆసక్తి..




న్యూఢిల్లీ: ట్రావెల్ టెక్ ప్లాట్‌ఫాం ఓయో షేర్లపై గత కొన్నాళ్లుగా పలువురు సెలబ్రిటీల్లో ఆసక్తి పెరుగుతోంది. బాలీవుడ్ తారలు మాధురీ దీక్షిత్, అమృతా రావు.. నిర్మాత గౌరి ఖాన్ తదితరులు సంస్థ షేర్లను కొనుగోలు చేసిన వారిలో ఉండటం ఇందుకు నిదర్శనం. కంపెనీ ఇటీవల రూ. 1,400 కోట్లు సమీకరించిన సందర్భంగా గౌరి ఖాన్ 24 లక్షల షేర్లు కొనుగోలు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అలాగే మాధురీ దీక్షిత్, ఆమె భర్త శ్రీరామ్ నెనెతో పాటు మరి కొందరు ప్రముఖులు ఇరవై లక్షల షేర్లు కొనుగోలు చేసినట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే, ఆర్థిక వివరాలను వెల్లడించలేదు. మరోవైపు, సెలబ్రిటీ జంట అమృతారావు, ఆమె భర్త అన్మోల్ సూద్ .. సెకండరీ మార్కెట్లో షేర్లను కొన్నట్లు ఓయో పేర్కొంది. నువామా వెల్త్ ఈ మధ్యే ఒక్కో షేరుకు రూ. 53 చొప్పున రూ. 100 కోట్ల విలువ చేసే షేర్లను కొన్నట్లు వెల్లడైంది. ఈ డీల్స్‌తో కంపెనీ వేల్యుయేషన్ సుమారు 4.6 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లుగా తెలుస్తోంది. ఒకప్పుడు ఓయో మార్కెట్ విలువ 10 బిలియన్ డాలర్లు పలికినప్పటికీ ఆ తర్వాత గణనీయంగా తగ్గిపోయింది.


మాధురీ దీక్షిత్


అమృతారావు


గౌరి ఖాన్

# గణాంకాలు, ఫలితాల ఎఫెక్ట్



- క్యూ3 జాబితాలో ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్, విప్రో
- ఆర్‌బీఎల్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్
- ద్రవ్యోల్బణం, వాణిజ్య లోటు వివరాలు వెల్లడి
- ఈ వారం మార్కెట్ల ట్రెండ్‌పై నిపుణుల అంచనాలు

దేశీ స్టాక్ మార్కెట్లు ఈ వారం ప్రధానంగా అక్టోబర్–డిసెంబర్(క్యూ3) ఫలితాలు, ద్రవ్యోల్బణ గణాంకాల ఆధారంగా కదిలే వీలున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. వీటికితోడు అంతర్జాతీయ అంశాలు సైతం సెంటిమెంటును ప్రభావితం చేయనున్నట్లు తెలియజేశారు. డిసెంబర్ నెలకు యూఎస్, చైనా గణాంకాలు వెలువడనున్నాయి. ఇవికాకుండా విదేశీ పెట్టుబడులు, డాలరు ఇండెక్స్ కదలికలు తదితర అంశాలు సైతం కీలకంగా నిలవనున్నట్లు వివరించారు. వివరాలు చూద్దాం..

–సాక్షి, బిజినెస్‌డెస్క్

**ఫలితాలకు రెడీ**

గత వారం ఐటీ సేవల దిగ్గజం టీసీఎస్ క్యూ3 ఫలితాలతో ఇన్వెస్టర్లను మెప్పించగా.. ఈ వారం మరి కొన్ని దిగ్గజాలు పనితీరు వెల్లడించనున్నాయి. ఆనంద్‌రాఠీ, ఏంజెల్ వన్, డెల్టా కార్ప్, హిమాద్రి స్పెషాలిటీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 13న, నెట్‌వర్క్ 18, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ 14న, సియట్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఎల్‌టీటీఎస్, నెల్కో, ట్రాన్స్‌రైల్ 15న, యాక్సిస్ బ్యాంక్, హాట్సన్, హావెల్స్, ఇన్ఫోసిస్, కేశోరామ్, ఎల్‌టీఐఎం, మాస్టెక్, ఆర్‌బీఎల్ 16న ఫలితాలు ప్రకటించనున్నాయి. ఈ బాటలో 17న అట్లాస్ సైకిల్, ఇండియన్ హోటల్స్, ర్యాలీస్, ఆర్‌కే ఫోర్జ్, ఎస్‌బీఐ లైఫ్, శేషసాయి పేపర్, స్టెరిలైట్ టెక్, స్వరాజ్ ఇంజిన్స్, టెక్ మహీంద్రా, విప్రో క్యూ3 ఫలితాలు తెలియజేయనున్నాయి. వారాంతాన(11న) డీమార్ట్ రిటైల్ స్టోర్ల దిగ్గజం ఎవెన్యూ సూపర్ మార్ట్స్, జస్ట్‌డయల్ అక్టోబర్–డిసెంబర్ ఫలితాలు వెల్లడించాయి. ఈ ప్రభావం సోమవారం(13న) కనిపించనున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ సీనియర్ టెక్నికల్ అనలిస్ట్ ప్రవేశ్ గౌర్ పేర్కొన్నారు.

**ధరల వివరాలు**

డిసెంబర్ నెలకు రిటైల్ ధరల ద్రవ్యోల్బణం(సీపీఐ) గణాంకాలు నేడు(సోమవారం) వెల్లడికానున్నాయి. నవంబర్‌లో సీపీఐ 5.48 శాతానికి తగ్గింది. అక్టోబర్‌లో ఇది 6.21 శాతంగా నమోదైంది. ఇక టోకు ధరల ద్రవ్యోల్బణం(డబ్ల్యూపీఐ) వివరాలు రేపు(14న) విడుదలకానున్నాయి. నవంబర్‌లో డబ్ల్యూపీఐ 1.89 శాతానికి తగ్గింది. అక్టోబర్‌లో ఇది 2.36 శాతంగా నమోదైంది. ఆహార ధరలు తగ్గడం ప్రభావం చూపింది. బుధవారం(15న) నవంబర్ నెలకు వాణిజ్య గణాంకాలు వెలువడనున్నాయి. నవంబర్‌లో వాణిజ్య లోటు అత్యధికంగా 37.8 బిలియన్ డాలర్లను తాకింది. గతేడాది ఇదే నెలలో ఈ సంఖ్య 20.6 బిలియన్ డాలర్లు మాత్రమే. ఆర్థిక గణాంకాలు సైతం సెంటిమెంటుకు కీలకంగా నిలవనున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా అభిప్రాయపడ్డారు.

**వాణిజ్య మిగులు**

డిసెంబర్ నెలకు చైనా వాణిజ్య గణాంకాలు 13న విడుదలకానున్నాయి. నవంబర్‌లో వాణిజ్య మిగులు 97.5 బిలియన్ డాలర్లుగా నమోదైంది. డిసెంబర్ నెలకు యూఎస్ ఉత్పాదక ధరల ద్రవ్యోల్బణ వివరాలు 14న, కీలక ద్రవ్యోల్బణ గణాంకాలు 15న వెలువడనున్నాయి. నవంబర్‌లో మూడు నెలల గరిష్టం 3.3 శాతానికి చేరింది. రిటైల్ అమ్మకాలు 16న వెల్లడికానున్నాయి. నవంబర్‌లో ఇవి 0.7 శాతం పెరిగాయి. 17న చైనా 2024 క్యూ3 జీడీపీ వివరాలు తెలియనున్నాయి. వార్షికంగా 4.6 శాతం ఎకానమీ వృద్ధిని అంచనా వేస్తున్నారు. క్యూ2లో 4.7 శాతం పురోగతిని సాధించింది.

**గత వారమిలా**

శుక్రవారం(11)తో ముగిసిన గత వారం మార్కెట్లు డీలా పడ్డాయి. 2 వారాల తదుపరి తిరిగి నష్టపోయాయి. సెన్సెక్స్ నికరంగా 1,844 పాయింట్లు (2.3 శాతం) పతనమైంది. 77,379 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 573 పాయింట్లు(2.4 శాతం) పడిపోయి 23,432 దిగువన స్థిరపడింది. బీఎస్ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ మరింత అధికంగా 5.7 శాతం దిగజారగా.. స్మాల్ క్యాప్ 6 శాతంపైగా పడిపోయింది.

**ఇతర అంశాలు**

ప్రపంచ ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు బలపడుతోంది. దీంతో దేశీ కరెన్సీ రోజురోజుకీ సరికొత్త కనిష్టాలను తాకుతోంది. గత వారం సాంకేతికంగా కీలకమైన 86 స్థాయినీ కోల్పోయింది. మరోపక్క యూఎస్ బాండ్ల ఈల్డ్స్, ముడిచమురు ధరలు సైతం పుంజుకుంటున్నాయి. దీంతో గత వారం మార్కెట్లు పతన బాటలో సాగినట్లు మాస్టర్ ట్రస్ట్ గ్రూప్ డైరెక్టర్ పునీత్ సింఘానియా పేర్కొన్నారు. అయితే ఈ వారం క్యూ3 ఫలితాల ప్రభావం అధికంగా కనిపించనున్నట్లు తెలియజేశారు. అయితే యూఎస్, చైనా గణాంకాలు, విదేశీ పెట్టుబడులు తదితర అంశాలు సైతం మార్కెట్లలో ఒత్తిడికి కారణమవుతున్నట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ పేర్కొన్నారు.

## ఎఫ్‌పీఐల అమ్మకాలు.. జనవరి 10 వరకు రూ. 22,914 కోట్లు



న్యూఢిల్లీ: దేశీ ఈక్విటీలలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) మరోసారి నికర అమ్మకందారులుగా నిలుస్తున్నారు. ఈ నెలలో ఇప్పటివరకూ(1–10 మధ్య) రూ. 22,194 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించారు. డిసెంబర్‌లో తొలుత అమ్మకాలు చేపట్టినప్పటికీ చివరి వారాల్లో కొనుగోళ్లకు దిగడంతో నికరంగా రూ. 15,446 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. యూఎస్ డాలర్ ఇండెక్స్ 109కు బలపడటం, కొత్త ప్రెసిడెంట్‌గా ఎంపికైన ట్రంప్ టారిఫ్‌లకు తెరతీయవచ్చన్న అంచనాలు ప్రభావం చూపుతున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. వీటికితోడు యూఎస్ బాండ్ల ఈల్డ్స్ 4.6 శాతానికి పుంజుకోవడం, దేశ జీడీపీ వేగం తగ్గడం వంటి అంశాలు సైతం జత కలుస్తున్నట్లు అభిప్రాయపడ్డారు.

## 5 ఐపీవోల లిస్టింగ్




స్టాక్ ఎక్స్ఛేంజీలలో ఈ వారం 5 కంపెనీలు లిస్టికానున్నాయి. గత వారం ఇష్యూలు పూర్తయిన హైదరాబాద్ కంపెనీ స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ(13న)తోపాటు రైల్వే రక్షణ రంగ కంపెనీ క్వాడ్రంట్ ఫ్యూచర్ టెక్, క్యాపిటల్ ఇన్‌ఫ్రా ట్రస్ట్ ఇన్విట్(14న) లిస్టికానున్నాయి. ఈ బాటలో ఎస్ఎంఈలు బీఆర్ గోయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డెల్టా ఆటోకార్ప్, అవాక్స్ అపారెల్స్ అండ్ ఆర్నమెంట్స్ 14న లిస్టికానున్నాయి. మరోవైపు 13న లక్ష్మీ డెంటల్ ఐపీవో ప్రారంభంకానుంది. ఈ బాటలోఎస్ఎంఈలు కాబ్రా జ్యువెల్స్, రిఖావ్ సెక్యూరిటీస్, ల్యాండ్‌మార్క్ ఇమ్మిగ్రేషన్, ఈఎంఏ పార్ట్‌నర్స్ ఇష్యూలు ప్రారంభంకానున్నాయి.

## టాప్-5 కంపెనీలకు అమ్మకాల సెగ




గత వారం మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ)రీత్యా టాప్-5 కంపెనీల మార్కెట్ విలువలో నికరంగా రూ. 1,85,952 కోట్లు ఆవిరైంది. జాబితాలో టాప్-5 కంపెనీల విలువ నష్టపోగా.. మిగిలిన 5 దిగ్గజాల మార్కెట్ క్యాప్ బలపడింది. ప్రధానంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలువకు రూ. 70,479 కోట్లు చిల్లు పడింది. ఈ బాటలో ఐటీసీ విలువ రూ. 46,481 కోట్లు, స్టేట్‌బ్యాంక్(ఎస్‌బీఐ) విలువ రూ. 44,935 కోట్లు, రిలయన్స్ ఇండస్ట్రీస్ విలువ రూ. 12,179 కోట్లు, ఐసీఐసీఐ బ్యాంక్ విలువ రూ. 11,877 కోట్లు చొప్పున క్షీణించింది. అయితే ఐటీ దిగ్గజం టీసీఎస్ మార్కెట్ విలువకు రూ. 60,169 కోట్లు జమకావడం గమనార్హం!

### ప్రీమియం సీట్ల పెంపుపై ఎయిరిండియా ఫోకస్




న్యూఢిల్లీ: వ్యాపార వృద్ధి అవకాశాలను మరింతగా అందిపుచ్చుకునే దిశగా ఎయిరిండియా తమ విమానాల్లో ప్రీమియం ఎకానమీ, బిజినెస్ క్లాస్ సీట్ల సంఖ్యను పెంచుకోనుంది. అలాగే, మరింత మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు ఫ్లయిట్స్ వేళలను, నెట్‌వర్క్‌ను క్రమబద్ధీకరించుకోనుంది. ఎయిరిండియా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ నిపుణ్ అగర్వాల్ ఈ విషయాలు తెలిపారు. అంతర్జాతీయ రూట్లలో మిగతా సంస్థలతో పోటీపడేందుకు ఏ350–1000 రకం పెద్ద విమానాల్లో ఫస్ట్ క్లాస్ సీట్లను కూడా ప్రవేశపెట్టనున్నట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం ఎయిరిండియాకు 202 విమానాలు ఉన్నాయి. వీటిలో 67 పెద్ద విమానాలు ఉన్నాయి. నిత్యం 1,168 ఫ్లయిట్స్‌ను నడుపుతోంది. ఇందులో 313 సర్వీసులు అంతర్జాతీయ రూట్లలో ఉంటున్నాయి. అటు రూపాయి మారకం విలువ క్షీణతతో తమ వ్యయాలు, లాభదాయకతపై కూడా ఒత్తిడి పెరుగుతోందని అగర్వాల్ చెప్పారు. అయితే, అంతర్జాతీయ ఫ్లయిట్స్ టికెట్ల చార్జీలు విదేశీ కరెన్సీలో ఉండటం వల్ల ప్రభావం కాస్త తక్కువగా ఉంటోందని వివరించారు.

# సులభతర వ్యాపారానికి పది చర్యలు

- అనుమతులకు సింగిల్ విండో
- వివాదాలను వేగంగా పరిష్కరించాలి
- భూములపై సమాచారం కోసం డేటా బ్యాంక్
- కేంద్రానికి సీఐఐ సూచనలు




న్యూఢిల్లీ: వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేసేందుకు పది పాయింట్ల అజెండాను భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. నిబంధనల అమలు భారాన్ని తగ్గించడం, నియంత్రణపరమైన కార్యాచరణను సులభంగా మార్చడం, పారదర్శకతను పెంచడం లక్ష్యాలుగా బడ్జెట్‌కు ముందు సీఐఐ ఈ సూచనలు చేయడం గమనార్హం.

- కేంద్రం, రాష్ట్రం, స్థానిక స్థాయిలో అన్ని నియంత్రణపరమైన అనుమతులను జాతీయ సింగిల్ విండో విధానంలోనే మంజూరు చేయాలి.
- కోర్టుల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా వివాదాల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి. ప్రత్యామ్నాయ వివాద పరిష్కార యంత్రాంగాన్ని (ఏడీఆర్) తీసుకురావాలి.
- పర్యావరణ నిబంధనల అమలును క్రమబద్ధీకరించేందుకు వీలుగా ఏకీకృత కార్యాచరణను ప్రవేశపెట్టాలి. అన్నింటితో ఒకే డాక్యుమెంట్‌ను తీసుకురావాలి.
- వ్యాపార విస్తరణ, కొత్త వ్యాపారాలకు భూమి ఎంతో అవసరం. ఆన్‌లైన్ ఇంటిగ్రేటెడ్ ల్యాండ్ అథారిటీని అభివృద్ధి చేయడానికి రాష్ట్రాలను ప్రోత్సహించాలి. భూమి రికార్డులను డిజిటైజ్ చేయడం, వివాదాల్లో ఉన్న భూముల సమాచారం అందించడం లక్ష్యాలుగా ఉండాలి.
- భూసమీకరణలో పరిశ్రమకు సహకరించేందుకు వీలుగా.. చాలా రాష్ట్రాల్లో భూముల సమాచారాన్ని అందించే 'ఇండియా ఇండస్ట్రియల్ ల్యాండ్ బ్యాంక్ (ఐఐఎల్‌బీ)'ను కేంద్రం నిధుల సహకారంతో జాతీయ స్థాయి ల్యాండ్ బ్యాంక్‌గా అభివృద్ధి చేయొచ్చు.
- పరిశ్రమల దరఖాస్తుల మదింపును నిర్ణీత కాల వ్యవధిలో ముగించేందుకు, కేంద్ర ప్రభుత్వ శాఖల సేవలకు చట్టబద్ధమైన కాల పరిమితి నిర్ణయించాలి.
- కార్మిక చట్ట నిబంధనలు ఇప్పటికీ కష్టంగానే ఉన్నాయి. నాలుగు లేబర్ కోడ్‌ల అమలు చేయాలి. అన్ని రకాల కేంద్ర, రాష్ట్ర కార్మిక చట్ట నిబంధనల అమలుకు కేంద్రీకృత పోర్టల్‌గా శ్రమ్ సువిధ పోర్టల్‌ను అమలు చేయాలి.
- అథరైజ్డ్ ఎకనమిక్ ఆపరేటర్ (ఏఈవో) కార్యక్రమాన్ని తీసుకురావాలి. ఎన్నో ప్రాధాన్య అనుమతులకు మార్గం సుగమం అవుతుంది.

**ఆర్థిక వృద్ధి కోసం తప్పదు..**

''నియంత్రణ కార్యాచరణను సులభతరం చేయడం, నిబంధనల అమలు భారాన్ని తగ్గించడం, పారదర్శకతను పెంచడం వచ్చే కొన్నేళ్ల కాలానికి ప్రాధాన్య అజెండాగా ఉండాలి. భూమి, కార్మికులు, వివాదాల పరిష్కారం, పన్ను చెల్లింపులు, పర్యావరణ అంశాలకు సంబంధించి నిబంధనల అమలు భారాన్ని తగ్గించేందుకు ఎంతో అవకాశం ఉంది. ఇది పోటీతత్వాన్ని పెంచడంతోపాటు ఆర్థిక వృద్ధికి, ఉపాధి కల్పనకు ఊతమిస్తుంది''అని సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ పేర్కొన్నారు.

# పెళ్లి ఖర్చులు.. పన్ను భారం...

కె.సీహెచ్. ఏ.వి.ఎస్.ఎన్ మూర్తి | కె.వి.ఎన్ లావణ్య




ట్యాక్సేషన్ నిపుణులు

ఈ రోజుల్లో అబ్బాయి పెళ్లైనా, అమ్మాయి పెళ్లైనా.. ఖర్చులకు అంతు లేకుండా పోతోంది. వాడుక అని, వేడుక అని ఒకర్ని చూసి ఒకరు ఎక్కువ ఖర్చుపెడ్తున్నారు. ఆటలు, పాటలు, హల్దీ, మెహందీ, బ్యాచిలర్ పార్టీలు, సంగీత్, ప్రీ–వెడ్డింగ్ షూట్.. పెళ్ళిలో వందలాది వంటకాలు, బట్టలు, రిటర్న్ గిఫ్టులు, అలంకరణ, బ్యాండు, కచేరీలు, బంగారం ... ఆ తర్వాత కార్యక్రమాలకు హోటళ్లు... అటు మీదట హనీమూన్. ఇవన్నీ పెళ్లి ఖర్చులు కిందే వస్తాయి. ఖర్చు పెడితే ఆదాయం రాదుగా.. ఇక పన్ను భారం ఏమిటండీ అంటారేమో.. ఓపిగ్గా చదవండి. పూర్తిగా చదవండి.

చట్టప్రకారం వరకట్నం నిషేధం. దాని జోలికి పోకండి. ఇవ్వకండి. ఏదైనా కారణాలవల్ల ఇవ్వాల్సి వస్తే 'నగదు' రూపంలో లావాదేవీలు నిర్వహించకండి. బ్యాంకుల ద్వారానే చేయండి. గిఫ్ట్ రూపంలో చేయండి. ఆ మేరకు డాక్యుమెంట్లు తయారు చేసుకోండి. మీ అమ్మాయి తరఫున ఇవ్వదల్చినట్లయితే.. 'స్త్రీధనం' పేరున అమ్మాయి పేరుతోనే వ్యవహారం చేయండి. స్త్రీధనం విషయంలో ఎలాంటి ఆంక్షలు లేవు. ఎంతైనా ఇవ్వొచ్చు. అయితే, ఇచ్చిన బ్యాంకు బ్యాలెన్సుకి, ఇంటికి, స్థిరాస్తికి, పొలానికి, తోటకి, బంగారానికి, ఆభరణాలకు డాక్యుమెంట్లు ముఖ్యం. ఇవన్నీ మీకు ఎలా వచ్చాయో మీరు చెప్పాల్సి రావచ్చు. ఎవరికి? పెళ్లివారికి కాదు.. ఆదాయపు పన్ను డిపార్టుమెంటు వారికి. అడిగినప్పుడు వివరణ ఇవ్వాలి. 'సోర్స్' చెప్పాలి.

ఇక పెళ్లి ఖర్చులపై ఎటువంటి ఆంక్షలు లేవు. ముకేశ్ అంబానీ కొడుకు పెళ్లి ఖర్చులు విన్నాం. అలా ఎన్నో పెళ్ళిళ్లు. మన కంటికి ఖర్చు కనిపిస్తూ ఉంటుంది. ఆ జోరు, హోరు, హుషారు, షికారు చూసి బంధువులు మెచ్చుకోవచ్చు. పెళ్లివారు సంతోషపడొచ్చు. కానీ ఆదాయపు పన్ను శాఖ వారి కంట్లో పడితే.. వారి దృష్టికి వెళితే, ఎవరైనా వారికి మీ ఖర్చుల మీద కంప్లైంట్ ఇస్తే.. ఖర్చుల విషయం ఆరా తీయడం చాలా తేలిక పని. అధికారుల వద్ద ఎన్నో పరికరాలు, పద్ధతులు ఉంటాయి. మిమ్మల్ని వాచ్ చేస్తారు. పెళ్లి పందిళ్లలో మమేకం అయిపోతూ, ఒక గెస్టులాగా మీతో మాట్లాడుతూ భోగట్టా చేస్తారు. కూపీ లాగుతారు. ఎంక్వైరీ చేస్తారు. మనం కూడా ఎంతో సంతోషంగా, సంబరంగా, గర్వంగా, గొప్పగా చెప్పేస్తాం. షేర్ చేసుకుంటాం.

ఇది కాకుండా పందిళ్లలో ఆ నోటా.. ఈ నోటా .. కొన్ని మాటలు వింటాం. వెండర్లు.. అంటే సరీస్ ప్రొవైడర్లు.. కొటేషన్లు ఇస్తున్నారు. అందులో జీఎస్‌టీ వసూలు చేస్తున్నారు. విజిటింగ్ కార్డులు పంచుతున్నారు. సోషల్ మీడియాలో టామ్‌టామ్ చేసుకుంటున్నారు. గూగుల్, పేటీఎంకు చెల్లింపులు చెయ్యమంటున్నారు. కాగితాలు, రుజువులు .. ఫొటోల సాక్షిగా దొరుకుతున్నాయి. ఒక విధంగా అంతా బట్టబయలే. పారదర్శకమైనదిగా కంటికి కనిపించేదిగానే ఉంటోంది. ఊహకు అందని విషయమేమీ కాదు. శ్రేయోభిలాషి 'శభాష్' అన్నా.. అధికారులు మనల్ని 'బేహోష్' చేయొచ్చు.

హాల్ బుకింగ్‌కి అడ్వాన్స్ ఇస్తే నోటీసులు వచ్చాయి. వెండార్స్ నుండి సమాచారం సంగ్రహించి, నోటీసులు ఇచ్చారు. మొత్తం ఖర్చు ఎంత అని అడిగితే.. మీరు ఏదో ఒక జవాబు ఇవ్వచ్చు. కానీ వాళ్ల దగ్గర పూర్తి సమాచారం ఉంటుంది. కాస్సేపు ఇద్దరి లెక్కలు ఒకటే అనుకోండి. అయినప్పటికీ ఆ ఖర్చులకు 'సోర్స్' చెప్పాలి. సరైన, సంతృప్తికరమైన జవాబులు రాకపోతే, ఖర్చు మొత్తాన్నీ 'ఆదాయం'గా భావించి పన్నులను చెల్లించమంటారు.

'సోర్స్' మీ సేవింగ్స్ కావచ్చు, మీరు అప్పు చేసి ఉండవచ్చు, మీ అబ్బాయి అమెరికా నుండి పంపి ఉండవచ్చు.. ఎల్ఐసీ మెచ్యూరిటీ అయి ఉండవచ్చు.. ఎన్ఎస్‌సీలను ఎన్‌క్యాష్ చేసి ఉండొచ్చు.. ఏదైనా సరే.. తగిన జాగ్రత్తలు తీసుకోండి. 'సోర్స్' ఉన్నంతవరకే ఖర్చు పెట్టండి.



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

# దీర్ఘకాల పెట్టుబడులకు అనుకూలం

## టాటా స్మాల్‌క్యాప్ ఫండ్




మ్యూచువల్ ఫండ్స్‌లో అధిక రాబడులు కోరుకునే వారికి స్మాల్‌క్యాప్ విభాగం అనుకూలం. పదేళ్లు అంతకుమించిన కాలంలో స్మాల్‌క్యాప్ ఫండ్స్ ఇతర కంపెనీలతో పోల్చినప్పుడు అధిక రాబడులు ఇస్తాయని చారిత్రక డేటా తెలియజేస్తోంది. కాకపోతే స్మాల్‌క్యాప్ కంపెనీల్లో ఊగిసలాటలు ఎక్కువ. వీటిల్లో రిస్క్ ఎంతో అధికం. యాజమాన్యం, కంపెనీ వ్యాపార సామర్థ్యాలు, భవిష్యత్ అవకాశాలు ఇలా ఎన్నో అంశాలను చూసిన తర్వాతే కంపెనీలు ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. అందుకని స్మాల్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్టర్లు నేరుగా పెట్టుబడులు పెట్టుకోవడం సూచనీయం కాదు. చిన్న కంపెనీలు కనుక ఆర్థిక సంక్షోభాలు, ఆయా రంగాల్లో వచ్చే ప్రతికూలతల ప్రభావం వీటిపై ఎక్కువగా ఉంటుంది. సాధారణ ఇన్వెస్టర్లకు ఇలాంటి సమాచారాన్ని తెలుసుకోవడం, విశ్లేషించుకోవడం కష్టమైన పని. నిపుణుల నిర్వహణలో నడిచే స్మాల్‌క్యాప్ ఫండ్స్ ద్వారా ఇన్వెస్ట్ చేసుకోవడం ద్వారా ఈ రిస్క్‌లను చాలా వరకు అధిగమించొచ్చు. స్మాల్‌క్యాప్ విభాగంలో మంచి పనితీరు చూపిస్తున్న పథకాల్లో టాటా స్మాల్‌క్యాప్ ఫండ్ కూడా ఒకటి.

**రాబడులు**

ఈ పథకం ఏడాది కాలంలో 23.49 శాతం రాబడిని తెచ్చిపెట్టింది. మూడేళ్లలో చూస్తే 20.90 శాతం, ఐదేళ్లలోనూ 29.79 శాతం చొప్పున వార్షిక రాబడులను ఇన్వెస్టర్లకు అందించింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 250 సూచీ మాత్రం ఏడాదిలో 16 శాతం, మూడేళ్లలో 18.51 శాతం, ఐదేళ్లలో 27.62 శాతం చొప్పున రాబడినివ్వడం గమనార్హం. అంటే స్మాల్‌క్యాప్ సూచీ కంటే ఈ పథకమే ఎక్కువ రాబడిని తెచ్చి పెట్టింది. ఈ పథకం 2018 నవంబర్‌లో ప్రారంభమైంది. నాటి నుంచి చూసుకున్నా వార్షిక రాబడి 25 శాతంగా ఉండడం గమనార్హం. కనుక ఇన్వెస్టర్లు దీర్ఘకాల లక్ష్యాల కోసం సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవడాన్ని పరిశీలించొచ్చు.





**పెట్టుబడుల విధానం/పోర్ట్‌ఫోలియో**

దీర్ఘకాలంలో పెట్టుబడిని వృద్ధి చేయడం అనే విధానంతో ఈ పథకం పనిచేస్తుంటుంది. ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.9,699 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 92 శాతాన్ని ఈక్విటీలకు కేటాయించింది. 0.09 శాతాన్ని రియల్ ఎస్టేట్ సాధనాల్లో పెట్టుబడి పెట్టగా, మిగిలిన మేర నగదు రూపంలో కలిగి ఉంది. ఈక్విటీ పెట్టుబడుల్లో 60 శాతం స్మాల్ క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసింది. మిగిలిన పెట్టుబడులను మిడ్‌క్యాప్ కంపెనీలకు కేటాయించింది. పోర్ట్‌ఫోలియోలో మొత్తం 57 స్టాక్స్ ఉన్నాయి. పెట్టుబడుల పరంగా మెటీరియల్స్ కంపెనీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది. 22 శాతం పెట్టుబడులు ఈ రంగాల కంపెనీల్లోనే ఉన్నాయి. ఆ తర్వాత ఇండస్ట్రియల్స్‌కు 18.57 శాతం, కన్జ్యూమర్ డిస్క్రిషనరీ కంపెనీలకు 13.35 శాతం, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు 10 శాతం, హెల్త్ కేర్ కంపెనీలకు 10 శాతం చొప్పున పెట్టుబడులు కేటాయించింది. ఈ పథకంలో మొదటి సారి అయితే కనీసం రూ.5,000, సిప్ రూపంలో కనీసం రూ.500 ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది.

**టాప్ ఈక్విటీ హోల్డింగ్స్**

| కంపెనీ | పెట్టుబడులు శాతం |
|---|---|
| బీఏఎస్ఎఫ్ ఇండియా | 4.38 |
| గోద్రేజ్ ఇండస్ట్రీస్ | 3.71 |
| టైమ్ టెక్నోప్లాస్ట్ | 3.61 |
| కిర్లోస్కర్ న్యూమాటిక్ | 3.57 |
| క్వెస్ కార్ప్ | 3.28 |
| ఐడీఎఫ్‌సీ బ్యాంక్ | 3.25 |
| అనంత్‌రాజ్ | 3.21 |
| వండర్లా హాలిడేస్ | 3.18 |
| ఎలాంటస్ బెక్ | 2.76 |
| యూటీఐ అస్సెట్ | 2.72 |

# సాంట్నర్ సారథ్యంలో...


సాంట్నర్

**చాంపియన్స్ ట్రోఫీకి న్యూజిలాండ్ జట్టు**

**వెల్లింగ్టన్:** పేసర్ ఫెర్గూసన్‌కు చాంపియన్స్ ట్రోఫీలో బరిలోకి దిగే న్యూజిలాండ్ జట్టులో చోటు దక్కింది. పాకిస్తాన్–యూఏఈ ఆతిథ్యమిస్తున్న అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) చాంపియన్స్ ట్రోఫీ కోసం న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు ఆదివారం 15 మందితో కూడిన జట్టును ప్రకటించింది. ఈ టీమ్‌కు స్పిన్ ఆల్‌రౌండర్ మిచెల్ సాంట్నర్ సారథిగా వ్యవహరించనున్నాడు. లీగ్‌ల్లో ఆడేందుకు న్యూజిలాండ్ వార్షిక కాంట్రాక్ట్‌ను వదులుకున్న ఫెర్గూసన్‌తో పాటు యువ పేసర్లు రూర్కె, బెన్ సీర్స్‌కు సెలెక్టర్లు ఈ జట్టులో అవకాశం కల్పించారు. 2013, 2017 చాంపియన్స్ ట్రోఫీల్లో కూడా జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్‌తో పాటు వికెట్ కీపర్ టామ్ లాథమ్, కాన్వే, రచిన్ రవీంద్ర, విల్ యంగ్, చాప్‌మన్, డారిల్ మిచెల్ టీమ్‌లో చోటు దక్కించుకున్నారు. 'చాలా సంవత్సరాల తర్వాత తిరిగి చాంపియన్స్ ట్రోఫీ జరుగుతుంది. ఐసీసీ నిర్వహించే ఇలాంటి ప్రతిష్టాత్మక టోర్నీల్లో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం గొప్ప విషయం. 2000లో తొలిసారి ఐసీసీ నాకౌట్ ట్రోఫీ పేరుతో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో న్యూజిలాండ్ జట్టు విజయం సాధించింది. ఇప్పుడు కూడా అటు అనుభవజ్ఞులు, ఇటు యువకులతో జట్టు సమతూకంగా ఉంది. పాకిస్తాన్, యూఏఈ పిచ్‌లకు అనుగుణంగా జట్టు ఎంపిక చేశాం. మెరుగైన ప్రదర్శన చేస్తామనే నమ్మకముంది' అని న్యూజిలాండ్ కోచ్ గ్యారీ స్టెడ్ అన్నాడు.

**న్యూజిలాండ్ జట్టు:** సాంట్నర్ (కెప్టెన్), కాన్వే, రచిన్ రవీంద్ర, విలియమ్సన్, లాథమ్, డారిల్ మిచెల్, చాప్‌మన్, విల్ యంగ్, గ్లెన్ ఫిలిప్స్, మైకేల్ బ్రేస్‌వెల్, నాథన్ స్మిత్, బెన్ సీర్స్, ఫెర్గూసన్, మ్యాట్ హెన్రీ, రూర్కె.

# షకీబ్‌కు చుక్కెదురు

- బంగ్లాదేశ్ జట్టులో దక్కని చోటు
- చాంపియన్స్ ట్రోఫీకి టీమ్ ప్రకటన


షకీబ్

**ఢాకా:** స్టార్ ఆల్‌రౌండర్, మాజీ కెప్టెన్ షకీబ్ అల్ హసన్‌కు చాంపియన్స్ ట్రోఫీ కోసం ప్రకటించిన బంగ్లాదేశ్ జట్టులో చోటు దక్కలేదు. సందేహాస్పద బౌలింగ్ యాక్షన్ కారణంగా సస్పెన్షన్‌కు గురైన షకీబ్‌ను సెలెక్టర్లు ఐసీసీ టోర్నీకి పరిగణించలేదు. ఇప్పటికే టి20, టెస్టు ఫార్మాట్‌లకు వీడ్కోలు పలికిన 37 ఏళ్ల షకీబ్... చాంపియన్స్ ట్రోఫీ తర్వాత వన్డే ఫార్మాట్ నుంచి కూడా తప్పుకుంటానని ఇదివరకే వెల్లడించాడు. దీంతో ఇక షకీబ్ అంతర్జాతీయ కెరీర్ ముగిసినట్లే. షకీబ్‌తో పాటు ఫామ్‌లేక తంటాలు పడుతున్న సీనియర్ బ్యాటర్ లిటన్ దాస్‌కు కూడా నిరాశ ఎదురైంది. గత 13 మ్యాచ్‌ల్లో ఒక్క అర్ధశతకం కూడా సాధించని లిటన్ దాస్... గత ఏడు ఇన్నింగ్స్‌ల్లో వరుసగా 6, 1, 0, 0, 2, 4, 0 పరుగులు చేశాడు. దీంతో అతడిని ఈ టోర్నీకి ఎంపిక చేయలేదు. వచ్చేనెల 19 నుంచి ప్రారంభం కానున్న చాంపియన్స్ ట్రోఫీ కోసం బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) శుక్రవారం 15 మందితో కూడిన జట్టును ప్రకటించింది. ఈ టీమ్‌కు నజ్ముల్ హసన్ షంటో సారథ్యం వహిస్తుండగా... ముష్ఫికర్, మహ్ముదుల్లా, ముస్తఫిజుర్ వంటి సీనియర్ ప్లేయర్లు చోటు దక్కించుకున్నారు. చాంపియన్స్ ట్రోఫీలో తమ తొలి మ్యాచ్‌లో టీమిండియాతో బంగ్లాదేశ్ తలపడనుంది.

**బంగ్లాదేశ్ జట్టు:** నజ్ముల్ హసన్ షంటో (కెప్టెన్), ముష్ఫికర్ రహీమ్, తౌహిద్ హృదయ్, సౌమ్య సర్కార్, తన్జిద్ హసన్, మహ్ముదుల్లా, జాకీర్ అలీ, మెహదీ హసన్ మిరాజ్, రిషాద్ హుసేన్, తస్కీన్ అహ్మద్, ముస్తఫిజుర్ రహమాన్, పర్వేజ్ హుసేన్, నసుమ్ అహ్మద్, తన్జిమ్ హసన్, నహిద్ రాణా.

# ఫిబ్రవరి 7 నుంచి డబ్ల్యూపీఎల్

- మార్చి 21 నుంచి మే 25 వరకు ఐపీఎల్
- బీసీసీఐ ఎస్‌జీఎంలో నిర్ణయం
- కొత్త కార్యదర్శిగా దేవజిత్ సైకియా ఏకగ్రీవ ఎన్నిక



**ముంబై:** వచ్చే నెల 7 నుంచి మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ప్రారంభం కానుంది. గతేడాది రెండు (లక్నో, బరోడా) వేదికల్లో ఈ లీగ్ నిర్వహించగా... ఈ సారి నాలుగు నగరాల్లో మ్యాచ్‌లు జరగనున్నాయి. దీనికి సంబంధించిన పూర్తి షెడ్యూల్ త్వరలో విడుదల కానుంది. ఈ మేరకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. మార్చి 2న డబ్ల్యూపీఎల్ ఫైనల్ జరగనుండగా... అదే నెల 21 నుంచి ఐపీఎల్ ప్రారంభం కానుంది. మే 25న ఐపీఎల్ తుదిపోరుకు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ మైదానం ఆతిథ్యమివ్వనుంది. 2024 ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ ట్రోఫీ చేజిక్కించుకోవడంతో... తొలిపోరు కూడా అక్కడే జరగనుంది. ఈ సమావేశంలో బోర్డు కార్యదర్శిగా దేవజిత్ సైకియా, కోశాధికారిగా ప్రభ్‌తేజ్ సింగ్ భాటియా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ రెండు పదవులకు వీరిద్దరే దరఖాస్తు చేసుకోవడంతో ఎన్నిక అవసరం లేకుండా పోయిందని... ఎన్నికల అధికారి వెల్లడించారు. 'డబ్ల్యూపీఎల్ వేదికలు ఎంపిక చేశాం. అతి త్వరలో వాటి వివరాలు వెల్లడిస్తాం' అని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా చెప్పారు. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనే భారత జట్టును ఈనెల 18 లేదా 19వ తేదీల్లో ప్రకటించనున్నట్లు ఆయన వెల్లడించారు.


బీసీసీఐ కొత్త కార్యదర్శి దేవజిత్ సైకియాను అభినందిస్తున్న హైదరాబాద్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు




సబలెంకా విజయ గర్జన

# సబలెంకా శుభారంభం

- అలవోకగా నెగ్గిన డిఫెండింగ్ చాంపియన్
- కిన్‌వెన్ జెంగ్, బదోసా ముందంజ
- శ్రమించి నెగ్గిన రూడ్

**మెల్‌బోర్న్:** 'హ్యాట్రిక్' టైటిల్ లక్ష్యంతో ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో బరిలోకి దిగిన బెలారస్ స్టార్ సబలెంకా శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ సబలెంకా 6–3, 6–2తో 2017 యూఎస్ ఓపెన్ చాంపియన్ స్లోన్ స్టీఫెన్స్ (అమెరికా)పై అలవోకగా గెలిచి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టింది. 2023, 2024లలో చాంపియన్‌గా నిలిచిన సబలెంకా ఈసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ సాధిస్తే... మార్టినా హింగిస్ (స్విట్జర్లాండ్; 1997, 1998, 1999) తర్వాత ఈ టోర్నీలో 'హ్యాట్రిక్' నమోదు చేసిన ప్లేయర్‌గా గుర్తింపు పొందుతుంది. స్లోన్ స్టీఫెన్స్‌తో 71 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సబలెంకా రెండు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. 20 విన్నర్స్ కొట్టిన ఈ బెలారస్ స్టార్ 21 అనవసర తప్పిదాలు చేసింది. నెట్ వద్దకు 21 సార్లు దూసుకొచ్చి 13 సార్లు పాయింట్లు నెగ్గిన సబలెంకా తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. గత ఏడాది రన్నరప్, పారిస్ ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత కిన్‌వెన్ జెంగ్ (చైనా), 11వ సీడ్ పౌలా బదోసా (స్పెయిన్) కూడా రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ఐదో సీడ్ కిన్‌వెన్ 7–6 (7/3), 6–1తో అంకా టొడోని (రొమేనియా)పై, బదోసా 6–3, 7–6 (7/5)తో జిన్‌యు వాంగ్ (చైనా)పై గెలిచారు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో 14వ సీడ్ మిరా ఆంద్రీవా (రష్యా) 6–3, 6–3తో మేరీ బుజ్‌కోవా (చెక్ రిపబ్లిక్)పై, 18వ సీడ్ డొనా వెకిచ్ (క్రొయేషియా) 6–4, 6–4తో డియాన్ పారీ (ఫ్రాన్స్)పై, లేలా ఫెర్నాండెజ్ (కెనడా) 7–5, 6–4తో యులియా (ఉక్రెయిన్)పై విజయం సాధించి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు.

**జ్వెరెవ్ బోణీ**

పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) సులువుగా రెండో రౌండ్‌కు చేరగా... ఆరో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే) ఐదు సెట్‌ల పోరులో గట్టెక్కాడు. జ్వెరెవ్ 6,4 6–4, 6–4తో లుకాస్ పౌలీ (ఫ్రాన్స్)పై నెగ్గగా... రూడ్ 6–3, 1–6, 7–5, 2–6, 6–1తో 3 గంటల 21 నిమిషాల్లో మునార్ (స్పెయిన్)ను ఓడించాడు. వర్షం కారణంగా తొలి రోజు చాలా మ్యాచ్‌లకు అంతరాయం కలిగింది.

## హబీబ్ వరుస సెట్‌లలో...



ఓపెన్ శకంలో (1968 నుంచి) పురుషుల గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ మెయిన్ 'డ్రా'కు అర్హత పొందిన తొలి లెబనాన్ ప్లేయర్‌గా గుర్తింపు పొందిన హాది హబీబ్ తొలి అడ్డంకిని అధిగమించాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో హబీబ్ 7–6 (7/4), 6–4, 7–6 (8/6)తో బు యున్‌చావోకెటె (చైనా)పై విజయం సాధించి రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. 'నా జీవితంలో ఇది మర్చిపోలేని రోజు. గ్రాండ్‌స్లామ్ టోర్నీ మెయిన్ 'డ్రా'లో తొలి మ్యాచ్ గెలిచిన అనుభూతిని మాటల్లో వర్ణించలేను' అని ప్రపంచ 219వ ర్యాంకర్ హబీబ్ వ్యాఖ్యానించాడు. గ్రాండ్‌స్లామ్ టోర్నీలో రెండో రౌండ్‌కు చేరడం ద్వారా హబీబ్ తన కెరీర్‌లో ఇప్పటి వరకు సంపాదించిన మొత్తం ప్రైజ్‌మనీ (1,54,619 డాలర్లు) కంటే ఎక్కువ మొత్తాన్ని ఒకేసారి (2,00,000 డాలర్లు) అందుకోనున్నాడు.

# హైదరాబాద్ తూఫాన్స్ విజయం

**రూర్కెలా:** పురుషుల హాకీ ఇండియా లీగ్‌లో హైదరాబాద్ తూఫాన్స్ జట్టు నాలుగో విజయం నమోదు చేసింది. వేదాంత కళింగ లాన్సర్స్ జట్టుతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ తూఫాన్స్ జట్టు 5–1 గోల్స్ తేడాతో గెలిచింది. తూఫాన్స్ తరఫున గొంజాలో పీలాట్ (6వ, 30వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా... మైకో కసెల్లా (21వ నిమిషంలో), టిమ్ బ్రాండ్ (47వ నిమిషంలో), అర్ష్‌దీప్ సింగ్ (54వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. కళింగ లాన్సర్స్ జట్టుకు అలెగ్జాండర్ హెండ్రిక్స్ (5వ నిమిషంలో) ఏకైక గోల్ అందించాడు. ఆరు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న హైదరాబాద్ తూఫాన్స్ జట్టు 10 పాయింట్లతో రెండో స్థానానికి చేరుకుంది. నేడు జరిగే మ్యాచ్‌లో తమిళనాడు డ్రాగన్స్‌తో ఢిల్లీ ఎస్జీ పైపర్స్ జట్టు ఆడుతుంది.

**ఒడిశా వారియర్స్ బోణీ**

రాంచీలో ఆదివారం మొదలైన తొలి మహిళల హాకీ ఇండియా లీగ్‌లో ఒడిశా వారియర్స్ జట్టు శుభారంభం చేసింది. ఒడిశా వారియర్స్ 4–0 గోల్స్ తేడాతో ఢిల్లీ ఎస్జీ పైపర్స్ జట్టును ఓడించింది. ఒడిశా వారియర్స్ తరఫున యిబ్బీ జాన్సెన్ (16వ, 37వ నిమిషంలో) రెండు గోల్స్ చేయగా... బల్జీత్ కౌర్ (42వ నిమిషంలో), ఫ్రీక్ మోయిస్ (43వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. నేడు జరిగే మ్యాచ్‌లో శ్రాచి రార్ బెంగాల్ టైగర్స్‌తో జేఎస్‌డబ్ల్యూ సూర్మా హాకీ క్లబ్ తలపడుతుంది.

# పంజాబ్ కింగ్స్ జట్టు కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్


శ్రేయస్ అయ్యర్

**చండీగఢ్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ జట్టు... టీమిండియా బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేసుకుంది. ఐపీఎల్ మెగా వేలంలో రూ. 26 కోట్ల 75 లక్షలు పెట్టి కొనుగోలు చేసుకున్న అయ్యర్‌కు జట్టు పగ్గాలు అప్పచెప్పింది. ఐపీఎల్–2024లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు కెప్టెన్‌గా ఉన్న 30 ఏళ్ల శ్రేయస్ అయ్యర్... ఆ జట్టును విజేతగా నిలిపాడు. 'నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. హెడ్ కోచ్ పాంటింగ్‌తో మరోసారి కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా చూస్తున్నా. జట్టులో నైపుణ్యానికి కొదవలేదు. ఇప్పటికే నిరూపించుకున్న ఆటగాళ్లతో పాటు ప్రతిభావంతులు చాలా మంది అందుబాటులో ఉన్నారు. పంజాబ్ కింగ్స్ జట్టుకు తొలి ఐపీఎల్ టైటిల్ అందించేందుకు నావంతు కృషి చేస్తా' అని శ్రేయస్ అన్నాడు. ప్రధాన కోచ్ పాంటింగ్ మాట్లాడుతూ 'శ్రేయస్‌కు ఆటపై మంచి అవగాహన ఉంది. కెప్టెన్‌గా ఇప్పటికే నిరూపించుకున్నాడు. గతంలో అతడితో కలిసి పనిచేశా. సీజన్ కోసం ఆతృతగా చూస్తున్నా' అని అన్నాడు. 2024లో రంజీ ట్రోఫీ, ఇరానీ ట్రోఫీలు గెలిచిన ముంబై జట్టులో శ్రేయస్ అయ్యర్ సభ్యుడు కాగా... ఇటీవల అతడి కెప్టెన్సీలో ముంబై టీమ్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 టోర్నమెంట్ టైటిల్ గెలిచింది.

# కరుణ్ నాయర్, ధ్రువ్ షోరే అజేయ సెంచరీలు

- రాజస్తాన్‌పై 9 వికెట్లతో విదర్భ ఘనవిజయం
- గుజరాత్‌పై హరియాణా గెలుపు
- సెమీఫైనల్స్‌లో మహారాష్ట్రతో విదర్భ; కర్ణాటకతో హరియాణా 'ఢీ'
- విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నమెంట్


కరుణ్ నాయర్


ధ్రువ్ షోరే

**వడోదర:** దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీలో హరియాణా, విదర్భ జట్లు సెమీఫైనల్లోకి దూసుకెళ్లాయి. ఆదివారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో విదర్భ 9 వికెట్ల తేడాతో రాజస్తాన్‌పై విజయం సాధించగా... హరియాణా జట్టు 2 వికెట్ల తేడాతో గుజరాత్ జట్టును ఓడించింది. విదర్భతో జరిగిన పోరులో మొదట బ్యాటింగ్ చేసిన రాజస్తాన్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 291 పరుగులు చేసింది. కార్తీక్ శర్మ (62; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), శుభమ్ గర్వాల్ (59; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ శతకాలు సాధించగా... దీపక్ హుడా (45; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), దీపక్ చహర్ (14 బంతుల్లో 31; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ మహిపాల్ లోమ్రోర్ (32) తలా కొన్ని పరుగులు చేశారు. విదర్భ బౌలర్లలో యశ్ ఠాకూర్ నాలుగు వికెట్లతో సత్తా చాటాడు. అయితే సీనియర్ ప్లేయర్ కరుణ్ నాయర్ (82 బంతుల్లో 122 నాటౌట్; 13 ఫోర్లు, 5 సిక్స్‌లు) దూకుడు ముందు రాజస్తాన్ స్కోరు సరిపోలేదు. ఈ సీజన్‌లో వరుస సెంచరీలతో రికార్డులు తిరగరాస్తున్న విదర్భ కెప్టెన్ కరుణ్ నాయర్ రాజస్తాన్ బౌలింగ్‌ను ఓ ఆటాడుకున్నాడు. అతడితో పాటు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ధ్రువ్ షోరే (131 బంతుల్లో 118 నాటౌట్, 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) కూడా 'శత'క్కొట్టడంతో విదర్భ జట్టు 43.3 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 292 పరుగులు చేసి గెలిచింది. టీమిండియా ప్లేయర్లు దీపక్ చహర్, ఖలీల్ అహ్మద్, దీపక్ హుడా బౌలింగ్‌లో ధ్రువ్, కరుణ్ జంట పరుగుల వరద పారించింది. యశ్ రాథోడ్ (39) త్వరగానే అవుటవ్వగా... ధ్రువ్, కరుణ్ అబేధ్యమైన రెండో వికెట్‌కు 200 పరుగులు జోడించారు. తాజా సీజన్‌లో వరుసగా నాలుగు (ఓవరాల్‌గా 5) శతకాలు బాదిన కరుణ్ నాయర్... విజయ్ హజారే టోర్నీ చరిత్రలో ఒకే సీజన్‌లో అత్యధిక సెంచరీలు చేసిన ప్లేయర్‌గా నారాయణ్ జగదీశన్ (5 శతకాలు; 2022–23లో) సరసన చేరాడు. ఈ టోర్నీలో ఇప్పటి వరకు 664 పరుగులు చేసిన 33 ఏళ్ల కరుణ్ నాయర్ అత్యధిక పరుగుల వీరుల జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. గురువారం జరగనున్న రెండో సెమీఫైనల్లో మహారాష్ట్రతో విదర్భ తలపడుతుంది.

**హరియాణా ఆల్‌రౌండ్ షో**

గుజరాత్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో హరియాణా సమష్టి ప్రదర్శనతో సత్తా చాటింది. మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ 45.2 ఓవర్లలో 196 పరుగులకు ఆలౌటైంది. హేమంగ్ పటేల్ (54; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధ శతకంతో మెరవగా... చింతన్ గాజా (32; 4 ఫోర్లు), ఉర్విల్ పటేల్ (23; 3 ఫోర్లు, 1 సిక్స్), ఆర్య దేశాయ్ (23; 5 ఫోర్లు), సౌరవ్ చౌహాన్ (23; 2 ఫోర్లు, 1 సిక్స్) తలా కొన్ని పరుగులు చేశారు. కెప్టెన్ అక్షర్ పటేల్ (3) విఫలమయ్యాడు. హరియాణా బౌలర్లలో అనూజ్ ఠక్రాల్, నిశాంత్ చెరో 3 వికెట్లు పడగొట్టగా... అన్షుల్ కంబోజ్ 2 వికెట్లు తీశాడు. అనంతరం లక్ష్యఛేదనలో హరియాణా 44.2 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 201 పరుగులు చేసి గెలిచింది. హిమాన్షు రాణా (66; 10 ఫోర్లు) టాప్ స్కోరర్. గుజరాత్ బౌలర్లలో టీమిండియా లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ 4 వికెట్లు తీశాడు. అనూజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. బుధవారం జరగనున్న తొలి సెమీఫైనల్లో కర్ణాటకతో హరియాణా జట్టు తలపడనుంది.

# నేటి నుంచి ఖోఖో 'ప్రపంచ' షో

**తొలి పోరులో నేపాల్‌తో భారత్ 'ఢీ'**



**న్యూఢిల్లీ:** మన భారతీయ గ్రామీణ క్రీడ ఖోఖో నేడు సరికొత్త 'శోభ'ను సంతరించుకునేందుకు ముస్తాబైంది. దేశ రాజధాని నగరంలో 'ప్రపంచ' షోకు సర్వం సిద్ధమైంది. మొట్ట మొదటి ప్రపంచకప్ ఖోఖోను అట్టహాసంగా నిర్వహించేందుకు భారత ఖోఖో సమాఖ్య (కేకేఎఫ్ఐ) అన్ని ఏర్పాట్లు చేసింది. పాశ్చాత్య, ఆఫ్రికా, ఆసియా సహా 23 దేశాలకు చెందిన పురుషులు, మహిళల జట్లు ప్రపంచకప్ ఆడేందుకు ఇదివరకే భారత్‌లో అడుగుపెట్టాయి. న్యూఢిల్లీ, గ్రేటర్ నోయిడాల్లోని రెండు ఇండోర్ స్టేడియాల్లో సరిగ్గా వారం రోజుల పాటు ఈ మెగా ఈవెంట్‌ను నిర్వహిస్తారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ముందుగా తొలిరోజు సోమవారం నుంచి 16వ తేదీ వరకు లీగ్ దశ పోటీలుంటాయి. శుక్రవారం (17న) నాలుగు క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయి. మరుసటిరోజు రెండు సెమీఫైనల్స్, ఆదివారం (19న) ఇరు విభాగాల్లో జరిగే ఫైనల్స్‌తో ఖోఖో ప్రపంచకప్‌కు తెరపడుతుంది. సోమవారం జరిగే ప్రారంభమ్యాచ్‌లో భారత పురుషుల జట్టు నేపాల్‌తో తలపడుతుంది. పోలాండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా తదితర దేశాలకు చెందిన క్రీడాకారులు ఖోఖో ప్రపంచకప్‌పై తమ అమితాసక్తిని కనబరుస్తున్నారు. మెగా ఈవెంట్ కోసం చేసిన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేసిన పోలాండ్ పురుషుల కెప్టెన్ కొన్‌కార్డ్, మహిళల సారథి కరోలినా బరిలోకి దిగేందుకు తెగ ఉత్సాహం చూపిస్తున్నారు. ఆసీస్ అమ్మాయిల జట్టు ప్లేయర్ బ్రిడ్జెట్ సరికొత్త సవాల్‌కు సరైన వేదికని కొనియాడగా, దక్షిణాఫ్రికా మహిళల జట్టు కోచ్ మ్యాట్‌షిడిసో తొలి ప్రపంచకప్‌ను తమ జట్టు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుందని, పట్టుదలతో ఆడేందుకు అమ్మాయిలంతా సన్నద్ధమై వచ్చారని చెప్పారు.



ఆదివారం అహ్మదాబాద్ అంతర్జాతీయ పతంగుల వేడుకలో కనువిందు చేస్తున్న పెద్ద సైజు శాంటాక్లాజ్‌లు, భారీ బంతి ఆకృతుల్లోని పతంగులు



కృత్రిమంగా చేసిన 'మంచు కోటలు' వద్ద ఫొటోలు దిగుతున్న సందర్శకులు. అమెరికాలోని న్యూ హ్యాంప్‌షైర్ రాష్ట్రంలోని నార్త్ వుడ్‌స్టాక్ సిటీలో శుక్రవారం ఈ వేడుకలు మొదలయ్యాయి

# ఆపరేషన్ మిల్కీపూర్

**సత్తా చాటాలనుకుంటున్న బీజేపీ, ఎస్పీ • ఢిల్లీ అసెంబ్లీతో పాటే ఫిబ్రవరి 5న యూపీలోని మిల్కీపూర్‌కు ఉప ఎన్నిక**

**ఎన్నికకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్న బీఎస్పీ • యూపీ డీజీపీని తొలగించాలని డిమాండ్ చేస్తున్న సమాజ్‌వాదీ**

సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని మిల్కీపూర్ అసెంబ్లీ స్థానం ఉప ఎన్నికకు రంగం సిద్ధమైంది. మిల్కీపూర్ ఉప ఎన్నికలో గెలుపే లక్ష్యంగా ఎస్పీ, బీజేపీ రెండు పార్టీలు క్షేత్రస్థాయిలో తమ పూర్తి బలాన్ని చాటుతున్నాయి. మిల్కీపూర్‌లో విజయం సాధించడం ద్వారా ఫైజాబాద్ లోక్‌సభ స్థానం ఓటమి నుంచి కోలుకోవాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకోగా, 2022లో తాను దక్కించుకున్న అసెంబ్లీ స్థానాన్ని నిలబెట్టుకోవాలని ఎస్పీ కృతనిశ్చయంతో ఉంది. ఇటీవల యూపీలో తొమ్మిది అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ ఏడు స్థానాల్లో గెలవగా... ఎస్పీకి కేవలం రెండు సీట్లు మాత్రమే దక్కాయి. ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలతో పాటు మిల్కీపూర్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరగనుంది.

2024 జనవరిలో రామమందిరాన్ని ప్రారంభించిన తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఫైజాబాద్ (అయోధ్య) సీటును బీజేపీ కోల్పోయింది. ఇది లౌకికవాద విజయమని ఎస్పీ అప్పట్లో చాలా ప్రచారం చేసింది. ఇక్కడి నుంచి లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా అవధేష్ ప్రసాద్ ఎన్నిక కావడంతో మిల్కీపూర్ సీటు ఖాళీ అయింది. అయితే ఇప్పుడు మిల్కీపూర్ సీటును కైవసం చేసుకోవడం ద్వారా యావత్ దేశానికి అయోధ్యలో తమ బలం ఏమాత్రం తగ్గలేదన్న సందేశం ఇవ్వాలని బీజేపీ అధిష్టానం ప్రయత్నిస్తోంది. కాగా మాయావతి నేతృత్వంలోని బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ (బీఎస్పీ) ఉప ఎన్నికకు దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. దీంతో ఇప్పుడు ఉప ఎన్నిక బీజేపీ, సమాజ్‌వాదీ పార్టీల మధ్య ప్రత్యక్ష పోటీగా మారింది.

కాగా ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పర్యవేక్షణలో ఉన్న మిల్కీపూర్‌లో ఓటర్లను సమీకరించేందుకు ఐదారుగురు మంత్రులను బీజేపీ మోహరించింది. ఇటీవల జరిగిన ఉప ఎన్నికలో కుందర్కిలో మూడు దశాబ్దాల తర్వాత బీజేపీ గెలుపునకు కారణమైన మంత్రి జేపీఎస్ రాథోడ్, ఎమ్మెల్సీ ధర్మేంద్ర సింగ్‌లకు కమలదళం మిల్కీపూర్ ఉప ఎన్నిక బాధ్యతలు అప్పగించింది. వీరితో పాటు అయోధ్య జిల్లా ఇంఛార్జ్‌గా ఉన్న మంత్రి సూర్యప్రతాప్ షాహితో పాటు స్వతంత్ర దేవ్ సింగ్, సతీష్ శర్మ, గిరీష్ యాదవ్, మయాంకేశ్వర్ సింగ్‌లతో సహా నేతల బృందం కూడా మిల్కీపూర్‌లో విజయం సాధించే బాధ్యతను తీసుకుంది. నియోజకవర్గంలో చిన్న చిన్న సమావేశాలను నిర్వహించి ఓటర్లను ఆకట్టుకొనే పనిలో ఉన్నారు. అదనంగా ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఇటీవల మిల్కీపూర్‌ను మూడుసార్లు సందర్శించి వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. అంతేగాక మిల్కీపూర్‌లో 5,500 మంది యువతకు అపాయింట్‌మెంట్ లెటర్‌లు పంపిణీ చేయడంతోపాటు 3,415 మంది యువకులకు ట్యాబ్లెట్‌లు, స్మార్ట్‌ఫోన్లు సీఎం యోగి ఆదిత్యనాథ్ పంపిణీ చేశారు.

మరోవైపు, బీజేపీ ఇంకా తన అభ్యర్థిని ప్రకటించకపోగా, సమాజ్‌వాదీ పార్టీ మాత్రం తమ పార్టీ ఫైజాబాద్ ఎంపీ అవధేష్ ప్రసాద్ కుమారుడు అజిత్ ప్రసాద్‌ను రంగంలోకి దింపింది. కాగా ఉత్తర ప్రదేశ్‌లోని మిల్కీపూర్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికల తేదీలు ప్రకటించిన తర్వాత రాజకీయ యుద్ధం ఊపందుకుంది. అక్రమాలకు కారణమయ్యే యూపీ డీజీపీని వెంటనే తొలగించాలని సమాజ్‌వాదీ పార్టీ డిమాండ్ చేస్తోంది. యూపీ డీజీపీని పదవిలో కొనసాగిస్తే, అది ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఉల్లంఘించడమే కాకుండా ఎన్నికల్లో అక్రమాలకు దారితీయవచ్చని ఎస్పీ ఆరోపిస్తోంది. డీజీపీని తొలగించి ఎన్నికలు నిర్వహిస్తే మిల్కీపూర్‌లో సమాజ్‌వాదీ పార్టీని ఏ శక్తీ ఓడించలేదని సమాజ్‌వాదీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## మహిళల్లో మద్యం అలవాటుకు ఈస్ట్రోజన్‌కు లింకు

- అతి ఈస్ట్రోజన్ వేళ అతిమద్యం ఛాన్స్
- అమెరికా శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ: ఈస్ట్రోజన్ హార్మోన్ స్థాయిలు పెరిగిన సందర్భాల్లో మహిళల్లో మద్యం అతిగా తాగాలనే ఆలోచనలు ఎక్కువగా రావొచ్చని అమెరికాలో జరిగిన ఓ పరిశోధనలో తేలింది. అమెరికాలోని వెల్ కార్నెల్ విశ్వవిద్యాలయంలోని పరిశోధకుల సంబంధిత అధ్యయనం వివరాలు తాజాగా 'నేచర్ కమ్యూనికేషన్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈస్ట్రోజన్ స్థాయిలకు మహిళల్లో అతి మద్యపాన అలవాట్లకు మధ్య దగ్గరి సంబంధం ఉందని తొలిసారిగా కనుగొన్నామని పరిశోధకులు చెప్పారు. పురుషులతో పోలిస్తే ఈ ధోరణి మహిళల్లోనే ఉందని పేర్కొన్నారు. మహిళ ఒకేసారి నాలుగు కంటే ఎక్కువ పెగ్గులు తాగితే ఆ అలవాటును అతిమద్యపాన సేవనంగా పేర్కొంటారు. సంబంధిత ప్రయోగాన్ని ఎలుకలపై చేసి నిర్ధారించుకున్నారు. మగ ఎలుకలతో పోలిస్తే ఆడ ఎలుకల మెదడులో 'స్ట్రియా టెర్మినల్‌లోని బెడ్ న్యూక్లియస్' న్యూరాన్లు ఈస్ట్రోజన్ ఎక్కువ అయినప్పుడు అతిగా మద్యం తాగాలని ప్రేరేపిస్తున్నాయి. మద్యం అందించిన తొలి 30 నిమిషాల్లోనే వాటిలో ఈ అతిపోకడ కనిపించింది. మహిళల్లో అతిమద్యం అలవాట్లకు కారణం ఏమై ఉంటుందో ఇన్నాళ్లూ బోధపడలేదు. ఎందుకంటే ఇంతకాలం జరిగిన ఈ తరహా పరిశోధనలు కేవలం పురుషులమీదే జరిగాయి. ఈ పరిశోధన ఫలితాలు మహిళల్లో మద్యం అలవాట్లపై అధ్యయనానికి కొత్త బాటలు వేశాయి''అని వెల్ కార్నెల్ మెడిసిన్‌లోని ఫార్మకాలజీ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్, నివేదికలో కీలక రచయిత క్రిస్టీన్ పెయిల్ వ్యాఖ్యానించారు. మహిళల్లో నెలసరి రోజులులాగా ఎలుకల్లో ఈస్ట్రోజన్ చక్రం కొనసాగినంతకాలం ఈ పరిశోధన చేశారు. ఈస్ట్రోజన్ స్థాయిలు ఎక్కువ ఉన్నన్ని రోజులూ ఆడ ఎలుకలు మద్యం పూటుగా తాగడం గమనించారు. మద్యానికి బానిసలైన మహిళా బాధితులకు చికిత్సా విధానాల్లో మార్పుకు ఈ కొత్త పరిశోధన ఎంతగానో సాయపడనుందని పరిశోధకులు అభిప్రాయపడ్డారు.

## తాలిబన్ ప్రభుత్వాన్ని చట్టబద్ధం చేయొద్దు

**ప్రపంచ ముస్లిం నాయకులకు మలాలా విజ్ఞప్తి**

ఇస్లామాబాద్: అఫ్గనిస్తాన్‌లో తాలిబన్ ప్రభుత్వాన్ని చట్టబద్ధం చేయవద్దని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మలాలా యూసఫ్‌జాయ్ ముస్లిం నాయకులను కోరారు. 'ఇస్లామిక్ దేశాల్లో బాలికల విద్య'పై ఇస్లామాబాద్‌లో జరుగుతున్న సదస్సులో ఆదివారం ఆమె మాట్లాడారు. ముస్లిం నాయకులు గొంతు విప్పడానికి, వారి శక్తిని ఉపయోగించడానికి ఇది సరైన సమయమని, నిజమైన నాయకత్వమేంటో, నిజమైన ఇస్లామంటే ఏంటో నిరూపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ముస్లిం వరల్డ్ లీగ్ (ఎండబ్ల్యూఎల్) మద్దతుతో జరుగుతున్న రెండో రోజుల సదస్సులో ముస్లిం మెజారిటీ దేశాలకు చెందిన మంత్రులు, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మలాలా మాట్లాడుతూ తాలిబన్లు మహిళలను మనుషులుగా చూడరని, వారు తమ నేరాలను సాంస్కృతిక, మతపరమైన సమర్థనలతో కప్పి పుచ్చుకుంటారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సదస్సు జరుగుతున్న పాకిస్తాన్‌లోనూ 1.2 కోట్ల మంది బాలికలు బడికి దూరంగా ఉన్నారని, ఇది ప్రపంచంలోనే అత్యధికమని మలాలా సంతృప్తి వ్యక్తం చేశారు. యెమెన్, సూడాన్, గాజా యుద్ధాల ప్రభావం పాఠశాల విద్యపై పడిందని, గాజాలో ఇజ్రాయెల్ మొత్తం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ చట్టాలు, మానవ హక్కులను ఇజ్రాయెల్ ఉల్లంఘిస్తోందని మండిపడ్డారు. బాలికల విద్యకు ఇస్లాం విరుద్ధమనడం తప్పని సౌదీ మతగురువు, ఎండబ్ల్యూఎల్ సెక్రటరీ జనరల్ మహ్మద్ అల్ ఇస్సా సైతం మాట్లాడటం గమనార్హం.

## కుంభమేళా కోసం ప్రత్యేక గీతాలు

న్యూఢిల్లీ: కుంభమేళా విశిష్టతను చాటేలా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఆకాశవాణి, దూరదర్శన్ ప్రత్యేక గీతాలను రూపొందించి విడుదలచేసింది. వీటిలో మహాకుంభ్ హై పాటను ప్రముఖ గాయకుడు కైలాష్ ఖేర్ ఆలపించారు. రచయిత ఆలోక్ శ్రీవాస్తవ ఈ పాటను రాయగా మహాకుంభమేళా ప్రాశస్త్యాన్ని, సంప్రదాయాలను కళ్లకు కట్టేలా క్షితిజ్ తారే బాణీ కట్టారు. జై మహాకుంభ్ అనే మరో పాటనూ ఆకాశవాణి విడుదలచేసింది. ఆధ్యాత్మిక, సాంస్కృతిక, మత గొప్పతనాన్ని గుర్తుకుతెచ్చేలా రాసిన ఈ పాటకు రతన్ ప్రసన్న మరింత సుమధురంగా ఆలపించారు. రతన్ ప్రసన్న, సంతోష్ నహర్ సంయుక్తంగా ఈ పాటకు సంగీతం సమకూర్చారు. 12 ఏళ్ల అషిత్, ఏడేళ్ల ఆరావ్ అన్నదమ్ములు ఉమ్మడిగా రాసి పాడిన 'ఛలో ప్రయాగ్‌రాజ్ మహాకుంభ్ ఛలే' పాటను ప్రయాగ్‌రాజ్ రైల్వే డివిజన్ ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది.

## ఛత్తీస్‌గఢ్‌లో ఐదుగురు మావోయిస్టులు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిజాపూర్ జిల్లాలో ఆదివారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మహిళలు సహా ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. మద్దేడు, భూపాలపట్నం పోలీస్‌స్టేషన్ల సరిహద్దుల్లోని ఇంద్రావతి నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారంతో భద్రతా బలగాలు శనివారం రాత్రి నుంచి కూంబింగ్ సాగిస్తున్నాయి. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున బలగాలకు మావోయిస్టులు తారసపడ్డారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య ఎదురు కాల్పులు దాదాపు నాలుగు గంటల పాటు హోరాహోరీగా కొనసాగాయి. అనంతరం ఆ ప్రాంతంలో గాలించగా ఇద్దరు మహిళలు సహా యూనిఫాం ధరించిన ఐదుగురు మావోయిస్టులు మృతదేహాలతో పాటు ఒక ఎస్ఎల్ఆర్, ఒక 12 బోర్ రైఫిల్, రెండు సింగిల్ షాట్ రైఫిళ్లు, ఒక బారెల్ గ్రెనేడ్ లాంఛర్, ఒక మజిల్ లోడింగ్ గన్, భారీగా పేలుడు సామగ్రి లభ్యమయ్యాయి. మృతులను గుర్తించాల్సి ఉందని జిల్లా ఎస్పీ జితేంద్రకుమార్ యాదవ్ చెప్పారు. కాగా, మృతుల్లో ఒకరు రూ.8 లక్షల రివార్డు కలిగిన డివిజనల్ కమిటీ సభ్యుడొకరు ఉన్నట్లు సమాచారం. మరో పరిణామం.. నారాయణపూర్ జిల్లాలోని హెరిగైనార్, ఉమ్ముసూరు సమీప అడవుల్లో కూంబింగ్ సందర్భంగా ఆయుధాలు, పేలుడు సామగ్రి, విప్లవ సాహిత్యంతో కూడిన డంప్ లభ్యమైందని పోలీసులు తెలిపారు.

## గడ్చిరోలిలో మావోయిజం తగ్గుముఖం: నితిన్ గడ్కరీ

ముంబై: మహారాష్ట్రలోని గడ్చిరోలిలో మావోయిజం ప్రభావం గణనీయంగా తగ్గుముఖం పట్టిందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. గతంలో ప్రజాప్రతినిధులు సైతం ఆ ప్రాంతంలోకి వెళ్లేందుకు చాలా కష్టమయ్యేదని గుర్తు చేశారు. ఇప్పుడా పరిస్థితి మారిందన్నారు. ఆ ప్రాంతానికి చెందిన సుమారు 5 వేల మంది యువకులు తీవ్రవాదబాటను వీడి జనజీవన స్రవంతిలో కలిశారని చెప్పారు. డ్రైవర్లు, ఫిట్టర్లు, తదితర వృత్తుల్లో వారంతా సెటిలయ్యారని చెప్పారు. ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల ఏర్పాటుతో పాటు వస్త్ర పరిశ్రమ వృద్ధి చెందిందన్నారు. రానున్న ఐదేళ్లలో గడ్చిరోలి ప్రాంతం మహారాష్ట్రలోనే అత్యధిక ఆదాయం సంపాదించే జిల్లాగా అవతరించనుందని గడ్కరీ అన్నారు. ఆదివారం అహిల్యానగర్‌లోని షిర్డీలో జరిగిన బీజేపీ రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. పార్టీ ఎన్నికల విజయాన్ని అర్థవంతమైన సామాజిక పరివర్తనగా మార్చాలని కార్యకర్తలకు ఆయన విజ్ఞప్తి చేశారు. గతేడాది రాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో బీజేపీ సాధించిన విజయం సుపరిపాలన సాధనకు మార్గంగా మారాలన్నారు. ఈ సమావేశంలో పార్టీకి చెందిన ఎంపీ కంగనా రనౌత్ నటించిన రూపొందించిన 'ఎమర్జెన్సీ' చిత్రాన్ని ప్రదర్శించారు. ఎమర్జెన్సీని ఎప్పుడు, ఎందుకు విధించారు, మన కార్యకర్తలు ఆ సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొని, నిలబడ్డారో చూపించే అద్భుతమైన సినిమా అంటూ గడ్కరీ కొనియాడారు. దర్శకనిర్మాతగా, రచయితగా కంగన రూపొందించిన ఈ సినిమా 17న విడుదల కానుంది.

## హెల్మెట్ లేకపోతే పెట్రోల్ పోయొద్దు

- ఆపరేటర్లకు యూపీ ప్రభుత్వం ఆదేశాలు
- ద్విచక్ర వాహన ప్రమాదాలు తగ్గించేందుకు చర్యలు

లక్నో: ద్విచక్ర వాహనాల ప్రమాదాలు తగ్గించేందుకు ఉత్తరప్రదేశ్ రవాణా శాఖ కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. హెల్మెట్ లేకుండా వచ్చిన వారికి ఇంధనం పోయొద్దని పెట్రోల్ బంకు నిర్వాహకులకు ఆదేశాలిచ్చింది. ఈ మేరకు రాష్ట్రంలో 75 జిల్లాల కలెక్టర్లకు రవాణాశాఖ కమిషనర్ బ్రజేష్ నారాయణ సింగ్ లేఖలు పంపారు. వాహనం నడిపేవారితోపాటు వెనుక కూర్చున్నవారు సైతం కచ్చితంగా హెల్మెట్ ధరించి ఉండాలని పేర్కొన్నారు. వాహనదారులకు అవగాహన కల్పించేందుకు పెట్రోల్ బంకుల బయట 'నో హెల్మెట్, నో ఫ్యూయెల్' బోర్డులను ప్రదర్శించాలని సూచించారు. ద్విచక్ర వాహన ప్రమాదాల్లో బాధితులు హెల్మెట్ ధరించడం లేదన్న గణాంకాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రాణాలను కాపాడటం, రోడ్డు భద్రతను నిర్ధారించడమే రవాణా శాఖ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గౌతమ్‌బుద్ధ నగర్ జిల్లాలో 2019లో ప్రవేశపెట్టినా అమలులో నిర్లక్ష్యం జరిగింది. గత అనుభవాల దృష్ట్యా ఆదేశాల అమలుపై పర్యవేక్షణ అవసరమని, దీని కోసం అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లో ఏటా దాదాపు 26వేల మంది చనిపోతున్నారు. హెల్మెట్ ధరించకపోవడం వల్లే వీరిలో అత్యధిక మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఇటీవల రవాణాశాఖ సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్.. ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలీలో భారీగా మంచు కురుస్తుండటంతో చూసేందుకు, హాయిగా గడిపేందుకు వెళ్తున్న ప్రయాణికుల వాహనాలతో ఆదివారం రద్దీగా మారిన సోలాంగ్ వ్యాలీ కొండ ప్రాంతం

## యువతకు వివేకానందుడే స్ఫూర్తి

**నివాళులర్పించిన రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ**

న్యూఢిల్లీ: సంఘ సంస్కర్త, ఆధ్యాత్మికవేత్త స్వామి వివేకానందుని జయంతిని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆదివారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. శక్తిసామర్థ్యాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, దేశ నిర్మాణంలో పాలుపంచుకోవడంతోపాటు తోటివారికి సాయం చేయాలంటూ యువతలో స్ఫూర్తి రగిలించారని కొనియాడారు. ఆయన ఆశయాలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న లెక్కలేనంత మందికి ఇప్పటికీ ప్రేరణగా నిలుస్తున్నాయని ఆమె 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'మన దేశ గొప్ప ఆధ్యాత్మిక సందేశాన్ని ఆయన ప్రపంచానికి అందించారు. భారతదేశ ప్రజల్లో ఆయన ఆత్మవిశ్వాసాన్ని నింపారు' అని చెప్పారు. అదేవిధంగా, స్వామి వివేకానందునికి ప్రధాని మోదీ నివాళులర్పించారు. దేశ యువతకు ఎప్పటికీ స్ఫూర్తి ప్రదాతగానే ఉంటారన్నారు. బలమైన, అభివృద్ధి చెందిన భారత్ అన్న ఆయన దార్శనికతను సాకారం చేసేందుకు కట్టుబడి ఉన్నామని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

## చాద్‌లో అధికార పార్టీ విజయం

**ఎన్నికలను బహిష్కరించిన ప్రధాన ప్రతిపక్షం**

ఇంజమెనా(చాద్): చాద్‌లో గత నెలలో జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో అధికార పార్టీ విజయం సాధించింది. దశాబ్దం తరువాత జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో అధికార దేశభక్త సాల్వేషన్ మూవ్‌మెంట్ పార్టీ మూడింట రెండెంతుల స్థానాలను గెలుపొందింది. 188 స్థానాలకు గాను 124 గెలుపొందినట్లు ఎన్నికల సంఘం అధిపతి అహ్మద్ బార్చినెట్ ప్రకటించారు. 2021లో మహమత్ ఇద్రిస్ డెబీ సైనిక పాలకుడిగా అధికారం చేపట్టారు. ఆయన తండ్రి దీర్ఘకాలిక అధ్యక్షుడు ఇద్రి డెబీ ఇట్నో మరణం తరువాత ఆయన అధికారంలోకి వచ్చారు. ప్రజాస్వామ్యంలోకి మార్చడానికి పార్లమెంటరీ ఎన్నికలు నిర్వహించారు. చాదియన్ ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న అధికార వికేంద్రీకరణ శకానికి ఈ ఎన్నికలు మార్గం సుగమం చేశాయని డెబీ అన్నారు. కాగా ఈ ఎన్నికలను ఈ ఎన్నికలను ఓ నాటకంగా అభివర్ణించిన ప్రధాన ప్రతిపక్ష పార్టీ ట్రాన్స్‌ఫార్మర్స్‌తో సహా 10 పార్టీలు బహిష్కరించాయి. ఫలితాలపై ప్రధాన ప్రతిపక్షం స్పందించలేదు.

## కనౌజ్ రైల్వే స్టేషన్‌లో సహాయక చర్యలు పూర్తి

**సురక్షితంగా బయటపడ్డ 28 మంది కార్మికులు**

కనౌజ్: ఉత్తరప్రదేశ్‌లోని కనౌజ్ రైల్వే స్టేషన్‌లో దాదాపు 16 గంటలపాటు కొనసాగిన సహాయక చర్యలు ఆదివారం ఉదయం ముగిశాయి. కుప్పకూలిన భవనం శిథిలాల్లో చిక్కుకున్న 28 కార్మికులను సురక్షితంగా వెలికి తీశారు. వీరందరినీ వెంటనే ఆస్పత్రులకు తరలించామని అధికారులు తెలిపారు. ఘటనలో ఎవరూ చనిపోలేదని స్పష్టం చేశారు. రైల్వే స్టేషన్ ప్రాంగణంలోని నిర్మాణంలో ఉన్న ఓ భవనం శనివారం మధ్యాహ్నం కుప్పకూలడం తెలిసిందే. ఘటనలో 23 మంది గాయపడగా, మరికొందరు శిథిలాల కింద చిక్కుకుపోయారు. వీరిని సురక్షితంగా వెలుపలికి తీసుకువచ్చేందుకు ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్‌తో పాటు రైల్వే బలగాలు వణికించే చలిలో సైతం నిర్విరామంగా పనిచేశాయి. కాంక్రీట్ బీమ్‌ను సరిగ్గా అమర్చే క్రమంలోనే ఘటన చోటుచేసుకున్నట్లు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా వెల్లడైంది. కాగా, స్వల్పంగా గాయపడిన కార్మికులకు రూ.50 వేలు, తీవ్రంగా గాయాలైన వారికి రూ.2.5 లక్షల చొప్పున పరిహారమిస్తామని రైల్వే శాఖ తెలిపింది.

## పాకిస్తానీలకు బంగ్లాదేశ్ వీసా ఇక సులభం

లాహోర్: పాకిస్తాన్‌తో ఇన్నాళ్లూ అంటీముట్టనట్లుగా ఉన్న బంగ్లాదేశ్..ఇప్పుడా దేశంతో వాణిజ్య, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసుకునే ప్రయత్నాల్లో పడింది. ఇందులో భాగంగా పాకిస్తాన్ దేశస్తులకు వీసా జారీ ప్రక్రియను సులభతరం చేసింది. పాకిస్తాన్ ప్రతినిధి వర్గాలకు జారీ చేసే వీసాలకు బంగ్లా ప్రభుత్వం నుంచి ఇకపై అనుమతులు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఈ విషయాన్ని పాకిస్తాన్‌లోని బంగ్లాదేశ్ హై కమిషనర్ ఇక్బాల్ హుస్సేన్ ఇటీవల లాహోర్‌లో జరిగిన వాణిజ్య వేత్తల సమావేశంలో తెలిపారు. రెండు దేశాల మధ్య వాణిజ్యం గణనీయంగా పెరిగేందుకు ఎన్నో అవకాశాలున్నాయన్నారు.

## సంపాదన కోసం ఫ్యాక్టరీలకు నిప్పు

**జైపూర్ ఫైర్ సిబ్బంది నిర్వాకం**

జైపూర్: ఆదాయం పెంచుకోవాలనే దురాశతో ఫ్యాక్టరీలకు నిప్పు పెడుతున్న ఇద్దరు కాంట్రాక్టు ఉద్యోగులను పోలీసులు అరెస్ట్ చేశారు. సర్నా దుంగార్‌పూర్ ఏరియా ఫైర్ స్టేషన్‌లో ఫైర్‌మాన్‌గా విజయ్ శర్మ, డ్రైవర్‌గా రాహుల్ యాదవ్ కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. అగ్ని ప్రమాదాలు తరచూ జరుగుతుంటే ఆర్పేందుకు అక్కడికి వెళ్లినప్పుడు వాహనంలోని డీజిల్‌ను దొంగచాటుగా అమ్ముకోవచ్చని పథకం వేశారు. ఇందుకు గాను, ఇటీవలి కాలంలో ఆ ఫైర్ స్టేషన్ పరిధిలోకి వచ్చే మూడు ఫ్యాక్టరీలకు నిప్పుపెట్టారు. ఈ మేరకు సమాచారం కోసం అలెర్ట్‌గా ఉండే వీరు అక్కడికి వెళ్లి, మంటలను ఆర్పేశాక, వాహనంలోని డీజిల్‌ను దొంగచాటుగా బయటకు తీసి అమ్ముకునేవారు. అనుమానం వచ్చి అధికారులు నిఘా వేయగా నిజమేనని తేలింది. ఈ మేరకు ఇద్దరినీ శనివారం రాత్రి అరెస్ట్ చేశారు.

## చైనాలో విద్యార్థి మృతి

**హింసాత్మకంగా మారిన నిరసనలు**

బీజింగ్: చైనాలో టీనేజ్ బాలుడి మృతితో మొదలైన నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఘటన జరిగిన పుచెంగ్ ఒకేషనల్ టెక్నికల్ స్కూల్ బయట ప్రజలు ఆందోళన చేపట్టారు. అడ్డుకున్న పోలీసులపై అగ్నిమాపక యంత్రాలతో సహా చేతికి అందిన వస్తువులను విసిరారు. దీంతో పోలీసులు ఆందోళనకారులను చితకబాదారు. ఒకేషనల్ టెక్నికల్ స్కూల్లో చదువుతున్న డాంగ్ అనే విద్యార్థికి హాస్టల్‌లోని మరో విద్యార్థితో గొడవ జరిగింది. వార్డెన్ వారికి సర్ది చెప్పారు. తెల్లవారేసరికి.. డాంగ్ అనుమానాస్పద స్థితితో మరణించి ఉన్నాడు. కిటికీ తెరిచి ఉంది. ఘటన ప్రమాదావశాత్తూ జరిగిందని పుచెంగ్ అధికారులు చెబుతున్నారు. అయితే అది ప్రమాదవశాత్తూ కాదని, అధికారులు కప్పిపుచ్చుతున్నారని విద్యార్థి కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. డాంగ్ మృతి అనుమానాస్పదంగా ఉందని అమెరికాకు చెందిన హ్యూమన్ రైట్స్ ఇన్ చైనా బృందం కూడా తెలిపింది. దీంతో సోమవారం ప్రారంభమైన నిరసనలు వారమంతా కొనసాగాయి.

## బీజేపీకి అధికారమిస్తే మురికి వాడలు నాశనమే

**ఆప్ చీఫ్ కేజ్రీవాల్ ఆరోపణలు**

న్యూఢిల్లీ: ఢిల్లీలో బీజేపీకి అధికారమిస్తే మురికివాడలన్నిటినీ ధ్వంసం చేస్తుందని ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. మురికివాడల నివాసితుల సంక్షేమం కంటే కూడా అక్కడి భూములపైనే బీజేపీ దృష్టి ఉందన్నారు. ఆదివారం కేజ్రీవాల్ షకూర్ బస్తీలో మీడియాతో మాట్లాడారు. 'వాళ్లు మొదటగా మిమ్మల్ని ఓట్లడుగుతారు. ఎన్నికలయ్యాక మీ భూములివ్వమంటారు' అని బీజేపీనుద్దేశిస్తూ వ్యాఖ్యానించారు. బస్తీల్లోని వారి సమస్యలను పక్కనబెట్టి, వారి భూమిని ఆక్రమించుకునేందుకు బీజేపీ కుట్ర పన్నిందన్నారు. చేతనైతే వలస జీవులపైనా, మురికివాడల్లో ఉండే వారిపైనా నమోదైన కేసులన్నిటినీ ఎత్తేసి, వారికి మరో చోట పునరావాసం కల్పించాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు సవాల్ విసిరారు. 24 గంటల్లో వీటిని తూచా తప్పకుండా అమలు చేస్తే ఈ ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుంటామని పేర్కొన్నారు. ఇందులో బీజేపీ విఫలమైతే, ఈ ఎన్నికల్లో పోటీ చేసి మురికివాడల ప్రజలకు రక్షణగా నిలుస్తానని, వారి బస్తీలను ఎవరు నాశనం చేస్తారో చూస్తానని హెచ్చరించారు. మురికివాడల్లో వారందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామన్న బీజేపీ నినాదం కేవలం కంటితుడుపు చర్య మాత్రమేనన్నారు. 'ఢిల్లీలో 4 లక్షల మురికివాడలుండగా గడిచిన పదేళ్లలో కేంద్రం కేవలం 4,700 ఫ్లాట్లు మాత్రమే నిర్మించింది. ఈ రకంగా చూస్తే ఢిల్లీలోని మురికివాడల ప్రజలందరికీ గృహ వసతి కల్పించేందుకు మరో వెయ్యేళ్లు పడుతుంది' అని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు.

సాక్షి ప్లస్
సోమవారం । 13-1-2025

# ‘ఈవీఎం’లను ప్రవేశపెట్టిన మొదటి రాష్ట్రం?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ



### ఎన్నికల సంస్కరణలు

భారతదేశం ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. ప్రజాస్వామ్యం విజయవంతం కావాలంటే ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. సమర్థులు, నిస్వార్థపరులను ప్రతినిధులుగా ఎన్నుకోవడానికి ఎన్నికల సంస్కరణలు అవసరం. నేరచరిత్ర ఉన్న వారిని ఎన్నికల్లో పోటీచేయకుండా నివారించి, ఎన్నికల ప్రక్రియను సులభతరం చేయడానికి ఎన్నికల సంస్కరణలు తప్పనిసరి.

తార్కుండే, టి.ఎన్.శేషన్, జె.ఎం.లింగ్డో, సంపత్ ఎన్నికల కమిషనర్లుగా ఉన్న సమయంలో ఎన్నికల సంస్కరణలను బలోపేతం చేయడానికి ప్రయత్నించారు. ఎన్నికల సంస్కరణలను సూచించడానికి 1974లో తార్కుండే కమిటీ, 1990లో దినేష్ గోస్వామి కమిటీ, 1998లో ఇంద్రజిత్ గుప్తా కమిటీ, 1999లో జస్టిస్ జీవన్‌రెడ్డి అధ్యక్షతన 15వ లా కమిషన్‌ను నియమించారు. జస్టిస్ వెంకటాచలయ్య అధ్యక్షతన నియమించిన రాజ్యాంగ సమీక్ష సంఘం, వీరప్ప మొయిలీ అధ్యక్షతన నియమించిన రెండో పరిపాలన సంస్కరణల సంఘం కూడా కొన్ని సూచనలు చేశాయి.

### వివిధ కమిటీల ముఖ్య సిఫారసులు

1. స్వతంత్ర అభ్యర్థులు మరణిస్తే ఎన్నికను వాయిదా వేయొద్దు. స్వతంత్ర అభ్యర్థులను పోటీకి అనుమతించొద్దు.
2. పార్లమెంటు సభ్యుడికి డిగ్రీ, అసెంబ్లీ సభ్యుడికి ఇంటర్మీడియెట్ కనీస విద్యార్హతగా నిర్ణయించాలి.
3. పార్లమెంటు, అసెంబ్లీకి ఎన్నికైన ప్రతినిధులు తమ ఆస్తుల వివరాలను సభాధ్యక్షునికి, ఎన్నికల సంఘానికి ప్రమాణ స్వీకారానికి ముందే తెలపాలి.
4. కేంద్ర, రాష్ట్ర మంత్రిమండలి సభ్యుల సంఖ్య పార్లమెంటు, రాష్ట్ర శాసనసభ సభ్యుల సంఖ్యలో పదో వంతుకు మించొద్దు. దీన్ని 2003లో 91వ సవరణ ద్వారా రాజ్యాంగంలో చేర్చారు.
5. కొత్తగా ఎన్నికైన సభ్యులకు మంత్రి పదవులు ఇవ్వాలంటే ప్రభుత్వ నిర్వహణపై నెలపాటు తర్ఫీదు ఇవ్వాలి.
6. పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలో సభ్యత్వం లేని వ్యక్తిని శాసనసభ నాయకుడిగా ఎన్నుకోవడానికి అనర్హుడిగా ప్రకటించాలి.
7. ఎన్నికల ప్రచారానికయ్యే అభ్యర్థుల ఖర్చును ప్రభుత్వమే భరించాలి.
8. ఎన్నికల ముందు జరిగిన సర్దుబాట్లకు పార్టీ విప్‌ను ప్రయోగించి పార్టీ ఫిరాయింపుల చట్టం వర్తింపజేయాలి.
9. ఒక నియోజక వర్గంలో పోలైన ఓట్లలో 51 శాతం సాధించిన అభ్యర్థినే విజేతగా ప్రకటించాలి.
10. పార్టీల ఆదాయ వ్యయాలను ఆడిట్ చేయించాలి.
11. వ్యతిరేక ఓటు పద్ధతిని ప్రవేశపెట్టాలి.
12. రాజకీయ అస్థిరత్వాన్ని సృష్టించే చిన్న గ్రూపులు, చిన్న పార్టీలను నిషేధించాలి.
13. లోక్‌సభ, అసెంబ్లీలు పూర్తి కాలంపాటు కొనసాగేలా చూడాలి.
14. రాష్ట్రాల్లో ఎన్నికల నిర్వహణ సమయంలో రాష్ట్రపతి పాలన విధించాలి.
15. రాజకీయ పదవుల నిర్వహణలో రెండు పర్యాయాల పరిమితిని నిర్దేశించాలి.
16. ముఖ్యమంత్రి పదవికి ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలి.
17. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల ప్రచార సమయాన్ని గణనీయంగా తగ్గించాలి.
18. అభ్యర్థులు ఒకే సమయంలో ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాల్లో పోటీ చేయకుండా నిషేధించాలి.
19. లోక్‌సభ, విధాన సభకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలి.
20. ఎన్నికల ప్రవర్తన నియమావళికి చట్టబద్ధహోదా కల్పించి, అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి.
21. ఓటింగ్ యంత్రాలను ప్రవేశపెట్టాలి.

పైన సిఫారసు చేసిన సంస్కరణల్లో కొన్ని అమల్లోకి వచ్చాయి.

### పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం

ప్రస్తుత ప్రజాస్వామ్య ప్రభుత్వాల్లో రాజకీయ పార్టీలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. ప్రభుత్వాల భవిష్యత్తు రాజకీయ పార్టీలపై ఆధారపడి ఉంటుంది. ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికల్లో పోటీచేసి అధికారం చేపట్టేందుకు ప్రయత్నిస్తుంది. ఒక పార్టీ ఎన్నికల్లో విజయం సాధించి ప్రభుత్వాన్ని నడిపితే, ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వ లోపాలను ఎండగడుతూ అధికార పార్టీని నియంత్రిస్తాయి. కానీ కొన్ని సందర్భాల్లో అభ్యర్థులు ఒక రాజకీయ పార్టీ నుంచి ఎన్నికై మరో పార్టీలోకి ఫిరాయిస్తున్నారు. ఫలితంగా రాజకీయ అస్థిరత్వం ఏర్పడి ప్రజాభిప్రాయం అభాసుపాలవుతుంది.

ఉదాహరణకు 1967 తర్వాత దేశంలో పార్టీ ఫిరాయింపులు జోరందుకున్న నేపథ్యంలో ‘ఆయారామ్ గయారామ్’ అనే పదం పాపులర్ అయింది. దీంతో పార్టీ ఫిరాయింపులను నివారించి, ప్రజాస్వామ్య విలువలను కాపాడటానికి పార్టీ ఫిరాయింపుల నిషేధ చట్టాన్ని రూపొందించారు.

రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు 1985లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్టీ ఫిరాయింపుల నిషేధ చట్టాన్ని ప్రత్యేకంగా పదో షెడ్యూల్‌లో చేర్చారు. 2003లో 91వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ చట్టాన్ని సవరించారు.

### అనర్హత వేటుపడే సందర్భాలు

1. ఒక పార్టీ నుంచి ఎన్నికై మరో పార్టీలో చేరినప్పుడు.
2. పార్టీ విప్‌కు విరుద్ధంగా ఓటు వేసినప్పుడు, ఓటు వేయనప్పుడు.
3. స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికై ఏదో ఒక పార్టీలో చేరినప్పుడు.
4. నామినేటెడ్ సభ్యుడు 6 నెలల తర్వాత ఏదో ఒక పార్టీలో చేరినప్పుడు.

### రద్దుచేసే అధికారం

1. సభ్యుడిపై అనర్హత వేటు వేసే అధికారం స్పీకర్‌కు లేదా సభాధ్యక్షునికి ఉంటుంది.
2. స్పీకర్ లేదా సభాధ్యక్షుడు ఫిరాయిస్తే నిర్ణయాధికారం సభ ఎన్నుకున్న మరో సభ్యుడికి ఉంటుంది.

### మినహాయింపులు

1. ఒక రాజకీయ పార్టీ మరో పార్టీలో విలీనమైనప్పుడు సభ్యుల సభ్యత్వం రద్దు కాదు.
2. ఒక పార్టీలోని మొత్తం సభ్యులు మరో పార్టీలో చేరినప్పుడు సభ్యత్వం రద్దుకాదు.
3. గుర్తింపులేని పార్టీనుంచి వెళ్లితే ఫిరాయింపుల నిరోధక చట్టం వర్తించదు.
4. ఒక పార్టీకి చెందిన మొత్తం సభ్యుల్లో 2/3 వంతు సభ్యులు ఫిరాయిస్తే సభ్యత్వం రద్దుకాదు.

### పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం - ఉపయోగాలు

1. రాజకీయ సుస్థిరత సాధించవచ్చు.
2. రాజకీయాల్లో అవినీతి, అనైతికతను నివారించ వచ్చు.
3. సంకుచిత, స్వార్థ, అవకాశవాద రాజకీయాలను అరికట్టవచ్చు.

### 91వ రాజ్యాంగ సవరణ

2003లో 91వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని సవరించారు. ఈ సవరణ ద్వారా..

1. మంత్రిమండలి సభ్యుల సంఖ్య లోక్‌సభ, విధానసభ సభ్యుల సంఖ్యలో 15 శాతానికి మించొద్దు. రాష్ట్ర మంత్రివర్గంలో కనీసం 12 మంది ఉండాలి.
2. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద అనర్హులుగా ప్రకటించన వారిని మంత్రులుగా నియమించొద్దు.
3. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద అనర్హుడిగా ప్రకటించిన వారిని లాభదాయక పదవుల్లో నియమించొద్దు.
4. పార్టీ ఫిరాయింపు చట్టం ద్వారా చీలిక (1/3వంతు) పదానికి మినహాయింపు ఉండేది. దీన్ని తొలగించారు.

### మాదిరి ప్రశ్నలు

1. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అమలు చేసిన మొదటి రాష్ట్రం?
ఎ) తమిళనాడు బి) కర్ణాటక
సి) జమ్మూకశ్మీర్
డి) ఆంధ్రప్రదేశ్
2. ఫ్లోర్ క్రాసింగ్ అంటే?
ఎ) అధికార పార్టీకి మద్దతు ప్రకటించడం
బి) రాజకీయ లబ్ధికోసం అధికార పార్టీలోకి ఫిరాయింపు
సి) రాజకీయ రంగాన్ని వీడటం
డి) పైవన్నీ
3. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం అనర్హతపై అంతిమ అధికారం ఎవరికి ఉంటుంది?
ఎ) సుప్రీంకోర్టు
బి) కేంద్ర ఎన్నికల సంఘం
సి) సభాధ్యక్షులు డి) రాష్ట్రపతి
4. భారత రాజ్యాంగంలోని ఏ అధికరణ పార్లమెంటు సభ్యుల అనర్హతల గురించి తెలుపుతుంది?
ఎ) అధికరణ 101
బి) అధికరణ 102
సి) అధికరణ 108
డి) అధికరణ 110
5. ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లను ప్రవేశపెట్టిన మొదటి రాష్ట్రం?
ఎ) కేరళ బి) హర్యానా
సి) అసోం డి) పంజాబ్
6. ‘నోటా’ బటన్‌ను తొలుత ఏ లోక్‌సభ ఎన్నికల్లో ప్రవేశపెట్టారు?
ఎ) 13వ బి) 14వ
సి) 15వ డి) 16వ
7. పార్టీ ఫిరాయింపుల చట్టం గురించి తెలిపే షెడ్యూల్ ఏది?
ఎ) 8 బి) 9 సి) 10
డి) పైవేవీ కావు
8. ఓటరు గుర్తింపు కార్డులను ప్రవేశపెట్టిన మొదటి రాష్ట్రం?
ఎ) మణిపూర్ బి) మేఘాలయ
సి) హర్యానా
డి) హిమాచల్ ప్రదేశ్
9. అభ్యర్థుల ఎన్నికల ప్రచార ఖర్చును ప్రభుత్వమే భరించే దేశం?
ఎ) పాకిస్తాన్ బి) యూఎస్ఏ
సి) ఇండియా డి) బ్రిటన్
10. ఓటరు దినోత్సవంగా ఏ రోజును జరుపుకుంటారు?
ఎ) జనవరి 3 బి) జనవరి 25
సి) జనవరి 26 డి) అక్టోబర్ 2
11. ఎన్నికల సంస్కరణల సిఫారసుల కోసం వి.పి.సింగ్ ప్రభుత్వం నియమించిన కమిటీ?
ఎ) తార్కుండే కమిటీ
బి) దినేష్ గోస్వామి కమిటీ
సి) ఇంద్రజిత్ గుప్తా కమిటీ
డి) 15వ లా కమిషన్
12. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ఆమోదించారు?
ఎ) 52వ రాజ్యాంగ సవరణ
బి) 73వ రాజ్యాంగ సవరణ
సి) 91వ రాజ్యాంగ సవరణ
డి) 61వ రాజ్యాంగ సవరణ
13. ఎన్నికల సంస్కరణలను ప్రవేశపెట్టడానికి కృషిచేసిన ఎన్నికల కమిషనర్?
ఎ) పేరిశాస్త్రి
బి) సుకుమార్ సేన్
సి) టి.ఎన్. శేషన్
డి) నజీంజైది
14. పార్టీ ఫిరాయింపులకు సంబంధించి స్పీకర్ ఎంత కాలంలో నిర్ణయం ప్రకటించాలి?
ఎ) 3 నెలలు బి) 6 నెలలు
సి) ఏడాది డి) పైవేవీ కావు

#### సమాధానాలు

1) సి; 2) బి; 3) సి; 4) బి; 5) ఎ; 6) డి; 7) సి; 8) సి; 9) డి; 10) బి; 11) బి; 12) ఎ; 13) సి; 14) డి.

### గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఎన్నికల సంస్కరణల అంశాన్ని ఏ కమిటీ ప్రస్తావించింది?
1) తార్కుండే కమిటీ
2) గోస్వామి కమిటీ
3) సంతానం కమిటీ
4) సబార్ కమిటీ
ఎ) 1, 2 మాత్రమే బి) 1, 3 మాత్రమే
సి) 1, 2, 3 మాత్రమే డి) 3, 4 మాత్రమే
2. ఎన్నో రాజ్యాంగ సవరణ ద్వారా మంత్రుల సంఖ్యకు పరిమితి విధించారు?
ఎ) 87 బి) 86 సి) 91 డి) 73
3. కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్)ని ఎప్పుడు స్థాపించారు?
ఎ) 1960 బి) 1961
సి) 1962 డి) 1964

#### సమాధానాలు

1) ఎ; 2) సి; 3) డి.

# ఆరావళి పర్వత శ్రేణి ఏ రాష్ట్రంలో ఉంది?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

జాగ్రఫీ

1. భారతదేశం ఏ రకమైన శీతోష్ణస్థితిని కలిగి ఉంది?
జ. ఉష్ణమండల రుతుపవన శీతోష్ణస్థితి
2. మన దేశంలో పశ్చిమ దిశగా ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తున్న నదులేవి?
జ. నర్మద, తపతి, మహి, సబర్మతి
3. దేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే ప్రాంతం?
జ. రాజస్థాన్‌లోని జైసల్మీర్
4. మనదేశంలో నైరుతి రుతుపవన కాలం?
జ. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు
5. ఈశాన్య రుతుపవనాలు (తిరోగమన రుతుపవనాలు) వీచే కాలం?
జ. సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు
6. నైరుతి రుతుపవనాల వల్ల మొదటగా ఏ రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయి?
జ. కేరళ
7. ఈశాన్య రుతుపవనాలు మొదటగా ఏ రాష్ట్రంలో ప్రవేశిస్తాయి?
జ. పంజాబ్
8. ప్రస్తుతం హిమాలయాలున్న భూభాగంపై మధ్య మహాయుగంలో ఉన్న సముద్రం?
జ. టెథిస్
9. భారత ద్వీపకల్ప పీఠభూమిని పూర్వం ఏమని పిలిచేవారు?
జ. గోండ్వానా పీఠభూమి
10. హిమాలయాలు ఏ రకమైన పర్వతాలు?
జ. నవీన ముడుత పర్వతాలు
11. సిమ్లా పట్టణం ఏ పర్వత శ్రేణిలో ఉంది?
జ. ధౌల్‌దార్ శ్రేణి
12. అరుణాచల్‌ప్రదేశ్‌లోని బాహ్య హిమాలయాలను ఏమని పిలుస్తారు?
జ. మిష్మి కొండలు
13. ప్రముఖ వేసవి విడిది కేంద్రమైన డెహ్రాడూన్ ఏ రాష్ట్రంలో ఉంది?
జ. ఉత్తరాఖండ్
14. ప్రపంచంలో రెండో అతి ఎత్తైన శిఖరం ఏ పర్వత శ్రేణిలో ఉంది?
జ. కారకోరం శ్రేణి
15. మడ అడవులు (సుందర వనాలు) ఏ రాష్ట్రంలో ఎక్కువగా ఉన్నాయి?
జ. పశ్చిమ బెంగాల్
16. ఆరావళి పర్వతాల్లో ఎత్తైన శిఖరం?
జ. గురుశిఖర్ పర్వతం (1722 మీటర్లు)
17. ఆరావళి పర్వతాలు ఏ రకాని చెందినవి?
జ. అతి పురాతన ముడుత పర్వతాలు
18. ఛోటా నాగపూర్ పీఠభూమి ఏ రాష్ట్రంలో ఉంది?
జ. జార్ఖండ్
19. ఆరావళి పర్వత శ్రేణి ఏ రాష్ట్రంలో ఉంది?
జ. రాజస్థాన్
20. ఊటీ ఏ కొండల్లో ఉంది?
జ. నీలగిరి కొండలు (తమిళనాడు)
21. సింధు నది ముఖ్య ఉపనదులు?
జ. జీలం, చీనాబ్, బియాస్, సట్లెజ్, రావి
22. బ్రహ్మపుత్ర నదిని అరుణాచల్‌ప్రదేశ్‌లో ఏమని పిలుస్తారు?
జ. ది హాంగ్
23. అసోం దుఃఖదాయనిగా పేరొందింది?
జ. బ్రహ్మపుత్రా నది
24. కృష్ణా నది జన్మస్థానం?
జ. మహాబలేశ్వర్ (మహారాష్ట్ర)
25. సింధు నది జన్మస్థానం?
జ. మానస సరోవరం (టిబెట్)
26. అమర్ కంటక్ వద్ద జన్మించిన నది?
జ. నర్మద
27. తపతి నది జన్మస్థానం?
జ. ముల్తాయి (బేటల్, మధ్యప్రదేశ్)
28. కోరమండల్ తీరంలో ఏ రుతుపవనాల వల్ల అధిక వర్షం కురుస్తుంది?
జ. ఈశాన్య రుతుపవనాలు
29. కరువుకు గురయ్యే ప్రాంతాల ప్రణాళిక (DPAP)ను ఏ సంవత్సరంలో ప్రవేశపెట్టారు?
జ. 1973
30. మహానది ఏ రాష్ట్రంలో ఎక్కువ దూరం ప్రవహిస్తోంది?
జ. ఒడిశా
31. బెంగాల్ దుఃఖదాయని అని ఏ నదిని పిలుస్తారు?
జ. దామోదర్ నది
32. సుగంధ నూనెలను తయారుచేయడానికి ఉపయోగపడే రూసా గడ్డిని ఏ జిల్లాలో పండిస్తున్నారు?
జ. నిజామాబాద్
33. భారతదేశ సగటు అటవీ శాతం?
జ. 20.55%
34. అడవుల విస్తీర్ణం పరంగా మధ్యప్రదేశ్ మొదటి స్థానంలో ఉండగా, చివరిస్థానంలో ఉన్న రాష్ట్రం?
జ. హర్యానా
35. వైశాల్యం పరంగా అత్యధిక శాతం అడవులు ఉన్న రాష్ట్రం?
జ. అరుణాచల్ ప్రదేశ్
36. మృత్తికా క్రమక్షయం అంటే?
జ. సహజ కారణాల వల్ల సారవంతమైన నేలల పైపొర కొట్టుకొని పోవడం
37. ఉష్ణమండల చెర్నోజెమ్ మృత్తికలుగా పేరొందినవి?
జ. నల్లరేగడి నేలలు
38. మౌసమ్ అనేది ఏ భాషా పదం?
జ. అరబిక్ (అర్థం–రుతువు)
39. మన దేశంలో ఇప్పటి వరకూ అత్యల్ప ఉష్ణోగ్రత (–40°C) ఎక్కడ నమోదైంది?
జ. ద్రాస్ (కార్గిల్– కశ్మీర్)
40. అత్యధిక వర్షపాతం (1141సెం.మీ.) నమోదయ్యే మాసిన్‌రామ్ ప్రాంతం ఏ రాష్ట్రంలో ఉంది?
జ. మేఘాలయ
41. తమిళనాడులో అత్యధిక వర్షపాతం సంభవించడానికి కారణమయ్యే రుతుపవనాలు?
జ. తిరోగమన రుతుపవనాలు
42. పత్తి పంటకు అత్యంత అనుకూలమైన నేలలు?
జ. నల్లరేగడి నేలలు
43. భంగర్, ఖాదర్ మృత్తికలుండే నేలలు?
జ. ఒండ్రు నేలలు
44. మృత్తికా పరిరక్షణ పద్ధతులేవి?
జ. కాంటూర్ బండింగ్, ఫిర్రోయింగ్, స్ట్రిప్ క్రాసింగ్
45. దక్కన్ లావా నేలలుగా పేరుగాంచినవి?
జ. నల్లరేగడి నేలలు
46. జనసాంద్రత అంటే?
జ. చదరపు కిలోమీటరుకు నివసించే సగటు జనాభా
47. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఏ రోజున జరుపుకుంటాం?
జ. జూలై 11
48. తెలంగాణలో అక్షరాస్యత ఎక్కువగా ఉన్న జిల్లా హైదరాబాద్ కాగా తక్కువగా ఉన్న జిల్లా?
జ. మహబూబ్‌నగర్ (55.4%)
49. తెలంగాణ రాష్ట్ర మొత్తం జనాభా?
జ. 3 కోట్ల 52 లక్షలు
50. రాష్ట్రంలో ఎక్కువ జనాభా ఉన్న జిల్లా రంగారెడ్డి. కాగా, అతి తక్కువ జనాభా ఉన్న జిల్లా?
జ. నిజామాబాద్
51. తెలంగాణలో ఎస్సీ జనాభా తక్కువగా ఉన్న జిల్లా హైదరాబాద్. కాగా, ఎక్కువగా ఉన్న జిల్లా?
జ. కరీంనగర్
52. తెలంగాణలో ఎస్టీ జనాభా అధికంగా ఉన్న జిల్లా ఖమ్మం కాగా, తక్కువగా ఉన్న జిల్లా ఏది?
జ. హైదరాబాద్
53. దేశంలో ఎక్కువగా వ్యవసాయానికి తోడ్పడే నీటి పారుదల వనరు?
జ. బావులు
54. పెరియార్, మెట్టూరు కాలువలు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?
జ. తమిళనాడు
55. చెరువుల ద్వారా సాగయ్యే భూమి ఏ రాష్ట్రంలో ఎక్కువగా ఉంది?
జ. తెలంగాణ
56. కాలువలు, బావుల ద్వారా సాగయ్యే భూమి అత్యధికంగా ఉన్న రాష్ట్రం?
జ. ఉత్తరప్రదేశ్
57. ఏ రాష్ట్రంలో చాలా వరకు వ్యవసాయమంతా నీటిపారుదల వసతుల కిందే జరుగుతుంది?
జ. పంజాబ్
58. భారీ నీటిపారుదల పథకాల ఆయకట్టు ప్రాంతం ఎంత ఉంటుంది?
జ. 10,000 హెక్టార్ల కంటే ఎక్కువ
59. చిన్నతరహా నీటిపారుదల పథకాల ఆయ కట్టు ప్రాంతం ఎన్ని హెక్టార్లలోపు ఉం టుంది?
జ. 2000
60. తెల్లబొగ్గుగా పిలిచేది?
జ. జలవిద్యుచ్ఛక్తి
61. దేశంలో ఉత్పత్తయ్యే మొత్తం విద్యుచ్ఛక్తిలో జలవిద్యుచ్ఛక్తి వాటా?
జ. 22 శాతం
62. మనదేశంలో జలవిద్యుచ్ఛక్తి ఉత్పత్తికి అత్యంత అనువైన ప్రాంతం?
జ. హిమాలయ పర్వతపాద ప్రాంతం
63. ఏ బహుళార్థసాధక పథకం వల్ల అధికంగా జలవిద్యుచ్ఛక్తి ఉత్పత్తి అవుతుంది?
జ. భాక్రానంగల్
64. మనదేశంలోని ఏకైక అంతర్జాతీయ బహుళార్థసాధక ప్రాజెక్టు
జ. కోసి ప్రాజెక్టు
65. భాబర్ అంటే?
జ. గులకరాళ్లతో కూడిన సచ్ఛిద్ర మండలం
66. టెరాయి అంటే?
జ. చిత్తడి ప్రాంతం
67. భంగర్ అంటే?
జ. ప్రాచీన కాలంలో ఏర్పడిన ఒండలి మైదానం.
68. ఖాదర్ అంటే?
జ. నూతనంగా ఏర్పడిన ఒండలి మైదానం
69. రే/ కల్లార్ అంటే?
జ. చవుడు, లవణీయ, స్ఫటికీయ భూభాగం

| బహుళార్థసాధక ప్రాజెక్టు | నది | నిర్మించిన ప్రదేశం | లబ్ధి పొందుతున్న రాష్ట్రాలు |
|---|---|---|---|
| భాక్రానంగల్ ప్రాజెక్టు | సట్లెజ్ | భాక్రానంగల్ (హిమాచల్ ప్రదేశ్) | పంజాబ్, హర్యానా, రాజస్థాన్ |
| బియాస్ ప్రాజెక్టు | బియాస్ | పాంగ్ (పంజాబ్) | పంజాబ్, హర్యానా, రాజస్థాన్ |
| దామోదర్ ప్రాజెక్టు | దామోదర్ | జార్ఖండ్ | పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ |
| హిరాకుడ్ ప్రాజెక్టు | మహానది | సంబల్‌పూర్ | ఒడిశా |
| నాగార్జునసాగర్ ప్రాజెక్టు | కృష్ణా | నందికొండ (నల్గొండ, తెలంగాణ) | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ |
| తుంగభద్ర ప్రాజెక్టు | తుంగభద్ర | మల్లాపూర్ (బళ్లారి) | కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ |
| కోసి ప్రాజెక్టు | కోసి నది | హనుమాన్ నగర్ (బిహార్) | బిహార్, నేపాల్ (అంతర్జాతీయ పథకం) |
| చంబల్ ప్రాజెక్టు | చంబల్ | మధ్యప్రదేశ్ | మధ్యప్రదేశ్, రాజస్థాన్ |
| గండక్ ప్రాజెక్టు | గండక్ | వాల్మీకి నగర్ (బిహార్) | బిహార్, ఉత్తరప్రదేశ్, నేపాల్ |
| రామ్‌గంగా ప్రాజెక్టు | రామ్‌గంగా | కాలాగర్ | ఉత్తరాఖండ్ |

| పర్వతాలు | రాష్ట్రం |
|---|---|
| మహాదేవ్ కొండలు | మధ్యప్రదేశ్ |
| రాజ్‌మహల్ కొండలు | జార్ఖండ్ |
| మిష్మి కొండలు, డాఫ్లా కొండలు | అరుణాచల్‌ప్రదేశ్ |
| కచార్ కొండలు | అసోం |
| పాట్‌కాయ్ కొండలు | నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్ |
| ఖాసీ కొండలు, జాంతియా కొండలు, గారో కొండలు | మేఘాలయ |
| పళని కొండలు, నీలగిరి కొండలు, షేవరాయ్ కొండలు | తమిళనాడు |
| యాలకుల (కార్డమమ్) కొండలు, అన్నామలై కొండలు | కేరళ |
| లూషాయ్ కొండలు | మిజోరాం |
| గిర్ కొండలు | గుజరాత్ |

| తీరప్రాంత మైదానం | విస్తరించిన రాష్ట్రం |
|---|---|
| సర్కార్ తీరం | ఆంధ్రప్రదేశ్ |
| ఉత్కల్ తీరం | ఒడిశా |
| కోరమండల్ తీరం | తమిళనాడు |
| మలబార్ తీరం | కేరళ |
| కెనరా తీరం | కర్ణాటక |
| కొంకణ్ తీరం | గోవా, మహారాష్ట్ర |

**2011 జనాభా లెక్కల ప్రకారం భారత్‌లో**

| | |
|---|---|
| మొత్తం జనాభా | 121 కోట్లు |
| జనాభా పెరుగుదల రేటు (దశాబ్దంలో) | 17.7% |
| అక్షరాస్యత | 74% |
| లింగనిష్పత్తి | 1000 : 943 |
| జనసాంద్రత | 382 |
| పట్టణ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం | గోవా (62.2%) |
| గ్రామీణ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం | హిమాచల్ ప్రదేశ్ (90%) |

# కుడి నుంచి వారి స్థానాలు వరుసగా?

## ర్యాంకింగ్ టెస్ట్

పోటీ పరీక్షల్లో మెంటల్ ఎబిలిటీలో భాగంగా ర్యాంకింగ్ టెస్ట్ అంశం నుంచి ప్రశ్నలు తప్పనిసరిగా అడుగుతున్నారు. దీనిలో ప్రధానంగా ఒక తరగతిలో లేదా ఒక వరుసలో వ్యక్తుల స్థానాలను (ర్యాంకులను) ఒకవైపు నుంచి ఇచ్చి మరోవైపు నుంచి కనుక్కోవాలని అడుగుతారు. స్థానాలను పరస్పరం మార్చడం ద్వారా కొత్తగా ఏర్పడే వరుసలోని ర్యాంకులను గుర్తించాలని ప్రశ్నలు ఇస్తారు. కొందరి ర్యాంకులను ఇచ్చి సమూహంలోని మొత్తం వ్యక్తుల సంఖ్యను గుర్తించ మనడం లాంటి అంశాలపై కూడా తరచుగా ప్రశ్నలు ఇస్తారు. ఇచ్చిన సమాచారాన్ని అవగాహన చేసుకుని సునిశిత పరిశీలన ద్వారా సమాధానాలను సులభంగా గుర్తించవచ్చు. ర్యాంకింగ్ టెస్ట్‌ను ప్రధానంగా 4 రకాలుగా విభజించవచ్చు. అవి

### టైప్-1

- ఒక వరుస లేదా తరగతిలో మొత్తం విద్యార్థుల సంఖ్య, ఏదైనా ఒక విద్యార్థి స్థానం ఒక వైపు (కుడి లేదా ఎడమ) నుంచి ఇచ్చి రెండోవైపు నుంచి ఆ విద్యార్థి స్థానాన్ని కనుగొనడం.
- ఇలాంటి ప్రశ్నలకు కింది సూత్రం ద్వారా సమాధానాలను తేలికగా రాబట్టవచ్చు.
- ఒక వరుసలో లేదా తరగతిలోని మొత్తం విద్యార్థుల సంఖ్య (T). ఏదైనా ఒక విద్యార్థి స్థానం ఒక వైపు నుంచి ($R_1$) అయితే రెండో వైపు నుంచి ఆ విద్యార్థి స్థానం($R_2$).
  $R_2 = (T-R_1)+1$

**ఉదాహరణ:**

- 30 మంది విద్యార్థులున్న తరగతిలో రోహిత్ మొదటి(ఎడమ) నుంచి 12వ స్థానంలో ఉన్నాడు. అయితే చివరి (కుడి) నుంచి అతడి స్థానం ఎంత?

**సాధన:** మొత్తం విద్యార్థులు T = 30
మొదటి నుంచి రోహిత్ స్థానం
$R_1 = 12$
చివరి నుంచి రోహిత్ స్థానం $R_2$ = ?
$\therefore R_2 = (T-R_1)+1$
$R_2 = (30-12)+1 = 18+1 = 19$
∴ చివర నుంచి రోహిత్ స్థానం 19.

### టైప్-2

ఒక వరుస లేదా తరగతిలోని ఒక విద్యార్థి స్థానాన్ని రెండు వైపుల నుంచి ఇచ్చి ఆ వరుస లేదా

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

## జనరల్ స్టడీస్

### మెంటల్ ఎబిలిటీ

తరగతిలోని మొత్తం విద్యార్థుల సంఖ్య కనుగొనడం.

ఇలాంటి ప్రశ్నలకు కింది సూత్రం ద్వారా సులభంగా సమాధానాలు రాబట్టవచ్చు.

ఒక వరుస లేదా తరగతిలోని ఒక విద్యార్థి స్థానాలు రెండు వైపుల నుంచి $R_1$, $R_2$, మొత్తం విద్యార్థుల సంఖ్య T. అయితే
$T = (R_1+R_2)-1$

**ఉదాహరణ:**

- ఒక తరగతిలో ఒక విద్యార్థి స్థానం మొదటి (ఎడమ) నుంచి 12. చివరి (కుడి) నుంచి 17. అయితే ఆ తరగతిలోని మొత్తం విద్యార్థుల సంఖ్య?

**సాధన:** మొదటి నుంచి స్థానం = $R_1$
చివర నుంచి స్థానం = $R_2$
ఆ తరగతిలోని మొత్తం విద్యార్థుల సంఖ్య (T)
$= (R_1 + R_2)-1$
$= (12 + 17)-1 = 29-1 = 28$
తరగతిలోని మొత్తం విద్యార్థుల సంఖ్య = 28

### టైప్-3


ఒక వరుస లేదా తరగతిలోని విద్యార్థుల స్థానాలు పరస్పరం మారినప్పుడు వారి స్థానాలను నిర్ణయించడం.

**ఉదాహరణ:**

- ఒక వరుసలో పద్మ ఎడమ నుంచి 9వ స్థానంలో, పుష్ప కుడి నుంచి 12వ స్థానంలో ఉన్నారు. వారిద్దరూ పరస్పరం స్థానాలను మార్చుకోగా పద్మ ఎడమ నుంచి 15వ స్థానంలో ఉంది. అయితే ఆ వరుసలో మొత్తం బాలికల సంఖ్య?

**సాధన:**






పద్మ ఎడమ నుంచి 9వ స్థానంలో, పుష్ప కుడి నుంచి 12వ స్థానంలో ఉన్నారు. వారిద్దరూ పరస్పరం స్థానాలను మార్చుకుంటే పద్మ ఎడమ నుంచి 15వ స్థానంలో ఉంది. ఆ స్థానం ఇంతకు ముందు పుష్పది. కాబట్టి ఆ వరుసలోని మొత్తం బాలికలు..
$(15 + 12)-1 = 26$

### టైప్-4

ఒక వరుస లేదా తరగతిలోని ఇద్దరు విద్యార్థుల స్థానాలు రెండు వైపుల నుంచి ఇచ్చి, వారి మధ్యలో మూడో విద్యార్థి ఉంటే, తరగతిలోని మొత్తం విద్యార్థుల సంఖ్యను కనుగొనడం.


**ఉదాహరణ:**

- ఒక తరగతిలో B స్థానం పైనుంచి 9. C స్థానం కింది నుంచి 8. A సరిగ్గా వారిద్దరి మధ్య ఉన్నాడు. B, Aల మధ్య నలుగురు విద్యార్థులు ఉంటే, తరగతిలో మొత్తం విద్యార్థుల సంఖ్య?

(2006-SI)

**సాధన:**

A అనే విద్యార్థి B, Cల మధ్య ఉన్నాడు. B, Aల మధ్య నలుగురు విద్యార్థులు ఉన్నారు. కాబట్టి A, Cల మధ్య కూడా నలుగురు విద్యార్థులు ఉంటారు.
∴ B, Cల మధ్యలో 9 మంది విద్యార్థులు ఉంటారు.
B స్థానం పైనుంచి 9.
C స్థానం కింది నుంచి 8.




కాబట్టి ఆ తరగతిలోని మొత్తం విద్యార్థుల సంఖ్య = 26


- ఒక తరగతిలో 36 మంది బాలురు, బాలికలు సమాన సంఖ్యలో ఉన్నారు. బాలురు బేసి సంఖ్యల స్థానంలో కూర్చున్నారు. అయితే శ్రీను పై నుంచి 17వ స్థానంలో ఉన్నాడు. అయితే శ్రీను కింద ఎంతమంది బాలురు ఉన్నారు?

**సాధన:** బాలురు బేసి సంఖ్యల స్థానంలో ఉంటే, బాలికలు సరి సంఖ్యల స్థానంలో ఉంటారు. 36 మంది సమాన సంఖ్యలో ఉన్నారు కాబట్టి బాలురు 18. బాలికలు 18. శ్రీను స్థానం పై నుంచి17(బేసిసంఖ్య).
అంటే అతని ముందు 16 మంది (బేసి, సరి సంఖ్యలు) ఉన్నారు. అందులో శ్రీను పైన 8 మంది బాలురు ఉంటారు. మొత్తం 18 మంది బాలురల్లో 8 మంది పైన ఉంటే కింద (10-1)= 9 ఉంటారు.
∴ శ్రీను కింద ఉండే బాలుర సంఖ్య 9.

## మాదిరి ప్రశ్నలు

1. ఒక తరగతిలో పాస్ అయిన విద్యార్థుల్లో రవి ఎడమ నుంచి 18వ స్థానంలో, కుడి నుంచి 24వ స్థానంలో ఉన్నాడు. 15 మంది పరీక్షలో ఫెయిల్ అయ్యారు. ఐదుగురు విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదు. అయితే తరగతిలో మొత్తం విద్యార్థుల సంఖ్య ఎంత?
   **పాస్ అయిన విద్యార్థులు:**
   $T = (R_1 + R_2)-1$
   $T = (18+24)-1 = 42-1 = 41$
   **ఫెయిల్ అయిన విద్యార్థులు**
   15+5 = 20
   కాబట్టి తరగతి మొత్తం విద్యార్థులు
   పాస్ + ఫెయిల్ = 41+ 20 = 61
2. ఒక వరుసలో రవి ఎడమ నుంచి 18వ స్థానంలో, శివ కుడి నుంచి 24వ స్థానంలో ఉన్నారు. ఇద్దరి మధ్యలో వేణు, రవి తర్వాత 14వ స్థానంలో ఉన్నాడు. అయితే ఆ వరుసలో ఎంతమంది ఉన్నారు?

**సాధన:** ఒక వరుసలో ఎడమ నుంచి రవి వరకు 18 మంది, కుడి నుంచి శివ వరకు 24 మంది ఉన్నారు.
అంటే 18+24 = 42
రవి, శివల మధ్య వేణు, రవి తర్వాత 14 స్థానంలో ఉన్నాడు.
అయితే (14+14-1) = 27
రవి, శివల మధ్య 27మంది ఉన్నారు.
కాబట్టి ఆ వరుసలో మొత్తం విద్యార్థుల సంఖ్య = 42+27 = 69





3. 53 మంది విద్యార్థులు ఉన్న ఒక తరగతిలో ముగ్గురు విద్యార్థులు రోహిత్, శివ, శంకర్ ల స్థానాలు ఎడమ నుంచి వరుసగా 9,12,17. అయితే కుడి నుంచి వారి స్థానాలు ఎంత?

**సాధన:** మొత్తం విద్యార్థులు (T) = 53
రోహిత్ స్థానం $(R_1) = 9$
$R_2 = (T-R_1)+1$
$R_2 = (53-9)+1$
$R_2 = 44+1 = 45$
∴ కుడి నుంచి రోహిత్ స్థానం 45.
మొత్తం విద్యార్థులు (T) = 53
శివ స్థానం (ఎడమ)$(R_1) = 12$
శివ స్థానం (కుడి) $(R_2) = (T-R_1)+1$
$= (53-12)$
$= 41+1 = 42$
∴ కుడి నుంచి శివ స్థానం 42.
మొత్తం విద్యార్థులు (T) = 53
శంకర్ స్థానం (ఎడమ)$(R_1) = 17$
శంకర్ స్థానం (కుడి)$(R_2)$ = ?
$R_2 = (T-R_1)+1$
$R_2 = (T-R_1)+1$
$= (53-17)+1$
$= 36+1 = 37.$
∴ కుడి నుంచి శంకర్ స్థానం 37.

4. వేప చెట్ల వరుసలో మొదటి, చివరి నుంచి ఒక చెట్టు స్థానం 5. అయితే ఆ వరుసలో మొత్తం చెట్ల సంఖ్య. (2008 SI)


**సాధన:**





$(R_1+R_2-1)$ = Total
$R_1 = 5,\ R_2 = 5$
Total $= (R_1+ R_2)-1$
$= (5+5)-1 = 10-1 = 9$
∴ ఆ వరుసలోని మొత్తం వేపచెట్లు 9.

5. ఒక వరుసలో ఎడమ నుంచి గణేశ్ స్థానం 12. కుడివైపు నుంచి రాజన్ స్థానం 15. వారి స్థానాలను పరస్పరం మారిస్తే కుడివైపు నుంచి రాజన్ స్థానం 20. ఆ వరుసలో ఎంత మంది ఉన్నారు. (2006, SI)

**సాధన:** గణేశ్ ఎడమ నుంచి 12వ స్థానంలో, రాజన్ కుడి నుంచి 15వ స్థానంలో ఉన్నాడు. వారిద్దరూ పరస్పరం స్థానాలను మార్చుకుంటే రాజన్ కుడి నుంచి 20వ స్థానంలో ఉన్నాడు. ఆ స్థానం ఇంతకు ముందు గణేశ్‌ది.
కాబట్టి కుడి నుంచి గణేశ్ స్థానం 20, ఎడమ నుంచి 12.
∴ ఆ వరుసలో మొత్తం బాలురు
$= (20+12)-1 = 31$




# What is the code for "earn"




## Model Questions

***Directions (Q. No. 1-7):*** Study the following information to answer the given questions.

Eight people, viz A, B, C, D, E, F, G and H are sitting in a straight line facing North. Each of them has passed a recruitment exam and must join the office in different months, viz January, February, March, April, May, June, July and August but not necessarily in the same order.

G sits third to the right of the person who joins in May. The person who joins in August sits second to the right of G. A and E are immediate neighbours of each other. Neither A nor E has joining dates in either May or August. Neither A nor E is an immediate neighbour of G.

H sits third to the right of the person whose joining date is in January. Neither A nor E has joining dates in January. H's joining date is not in August.

Only two people sit between E and the person whose joining date is in July. The person whose joining date is in February sits on the immediate left of D.

Only one person sits between E and B. C joins before July. E joins after April. G joins after A.

1. In which of the following months does H join the office?
   1) April 2) June 3) July
   4) February 5) March
2. Who among the following sits exactly between E and B?
   1) The person whose joining date is in May
   2) The person whose joining date is in January
   3) D 4) A
   5) The person whose joining date is in August
3. "H" is related to "July" in a certain way based on the above arrangement. "B" is related to "June" following the same pattern. "___" is related to "May" following the same pattern.
   1) F 2) G 3) A 4) D 5) C
4. Which of the following is true regarding D?
   1) Only two people sit to the left of D
   2) D is sitting second to the right of the person whose joining date is in July
   3) E and B are immediate neighbours of D
   4) D's joining date is in May
   5) None is true
5. Who among the following has joining date in June?
   1) F 2) E 3) G 4) D 5) C
6. How many people sit between C and the person whose joining date is in April?
   1) None 2) One 3) Two
   4) Three 5) Four
7. Who among the following are sitting at extreme ends of the line?
   1) A and the person whose joining date is in August
   2) The person whose joining date is in May and E
   3) C and G
   4) The persons whose joining dates are in March and June
   5) None of these

***Directions (Q. No. 8-12):*** Study the following information to answer the given questions.

Eight people are sitting in two parallel rows containing four people each in such a way that there is an equal distance between adjacent persons. In row 1, A, B, C and D are sitting (but not necessarily in the same order) and all of them are facing North. In row 2, P, Q, R and S are sitting (but not necessarily in the same order) and all of them are facing South. Therefore, in the given seating arrangement, each member sitting in a row faces another member of the other row. S sits second to left of Q. A faces the immediate neighbour of S. Only one person sits between A and C. P does not face A. B is not an immediate neighbour of A.

8. Which of the following is true regarding D?
   1) D sits at one of the extreme ends of the line
   2) A sits on the immediate left of D
   3) Q faces D
   4) C is an immediate neighbour of D
   5) No immediate neighbour of D faces R
9. Who among the following faces C?
   1) P 2) Q 3) R 4) S
   5) Cannot be determined
10. Who among the following sits on the immediate right of the person who faces C?
    1) P 2) Q 3) R 4) S
    5) Cannot be determined
11. Four of the following five are alike in a certain way based on the given seating arrangement and thus form a group. Which is the one that does not belong to that group?
    1) A 2) Q 3) R 4) B 5) S
12. Who among the following faces R?
    1) A 2) B 3) C 4) D
    5) Cannot be determined

***Directions (Q. No. 13-18):*** Study the following information to answer the given questions:

In a certain code,
"time and money" is written as "ma jo ki",
"manage time well" is written as "pa ru jo",
"earn more money" is written as "zi ha ma" and
"earn well enough" is written as "si ru ha".

13. What is the code for "earn"?
    1) si 2) ru 3) ha 4) ma
    5) Cannot be determined
14. Which of the following represents "more time" ?
    1) pa jo 2) zi ki 3) ma ki
    4) si jo 5) jo zi
15. What is the code for "manage"?
    1) ru 2) pa 3) jo
    4) ha 5) Either "jo" or "ru"
16. Which of the following may represent "money matters"?
    1) ki to 2) ma pa 3) fi ma
    4) ha ma 5) ma jo
17. What does "ru" stand for?
    1) well 2) manage
    3) time 4) enough
    5) Either "time" or "enough"
18. Which of the following may represent "good enough"?
    1) ru si 2) da ha 3) si pa
    4) si da 5) ki ru

***Directions (Q. No. 19-23):*** Study the following information carefully and answer the given questions.

A word and number arrangement machine, when given an input line of words and numbers, rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement.

**Input:** gone over 35 69 test 72 park 27
**Step I:** 27 gone over 35 69 test 72 park
**Step II:** 27 test gone over 35 69 72 park
**Step III:** 27 test 35 gone over 69 72 park
**Step IV:** 27 test 35 park gone over 69 72
**Step V:** 27 test 35 park 69 gone over 72
**Step VI:** 27 test 35 park 69 over gone 72
**Step VII:** 27 test 35 park 69 over 72 gone


Step VII is the last step of the rearrangement.

As per the rules followed in the above steps, find out in each of the following questions the appropriate step for the given input.

19. **Input:** 86 open shut door 31 49 always 45
    How many steps will be required to complete the rearrangement?
    1) Five 2) Six 3) Seven
    4) Four 5) None of these
20. **Step III of an input:** 25 yes 37 enemy joy defeat 52 46
    Which of the following is definitely the input?
    1) enemy 25 joy defeat yes 52 37 46
    2) 37 enemy 25 joy yes defeat 52 46
    3) enemy joy defeat 25 52 yes 46 37
    4) Cannot be determined
    5) None of these
21. **Step II of an Input:** 18 win 71 34 now if victory 61.
    How many more steps will be required to complete the rearrangement?
    1) Three 2) Four 3) Five
    4) Six 5) More than six
22. **Input:** where 47 59 12 are they going 39
    Which of the following steps will be the last but one?
    1) VII 2) IV 3) V
    4) VIII 5) None of these
23. **Step II of an input:** 33 store 81 75 full of goods 52
    Which of the following will be step VI?
    1) 33 store 52 of 75 81 full goods
    2) 33 store 52 of 75 full 81 goods
    3) 33 store 52 of 75 goods 81 full
    4) There will be no such step
    5) None of these


## Explanations

**(1-7):**




**1.** 4 **2.** 1 **3.** 1 **4.** 5 **5.** 2
**6.** 3 **7.** 1

**(8-12):**




**8.** 4 **9.** 1 **10.** 2 **11.** 5 **12.** 1

**(13-18):**

time and money ® ma jo ki... (i)
manage time well ® pa ru jo...(ii)
earn more money® zi ha ma..(iii)
earn well enough ® si ru ha ...(iv)
From (i) and (ii), time ® jo
From (i) and (iii), money ® ma
From (i), and ® ki
From (ii) and (iv) well ® ru
From (ii), manage ® pa
From (iii) and (iv), earn ® ha
From (iii), more ® zi
From (iv), enough ® si

**13.** 3 **14.** 5 **15.** 2

**16.** Since "matters" is a new word. So, new code is introduced for "matters" ie, "fi". Code for "money" is "ma". **Ans: 3**

**17.** 1

**18.** Code for "enough" is "si" and since "good" is a new word, so a new code for "good", ie "da" is introduced. **Ans: 4**

**(19-23):**

The machine rearranges numbers in ascending order and word in reverse alphabetical order alternately.

**19. Input:** 86 open shut door 31 49 always 45
**Step I:** 31 86 open shut door 49 always 45
**Step II:** 31 shut 86 open door 49 always 45
**Step III:** 31 shut 45 86 open door 49 always
**Step IV:** 31 shut 45 open 86 door 49 always
**Step V:** 31 shut 45 open 49 86 door always
**Step VI:** 31 shut 45 open 49 door 86 aways **Ans: 2**

**20.** Can't proceed backward. **Ans: 4**

**21. Step II:** 18 win 71 34 now if victory 61
**Step III:** 18 win 34 71 now if victory 61
**Step IV:** 18 win 34 victory 71 now if 61
**Step V:** 18 win 34 victory 61 71 now if
**Step VI:** 18 win 34 victory 61 now 71 if
Four more steps are needed to complete the rearrangement. **Ans: 2**

**22. Input:** where 47 59 12 are they going 39
**Step I:** 12 where 47 59 are they going 39
**Step II:** 12 where 39 47 59 are they going
**Step III:** 12 where 39 they 47 59 are going
**Step IV:** 12 where 39 they 47 going 59 are **Ans: 5**

**23. Step II:** 33 store 81 75 full of goods 52
**Step III:** 33 store 52 81 75 full of goods
**Step IV:** 33 store 52 of 81 75 full goods
**Step V:** 33 store 52 of 75 81 full goods
**Step VI:** 33 store 52 of 75 goods 81 full **Ans: 3**